# డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్

(D.El.Ed.)

## ద్వితీయ సంవత్సరం

## పేపరు - 6

# ఎలిమెంటరీ స్థాయిలో సాంఘిక శాస్త్ర బోధన

# పాఠ్యపుస్తక అభివృద్ధి మండలి


**కె. సంధ్యారాణి, ఐ.పి.ఓ.ఎస్**
కమీషనర్
పాఠశాల విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్, అమరావతి

**శ్రీమతి ఎమ్.వి. రాజ్యలక్ష్మి**
సంచాలకులు, రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ,
ఆంధ్రప్రదేశ్, అమరావతి

**ఎస్.కె. జిలానీభాష**
ప్రొఫసర్, టీచర్ ఎడ్యుకేషన్ విభాగం
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, ఆంధ్రప్రదేశ్, అమరావతి.

**డా ॥ కె. పాండురంగ స్వామి**
ప్రొఫెసర్, టీచర్ ఎడ్యుకేషన్ విభాగం
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ, ఆంధ్రప్రదేశ్, అమరావతి


## సహకారం - సమన్వయం


**డా ॥ ఎస్.డి.వి. రమణ**
కో-ఆర్డినేటర్ కర్రికులం & పాఠ్యపుస్తక విభాగం
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణాసంస్థ,
ఆంధ్రప్రదేశ్, అమరావతి





**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ, అమరావతి**


చట్టాలను గౌరవించండి
హక్కులను పొందండి

విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

# ముందుమాట

నాగరిక సమాజాన్ని సృష్టించాలంటే విద్యావంతులైన పౌరులు అవసరం. శిశువును ప్రయోజకుడైన పౌరునిగా తీర్చిదిద్దాలంటే ఒక గురుప్రదమైన మార్గనిర్దేశకుడు అవసరం. అతడు జ్ఞాన సంపన్నుడైయుండడమే కాకుండా ఆదర్శప్రాయునిగానూ, బహుముఖ ప్రజ్ఞాశీలిగానూ, సృజనశీలిగానూ, తాత్వికునిగానూ భవిష్యత్ దార్శనికునిగానూ ఉండాలి. కాలం ప్రాచీనమైనా, నవీనమైనా భారతీయ సమాజం ఎప్పుడూ ఉపాధ్యాయుడిని ఘనమైన వ్యక్తిగా గౌరవిస్తూ తమ సంతతి సంక్షేమంకోసం అతడి నుండి ఎంతో ఆశిస్తుంది. సమాజంలో అతడూ ఒక సభ్యుడే అయినప్పటికి అతడి మాటలు చేతలు అన్నీ ఆదర్శనీయంగా ఉండాలని భావిస్తుంది. ఇలాంటి మహోన్నతమైన అధ్యాపనాన్ని వృత్తిగా స్వీకరించాలని నిర్ణయించుకున్న వ్యక్తిని ఉత్తముడైన ఉపాధ్యాయునిగా రూపుదిద్దడానికి సర్వోన్నతమైన విద్యాక్షేత్రం కావాలి.

ఒక సగటు వ్యక్తిని ఉపాధ్యాయునిగా తీర్చిదిద్దాలంటే అకుంఠిత దీక్షాతత్పరత కలిగిన మహోపాధ్యాయులు కావాలి. అందుకే పాఠశాల విద్యలో ఉపాధ్యాయవిద్య అత్యంత ప్రాధాన్యతాంశంగా గుర్తింపుపొందింది. ఉపాధ్యాయుని ద్వారా సామాజికాభ్యున్నతిని ఆశిస్తున్నప్పుడు ఉపాధ్యాయుడిని రూపొందించే సందర్భంలో అత్యంత జాగరూకత ఆవశ్యకం. ఉపాధ్యాయ విద్యార్థికి కేవలం విషయజ్ఞానం అందించడం, బోధనా పరిజ్ఞానం పెంపొందించడం మాత్రమే సరిపోదు. విద్యార్థుల ద్వారా భవిష్యత్తును వీక్షించగల శక్తియుక్తులను నేర్పాలి. సజీవమూ నిత్యచైతన్యశీలమూ అయిన విద్యార్థులలో జ్ఞానకాంక్షను పెంపొందింపజేసే మెళకువలను అభ్యసింపజేసే నైపుణ్యాలను అవగతం చేయించాలి. మానవీయత గుబాళించే ఆత్మీయతా ప్రవర్తనను అనువర్తింపజేయాలి. భారతీయ విద్యాతత్వాన్ని, విద్యయొక్క పరమావధిని అర్థం చేసుకుని వ్యవహరించడాన్ని ఆకళింపు చేయించాలి.

ప్రాథమిక పాఠశాల స్థాయి ఉపాధ్యాయునిగా రూపొందడమంటే బహుముఖ ప్రజ్ఞాపాటవాలను పుణికిపుచ్చుకోవడం అన్నమాట. అంటే ఉపాధ్యాయుడు చక్కని కథకుడుగా, గాయకుడుగా, నటుడుగా, చిత్రకారుడుగా, క్రీడాకారుడుగా, వైద్యునిగా, ఆధునిక సాంకేతిక నిపుణుడుగా వ్యవహరించగలగాలి. ఇలా బహుళ అంశాలలో ప్రవేశము, ప్రావీణ్యము కలిగి ఉండాలి. వీటిని సాధింపజేయాలి అంటే ఉపాధ్యాయుడు విద్య ఆయా అంశాలన్నింటినీ మమేకం చేసుకున్నదై ఉండాలి. ఉపాధ్యాయులపై రూపొందిన జాతీయ విద్యాప్రణాళిక చట్రం – 2009 ఉపాధ్యాయుడు విద్యార్థుల సాంఘిక, సాంస్కృతిక నేపథ్యాలను సంపూర్ణంగా అవగాహనచేసుకొని వారి వికాసానికి కృషిచేయాలని ఇందుకోసం సమాచార సాంకేతిక పరిజ్ఞానం, స్థానిక కళలు సంస్కృతులను బోధనా ప్రణాళికతో మమేకం చేసుకోవాలి. ఆ సందర్భంలో ఉపాధ్యాయుడు మననశీల అభ్యాసకుడు (Reflective Practitioner) గా ఉండాలని సూచించింది. కాబట్టి ఉపాధ్యాయ విద్యలో బాలలను వారి బాల్యాన్ని అర్థంచేసుకోవడం, నేర్చుకోవడం ఎలాగో నేర్పే పద్ధతులలో ప్రావీణ్యం పొందడం అత్యంత ఆవశ్యకం. సమకాలీన అంశాలను మేళవించుకుంటూ తన బోధనను సుసంపన్నం చేసుకోవడం. ఎంతో కీలకం. కాబట్టి ఉపాధ్యాయ శిక్షణ దశలోనే ఆయా అంశాలలో ఉపాధ్యాయ / విద్యార్థులకు సంపూర్ణ శిక్షణనివ్వాలి. వ్యవస్థకు యోగ్యమైన ఉపాధ్యాయుని అందించడంలో శిక్షణ సంస్థలే పూర్తిబాధ్యత వహించాలి. ఏ చిన్నపాటి అలసత్వం జరిగినా అది పటిష్టమైన శిక్షణ ద్వారానే పరమోన్నతమైన ఉపాధ్యాయులను రూపొందించగలం. నూతనంగా రూపొందించిన ఈ పాఠ్యపుస్తకాలు జ్ఞాననిర్మాణాత్మక అభ్యసన సిద్ధాంతాలు, పరస్పరాశ్రిత విద్యాతత్వం, సమ్మిళితబోధనా విధానాలు మొదలయిన నవీన భావనలతో నిర్మితమైనాయి. వీటన్నింటిని అర్థంచేసుకొని తమ ఆదర్శవంతమైన బోధనల ద్వారా అత్యంత ప్రజ్ఞాపాటవాలు కలిగిన ఉపాధ్యాయులను తీర్చిదిద్దడంలో అధ్యాపకులందరూ విశేషంగా కృషిచేస్తారనీ, ఉపాధ్యాయ విద్యార్థులు కూడా బోధనా సిద్ధాంతాలను విద్యయొక్క పరమావధిని అర్థంచేసుకొని విద్యా లక్ష్యాలను సాధించేందుకు తమ జీవిత అనుభవాలను అన్వయించుకుంటూ ఆదర్శ ఉపాధ్యాయులుగా రూపొందుతారని ఆశిస్తూ...

**సంచాలకులు**

రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ

అమరావతి, ఆంధ్రప్రదేశ్

# అధ్యాపకులకు సూచనలు....

ఉపాధ్యాయ విద్య పై రూపొందిన జాతీయ విద్య చట్రం – 2009 ఉపాధ్యాయ విద్య ప్రాధాన్యతను వివరిస్తూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలంటే ఉపాధ్యాయులను రూపొందిస్తున్న దశలోనే అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని సూచించింది. బాధ్యతాయుతమైన ఉపాధ్యాయులు ద్వారానే బాలల బాల్యానికి భరోసా ఇవ్వగలమని అలాంటి వారిని తయారుచేయడంలో ఉపాధ్యాయ శిక్షణ సంస్థలు నూతన దృక్పథంతో పనిచేయాలని తెలిపింది. అందులోని మౌలిక సూత్రాలను ఆధారంగా చేసుకుని ఈ పాఠ్యపుస్తకాలు రూపొందాయి. వీటిని అర్థవంతంగా ఉపయోగించడంలో అధ్యాపకులు కొన్ని మెళకువలు అనుసరించాలి.

- ఉపాధ్యాయ విద్య – జాతీయ విద్యా చట్రం – 2009 ని క్షుణ్ణంగా చదవాలి.
- ఆయా అంశాలకు చెంది విద్యాప్రణాళికలో పేర్కొన్న కీలక భావనలను వాటి తాత్వికతను అర్థంచేసుకోవాలి. (ఇందుకోసం సిలబస్‌లో పేర్కొన్న ముందుమాటలను పరిశీలించండి).
- జాతీయ విద్యా ప్రణాళిక చట్రం–2005లోని మౌలిక అంశాలయిన – జ్ఞాన నిర్మాణ విద్యా తత్వం – నిర్మాణాత్మక అభ్యసన సన్నివేశాల కల్పన మొదలైన భావనలను అర్థంచేసుకుని వాటిని ఉపాధ్యాయ విద్యకు మిళితంచేసి బోధన జరపాలి.
- ఆంధ్రప్రదేశ్ విద్యాప్రణాళికా పత్రం – 2010లో పేర్కొన్న 'పరస్పరాశ్రిత విద్యావిధానం' భావనను అధ్యాపకులు తమ తరగతిగది బోధనకు అన్వయించాలి.
- విద్యాహక్కుచట్టం – 2005 సూచించిన మార్గదర్శకాలను ఉపాధ్యాయవిద్యకు గల సంబంధాన్ని గుర్తించి బోధన జరపాలి.
- పాఠశాలలోని భావనల బోధనతోపాటుగా ఆయా సందర్భాలలో సూచించిన రచనలను తప్పనిసరిగా ఉపాధ్యాయుడు విద్యార్థులతో చదివించి చర్చించాలి.
- బోధనాంశాలకు అవసరమైన అనుబంధ అంశాలను చదివించి ఆయా విద్యావేత్తల దార్శనికతలు పేర్కొన్న విద్య తాత్వికతను పరమావధిని ఉపాధ్యాయ విద్యార్థులు గుర్తించేలా కృషిచేయాలి.
- పాఠశాల విద్య ద్వారా అమలవుతున్న విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తకాలు క్షుణ్ణంగా పరిశీలించి బోధనా శాస్త్రానికి పాఠ్యపుస్తకంకు గల సంబంధాన్ని ఆవిష్కరింపజేయాలో ఉపాధ్యాయుడు విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించాలి.
- ఉపాధ్యాయ విద్యలోని ప్రతి బోధనాంశానికి తనదైన 'ఆత్మ' వుంటుంది. అధ్యాపకులు మూలసూత్రాలను పరిశీలించి విశ్లేషించుకోగలిగినపుడే దానిని గుర్తించగలరు. కాబట్టి అయా అంశాలకు చెందిన ఇతర రచనలు తప్పనిసరిగా చదవాలి. వాటిని ఉటంకిస్తూ ఉపాధ్యాయ విద్యార్థులను 'నిత్య అభ్యాసకులుగా' మారేందుకు శిక్షణనివ్వాలి.
- ప్రాథమిక పాఠశాల స్థాయి విద్యార్థుల స్వభావం, కుటుంబ నేపథ్యం, సామాజిక సందర్భం మొదలైనవన్నీ పరిగణనలోకి తీసుకొంటూ పాఠశాలను విశ్లేషించాలి.

# విషయసూచిక


**1.** సాంఘీక శాస్త్రం - పరిచయం 1-21

**2.** సాంఘిక శాస్త్రం - కీలక ఇతివృత్తాలు 22-51

**3.** పాఠ్యపుస్తకాల పై అవగాహన, బోధనా విధానం 52-97

**4.** సాంఘికశాస్త్ర బోధన: 98-140

**5.** సాంఘికశాస్త్ర బోధనాభ్యసన మదింపు: 141-168

**6.** ఎలిమెంటరీ స్థాయి సాంఘికశాస్త్ర బోధనలో సమస్యలు, సవాళ్ళు 169-185

# యూనిట్ - 1 సాంఘీక శాస్త్రం - పరిచయం

## 1.1 సాంఘిక శాస్త్ర భావన, స్వభావం, పరిధి:-


పరిధి స్వభావంపై విభిన్న దృక్పధాలు, పాఠశాల విద్యా ప్రణాళికలో సాంఘీక శాస్త్ర స్థానం.

### 1.1.1 సాంఘీక శాస్త్రం - భావన (అర్థం)

మనవుని పరిసరములతో అతనికుండు అన్ని రకాల సంబంధములను సమగ్రముగా పరిశీలించి తెలుపు శాస్త్రమే సాంఘీక శాస్త్రము. సాంఘీక శాస్త్రము అమెరికా సంయుక్త రాష్ట్రాలలో ఉద్భవించింది. క్రీ.శ.1905వ సం॥లో సాంఘీక శాస్త్రం అనే పదం ఉద్భవించింది. 1916సం॥లో వరకు ఈ పదాన్ని అంతగా ఉపయోగించనప్పటికీ ఆ తరువాత నుంచి ఈ పదాన్ని విస్తృతంగా ఉపయోగించడం మొదలు పెట్టారు. "సాంఘీక శాస్త్రము" ఒక స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన అధ్యయనం. ఇది మానవుడు పరిసరాలతో అతనికి గల సంబంధములను తెలుపుటయేగాక భూత వర్తమానములకు ప్రాంతీయ-జాతీయ- అంతర్జాతీయ విషయాలలో మానవ జీవిత సంబంధాలను తెలుపుతుంది. మానవుడు సమాజ సభ్యునిగా ఇతరులతో సత్సంబంధాలు పెంపొందించుకొనుటకు కావలసిన సాంఘీక విలువలు వైఖరులు అలవరచుకొని, దేశ సాంస్కృతిక వారసత్వమును తెలుసుకొని సమాజ పరిస్థితికి అనుగుణంగా దానిని వుపయోగించుకునేలా ఉత్తమ పౌరులుగా విధ్యార్థులను తీర్చిదిద్దే విషయమే "సాంఘీక శాస్త్రం"

**మానవుడు - కుటుంబం నుంచి వివిధ స్థాయిలలో ప్రగతి చక్రం**

1. కుటుంబం
2. ఇరుగు పొరుగు
3. గ్రామం
4. తాలూకా
5. జిల్లా
6. రాష్ట్రం
7. జాతీయ
8. అంతర్జాతీయ




**సాంఘీక శాస్త్రం - నిర్వచనం :**

"**E.B.** వెస్లీ అభిప్రాయంలో "విద్యార్థి అతని పరిసరములలో గల సంస్థలతోనూ, వ్యక్తులతోనూ సృజనాత్మకమైన స్నేహపూరితమైన కార్యక్రమములతో ఏర్పరచుకునే సంబంధబాంధవ్యాలను సాంఘీక శాస్త్రం అధ్యయనం చేస్తుంది."

**I.F** ఫారెస్టర్ "సాంఘీక శాస్త్రమనగా సమాజము యొక్క అధ్యయనం". సంఘం రూపొందిన విధము, సంఘంలో విధ్యార్థుల బాధ్యతాయుత ప్రవర్తనను తెలియచేయుట దీని ముఖ్య లక్షణము"

**భారతదేశ మాధ్యమిక విద్యా సంఘం :**

డా॥ లక్ష్మణస్వామి మొదలియార్ అధ్యక్షతన ఈ సంఘం ఏర్పడింది. ఈ సంఘం అభిప్రాయంలో "భారతీయ

విద్యలో సాంఘీకశాస్త్రం నూతనముగా ప్రవేశపెట్టిన అంశం ఇంతకు పూర్వం వివిధ అంశాలు విడివిడిగా బోధించబడేవి. చరిత్ర, భూగోళశాస్త్రం, పౌరశాస్త్రం, అర్ధశాస్త్రమును కలిపి ఒకే శాస్త్రముగా బోధించటమే ఇందలి ముఖ్య ఉద్దేశ్యము. దీని ముఖ్య లక్ష్యము విద్యార్థులు ఈ సమాజం ఎట్లు ఆవిర్భవించినదో తెలుసుకొని సమాజంలోని భాగములైన కుటుంబం, సమాజం, రాష్ట్రము, దేశములో సత్పరులుగా మసలుకొనునట్లుగా తీర్చిదిద్దుట"

- అమెరికా సంయుక్త రాష్ట్రంలోని సాంఘికశాస్త్ర అధ్యయనం/పునర్వ్యవస్థీకరణ సమాఖ్య (Commission of Reorganisation of Secondary Education of Associations, U.S.A.) ప్రకారం "మానవ సమాజ అభ్యున్నతికి తోటి మానవుల సమాఖ్యలో కలిసి జీవించే విధానాన్ని తన అభ్యున్నతికి సంబంధించిన ప్రత్యక్ష, పరోక్ష అంశాలపట్ల అవగాహనను పెంపొందించే శాస్త్రంగా చెప్పారు"
- కొంతకాలానికి అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతీయ విద్యాసంస్థ విక్టోరియా విద్యబోర్డు వారి నిర్వచనం ప్రకారం "మానవ సంఘమును అభివృద్ధి చేసి, తీర్చదిద్దగలిగిన, ప్రత్యక్ష సంబంధము కలిగిన విషయములు, సాంఘిక వర్గములోని ఒక మానవుని నిర్మాణాత్మకమైన సభ్యునిగా చేయు విషయములు సాంఘిక శాస్త్ర పరిధిలోనికి వచ్చును" అని చెప్పారు.
- జేమ్స్ హేమ్మింగ్స్ :- "చారిత్రక, భౌగోళిక, సాంఘిక విషయముల సంబంధ, అంతర్ సంబంధముల అధ్యయనమే సాంఘిక శాస్త్రం".
- జాన్.వి. మైకెల్స్ :- "సాంఘిక అధ్యయనం మనిషికి మరియు అతని సాంఘిక భౌతిక పర్యావరణాల మధ్య జరిగే చర్యల, ప్రతిచర్యలకు సంబంధించినది. ఇది మానవ సంబంధాలను గూర్చి చర్చిస్తుంది. ప్రజాస్వామిక పౌరసత్వ అభివృద్ధే సాంఘిక అధ్యయనం యొక్క ముఖ్య లక్షణం."
- కొఠారీ కమీషన్ ప్రకారం :- "విద్యార్థి అవగాహన స్థాయిని పెంపొందించడంలో కుటుంబం, ఇరుగుపొరుగు, జిల్లా, రాష్ట్రం, దేశం, అంతర్జాతీయ స్థాయి వరకు విషయజ్ఞానం, అవగాహన వినియోగం, నైపుణ్యం, సోదరతత్త్వం, మొదలైన అంశాలపట్ల అభిరుచిని పెంపొందించుకోవడానికి అవకాశం ఉంది. విద్యార్థులలో నాది, మాది, మనందరిది అనే స్థాయికి ఎదగటానికి తోడ్పడుతుంది".

**సాంఘీక శాస్త్రం ముఖ్య లక్షణములు :**

1. మానవునికి పరిసరములతో అతనికి గల సంబంధమును తెలియచేస్తుంది.
2. ఇది అనేక సామాజిక శాస్త్రముల నుండి విషయ సేకరణ చేయబడిన స్వతంత్ర ప్రతిపత్తి గల్గిన ఒక అధ్యయనం.
3. ఇది అనేక సాయాజిక శాస్త్రముల సమన్వయం.
4. ఇది సాంఘీక పరిసరాలైన కుటుంబం, సంఘం, రాష్ట్రము, దేశముల స్వరూప స్వభావములను తెలుసుకొని సంఘంలో విద్యార్థులు బాధ్యతాయుత ప్రవర్తనను తెలియచేస్తుంది.
5. సాంఘీక శాస్త్రము భూత, భవిష్యత్, వర్తమానములకు గల సంబంధమును తెలియచేస్తుంది.
6. సాంఘీక శాస్త్రము సామాజిక శాస్త్రముల విషయా జ్ఞానమును సమన్వయం చేస్తుంది.
7. విద్యార్థులను మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తయారు చేస్తుంది. వారిలో విలువలను వైఖరులను నైపుణ్యములను పెంపొందిస్తుంది.
8. విద్యార్థులలో దేశభక్తి, సహకారము, సహజీవనము, విశ్వమానవ సౌభ్రాతృత్వములను పెంపొందిస్తుంది.

**1.1.2 సాంఘీక శాస్త్రం – స్వభావం :-**

సాంఘీక శాస్త్రం మానవజీవితంలో జరిగే వివిధ సామాజిక దృగ్విషయాలను వివిధకోణాలలో అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. అంతే కాకుండా సామాజిక ధర్మాలను మరియు విధానాలను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. ఇది సమాజాన్ని ఖచ్చితమైన పద్ధతుల ద్వారా అధ్యయనం చేస్తుంది. సాంఘీక శాస్త్రస్వభావాన్ని ఈ క్రింది విధంగా చెప్పవచ్చు. అవి:

1. సాంఘీక శాస్త్రం విద్యార్థులకు సమాజిక అనుభవాన్ని కలుగచేస్తుంది. వారిలో సామాజిక వైఖరులను పెంపొందిస్తుంది. మంచి సమాజ నిర్మాణానికి అవసరమైన ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం, సహనం,

సమతాభావం సహకారం మొదలైన వైఖరులను విద్యార్థులలో పెంపొందిస్తుంది.

2. సాంఘీకశాస్త్రం విద్యార్థులకు సమాజికి జ్ఞానాన్ని ఇస్తుంది. సమాజంలోని వివిధ వ్యక్తుల మధ్య ఉండే సంబంధాల సమాచారాన్ని ఇస్తుంది. అలాగే సంస్థల మధ్యగల సంబంధమును వాటి అవశ్యకతను తెలియచేస్తుంది.

3. ఇది విద్యార్ధులకు సమాజంలోని సభ్యులకు సామాజిక ప్రమాణాలను తెలియచేస్తుంది. అనగా చట్టాలను గౌరవించడం, సత్యాన్ని పలకటం, సత్ ప్రవర్తన కలిగి ఉండటం సరైన ఆసక్తులు, ఆదర్శాలును పెంపొందిచడం మొదలైనవి సాంఘీక శాస్త్ర అధ్యయనం ద్వారా తెలుసుకుంటారు.

4. సాంఘీక శాస్త్రం అధ్యయనం ఉద్దేశ్యం సామాజిక సమస్యలను తెలుసుకునేలా చేయడం, పేదరికం, నిరుద్యోగం, ప్రాంతీయ అంతరాలు అధిక జనాభా ద్రవ్యోల్బణం కాలుష్యం సామాజిక రుగ్మతలో మొదలైన సామాజిక సమస్యలను తెలుసుకొని వాటిని ఎదుర్కొనేలా పౌరులను తీర్చిదిద్దుతుంది. సమాజాభివృద్ధిలో వారిని భాగస్వాములను చేస్తుంది.

5. సమాజంలో వస్తున్న మార్పులను అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్ది వారి భావి జీవన విధానాన్ని సరైనదిశలో మలచుకునేందుకు సాంఘీక శాస్త్రం తోడ్పడుతుంది.

6. సామాజిక నేపథ్యంలో కారణాలను చెప్పడం కారణాలను అన్వేషించే నైపుణ్యాలను విద్యార్థులలో పెంపొందిస్తుంది.

7. సామాజిక, రాజ్యాంగ విలువలను విద్యార్థులలో పెంపొందిస్తుంది.

## 1.1.3 : సాంఘీక శాస్త్రం – పరిధి :-

**E.V.S.-1** పరిధి (Scople of Social Studies):

ఈ విశ్వంలో జీవపదార్థం ఆవిర్భవించిన కాలం నుంచి నేటివరకు అనేక పరిణామాలను చెందిందని మనం తెలుసుకున్నాం. అటువంటి పరిణామాలకు సంబంధించిన విషయాలు కొన్ని కాలగర్భంలో కలిసినా, మరికొన్ని భౌతికంగా, లిఖితపూర్వకంగా మనకు గోచరిస్తున్నాయి. వాటిని ఆధారంగా చేసుకొని మానవుడు నిరంతరం తన కార్యకలాపాలను కొనసాగిస్తున్నాడు. వాటి ప్రయోజనాలు, ఫలితాలు, తోటి వ్యక్తులపై ప్రభావాన్ని చూపిస్తున్నాయి. సాంఘికశాస్త్రం అనగానే ఇది ఒక ప్రయోజనంలేని విషయంగా, పాఠశాల స్థాయిలో ఈ విషయాన్ని ఎవరైనా ఏ విధంగానైనా బోధించవచ్చు. సిలబస్ పూర్తి చేసినా, చేయకపోయినా ఎలాగోలా విద్యార్థులను ఉత్తీర్ణత చేయవచ్చు అనే భావన కొందరిలో ఈనాటికీ కనిపిస్తోంది. పాలకవర్గాలు కూడా అలాగే భావించారు. వాస్తవానికి అలాంటి దృక్పథం సరయింది కాదని మన విషయ ప్రాధాన్యతే తెలుపుతుంది. పైన తెలిపిన ఆధారాల ప్రకారం ఈ సృష్టి ఎప్పుడు ఆవిర్భవించింది, దానిపై మానవుడు తన మనుగడను ఎలా కొనసాగించాడో మనకు భౌగోళికంగా చారిత్రకంగా తెలుస్తుంది. అంటే సాంఘికశాస్త్రం పై అంశాలన్నింటిని క్షుణ్ణంగా తెలియజేస్తుందనడంలో లాంటి సందేహం లేదు. ఈ అంశాన్ని గమనిస్తే అన్ని శాస్త్రాల ఆధారలకంటే సామాజిక / సాంఘిక పరిసరాల ఆధారాలే అతి ప్రాచీన కాలం నుంచి లభిస్తున్నాయి. వాటి ఆధారంగా సమాజాన్ని సరియైన మార్గంలో నడిపించడానికి సామాజిక శాస్త్రం, సాంఘిక విజ్ఞానం ఎంతగానో తోడ్పడుతున్నందువల్ల ఇది అతి ముఖ్యమైందిగా, మానవుని ప్రగతికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందజేసే విషయంగా భావించినపుడు సాంఘికశాస్త్ర పరిధిలో ఎంతో విశాలమైందని చెప్పవచ్చు.

సాంఘికశాస్త్రం ముఖ్యలక్షణం, “నేటి బాలలే రేపటి పౌరులు” అనే సంకల్పంతో అటువంటి బాలబాలికల ద్వారానే రాబోయే సమాజం పురోభివృద్ధి దిశలో ప్రయాణం చేయగలదు. అందుకే వారికి ఉత్తమ శిక్షణ, సోదరతత్త్వం, శాంతి, సహనం, శాసన విధేయత, దేశ సమగ్రతకై భవిష్యత్తులో వారివంతు కర్తవ్యాన్ని నిర్వర్తించటానికి ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్. స్కౌట్స్ & గైడ్స్ లాంటి శిక్షణలు ఇప్పించి దేశభక్తిని ప్రోత్సహిస్తుంది. కాబట్టి సాంఘిక శాస్త్రం ఉద్దేశ్యాలకు చాలా విశాల దృక్పథం ఉండి, జ్ఞానం, అవగాహన, వినియోగం, అభిరుచులు, వైఖరుల అభివృద్ధి, క్రియాశీలత, నైపుణ్యాల అభివృద్ధి, శాస్త్రీయ దృక్పథం, ఆశావాదం మొదలైన అంశాలను నేర్పుతుంది. భావోద్వేగాలను నియంత్రిస్తూ ప్రేమ, దయ, నైతిక విలువల ఆచరణ, యువత పెడమార్గంలో వెళ్ళకుండా కావలసిన మార్గనిర్దేశాలను

పెంపొందిస్తుంది. అపుడే ఆరోగ్యకరమైన సమాజం రూపొందుతుంది. గాంధీగారి మాటల్లో "పాఠశాల అనేది సూక్ష్మరూపంలో ఉన్న భారతదేశం (The school is the minature of India)" అన్ని రకాల వైద్యాలున్నప్పటికీ అంతా ఐకమత్యంగా జీవించే తత్వాన్ని అలవర్చుతుందిం.


నికోలస్ రైట్ అభిప్రాయం ప్రకారం "సాంఘుక శాస్త్రం పరిధి చాలా విశాలమైంది. సాంఘిక శాస్త్రం ప్రపంచవ్యాప్తంగా మానవుని ప్రస్తుత సమాజానికి సంబంధించినది". అంటే "సాంఘిక శాస్త్ర పరిధి ప్రపంచమంత విశాలమైంది. భూమిపై మానవుని చరిత్ర అంత సుదీర్ఘమైంది" అని చెప్పవచ్చు.

కాబట్టి మానవునికి, అతనికి సాంఘిక పరిసరాలకు ఎప్పటికి, అవినాభావ సంబంధం ఉండి నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. అంటే ఒకతరం కనుమరుగు అవుతూనే మరొకతరం పుట్టుకొస్తూ ఉంటుంది. ఆ తరం కూడా తన పరిసరాలను ఉపయోగించుకోవడం, పరిరక్షించుకోవడం ఆవశ్యకం. ఇలా ప్రకృతి, మానవుడు, అతని సాంఘిక ప్రవర్తనలు - బోధించే సాంఘికశాస్త్రం నిరంతరం కొనసాగుతున్నాయి. అందుకే సాంఘికశాస్త్ర పరిధినినిర్దేశించటం సాధ్యంకాదు.

సాంఘీకశాస్త్రం ప్రధానంగా మానవసంబంధాలను అధ్యయనం చేస్తుంది. మానవుడు సమాజ, రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ వ్యవహారాలలో పాల్గొనటానికి అవసరమైన జ్ఞానాన్ని మానవ సంబంధాలకు చెందిన అవగాహనను వైఖరులను ఆర్జించటానికి విద్యార్థులకు సహాయపడటం సాంఘీక శాస్త్ర లక్ష్యం. చరిత్ర, భూగోళశాస్త్రం, అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం, సమాజశాస్త్రం మొదలైన శాస్త్రాలనుంచి విషయాన్ని గ్రహించి విద్యార్థులను సమర్థవంతమైన పౌరులుగా తయారుచేయడానికి సాంఘీకశాస్త్రం ఉపకరిస్తుంది.

సాంఘీకశాస్త్రం ప్రధానంగా పాఠశాల స్థాయికి సంబంధించింది. పాఠశాల స్థాయిలో అధ్యయనం చేసే విద్యార్థులు మానవీయతను పెంపొందించుకొని వయోజనులైన మనుష్యులుగా రూపొందడానికి సాంఘీకశాస్త్రం సహాయపడుతుంది. ఇది పాఠశాల స్థాయిలో ఒక నిర్బంధ పాఠ్యాంశం.

సాంఘీకశాస్త్రంలో మానవ సమాజ పరిణామం తెలిపే చరిత్ర, మానవ సమాజంలో పౌరజీవనం గురించి తెలిపే పౌరశాస్త్రం, మానవ సమాజంలో మనము ఏర్పాటు చేసుకున్న రాజనీతిశాస్త్రం, మానవ జీవనోపాధిని మార్పును తెలిపే అర్థశాస్త్రం, మానవుని సామాజీకరణం, సమాజ వ్యవస్థీకరణం గురించి వివరించే సమాజశాస్త్రం మరియు మానవ నివాసం గురించి తెలిపే భూగోళశాస్త్రం ఇమిడి ఉన్నాయి.



అలా అని సాంఘికశాస్త్రం వివిధ సామాజిక శాస్త్రాల జ్ఞానముల కలగాపులగము కాదు. ఆయాశాస్త్ర జ్ఞానముల ప్రభావంలు వ్యక్తిపై చూపు సమగ్రప్రభావము అవి వ్యక్తి సమగ్ర వికాసమునకెట్లు తోడ్పడునో తెలుపు అనుభవ పూర్వకమైన జ్ఞానమే సాంఘికశాస్త్రం. దీని పరిధి అనంతమైనదని చెప్పవచ్చును.

## 1.1.4 సాంఘిక శాస్త్రం స్వభావం పరిధిపై విభిన్న దృక్పధాలు :-

సాంఘీక శాస్త్ర తరగతి గదిలో సామాజిక అంశాలను ఏర్పరచుకొనడంతో చూస్తారన్నది చాలా పెద్ద సమస్య. వాస్తవ పరిస్థితుల నుండి అత్యున్నతమైన ప్రశ్నలను తరగతి గదిలో చర్చించడం అంతే తేలిక విషయం కాదు. ఉదాహరణకు "సమానత, న్యాయాలను గౌరవించడం" ఈ అంశాన్ని నేర్చుకోవడమంటే విద్యార్థి తరగతి గదిలో చర్చించిన తరువాత ఇంటిలో లేదా సమాజంలో అసమానత అన్యాయం ఉంటే వాటితో తలపడలా? లేదా వాటికి సంబంధించిన పరిస్థితులను పరిశీలిస్తున్నప్పుడు వాటిని మార్చడం గురించి కూడా చర్చించాలా? లేక రాజ్యాంగం అందిస్తున్న హామీని అది ఏవిధంగా వాస్తవ పరిస్థితులలో అమలు అవుతున్నదో పరిశీలిచాలా? మొదలైనవన్నీ సాంఘీక శాస్త్ర అభ్యాసకుల, ఉపాధ్యాయుల ముందున్న సమస్యలు.

అయితే మన పాఠశాల వ్యవస్థ శాంతి సామస్యతలను కోరుకుంటూ అ ప్రియ ఘర్షణ పూరిత పరిస్థితులు తలెత్తకుండా చూస్తుంది. విద్యార్థులు భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా ఎదుగుటకు కావలసిన వాస్తవ పరిస్థితులను అంగీకరించి ఇంకా మెరుగైన చట్టాలు రూపొందించబడుతూ ఉంటామని అవి మరింత మెరుగ్గా అమలు అవుతాయని అందుకు పౌరులుగా బాధ్యత వహించాలని సాంఘికశాస్త్ర విద్యార్థులుగా తెలుసుకుంటారు.

భారత దేశ రాజ్యాంగం న్యాయమైన, సమానతతో కూడుకున్న సమాజాన్ని అందించుటకు రూపొందించబడింది. అయితే ఎటువంటి పౌరులు, పాలన వల్ల ఇది సాధ్యమవుతుందా అనేది రాజ్యాంగం వివరించదు. అందుకే సాంఘీకశాస్త్రం ముఖ్యలక్షణం ఈ అవగాహనను పిల్లలలో వృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలి. సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయునిగా సమాజంలో అత్యున్నత స్థానాన్ని పొందేలా విద్యార్థులను తయారుచేయుటకు కృషి చేయాలి.

విద్యారంగంలో ముఖ్యంగా సాంఘీక శాస్త్రాల బోధనా విధానంగా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి పాఠ్యపుస్తకాలలో నిర్ధారించిన సమాచారాన్ని తరగతి గదులలో పిల్లలకు అందించటానికి బదులుగా సమాచారాన్ని అర్థం చేసుకోవటానికి విశ్లేషించటానికి విభిన్న అవకాశాలు అనుభవాలు కల్పించడం ద్వారా పిల్లలు తమసొంత భావనాలను పెంపొందించుకోవటమనే కోణంలో మార్పులు చోటు చేసుకోవాలి. తరగతి గదిలో ఎంత ఎక్కువ వైవిధ్యాలు, సామాజిక నేపధ్యాలు ఉంటయో పిల్లలు అంత ఎక్కువ అనుభవాలు పొందగలుగుతారు. ఈ విధమైన విభన్న సామాజిక సత్యాలను దృక్పధాలను చూడడం ద్వారా పిల్లలు అత్యంత విలువైన సామాజిక నేపథ్యాలను అర్థం చేసుకోగలుగుతారు. పిల్లలకు సవాళ్ళతో కూడిన అభ్యసన సన్నివేశాలను కల్పించడం ద్వారా మరియు ఇతర అనుభవాలను కల్పించడం ద్వారా వాటిని నిశితంగా పరిశీలింపచేయడం ద్వారా వివిధ సామాజిక నేపద్యం గల పిల్లల అవసరాలను అర్థం చేసుకొనే వీలుకలుగుతుంది. సాంఘీకశాస్త్రంకు సంబంధించిన మరొక కీలక విషయం సామాజికంగా జరిగే మానవ ప్రతి చర్యలను బహుళ దృష్టికోణాలలో చూడాలి తప్ప ఏదోఒక కోణంలో మాత్రమే చూడటానికి అర్థంచేసుకోవటానికి వీలులేదు. ఇది ప్రజాస్వామ్యం నియమాలకు లోబడి జరగాలి. బహుళ దృక్పధ విధానాలు వనరులకు గుర్తించటానికి వినియోగించటానికి తోడ్పడుతుంది. విశ్లేషణాత్మకంగా విమర్శనాత్మక ఆలోచనలను వృద్ధి పరుస్తుంది. సాంఘీక శాస్త్రం అంశాలను మరింత లోతుగా విచారించినవుడు మాత్రమే సాంఘీక శాస్త్ర విషమ స్వభావాన్ని నిశితంగా పరిక్షించటానికి దాని స్వరూపానికి ఒక స్పష్టత చేకూర్చుటానికి వీలుకలుగుతుంది.

## 1.1.5 పాఠశాల విద్యా ప్రణాళికలో సాంఘీక శాస్త్ర స్థానం :-

మాధ్యమిక విద్యాదశ వరకు పున:నిర్మాణం గావించిన విద్యా ప్రణాళికలో సాంఘీక శాస్త్రం ఒక ముఖ్య విభాగం లేక మూలముగా చేయబడినది. ఇందుకు ప్రధాన కారణం విద్యార్థులందరూ విధాయకముగా నేర్చుకోవలసిన ప్రాతిపదిక అభ్యసనానుభవాలను మూల ప్రణాళికలో చేర్చటము. మూల విద్యా ప్రణాళిక విద్యార్థుల భావిజీవితమునకు శిక్షణ ఇస్తుంది. విద్యార్థులు వారి భావిజీవితంలో ఏ వృత్తి కోరుకున్నను వారి మూల విద్యా ప్రణాళిక మాత్రం అందరికి ఒకే విధంగా ఉండాలి. ఇది సంఘజీవితమునకు కావలసిన జ్ఞానమును విద్యార్థులకు ఇస్తుంది. పాఠశాల విద్యా ప్రణాళిక మాత్రం అందరికి ఒకే విధంగా ఉండాలి. ఇది సంఘజీవితమునకు కావలసిన జ్ఞానమును విద్యార్థులకు ఇస్తుంది. పాఠశాల విద్యా తొలిదశలో మూల విద్యా ప్రణాళికకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఇది విద్యార్థికి

14 సం॥లు వచ్చు వరకు సాధారణంగా సమాజంలో వ్యక్తులందరకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోగలిగే శక్తిని అందిస్తుంది.

సాంఘీక శాస్త్రమును మూల విద్యా ప్రణాళికలో చేర్చుటకు గల కారణములను క్రింది విధంగా చెప్పవచ్చు. అవి :

**1. మనో విజ్ఞాన శాస్త్ర కారణములు :** మానవుడు భౌతిక మరియు సామాజిక పరిసరములతో తమకు గల సంబంధములను తెలుసుకొనుటకు సాంఘీకశాస్త్రం ఉపయోగపడుతుంది. ఎందుకంటే ఇది సమగ్రమైనది కావటమే. సామాజిక జిజ్ఞాస, సత్యసంధత, విధేయత, సహనము. సహకారం, మొదలైన నైపుణ్యాలను మనోభావాలను సాంఘీక శాస్త్రాధ్యయనం మాత్రమే కలిగించును. అందువల్ల మూల పాఠ్య ప్రణాళికలో సాంఘీకశాస్త్రమునకు ప్రముఖ స్థానమున్నది.

**2. సాంఘీక కారణములు :-** మానవునికి సామాజిక స్పృహ ఉండాలి సమకాలిన సమస్యలను సాధించగల నైపుణ్యములను కలిగించి సమర్ధతగల పౌరునిగా శిక్షణ నిస్తుంది. అందుచేత సాంఘీక శాస్త్రము పాఠ్యప్రణాళికలో విధాయక విభాగమైనది.

**3. లౌకిక కారణాలు :** వ్యక్తి గౌరవముగా జీవిస్తూ తన హక్కులను కాపాడుకుంటూ సామాజిక పురోగమనానికి కొంత త్యాగం చేస్తుండాలి. ప్రజాస్వామ్యం ఒక ప్రభుత్వంగా కాక ఒక జీవన విధానంగా మానవుడు శాంతియుతంగా జీవించడానికి సంఘంలో కలిసి జీవించడానికి పరస్పరము గౌరవించుకొని కష్ట సుఖాలను పంచుకొనటానికి కావలసిన జీవన నైపుణ్యాలను సాంఘీక శాస్త్ర అధ్యయనం కల్పిస్తుంది.

## 1.2 సాంఘీక శాస్త్ర విద్యా ప్రణాళిక మరియు జాతీయ మౌలిక అంశాల ప్రాధాన్యత

21వ శతాబ్దంలో రాబోయే సాంకేతిక పరిజ్ఞాన సవాళ్ళకు తత్ఫలితంగా ఎదురయ్యే సామాజిక సవాళ్ళను ప్రస్తుతం దేశాన్ని ,ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న సవాళ్ళుకూ మనం తగిన విధంగా ప్రతి స్పందించటానికి మన విద్యావిధానం దోహదం చేయాలి. ఇది 1986 జాతీయ విద్యావిధానం ప్రధాన లక్ష్యం. నూతన విద్యా విధానం 1986 ఈ క్రింది పది మౌలిక విద్యా ప్రణాళికా రంగాలను గుర్తించింది. అవి

1. భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్ర
2. మన రాజ్యంగ కర్తవ్యం
3. మన జాతీయతను పెంపొందించడానికి తోడ్పడే పాఠ్యాంశాలు
4. భారతదేశ సాంస్కృతిక సంపద.
5. సమానత్వం, ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం.
6. స్త్రీ పురుష సమానత్వం
7. పరిసరాల సంరక్షణ
8. సామాజిక అవరోధాల తొలగింపు
9. చిన్న కుటుంబాల భావన
10. శాస్త్రీయ ధోరణి

ఈ పది మౌలిక సూత్రాలు సాంఘీక శాస్త్ర అధ్యయనానికి సంబంధించినందువల్ల పాఠశాల విద్యా ప్రణాళికలో సాంఘీక శాస్త్ర అధ్యయనానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది.

1986 జాతీయ విద్యా లక్ష్యాలను గమ్యాలను పైన ఉదహరించిన పది మౌలిక అంశాలను సాధించడం కోసం జాతీయ విద్య పరిశోధన శిక్షణ సంస్థ ప్రాధమిక, ప్రాథమికోన్నత దశలకనువైన విద్యాప్రణాళిక మార్గదర్శక సూత్రాలను రూపొందిచింది. అందుకు అనుగుణంగా అన్ని రాష్ట్రాలలో విద్యా ప్రణాళిక సిలబస్ పాఠ్యగ్రంథాలను మార్పు చేశారు. అందుకోసం పైన తెలిపిన పది మౌలిక విద్యా ప్రణాళికాంశాలను ఈ నూత విద్యా విధానం కింద భారత ప్రభుత్వంలోని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రచురించిన “కార్య పథకం” (Programme of action POA) లోని వివిధ విషయాలను దృష్టిలోకి తీసుకొని మన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయిలోని విద్యా పాఠ్య ప్రణాళికలను సంస్కరించారు. ఈ నూతన ప్రణాళికలను 1993-94 నుంచి అంచెలవారీగా మన పాఠశాలల్లో ప్రవేశపెట్టారు. పైన తెలిపిన పది మౌలిక విద్యా ప్రణాళికాంశాలు చాలా వరకు సాంఘీకశాస్త్రానికి సంబంధించినది. కాబట్టి సాంఘీకశాస్త్రం బోధనా పద్ధతులలో ఈ అంశాలకు ప్రాధాన్యత ఏర్పడింది.

**1.3 ఎలిమెంటరీ స్థాయిలో పాఠశాల విద్యా ప్రణాళికలో సాంఘీక శాస్త్ర ఉద్దేశ్యము ప్రాధాన్యత :**

శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న అనూహ్యమైన మార్పులు అవి అందజేస్తున్న పరిశోధనల ఫలితాలు ప్రపంచీకరణకు దోహదం చేస్తున్నాయి. ప్రపంచం కుగ్రామంగా మారుతున్న నేపథ్యంలో మార్కెట్ శక్తులు ప్రజల జీవితాలేను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి

ఈ మార్పులు ప్రజలకు ఎన్నో అవకాశాలను కల్పిస్తున్నప్పటికీ వాటితో పాటు సవాళ్ళు కూడా ఎదురవుతున్నాయి. విస్తరిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక, సామాజిక సేవారంగాలు పట్టణీకరణను ప్రోత్సహిస్తున్నాయి. మరొకవైపు గ్రామీణ రంగం పూర్తిగా నిర్వీర్యం అయిపోతున్నది. సహజవనరులు కొల్లగొట్టబడుతున్నాయి. ప్రజల జీవన విధానంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. భారత రాజ్యాంగంలో పేర్కొన్న విధంగా సమానత్వం, న్యాయం, సుస్థిర ప్రగతి సాధించటం లేకపోగా జాతిమత కుల లింగ వివక్షతలు సామాజిక అసమానతలు పెరిగిపోయాయి.

సాంఘీక శాస్త్ర విద్యాబోధన ద్వారా మాత్రమే భావిభారత పౌరులు ఈ సమస్యలను అర్థం చేసుకొని సవాళ్ళను ఎదుర్కొనగలుగుతారు. ప్రపంచీకరణ నేపథ్యంలోని అభివృద్ధిని పిల్లలు తమ జీవితానుభవాల ద్వారా అర్థం చేసుకోవడానికి జాతీయ పౌరులుగా గుర్తింపు పొందడానికి సాంఘీక శాస్త్ర అధ్యయనం దోహదపడుతుంది. ఇంకా సాంఘీక శాస్త్ర అధ్యయన ఆశయాలు దాని ప్రాముఖ్యతను క్రింది విధంగా చెప్పవచ్చు. అవి

1. పరిసరాలతో విద్యార్థులకు పరిచయాన్ని
2. సాంఘీక ఆర్థిక సంస్థల పట్ల అవగాహనను
3. సాంస్కృతిక వారసత్వ అభినందనను
4. సామాజిక అర్హతకు
5. వివేచనగల ప్రజాస్వామ్య పౌరసత్వం నిర్మాణాన్ని
6. సాంఘీక భౌతిక పరిసరాలను అర్థం చేసుకోవడానికి తగిన జ్ఞానం అవగాహన, సామర్థ్యం అభిరుచులను
7. ఆర్థిక, సాంఘీక, రాజకీయ విలువల అవగాహనను
8. సంపూర్ణ మూర్తిత్వాన్ని
9. విరామ కాలాన్ని సద్వినియోగం చేసుకొనుటకు
10. అంతర్జాతీయ అవగాహనను పెంపొందించుటకు
11. సామాజిక నేపథ్యంలో కారణాలు చెప్పటం కారణాలను అన్వేషించే నైపుణ్యాలను పెంపొందిచటం.
12. స్థల, కాల సంబంధాలను విభిన్న మానవ అనుభవాలను అర్థం చేసుకోగలడం
13. సామాజిక ప్రపంచాన్ని పలుకోణాలలో చూసి అర్థం చేసుకోవటం.
14. ముద్రిత అంశం డేటా, చిత్రాలు, మొదలగు వాటిని అర్థం చేసుకొని విశ్లేషించే నైపుణ్యాలను పెంపొందించటం.
15. సామాజిక రాజకీయ విలువలను అభివృద్ధి పర్చడం.

భారతదేశంలో విద్య సామాజిక అంశాలను ప్రతిబింబించడమే కాక సమాజ పరిణామానికి అది ఆయుధం అవుతుంది. బాలబాలికలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ద వలసిన బాధ్యత పాఠశాలపై ఉన్నది. ప్రజాస్వామ్య దేశంలో వ్యక్తుల కంటే సామాజిక సంక్షేమానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. విద్యార్థిలో బావి సమాజ నిర్మాణానికి తగిన నైతిక సాంఘీక విలువలను కలిగించాలి. భారతదేశ సాంస్కృతిక వారసత్వమును తెలుసుకొని ఈనాటి సమాజ పరిస్థితికి అనుగుణమైనదానిని అనుసరించగలగాలి. ఈ బాధ్యతలు అన్నింటిని నిర్వర్తించి ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దటమే సాంఘీకశాస్త్ర ముఖ్య ఆశయం.

**1.4 సాంఘీక శాస్త్రం గురిచి అపోహలు, సాంఘీక శాస్త్ర వాస్తవ భావనలు సాంఘీక శాస్త్రంతో ముడిపడిన విలువలు :-**

**1.4.4 : సాంఘీక శాస్త్రం గురించి అపోహలు**

సాంఘీక శాస్త్రాలు సమాజంలోని విభిన్న కోణాలను అంశాలను స్పృశిస్తాయి. వీటిలో చరిత్ర, భూగోళం, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం, సమాజశాస్త్రం, మానవశాస్త్రం మున్నగు కోర్సులలోని పలు అంశాలు ఉన్నాయి. శాంతియుతమైన న్యాయ సమ్మతమైన సమాజ నిర్మాణానికి ఈ సామాజిక సంబంధ అంశాల జ్ఞానం విద్యార్థులకు అవసరమైన ప్రాతిపదికలను నేపథ్యాలను సమకూరుస్తుంది. ఈ పాఠ్యాంశాలన్నీ విద్యార్థులతో సామాజిక స్పృహను పెంపొందించుటకు తోడ్పడతాయి.

అయితే కొంతమంది సామాజిక శాస్త్రాలపై కొన్ని తప్పుడు అభిప్రాయాల్ని కలిగి ఉన్నారు. ఇది కేవలం అపోహలు మాత్రమే వీటిని చర్చిద్దాం. కలిగి ఉన్నారు. ఇది కేవలం అపోహలు మాత్రమే వీటిని చర్చిద్దాం.

**1. సామాజిక శాస్త్రాలు నిరుపయోగమైన బోధనాంశాలు :**

ఈ అభిప్రాయము సరియైనది కాదు. నిజానికి సామాజిక శాస్త్రాలు విద్యార్థులలో సామాజిక, సాంస్కృతిక విశ్లేషణ నైపుణ్యాలను పెంపొందించి పరస్పరాధారిత ప్రపంచంలో విద్యార్థులు మనగల్గుటకు అవసరమైన శక్తియుక్తుల్ని సమకూరుస్తాయని నొక్కి చెప్పాలి. అంతేగాక రాజకీయ, ఆర్థిక వాస్తవాలను కూడా ఇవి తేటతెల్లం చేస్తాయని నొక్కి చెప్పవచ్చు. అందువల్ల సామాజిక శాస్త్రాలు నిరూపయోగమైన బోధనాంశాలన్ని వీటికి ఇతర ప్రకృత శాస్త్రాలకు ఇచ్చినంత ప్రాధాన్యత అవసరం లేదన్న వాదనలో నిజంలేదు.

**2. పాఠకేంద్రిత సామాచారాన్నే సాంఘిక శాస్త్రాలు సరఫరా చేస్తాయి :-**

ఈ వాదన కూడా అపోహ మాత్రమే. సాంఘిక శాస్త్ర విద్యార్థులు అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించి సామాజిక, రాజకీయ వాస్తవాలను అన్వేషించడానికి ప్రాధాన్యం ఇస్తారు. భావనాపరమైన అవగాహనను పెంపొందించునట్లుగా సాంఘీక శాస్త్ర అధ్యయనం వీలు కల్పిస్తుంది.

**3. సాంఘీక శాస్త్రాలను అధ్యయనం చేసిన వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉండవు :**

ఈ సాంఘీక శాస్త్రాలు అధ్యయనం చేయడం వల్ల విద్యార్థులు భవిష్యత్తులో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతారనేది పూర్తిగా ఖండించదగిన విషయము. నిజానికి సామాజిక శాస్త్రాలను అభ్యసించి విశ్లేషణ సృజనాత్మక అభివృద్ధి నైపుణ్యాలు గలవారికి విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

**4. సామాజిక శాస్త్రాల ద్వారా శాస్త్రీయ అన్వేషణకు వీలుకాదు :**

నిజానికి జీవశాస్త్రాలు, భౌతిక శాస్త్రాల వలననే సామాజిక శాస్త్రాలు కూడా శాస్త్రీయ అన్వేషణలకు వుపకరిస్తాయనేది గుర్తించాలి. సమాచార సేకరణ, విశ్లేషణ, శాస్త్రీయ బద్ధంగా జరిగి ఫలితాలను విశ్లేషించడం జరుగుతుంది. అయితే సామాజిక శాస్త్రాల్లోని సూత్రాలకు ప్రకృత్తి శాస్త్రాల్లోని సూత్రాలకంటే మినహాయింపులు ఎక్కువ. ఇందుకు కారణం ప్రకృతి శాస్త్రాలలోని ప్రధాన అధ్యయనాంశం "ప్రకృతి" అయితే సామాజిక శాస్త్రాల్లోని ప్రధాన అధ్యయనాంశం "మానవుడు". మానవుని ప్రవర్తనలో చరత్వం ఎక్కువ. స్థిరత్వం తక్కువ. అయితే గణాంకశాస్త్రం భావనలను సామాజిక శాస్త్రాల పరిశోధనల్లో విరివిగా ఉపయోగించడం ద్వారా సామాజిక శాస్త్రాల అధ్యయనానికి శాస్త్రీయత అభించింది.

సాంఘీక శాస్త్ర బోధనా విలువలను తెలుసుకునే ముందు ఆశయాలను తెలుసుకోవడం అవసరం. సాంఘీక శాస్త్ర ఆశయాలు 2రకాలుగా విభజించవచ్చు అవి 1. సాధారణ ఆశయాలు 2. ప్రత్యేక ఆశయాలు.

**1. సాధారణ ఆశయాలు :**

1. మానవ సమాజాన్ని గూర్చి తెలుపుట (To explain human society)
2. ఆపేక్ష భావాన్ని కలిగించుట (To give a sence of belongingness)
3. విజ్ఞాన వంతులైన సత్ పౌరులుగా తయారు చేయుట (To Develop enlighted citizens)
4. విశ్వశాంతిని చేకూర్చుట (To promote world Peace)
5. జాతీయ సమైక్యతను పెంపొందించడం (To Develop National intigration)
6. దేశభక్తిని పెంపొందించుట (To Develop Patriotism)
7. దేశ భవిష్యత్తుపై నమ్మకం కలిగించుట (To Develop Confidence in the future of nation)
8. భారతదేశ సంస్కృతిని ప్రశంసించుట (To Appriciate Indian Culture)

**2. నిర్దిష్ట ఆశయాలు :**

1. విజ్ఞానార్జన (Acquring Knowledge)

2. వివేచన మరియు విమర్శనాత్మకమైన నిర్ణయ శక్తులను పెంపొందించుట (Development of Reasoning Power and critical Judgment)

3. స్వయం పఠనాశిక్షణ (Trainig in independent Study)

4. అలవాట్లను నైపుణ్యములను పెంపొందిచుట (Formation of Habits and Skills)

5. కోరదగిన శీల సంపదకు శిక్షణ ఇచ్చుట (Training in desirable Pattern of Conduct)

ఈ పై ఆశయాలను దీర్ఘకాలంలో సాధించగలము. వీటిని ఎంత సాధించామనేది మాపన చేయలేము వీటిని కేవలం గమనించగలము.

విలువలు సాంఘీక సంస్థల అంతర్భాగం. ఇవి ప్రవర్తనకు సాంఘీక కార్యకలాపాలకు నిర్ణయ ప్రమాణాలుగా పనిచేయును. ఇవి ఒక ఉమ్మడి ఉన్ముఖత ఇస్తుంది. వ్యక్తిగత ప్రవర్తనను నిర్ణయించుటకు ఆధారంగా పనిచేస్తాయి. అంతేగాక ప్రవర్తనను నిర్ణయించుటకు ఆధారంగా పని చేస్తాయి. ఇవి తప్పొప్పులు మధ్య విచక్షణకు తోడ్పడతాయి.

బోధన ద్వారా ఏమి సాధించాలి అని తెలియజెప్పే ఆశయాలు కన్నా ఎంతవరకు సాధించామో తెలియజేసే విలువలు లేక ఫలితాలు ముఖ్యమైనవి.

**1. సాంఘీక శాస్త్ర బోధనా విలువలు :**

అనుభవాలతో కూడిన జ్ఞానము సాంఘీక శాస్త్ర అధ్యయనం విద్యార్థులకు అనుభవ పూర్వక జ్ఞానాన్ని అందిస్తుంది. నేర్చుకున్న విజ్ఞానాన్ని ఆచరణలో పెట్టుటకు అవకాశం కల్పిస్తుంది. అందువల్ల విద్యార్థులు అభ్యసనం ద్వారా అనుభవాలు పొందుతారు.

**2. సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలగడం :**

సాంఘీక శాస్త్ర బోధనా పద్ధతులలో ఎక్కువగా ప్రయోగాత్మకంగా అభ్యసించడానికి వీలు కల్పించే పద్ధతులున్నాయి. ప్రణాళికా పద్ధతి సమస్య పరిష్కార పద్ధతి, సంఘీకృత ఉద్గార పద్ధతి మొదలగు పద్ధతులలో విద్యార్థి స్వయంగా సమస్యలను విశ్లేషించి సామాన్యీకరణ చేస్తాడు. స్వయం అభ్యసనం విద్యార్థులలో సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనగల్గే ఆత్మ స్థైర్యాన్ని కలిగిస్తుంది.

**3. సహకార భావంతో శిక్షణ :**

సాంఘీక శాస్త్ర అధ్యయనం విద్యార్థులకు వ్యక్తిగత కార్యకలాపాలకంటే సామూహిక కార్యకలాపాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది కాబట్టి సాంఘీక శాస్త్ర అధ్యయనం విద్యార్థులలో సహకార భావాన్ని పెంపొందించటంలో శిక్షణ నిస్తుంది.

**4. సమాజ పరిణామానికి అనుగుణవగా సర్దుకుపోయే సరళ స్వభావం :**

విద్యార్థి ప్రస్తుత పరిస్థితులకు తగినట్లుగానే కాక భవిష్యత్ జీవితానికి కూడా ఉపయుక్తంగా ఉండే విధంగా విద్య ఉండాలి. సాంఘీక శాస్త్ర అధ్యయనం విద్యార్థి జీవితం అనేది నిరంతర అభివృద్ధి అని తెలియచెప్పి ఈ పరిణామ క్రమంలో సర్దుకుపోగల నైపుణ్యాన్ని ఇస్తుంది.

**5. వివేచనాత్మకమైన పరిజ్ఞానాన్ని పెంపొందిస్తుంది :**

సాంఘీక శాస్త్రాధ్యయనం విద్యార్థి నాగరికతాభివృద్ధికి మానవుడు చేసిన కృషి, పరిసరాలను తనకు అనుకూలంగా చేసుకొని జీవనాన్ని సాగించిన విద్యలను సంబంధించిన వాస్తవ విషయాలను తెలుపుతుంది. దీనివల్ల విద్యార్థి వాస్తవ విషయాలను ఆలోచించి వివేచనాత్మకమైన పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటాడు.

**6. పౌరులుగా వ్యక్తుల పాత్రలను తెల్పుట :**

సాంఘీక శాస్త్రం సామాజిక వ్యవస్థ యొక్క స్వరూపాన్ని తెల్పుట గాక ఈ వ్యవస్థలో ప్రతి వ్యక్తి యొక్క పాత్ర వారు చేయవలసిన బాధ్యతలను గూర్చి కూడా తెలుపుతుంది సహకార కృషిలో అనుభవాలను కలుగచేస్తుంది. సాంఘీక శాస్త్రం బాలబాలికలకు వారి వారి వ్యక్తిగత మరియు సామాజిక జీవన అభివృద్ధికి వారి పాత్రను తెలియచేస్తుంది.

సాంఘీక శాస్త్ర బోధన వల్ల వచ్చే ఫలితాలు విలువలు కాగ సాంఘీక శాస్త్ర బోధన వల్ల సాధించవలసిన గమ్యాలను ఆశయాలు అంటాము. అంటే సావఘీక శాస్త్రాన్ని సమర్థవంతంగా బోధిస్తే బోధనా విలువలను సాధించవచ్చు.

బౌద్ధిక విలువలు (Intellectual Values)

మానవుని బుద్ధి వికాసానికి కారణం అతనిలో తెలుసుకోవాలనే కోరిక, అభిరుచి, జ్ఞాపకాలే. మానవుని ఆలోచనా విధానాన్ని, తార్కిక శక్తిని పెంపొందించడంలో శాస్త్రం కొత్త పద్ధతుల్ని ప్రవేశపెట్టింది. దీని ఫలితంగా

వివేకం, జ్ఞానాభివృద్ధికి దోహదపడింది. దీనివల్ల నేర్చుకున్న కొత్త విషయాలు నిజజీవితంలో ఉపయోగపడతాయి. నూతన విషయాలు తెలుసుకోవడంవల్ల సత్యాన్వేషణకు ప్రయత్నించడంవల్ల విద్యార్థుల్లో బుద్ధివికాసం పెరుగుతంది. సాంఘికశాస్త్రాన్ని అధ్యయనం చేయడం వల్ల బౌద్ధిక నిజాయితి పెంపొందించుకోవడం, ప్రజాస్వామ్య విధానం మన చుట్టూ ఉండే పరిసరాలను అర్థం చేసుకొని వాటికీ వ్యక్తికీ మధ్యఉన్న పరస్పర సంబంధాలను అర్థం చేసుకోవడం లాంటి బౌద్ధిక విలువలు పెంపొందుతాయి. సాంఘికశాస్త్రం వల్ల విద్యార్థుల్లో బుద్ధికుశలత, సహనశీలత, నిస్వార్థత, సమాజానికి, జాతికి సేవచేయాలనే దృక్పథం పెంపొందుతాయి.

ఉపయోగితా విలువలు (Utilitarian Values):

దైనందిన జీవితంలో అనేక విషయాలు సాంఘికశాస్త్రంతో ముడిపడి ఉన్నాయి. భౌగోళిక శాస్త్ర పరిజ్ఞానం వలల నేలలు, ఆనేలల్లో పండే పంటలు, భూమిలో దొరికే ఖనిజ సంపద మొదలైన వాటికి సంబంధించిన జ్ఞానం లభిస్తుంది. చరిత్రను చదవడం వల్ల మన పూర్వీకుల గొప్పతనాన్ని, అప్పటి పరిస్థితుల్ని అర్థం చేసుకోవచ్చు. వివిధ రకాల రాజకీయ వ్యవస్థలు, వాటి ప్రయోజనాలను అర్థం చేసుకొని మంచి ప్రజాస్వామ్య ప్రభుత్వం నిర్మించుకోగలం. పౌరశాస్త్ర అధ్యయనం వల్ల విద్యార్థి తన హక్కులు, విధులు, బాధ్యతలను తెలుసుకోవడం, ఓటుహక్కును వినియోగించుకోవడం, న్యాయాలు, చట్టాలను గౌరవించడం లాంటివి జరుగుతాయి. అర్థశాస్త్రం ద్వారా మార్కెట్లు ఏవిధంగా ఉంటాయి. పంచవర్ష ప్రణాళికల్ని ఆధారంచేసుకొని ఏవిధంగా అభివృద్ధి సాధించగలమో తెలుసుకోవచ్చు. ఈవిధంగా సాంఘికశాస్త్ర బోధన వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి.

సాంస్కృతిక విలువలు (Vocational Values):

సంస్కృతిని ఒక తరం నుంచి మరొక తరానికి అందించడమే విద్య ముఖ్య విధి. రాతియుగం నాటి సంస్కృతి కంటే నేతి ఆధునిక సంస్కృతిలో ఎంతో అభివృద్ధి కన్పిస్తుంది. దీనికి సాంఘికశాస్త్ర అధ్యయనం ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఆకులూ, అలమలూ తింటూ, చెట్టు బెరడులు ధరించి, చెట్ల తొర్రల్లో జీవించి ఉన్న మానవులు, నేడు రకరకాల దుస్తులు, విలాసవంతమైన జీవితం వరకు, ఆచార వ్యవహారాల్లో, ఆరోగ్యంలో, కట్టుబాట్లలో, ఆలోచనా విధానంలో ఎన్నెన్నో మార్పులకు శాస్త్ర పరిజ్ఞానం కారణం. సాంఘిక శాస్త్ర బోధన వల్ల మన పూర్వీకుల సంస్కృతిని కాపాడటంతో పాటు నేడు మన సంస్కృతిని అభివృద్ధి చేసుకొని మానవజాతి పురోభివృద్ధి చెందుతుంది.

నైతిక విలువలు (Moral Values):

వ్యక్తులు తమ అంతర్గతాన్ని చూడగలగడం నైతిక విలువ. దీనివల్ల మంచి, చెడు విచక్షణాజ్ఞానం అలవడుతుంది. నైతిక విలువల వల్ల వ్యక్తి తనను పక్కకు బెట్టి లక్ష్యాత్మకంగా దృగ్విషయాలను, సంబంధాలను, సమస్యలను చూడగలిగే సామర్థ్యం అలవడుతుంది. సాంఘికశాస్త్ర బోధనవల్ల విద్యార్థుల్లో నిజాయితీ, నిష్కపట మనస్తత్వం, సంఘటితంగా, నిష్పాక్షికంగా, నిర్భయంగా, నిస్వార్థంగా, ఓర్పుగా ఉండటం లాంటి నైతిక విలువలు అభివృద్ధి చెందుతాయి.

చట్టాలపై నమ్మకాన్ని, గౌరవాన్ని కలిగి ఉండటం, సమాజ ప్రగతికోసం పాటుపడటం, లంచగొండితనం, అవినీతిని రూపుమాపడం, పన్నులను సకాలంలో చెల్లించడం, నీతిబద్ధంగా వ్యవహరించడం మొదలైన నైతిక విలువలు సాంఘికశాస్త్ర అధ్యయనం వల్ల విద్యార్థులకు అలవడతాయి.

సౌందర్యాత్మక విలువలు (Aesthetic Values):

జాన్‌కీట్స్ అభిప్రాయంలో "సత్యమే సౌందర్యం, సౌందర్యమే సత్యం". సౌందర్యాన్ని చూడగల హృదయం మనకుంటే సృష్టిలో ప్రతి వస్తువు సౌందర్యమయమే. ప్రకృతిలోని సంపదను అన్వేషించడం వల్ల అందులోని నదులు, లోయలు, పర్వతాలు, కొండలు, జలపాతాలు, వివిధ ప్రజల జీవన విధానం, శిల్పకళలు, పెయింటింగ్‌లు, తాజ్‌మహల్, జైపూర్‌కోట, వివిధ దేవాలయాలు, రాజులు నిర్మించిన కోటలు ఇలాంటిఎన్నో విషయాలు మనకు ఆనందాన్ని, రసానుభూతిని కలిగించే తృప్తివల్ల మానవుడు ఇంకా తెలుసుకోవాలనే తపనతో ముందుకు పోతాడు.

సృజనాత్మక విలువలు (Creative Values):

సాంఘికశాస్త్ర అధ్యయనం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుంది. సృజనాత్మకత అంటే కొత్తకోణంలో ఆలోచించగలగడం లేదా ఉన్న విషయాలను నూతన విధానంలో చెప్పగలగడం, విషయాన్ని భిన్నరీతుల్లో అమర్చి నూతన ఆవిష్కరణలకు నాందిపలకడం, విద్యార్థులు అభ్యసనకు కావలసిన ప్రత్యామ్నాయ పరికరాలను సమకూర్చుకోవడంలో, తయారుచేయడంలో సులభ పద్ధతులను, విధానాలను తెలుసుకోవడం ద్వారా సృజనాత్మకత పెంపొందుతుంది.

క్రమశిక్షణ విలువులు (Disciplinary Values) :

సాంఘిశాస్త్ర అధ్యయనం నీతి నిజాయితీతో, సంయమనాన్ని పాటిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ, మంచి జీవితానికి నాంది పలుకుతూ, క్రమశిక్షణాయుతమైన జీవితం గడపడానికి ఉపకరించి వ్యక్తి ఆలోచనలో, ప్రవర్తనలో మార్పు తెస్తుంది. సాంఘికశాస్త్ర అధ్యయనం సమస్యను నిశితంగా పరిశీలించడం, సమగ్రంగా ఆలోచించడం, పరిశీలించిన అంశాల నివేదిక తయారు చేయడం, పరికల్పనను రూపొందించి పరీక్షించడం, వీటి ఆధారంగా సూత్రాలు, సిద్ధాంతాలు రూపొందించడం లాంటి విషయాల్లో శిక్షణనిస్తుంది. దీనిద్వారా నిజజీవితంలో సంభవించే సమస్యలను క్రమశిక్షణతో పరిష్కరించవచ్చు.

శాస్త్రీయ వైఖరుల అభివృద్ధి (Development of Scientific Attitude):

సాంఘికశాస్త్రం అధ్యయనం విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరులను పెంపొందించాలి. దీనివల్ల వారిలో విశాలదృక్పథం అలవడుతుంది. నిర్ణయాలను సరిగ్గా పరిశీలించి బేరీజు వేయగలరు. నిర్ణయశక్తి, విమర్శనాత్మక వైఖరి ఉంటుంది. మూఢనమ్మకాలను విడనాడి సాక్ష్యాల ఆధారంగా నిర్ణయాలు చేయగల శక్తిని పెంపొందించు కుంటారు. విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరిని పెంపొందించడానికి స్వయంగా పఠనాన్ని ప్రోత్సహించడం, ప్రయోగాలు నిర్వహించడం, నిర్ణయాలను పరిశోధన ఫలితంగా చేయడం, విహారయాత్రలు నిర్వహించడం మొదలైన కార్యక్రమాలను చేపట్టవలసి ఉంటుంది.

## చరిత్ర, భూగోళశాస్త్రం, రాజనీతి శాస్త్రం, అర్థశాస్త్రాల ప్రాధాన్యత:

పరిస్థితులకు అనుగుణంగా పరివర్తన చెందే మానవ ప్రవర్తన పరిసరాలతో మానవునికి ఉన్న సంబంధం, దృక్పథం ఇతరులతో సత్సంబంధాలను పెంపొందించుకొనుటకు కావలసిన విలువలు వైఖరులు సామాజిక సమస్యలను తెలుసుకొని వాటిని పౌరులుగా ఎలా ఎదుర్కోవాలో సామాజిక శాస్త్రాలు చర్చిస్తాయి.

> "సామాజిక శాస్త్రాలు భౌతిక వస్తువులు నక్షత్రాలు, రాళ్ళు, కట్టెల కంటె ప్రత్యేకించి మానవ విషయాలకు సంబంధించినది" – చార్లెస్ బయర్డు

విద్యార్థి సాంఘీక సమస్యలను అర్థం చేసుకొని జీవితాన్ని సఫలీకృతం చేసుకుంటాడు. సాంఘీక శాస్త్ర పరిధిలో సమాజశాస్త్రం కూడా భాగమై ఉండటం వలన అది విద్యార్థుల సామాజిక ప్రవర్తనకు, సామూహిక జీవనానికి అవసరమైన శిక్షణ నిస్తుంది. అంతే కాకుండా సమాజం యొక్క ఆచారాలు సాంప్రదాయాలు సామాజిక నడవడిక మొదలగు వాటి గురించి విద్యార్థికి అవసరమైన శిక్షణ నిస్తుంది.

సామాజిక శాస్త్రాలు మన జీవితాలకు, ఉనికికి ఎంతో ముడిపడి ఉంటాయి. అవి మన ప్రవర్తనను ప్రాపంచిక దృక్పథాన్ని తీర్చిదిద్దుతాయి. సమాజాన్ని ప్రభావితం చేస్తూనే దాంట్లో కలిసిపోయేలా అభ్యాసకులను మలుస్తుంది. సామాజిక శాస్త్రాలతో ఏం చెప్పాలి అన్నది సమాజాన్ని, మనుషులను మనం ఎలా చూస్తామన్న దానిమీద ఆధారపడి ఉంటుంది. ప్రతి వ్యక్తి ప్రతిరోజూ తలపడే అంశాలలో సామాజిక శాస్త్రం ముడిపడి ఉంటుంది.

ఈ సామాజిక శాస్త్రాల లక్ష్యములను వాటి ప్రాముఖ్యతను చర్చిద్దాం.

### ఎ. చరిత్ర :

హిస్టరీ అను ఆంగ్లపదము "హిస్టోరియా" అను గ్రీకు పదమునుండి పుట్టినది. హిస్టోరియా అనగా అన్వేషణ లేక అన్వేషణ ద్వారా అభ్యసనము. రాజకీయ సాంఘీక ఆర్థిక మత విజ్ఞాన శాస్త్ర కళా సంస్కృతి రంగాలలో మానవుడు సాధించిన విజయాలను, పరాజయాలను చరిత్ర తెలుపుతుంది.

చరిత్ర కేవలం కాలక్రమేణా వచ్చే మార్పులను అవగాహన పరచటమే కాకుండా ఆ మార్పులు ఏఏ సామాజిక వర్గాలను ఏ విధంగా ప్రభావితం చేస్తాయో ఆ మార్పులు తర్వాత తరాలకు ఎలా అందించబడతాయో తెలుపుతుంది. చరిత్రలోని అంశాలను మనకు తెలియని అంశాలకు లభించిన ఆధారాలు సమాచారాలను విశ్లేషించడం ద్వారా వర్తమానానికి అన్వయించడానికి చరిత్ర దోహదం చేస్తుంది.

**చరిత్ర బోధనా లక్ష్యాలు :**

1. మానవ సమాజంలో కాలానుక్రమంగా వచ్చిన మార్పులను అభివృద్ధిని గూర్చి విద్యార్థులకు సరైన అవగాహనను పెంపొందించుట

2. ఒకే విధమైన నాగరికతా లక్షణముల కలిగిన వివిధ సమాజములను గూర్చి విద్యార్థులకు సరియైన అవగాహన నేర్పరుచుట.

3. మానవజాతి చరిత్రను తెలుసుకొనుట ద్వారా సరైన వైఖరులను అభివృద్ధి చేయుట.

4. మానవజాతి ఔన్నత్యమును వివిధ సంస్కృతులతో సహకరించిన రీతిని ప్రశంసించుటకు విద్యార్థులలో సరియైన అవగాహనను పెంపొందించుట.

5. కాలం, స్థలం, సమాజం అనుభావాల అవగాహనను పెంపొందించుట

6. సాంస్కృతిక వారసత్వమును ప్రశింసించుట భూతకాలంలోని సాంప్రదాయాల్ని ఆచారాలను అధ్యయనం చేయుట.

7. చారిత్రక సమగ్ర దృష్టిని పెంపొందించుట.

## బి. భూగోళశాస్త్రం :

జియోగ్రఫీ అను పదము “జియోగ్రఫియా”అను గ్రీకు పదము నుండి గ్రహించబడినది. జియో అనగా భూమి గ్రఫియా అనగా వర్ణన అనగా భూమిని వర్ణించు శాస్త్రం. పూర్వం భూగోళశాస్త్రం భూమి యొక్క భౌతిక లక్షణాలను దేశాల సరిహద్దులను మొదలగు వాటిని వర్ణించుటకు అధ్యనం చేసేవారు.

ఆధునిక భూగోళశాస్త్రం అద్వితీయంగానూ, వివరణాత్మకంగానూ, విశ్లేషణాత్మకంగానూ రూపొందింది.

మానవుడు జీవించు విధానం, సాగు చేయు భూములలోని రకాలు. శీతోష్ణస్థితి, సహజ సంపద మొదలగు విషయాలను తెలుపుతుంది. భూమిమీద మానవుని కార్యకలాపములు మరియు భూగోళ పరిసరములు పరస్పరము ప్రభావితం అయ్యే విధానములకు సంబంధించినశాస్త్రం భూగోళశాస్త్రం.

**భూగోళశాస్త్రం లక్ష్యములు :**

1. భూ ఉపరితలము మీద అనేక విధములుగా విస్తరించబడిన భౌగోళిక ఆర్థిక వనరులను గూర్చి విద్యార్థులు అవగాహన చేసుకొనుటకు సహాయము చేయుట.

2. మానవుని ఆర్థిక మరియు సాంకేతికాభివృద్ధిని గూర్చి విశదీకరించుటలో విద్యార్థులకు సహకరించుట.

3. ప్రపంచ ప్రజల జీవన విధానము మరియు మారుతూ ఉన్న పరిసరములకు అనుగుణంగా వారి సమస్యలను గూర్చి విద్యార్థులు అవగాహన చేసుకొనుట.

4. సహజ ప్రాకృతిక వాతావరణానికి, మానవ సమాజానికి గల అంశాలు సంబంధాలు మరియు విభిన్న సమాజాల మధ్య సంబంధాలను తెలుసుకొనుట.

5. భౌగోళిక వనరులు వాటి వినియోగం వనరుల పంపిణీ మొదలైన వాటిని విశ్లేషించుట

6. విద్యార్థులకు స్థానిక ప్రపంచానికి, విశ్వ ప్రపంచానికి గల సంబంధాలను అర్థం చేసుకోవడానికి తోడ్పడుతుంది.

7. వెనుకబడిన ప్రాంతాల గురించి సమాచారం సేకరించి విశ్లేషించి అక్కడి ప్రజల జీవన పరిస్థితిని మెరుగు పర్చుటకు తగు సూచనలు ఇవ్వటం.

## సి. రాజనీతి శాస్త్రం :

సమాజముతో, రాజ్యముతో పౌరునికి గల సంబంధ బాంధవ్యాలను తెల్పు సామాజిక శాస్త్రమే పౌర శాస్త్రము రాజ్య స్వభావ స్వరూపాలు ప్రభుత్వం, ప్రభుత్వరకాలు అధికారాలు స్థానిక సంస్థలు పరిపాలనా విధానాలు మొదలైన విషయాల గురించి రాజనీతిశాస్త్రం తెలుపుతుంది. విద్యార్థికి సమర్థుడైన ప్రజాస్వామ్య పౌరుడిగా శిక్షణ ఇచ్చుటకు అవసరమైన పరిజ్ఞానంను రాజనీతిశాస్త్రం అందిస్తుంది.

## డి. రాజనీతి శాస్త్రం బోధనా లక్ష్యాలు :

1. విద్యార్థులను ప్రజాస్వామ్య సమాజానికి తగిన ఉత్తమ పౌరునిగా తీర్చిదిద్దుట

2. భారతదేశము నందలి పౌర వ్యవస్థ రాజకీయ వ్యవస్థలను గూర్చి సరియైన అవగాహనను విద్యార్థులతో పెంపొందించుట.

3. విద్యార్థులను తెలివిగల పౌరులుగా తీర్చిదిద్ది పౌర సంబంధమైన అర్హతను వారికి కలిగించుట.

4. ప్రపంచ శాంతి భద్రతలు కాపాడుటలో వివిధ సంస్థల పాత్ర తెలుసుకొనుటకు.

5. ప్రపంచ దేశాలు ప్రజాస్వామ్య జీవన విధానంను ఎందుకు అవలంబిస్తున్నాయి ప్రజాస్వామ్య విధానానికి గల ప్రాధాన్యత తెలుసుకొనుటకు.

**ఇ.అర్థశాస్త్రం :**

మానవుని కోరికలు అందుబాటులో ఉన్న పరిమిత వనరులు వాటిమధ్యగల సంబంధాన్ని అర్థశాస్త్రం చర్చిస్తుంది. అర్థశాస్త్రం అను పదమును ఆంగ్లంలో “ఎకనామిక్స్” అంటారు. ఇది “ఓకియో” “నామస్” అను గ్రీకు పదముల నుంచి వచ్చింది. అర్థశాస్త్రం మానవ కార్యకలాపాలు సంపాదన, వ్యయము, వినియోగము సంపద మొదలగు వాటి గురించి అర్ధశాస్త్రం. తెలుపుతుంది. మానవుడు తన నిత్యజీవితంలో అనేక రకాలైన వస్తు సముదాయాలను వినియోగిస్తున్నాడు. అయితే వాటిని ఎలా పొందుతున్నాం. ఎలా కాపాడుకోవాలి, లేదా ఏవిధంగా అవసరాలకు అనుగుణంగా తయారు చేసుకోవాలి అనే విషయాలు ఉత్పత్తి–పంపిణీ, వినియోగం – మిగులు (పొదుపు), సద్వినియగం ఇలాంటి అంశాలను బాల్యం నుంచే విద్యార్థులకు అర్థమయ్యేటట్లు చేయాలి. అలా చేసేందుకు ఉపయోగపడే శాస్త్రమే అర్థశాస్త్రం.

**అర్థశాస్త్ర బోధనా లక్ష్యాలు :**

1. దైనందిన జీవితంలో ఆర్థిక సిద్ధాంతాలను, సూత్రములను అమలు పరచుటలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చుట.

2. సాంఘీక ఆర్థిక పరిసరములను గూర్చి విద్యార్థులలో అంతర్ దృష్టిని పెంపొందిచుట

3. దేశంలో ఎదురవుతున్న ఆర్థిక సమస్యలను గురించి వాటి పరిష్కార మార్గాలను విద్యార్థులకు తెలియచేయుట.

4. పరిమితమైన వనరుల ఉపయోగంలో అపరిమితమైన కోరికలను తీర్చుకోవడంలో మానవ ప్రయత్నాలు మరియు ప్రవర్తనను అధ్యయనం చేయుట.

5. వనరుల వినియోగం సమాజ సంక్షేమం వనరుల సమతుల పింపిణీ ఆవశ్యకత గురించి తెలుసుకొనుటకు

## 1.6 వివిధ సామాజిక శాస్త్రాల మధ్య అంతర్గత సంబంధం

### 1. చరిత్ర – భూగోళశాస్త్రం మధ్య సంబంధం :

ఎన్.సి.ఎఫ్.–2005 ప్రకారం సాంఘికశాస్త్రం అనే విషయాన్ని ప్రత్యేకంగా బోధనలో స్థాయిల వారీగా వర్గీకరణ చేసి బోధించాలని సూచిస్తుంది. ప్రాథమిక తరగతులకు జ్ఞాన నిర్మాణం, విషయ అవగాహన, పటాలు గీసి ప్రదేశాలను గుర్తించడం మరియు ప్రాజెక్టు పనులు, యశ్‌పాల్ కమిటీ రూపొందించిన సూత్రం ఆధారంగా, మానవతా విలువలు, సాంఘిక విలువలు సూక్ష్మస్థాయిలో బోధించాలన్నారు.

VI & VII తరగతులు (ప్రాథమికోన్నత స్థాయిలో) భూగోళశాస్త్రం, చరిత్ర, అర్ధశాస్త్రాలను బోధిస్తూనే పౌరనీతికి బదులుగా రాజనీతి శాస్త్రాన్ని అభ్యసింపజేయాలని సూచించారు. అంటే ప్రభుత్వాల స్వరూపాలు, స్థానిక స్వపరిపాలన పట్ల అవగాహన కలుగుతుందని భావిస్తున్నారు.

సెంకడరీ స్థాయిలో VIII, IX & X తరగతిలో చరిత్ర, భూగోళం, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రంతో పాటు సామాజిక అంశాలు నిమ్న, దళిత వర్గాల అభ్యున్నతి, ఆర్థిక, సాంఘిక సవాళ్ళు – పరిష్కార మార్గాలకై ఆలోచనను క్రియాత్మకతను పెంపొందించాలని సూచిస్తున్నారు.

కళాశాల స్థాయిలో ఉన్నత ప్రమాణాలు, వృత్తి విద్యలు అదనంగా బోధించాలని సూచించారు. ఈవిధంగా సాంఘికశాస్త్రం / పరిసరాల విజ్ఞానం ద్వారా విద్యార్థుల సంపూర్ణ వికాసానికి (All Round Development) అవకాశం

కల్పించాలనే భావన మనకు అవగతమవుతుంది. విద్యార్థులకు నిర్మాణాత్మక జ్ఞానం, తార్కిక దృక్పథం, హేతుభావనలు సంస్కృతి పరంపరల పరిరక్షణలను పెంపొందించాల్సిన ఆవశ్యకతను తెలుపుతున్నాయి.

చరిత్ర పఠనం వివిధ సంస్థల పరిణామాన్ని విమర్శనాత్మకంగా అవగాహన చేసుకొనుటకు దోహదం చేస్తుంది. చరిత్ర ప్రపంచంలోని ప్రాచీన మానవుల ఆచార్య వ్యవహారాలను కాలనుగుణంగా వాటిలో వచ్చిన మార్పులను గురించి తెలుపుతుంది. అనాదిగా మానవుడు సాంఘీక, ఆర్థిక, మత విజ్ఞాన కళా సారస్వత రంగాలలో సాధించిన జయాపజయాలను వివరిస్తుంది. భూగోళశాస్త్రం ప్రకృతి పరిసరాలు సాంఘీక, ఆర్థిక పరిస్థితుల మధ్యగల సంబంధాన్ని తెలుపుతుంది. అయితే ఈ రెండు శాస్త్రాలు మధ్య సహసంబంధం ఉన్నది. రెండు సామాజిక శాస్త్రాలు మానవ కేంద్రీకృతంగా సాగే అధ్యయనాలే. భూగోళశాస్త్రం చర్చించే ప్రజల జీవన విధానం ఆర్థికస్థితిగతులు వృతులు వారి జీవన ప్రమాణాలుపై భౌతిక అంశాలు శీతోష్ణస్థితి వాతావరణ పరిస్థితులు మొదలైనవి ఏవిధంగా అనాది కాలం నుంచి నేటివరకు ప్రభావం చూపుతున్నాయో చరిత్ర వివరిస్తుంది. చరిత్ర అధ్యయనం ద్వారా ఏకాలంలో ప్రకృతి సహజంగా సంబంధించిన అవాంతరాలను వాటి ఫలితాలను తెలుసుకొనుటకు అవే అవాంతరాలను మానవ ప్రయత్నాల ద్వారా తిరిగి సూచించకుండా ఏ చర్యలు తీసుకోవాలో తెలుసుకోవచ్చు. భూమి మీద మానవుని కార్యకలాపాలు మరియు భౌగోళిక పరిసరములు పరస్పరము ప్రభావితమయ్యే విధానములకు సంబంధించిన అంశాలను వివిధ కాలాల్లో వివిధ ప్రాంతాలలో/దేశాలలో ఏ విధంగా మానవుడు ప్రవర్తించారో చరిత్ర ద్వారానే అధ్యయనం చేయగలము. చారిత్రక అంశాలను విశాల దృక్పథంతో చర్చించటానికి వివిధ సామాజిక వర్గాలు, వాటి మధ్యగల సంబంధాలు ఒప్పందాలు సాంకేతిక అంశాలు సంస్కృతి, సాంప్రదాయాలు భౌగోళిక అంశాలు శీతోష్ణస్థితి పరిస్థితులు, పరిసరాలు విభిన్న ప్రాంతాల మధ్య ఉన్న వైవిధ్యాలను పరిశీలించి విశ్లేషించి చర్చించవలసి ఉంటుంది.

## 1.7 సాంఘీక శాస్త్ర వ్యవస్థీకరణ ఉపగమాలు :

సాంఘీక శాస్త్ర విద్యా ప్రణాళికను ఏ విధంగా రచించాలి. ఎప్పుడు ఏ అంశం ప్రవేశపెట్టాలి వివిధ స్థాయిలలో అంశం ఎట్లా అభివృద్ధి చేయాలి? ఆ అంశాన్ని ప్రవేశపెట్టాక పూర్వం ప్రవేశపెట్టిన తరువాత ఏం చెయ్యాలి? ఒక్కొక్క స్థాయిలో ఎంత బోధించాలి? ఈ విషయాలన్నింటిని జాగ్రత్తగా పరిశీలించి. అనువైన రీతిని ఎన్నుకొని విద్యా ప్రణాళికను రచన చెయ్యాలి. ఈ పనిలో ప్రధానంగా పాఠ్యగ్రంథం రచయితలు. ఉపాధ్యాయులు పాల్గొనవలసి ఉంటుంది. వీటిలోని అంశాలు క్రమబద్ధం చేయటం జరిగి ఒక క్రమాను గత శ్రేణిలో రూపొందుతాయి. ఇవి తార్కికమైన ఒక అనుక్రమంలోనూ కొన్ని అంతస్సంబంధాలతోనూ రూపొందుతాయి. అందువల్ల విద్యా వ్యవస్థలో విద్యా ప్రణాళిక రచన బోధనా శాస్త్రంలో అత్యంతావశ్యకమైన ఒక ప్రక్రియగా ఏర్పడింది.

విద్యా ప్రణాళిక రచనను ఉపయోగించే రీతులు చాలా ఉన్నాయి.

## 1.8. సాంఘీక శాస్త్ర బోధన – నిర్మాణాత్మక వాదం :

సాంప్రదాయ పద్ధతిలో సాంఘీక శాస్త్ర బోధన కేవలం సమాచారాన్ని అందించటానికి పరిమితం కావటం వల్ల దానిని బట్టీపట్టి గుర్తుంచుకొని చెప్పవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ముఖ్య కారణం పాఠశాలలు పాఠ్యపుస్తకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వటం ప్రారంభించినది. ప్రశ్నలకు జవాబులు రాబట్టడమే ప్రస్తుత బోధనా విధానంగా ఉ ండటం. పాఠశాల అనేది కేవలం సమాచార బదిలీని ప్రోత్సాహపరిచే స్థలంగా కాకుండా జ్ఞాన నిర్మాణానికి అభివృద్ధికి అనువైన కేంద్రంగా రూపొందాలి. విద్యార్థులలో ఉన్న అంతర్గత శక్తులను పెంపొందించి క్రమబద్ధంగా వినియోగించుకునేలా చేయటమే పాఠశాల. ప్రధానకర్తవ్యం. ఈ లక్ష్య సాధనకు నిర్వహించబడుతున్న బోధనాభ్యసన ప్రక్రియలు కేవలం సమాచారాన్ని అందించడమే కాక విద్యార్థులు ఆయా అంశాలలోని సమాచారాన్ని విశ్లేషించుకొనే సామర్థ్యాన్ని పాఠశాలలు పెంపొందిచాలి.

సామాజిక శాస్త్రాల బోధనలో నిర్మాణాత్మక అభ్యసనానికి ప్రత్యేక స్థానం ఉన్నది. దీనికై మూడు ప్రధాన ప్రక్రియలను తరగతి గదిలో అనుసరించాల్సి ఉంటుంది. అవి :

1. ప్రతి విద్యార్థి భౌతిక మరియు మేధోపరమైన కృత్యాలలో పాల్గొనటం.
2. తమ ఆలోచనలను సందేహాలను తోటి విద్యార్థులతో మరియు ఉపాధ్యాయులతో పంచుకోవడం
3. తాము చర్చిస్తున్న అంశాలకు తమ అనుభవాలను జోడించడం.

విద్య అనేది ఉపాధ్యాయుడు ద్వారానో లేదా పోస్టు ద్వారానో చేరవేసే వస్తువు కాదు. నిజమైన విద్య బిడ్డ భౌతిక సాంస్కృతిక క్షేత్రంలో సృషష్టించబడుతుంది. దాగి ఉంటుంది. తల్లిదండ్రులతో, టీచర్లతో, తోటి పిల్లలతో, సమాజంతో నేర్పే ప్రతి చర్య ద్వారా అది క్రమవికాసం పొందుతుంది. ఇలాంటి విద్య పటిష్టంగా ఫలప్రదంగా ఉంటుంది. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయుని పాత్రను, ఔన్నత్యాన్ని మనం గుర్తించాలి. ధృడ పరచాలి. జ్ఞాన సముపార్జన ఎప్పుడూ పరస్పరాశ్రితంగా ఉంటుంది. పెద్దలకంటే పిల్లలు బాగా పరిశీలిస్తారు. బాగా గ్రహిస్తారు. జ్ఞానాన్ని సృష్టించడంలో వాళ్లకున్న సామర్థ్యాన్ని పాత్రను మనం గుర్తించాలి. నాకున్న ఈ కొద్ది అవగాహన పిల్లలతో మాట్లాడటం వల్లనే లభించిందని అనుభవంతో చెబుతున్నాను.

ప్రొ. యశ్‌పాల్,
జాతాయ పాఠ్యప్రణాళిక – 2005
సారధ్య సంఘం అధ్యక్షులు

**జ్ఞాన నిర్మాణం :**

పిలలలో వివిధ అంశాలపై అవగాహన అభివృద్ధి పరచడానికి, భావ వ్యక్తీకరణను పాత్రాభినయం మాదిరి ఎన్నికలు / మాదిరి పార్లమెంటు/ అసెంబ్లీ, పాఠశాల సంక్షేమం, వాతావరణం వంటి వాటికి సంబంధించిన అంశాలు, సమస్యలపై సమిష్టిగా స్పందించగలగటం, సర్వే, జట్టు, ప్రాజెక్టు పనులు సమాచారాన్ని పట్టికల రూపంలో నమోదు చేయడం వంటి కృత్యాలను కల్పించాలి. అలాగే పిల్లలు మమేకం అయ్యేలా ఆలోచింపజేసే కృత్యాలయిన అవగాహన చేసుకోవటం, తమ అనుభవాలను అవగాహనను దృష్టియందుంచుకొని నిశితంగా సమీక్షించడం పోల్చడం భేదాలు చెప్పడం అనుబంద అంశాలను జోడించడం ఊహాత్మక వివరణలివ్వడం మొదలగునవి సాంఘీక శాస్త్ర బోధనలో చోటు చేసుకోవాలి.

వాస్తవానికి జ్ఞాన నిర్మాణం జరగాలంటే వివిధ విషయాల్లో జ్ఞానం ఎలా ఆవిష్కరించబడుతుందో అవి ఏఏ రూపాలలో ఉంటుందో అవగాహన చేసుకోవాల్సి ఉంటుంది. ఆ విధానాలను మనం తరగతి గదుల్లో అమలు పర్చాలి. ఏ విషయానికి చెందినా జ్ఞానమైన దానికి చెందిన ప్రక్రియల పైనే ఆధారపడి ఉంటుంది. ఆయా విషయాల్లో జ్ఞానం ఎలా ఆవిష్కరించబడుతుందో, ఆ ప్రక్రియలకు బోధనాభ్యసన ప్రక్రియల్లో స్థానం కల్పించాల్సి ఉంటుంది.

**జ్ఞాన నిర్మాణం ఏఏ సందర్భాల ద్వారా జరుగుతుంది?**

1. పూర్వ భావన (Pre Text) ఏ పాఠ్యాంశం గురించైనా భావన గురించైన పిల్లల్లో పూర్వజ్ఞానం లేదా అనుభవాలు లేదా అవగాహన ఉందా అని నిర్ధారించుకోవాలి.

2. తపన కలిగించడం (Urge Creation) పిల్లలు ఏ విషయాన్నైనా ఎంత కష్టమైన అవసరం ఉంటే తపన కలుగుతుంది. ఆసక్తి ఏర్పడుతుంది. భావావేశాన్ని పెంపొందించడం వల్ల కూడా తపన కలుగుతుంది.

3. మానసిక ప్రక్రియలు (Mental Process) : జ్ఞాన నిర్మాణంలో మానసిక ప్రక్రియలు కీలక పాత్ర పోషిస్తాయి. పిల్లలందరూ జన్మత: నేర్చుకోగలిగే సామర్థ్యం కలిగి ఉంటారు. పిల్లలకు పోల్చటం, వర్గీకరించడం విశ్లేషణ, సంశ్లేషణ, జ్ఞాపకం ఉంచుకోవడం పునరుక్తి చేయడం, నిర్ధారించడం, వ్యక్తపరచడం, గుర్తించడం, సాధారణీకరించడం, ఊహించడం, కల్పనాశక్తి వంటి అంతర్గత సామర్థ్యాలను కల్గి ఉంటారు. వాటివల్ల పిల్లలు మదిలో అనేక చర్యలు చోటు చేసుకుంటాయి. ఈ మానసిక ప్రక్రియల వల్ల నూతన జ్ఞానాన్ని పిల్లలు సృష్టించుకోగల్గుతారు.

4. ఆలోచింపచేయడం (Thought Provoking) : ఒక విషయం అంశంపై విభిన్న కోణాలలో పిల్లలను ఆలోచింప చేయడం వల్ల వారు జ్ఞానాన్ని సృష్టించుకోగల్గుతారు.

5. పిల్లలకు ప్రోత్సాహం, అవకాశం, వారిని భాగస్వాములను చేయడం ద్వారా జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. (Encouragement and participation)

జ్ఞాన నిర్మాణం – సోపానాలు :

1. పూర్వ భావనల నిర్మాణం(Pre text)

విద్యార్థులకు పూర్వ జ్ఞానాన్ని నిర్మించిన తరువాతనే అభ్యసన కార్యకలాపాలు నిర్వహించాలి.

2. పూర్వ భావనలతో పాఠ్యాంశ భావనలకు అనుసందానం (Contexualization of pretext with texual part) అభ్యసనం నిర్మాణాత్మకంగా జరగాలంటే పాఠ్యాంశ భవనాలను పూర్వ భావనలతో అనుసందానం చేయవలసి వుంటుంది.

3. జ్ఞానాత్మక శిక్షణ (Cogntive) పిల్లల జ్ఞాన నిర్మాణంలో ఉపాధ్యాయులు సౌకర్యకర్తలుగా ఉండాలి.

4. భాగస్వామ్య అభ్యసనం (Collaburative learning) తోటివారితో చర్చించుకోటానికి మాట్లాడటానికి అవకాశాలు ఉపాధ్యాయులు కల్పించాలి.

5. బహుళ ప్రతిస్పందనలు/ తమ ఆలోచనలకు రూపాన్నివ్వడం (Multi Manifestation) పిల్లలు వ్యక్తిగతంగా తమ ఆలోచనలను బహిర్గత పరచగలగాలి

6. నిర్ధారణ (Inference) వ్యక్తిగతంగా/ జట్టుపరంగా వ్యక్తపరిచిన అభిప్రాయాలను గ్రహించి తమకై తాము నిర్ధారించుకోగలగాలి.

**నిర్మాణాత్మక అభ్యసనం – ఉపాధ్యాయుని పాత్ర :**

ఉపాధ్యాయుడు సమాచారాన్ని అందించే వ్యక్తిగా ఉండకూడదు. ఆ సమాచారాన్ని పిల్లలే సృష్టించుకునేలా పరిస్థితులను వాతావరణాన్ని తరగతి గదుల్లో కలిపించాల్సి ఉంటుంది. అందుకు ఉపాధ్యాయుడు కీలక పాత్రను పోషించాలి. అవి

1. విద్యార్థుల జ్ఞాన నిర్మాణంలో భాగస్వాములు కావాలి.
2. ఆలోచనా వరుడు కావాలి.
3. సౌకర్యకర్తగా ఉంటూ విద్యార్థులకు అవసరమైన మేర సహకారం అందించాలి.
4. తరగతి గదిని ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాలి.
5. విద్యార్థుల బలాలు, బలహీనతలను గుర్తించగలగాలి.
6. కొత్త విషయాలను, అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటూ ఉండాలి. నిత్య పరిశోధకుడుగా ఉండాలి.
7. తరగతి గదిలో సమకాలిన/ సామిజిక అంశాలను చర్చింపజేస్తూ ఉండాలి.

అభ్యసనం నిర్మాణాత్మకంగా సాగినప్పుడే ఆ బోధనా ప్రక్రియ సఫలీకృతం అవుతుంది. విద్యార్థులకు ఆయా పాఠ్యాంశాలను, జ్ఞాననిర్మాణాత్మకంగా బోధించినట్లయితే వారు పొందిన జ్ఞానం నిత్యజీవితంలో వినియోగించబడుతుంది. అప్పుడే విద్యా లక్ష్యాలు నెరవేర్చబడతాయి.

## Definition and Scope of Social Studies :

అభ్యాసకులతో అర్ధవంతమైన అభ్యసనం జరుపుటకు ప్రతి సబ్జెక్టుకు అందరికి అంగీకారం అయిన నియమ నింధనలు, కొన్నే మార్గదర్శకాలు రూపొందించడం జరిగింది. ఇది బోధనా వైవిధ్యం కావచ్చు లేదా సబ్జెక్టులను సమకూర్చుటలో అవలంబించే వివిధ దశలు కావచ్చు. ఈ అధ్యయనం సాంఘిక శాస్త్ర నిర్వచనం పరిధి మరియు లక్ష్యాలు గురించి చర్చిద్దాం.

**ఈ అధ్యాయం యొక్క ముఖ్య లక్ష్యాలు :**

ఈ అధ్యాయంను చదవిని తరువాత అభ్యాసకులు

1. సాంఘికశాస్త్రాన్ని నిర్వచించగలరు.
2. సాంఘికశాస్త్రం పరిధిని వివరించగలరు.
3. సాంఘికశాస్త్రం యొక్క లక్ష్యాలు చెప్పగలరు.
4. సాంఘికశాస్త్రంలో అంతర్భాగాల యొక్క చరిత్ర, భూగోళశాస్త్రం, రాజనీతి శాస్త్రం మరియు అర్ధశాస్త్రంల ప్రాముఖ్యతను మరియు వాటి మధ్య గల అంతర్గత సంబంధమును చెప్పగలరు.
5. సాంఘికశాస్త్రం పాఠ్యప్రణాళిక రూపకల్పనలో అనుసరించే వివిధ రకాల బహుళ విభాగ, పరస్పరాధారిత, క్రమబద్దమైన ఉపగమాల గురించి చెప్పగలరు.

## INTEGRAGED APPROACH
## సమైక్య ఉపగమం

సాంఘికశాస్త్ర వ్యవస్థీకరణ ఉపగమాలలో సమైక్య ఉపగమం ఒకటి. ఈ ఉపగమంలో వివిధ సబ్జెక్టుల మధ్య సంబంధం ఏర్పరచుట జరుగుతుంది. అది పరస్పరాధారితంగా, బహుళవిభాగాల మధ్య లేదా ఒక క్రమబద్దమైన పద్ధలిలో ఉండవచ్చు. 20వ శతాబ్ధం ఆరంభం నుంచి సమైక్య ఉపగమంపై చర్చ జరుగుతున్నది. ఒక శాస్త్రాన్ని బోధించేటపుడు ఆ విషయానికి సంబంధించి మిగిలిన శాస్త్రాలకు చెందిన సారూప్య విషయాలను కూడా చర్చించడం. ఇంకోవిధంగా చెప్పాలంటే వివిధ సబ్జెక్టులను మరియు అందలి అనుభవాలను ఏకీకృతం చేయటమే పాఠ్యప్రణాళిలను సమైక్య పర్చుటం అంటాము.

ఇది క్రింది విధాలుగా జరుగుతుంటుంది.

1. Inter Disciplinary approach - పరస్పారాధారిత ఉపగమం

2. Multi disciplinary approach - బహుళ విభాగ ఉపగమం


3. Trans disciplinary approach - క్రమబద్ధమైన శిక్షణ ఉపగమం

**INTER DISCIPLINARY METHOD TEACHING - పరస్పరాధారిత బోధనా పద్ధతి :**

ఇది వివిధ రకాలైన బోధనాపద్ధతుల కలయిక. విద్యావిషయక అంశాన్ని బోధించేటపుడు దానికి సంబంధించిన ఇతర సబ్జెక్టులు బోధనాంశాలను నైపుణ్యాలను పద్ధతులను కలిపి విద్యార్థులకు బోధన చేయటం.

ఉదా : నదులు అనే పాఠ్యాంశాన్ని బోధజంచేటపుడు ఆర్ట్ ఎడ్యుకేషన్, విజ్ఞానశాస్త్రం మరియు భూగోళశాస్త్రం, చరిత్ర, అర్ధశాస్త్రం అంశాలను మేళవించి బోధన చేయటం. ఈవిధంగా సబ్జెక్టుల మధ్య గల అంతర్గత సంబంధాలను విశ్లేషిస్తూ వాటిని అధ్యయనం అధ్యయనం చేయటం జరుగుతుంది. సాంప్రదాయ బోధనలో తరగతిగదిలో లెక్కలు బోధించేటపుడు మిగతా సబ్జెక్టులను వేరుపరచి కేవలం లెక్కల బోధన వరకే పరిమితం చేస్తాము. పరస్పరాధారిత ఉ పగమంలో వివిధ సబ్జెక్టుల మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తూ వాటిమధ్య గల ఏకీకృత భావనలను విద్యార్థికి అందించటం జరుగుతుంది.

పరస్పరాధారిత ఉపగమంకు ఉదాహరణ :




జ్ఞానిర్మాణం అన్ని సబ్జెక్టుల పరస్పర సంబంధాలను కలుపుతూ జరుగుతుంది. అయితే ఈ ఉపగమంలో లోతైన అధ్యయనం ఉండదు.

**2. Trans Disciplinary Approach – క్రమబద్ధ శిక్షణ ఉపగమం :**

క్రమబద్ధమైన శిక్షణ ఉపగమం వాస్తవికత బోధనకు వీలుగా ఉంటుంది. దీనిని మొదలగా 1970లో పియాజెట్ ఉపయోగించాడు. ప్రస్తుతం ఇది అందరికీ ఆమోదయోగ్యమైన ఉపగమం. అభ్యసనం అనేది సాంప్రదాయ పద్ధతిలో వలె ఒక సబ్జెక్టుకు మాత్రమే పరిమితం చేయకుండా అందుకు సంబంధించిన ఇతర సబ్జెక్టులను సందర్భానుసారంగా చర్చిస్తూ కొనసాగేదే 'క్రమద్దమైన శిక్షణ ఉపగమం'

| |
|---|
| Transdisciplinary : Creating a unity of intelectual frame works beyond the disciplinary perspectives.<br>If flucuate among boundaries of various disciplinaries. |


ట్రాన్స్ డిసిప్లినరి ఉపగమం విద్యార్థుల అభ్యసనంలో ఎదురయ్యే అన్ని ప్రశ్నలకు సమాధానాలిస్తూ కొనసాగుతుంది. ఇది ఒక విశ్లేషణాత్మక, నిరంతర పరిశోధనాత్మక ఉపగమం.

| |
|---|
| Transdisciplinary approach allows students athentically to make connections.<br>So that they can construct their own meaning and transfer learning to real world application. |

ఈ పద్ధతిలో ఉపాధ్యాయుడు అభ్యాసనాంశమును వివిధ భాగాలుగా చేసి బోధన చేయుటకు వీలుపడదు. ట్రాన్స్ డిసిప్లినరి ఉపగమంలో ఈ అంశాలు ఉంటాయి.


1. స్టాఫ్ మరియు విద్యార్థుల మధ్య సహకారం మరియు సమన్వయం.
2. సాంకేతికతను ఉపయోగించుకోవడం.
3. విభిన్న సబ్జెక్టులను అనుసంధానం చేయడం.
4. విద్యార్థుల పరిశోధనకు వీలు కల్పించడం.
5. అభ్యసన వాతావరణం ఏ రకమైన వత్తిడులకు, కఠినతర నియమాలకు వీలులేకుండా ఉండటం.
6. విద్యార్థి / ఉపాధ్యాయులలో పరస్పర ప్రతిస్పందనలు.
7. తరగతి బయటి అంశాలతో అనుసంధానం.
8. సమాజ వ్యవహారాలు / సంస్కృతిని మేళవించి తరగతి నిర్వహణ.
9. వివిధ సబ్జెక్టుల మధ్య లోతైన అధ్యయనం.

**Transdisciplinary approach** ఒక ఉదాహరణ :




## Multidisciplinary approach – బహుళ విభాగ ఉపగమం :

బహుళ విభాగ ఉపగమం తరగతి గది బోధనను Passive నుండి Active గా మారుస్తుంది. ఇందులో విద్యార్థుల కేంద్రంగా బోధన జరుతుంది. వివిధ సబ్జెక్టుల అనుసంధానం కొంత మేరకు మాత్రమే జరుగుతూ బోధన ఉంటుంది. ఈ పద్దతిలో వివిధ సబ్జెక్టుల బోధకులు సమిష్టిగా ఉండి అభ్యాసకులతో చర్చిస్తారు. ఈ పద్ధతిలో సబ్జెక్టుల అనుసంధాన బోధన ఒక క్రమపద్ధతిలో ఉండదు. సాంఘిక / సామాజిక సమస్యలకు గల కారణాలు పరిష్కార మార్గాలను విశ్లేషించుటకు సమస్య సంబంధిత సబ్జెక్టు ఒక్కదానినే విశ్లేషించకుండా దానితో ప్రమేయం ఉండే మిగిలిన సబ్జెక్టులను కూడా విశ్లేషణ చేస్తారు. ఇది బోధకులు సమిష్టిగా ఉండి తమ భావాలను వ్యక్తపరుస్తూ విశ్లేషణ చేస్తారు.




ఒకరి అభిప్రాయాలను మరియొకరు సమిష్టిగా చర్చించుకుంటూ అభ్యాసకులకు కూడా చర్చలో ఆసక్తిగా పాల్గొనేలా చేస్తూ వారికి వారే ఒక ముగింపుకు వచ్చేలా బహుళవిభాగ ఉపగమం వీలు కల్పిస్తుంది. పాఠ్య ప్రణాళికలను సమిష్టి చర్చకు వీలుగా తయారు చేస్తారు.

**Issue based approach -సమస్య ఆధారిత ఉపగమం :**

జాతీయ ప్రణాళికా చట్రం 2005 పాఠశాల విద్య బోధన పద్ధతిలో నూతన విధానాలకు తెరతీసింది ఎన్.సి.ఎఫ్. 2005. ముఖ్య లక్ష్యాల సాధనకు అనుగుణంగా మరియు ప్రజాస్వామిక విలువలను, మానవతా విలువలను విద్యార్థులలో పెంపొందిస్తూ వారిని ఒక బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు వీలుకల్పించే పాఠ్యప్రణాళిక మరియు తరగతి బోధనే సమస్య ఆధారిత ఉపగమం. ఇది ఒక వినూత్నమైన పద్ధతి. పాఠ్యాంశాల రూపకల్పనలో తరగతి నిర్వహణలో వివిధ రకాల సమస్యలపై చర్చకు అనువైన వాతావరణం కల్పిస్తారు. కరికులమ్ రూపకల్పనలో వివిధ సమస్యలను గుర్తించి పాఠ్యాంశాలుగా చేరుస్తారు. ఉదాహరణకు

1. మానవ వనరుల కొరత – అభివృద్ధిపై వాటి ప్రభావం.
2. అంతర్జాతీయ మానవతావాదం – ప్రస్తుత స్థితి
3. ప్రజల ఆరోగ్యం
4. నీటి వనరుల ఉపయోగంలో సాంకేతికత
5. లౌకికవాదం
6. భూ పరిరక్షణ నిర్వహణ
7. ప్రజాస్వామ్యం – కులతత్వం ప్రభావం
8. పట్టణీకరణ సమస్యలు
9. పారిశ్రామికీకరణ – పర్యావరణం

సమస్యా ఆధార ఉపగమం నిర్వహణ విద్యార్థుల స్థాయి ఆధారంగా రూపొందించాలి. ప్రాథమిక స్థాయి సెకండరీ స్థాయిలలో విద్యార్థుల స్థాయి మరియు వారి అవసరాలు దృష్టిలో ఉంచుకొని కరికులమ్ రూపొందించాల్సి ఉంటుంది.

**Ref :**

1. Erickson Lynn H.2007 - Concept based Curriculum and instructions for the thinking classroom.
2. NCERT - NCF 2005
3. Verification of Inter disciplinary approaches in the social sciences : A 1981 over view.

**DISPLINE CENTERED CURRICULUM :**

ఈ విధమైన కరికులమ్ రూపకల్పనలో విషయాన్ని సబ్జెక్టు పరంగా వివిధ భాగాలుగా విభజించడం జరుగుతుంది.

ఉదా : భాష, విజ్ఞానశాస్త్ర, గణిత శాస్త్రం, సాంఘిక శాస్త్రం.

> **"Discipline based curriculum approach characterises teaching practice within one subject and encourages teacher for specialization, depth of content knowledge, and integrity to the conventions of their discipline" - Kride 2010**

ఈ ఉపగమంలో తత్‌సంబంధిత సబ్జెక్టు విభాగం వరకు మాత్రమే కరికులమ్ రూపొందించబడుతుంది. ఈవిధానంలో అభ్యసించిన అభ్యాసకులను సాధారణంగా స్పెషలిస్ట్‌గా, ఎక్స్‌పర్ట్‌గా పిలుస్తారు. విద్యాసంబంధ సంస్థలు సాధారణంగా సబ్జెక్టులపరంగా విభజింపబడి ఉంటాయి. ప్రస్తుతకాలంలో సబ్జెక్టు విభాగాలు సూక్ష్మభాగాలుగా విభజించబడుతూ **"Media Studies, Women's Studies, Nursing Nano Technology'** గా రూపాంతరం చెందుతున్నాయి.

సబ్జెక్టు కేంద్రిత ఉపగమం కేవలం ఒక సబ్జెక్టుకు మాత్రమే పరిమితం కావడంవల్ల ఒక సమస్య విశ్లేషణలో మిగిలిన సబ్జెక్టుల అనుసంధానంకు వీలుపడదు. అంటే ఒకరకంగా ఈ పద్ధతి ఒక సంకుచిత విశ్లేషణకు వీలు కల్పిస్తుంది. సబ్జెక్టు విభాగం ఎవరికి వారే గొప్పదిగా భావించే ప్రమాదం ఉన్నది. సామాజిక అంశాల విశ్లేషణకు ఈ ఉపగమం అంతగా వీలు కల్పించదు. అయితే కొన్ని సమస్యల లోతైన అధ్యయనంకు ఇది ఎంతో వుపయోగపడుతుంది. ఉదాహరణకు భాష, గణితశాస్త్రం.

చర్చించండి :

1. సాంఘికశాస్త్రం అంటే ఏమిటి ?
2. సాంఘికశాస్త్రానికి ఒక ఆమోదయోగ్యమైన ఒక నిర్వచనము ఎందుకు ఇవ్వలేకపోయాము. చర్చించండి.
3. సాంఘిక శాస్త్రముతో సంబంధం కలిగిన ఇతర సబ్జెక్టులను చెప్పండి.

చర్చించండి :

1. సాంఘికశాస్త్రం యొక్క ఏవైని 5 ముఖ్యవిధులు ఏవి ?
2. సాంఘికశాస్త్ర లక్ష్యాలలో వేటిని నీవు ఎక్కువ సమర్ధిస్తావు. ఎందుకు?

## అధ్యాయం - 2

### అధ్యాయంలోని అంశాలు :

2.1 చరిత్ర : కాలం, కాలానుగుణంగా వచ్చే మార్పులు
రాజనీతిశాస్త్రం : సమాజం, సమాజ నిర్మాణం, రాజ్యం, ప్రభుత్వం, అధికారం, ఆధిపత్యం, పౌరసత్వం.

2.2 భూగోళశాస్త్రం : ప్రాంతం, ప్రజలు, వనరులు; ప్రాంతం - వనరుల మధ్య సంబంధం, ప్రజలు - వనరుల మధ్య పరస్పర చర్యలు.

2.3 అర్థశాస్త్రం : మార్కెట్, వినిమయం, శ్రమ.

2.4 వసుధైక కుటుంబం, ప్రపంచశాంతి సాధనలో భాగంగా ప్రపంచం మరియు భారతీయ సమాజము ఎదుర్కొంటున్న సమకాలీన సమస్యలు, సవాళ్ళు - సమస్యలను అధిగమించి పురోగమిస్తున్న భారతదేశం.

2.5 సాంఘిక శాస్త్ర ప్రధాన ఇతివృత్తాలు - రాష్ట్ర పాఠ్య ప్రణాళిక, వాటి తరగతి గది అనువర్తనాలు.

### లక్ష్యాలు :

1. సాంఘిక శాస్త్రములోని ఇతివృత్తాలను గురించి అవగాహన చేసుకుంటాడు.
2. సాంఘిక శాస్త్రములోని వివిధ అంశముల మధ్య సంబంధములను తెలుసుకుంటాడు.
3. సాంఘిక శాస్త్రములోని అంశములు, సమస్యలు - పరిష్కార మార్గములను తెలుసుకొని నిజజీవితములో వాటిని అన్వయిస్తాడు.

# అధ్యాయం - 2
# సాంఘిక శాస్త్రం - కీలక ఇతివృత్తాలు

సాంఘికశాస్త్ర ఆధారపత్రం-2011ను జాతీయ విద్యా ప్రణాళిక చట్రం-2005 ఆధారంగా రూపొందించారు. దీని ఆధారంగా రూపొందించిన పాఠ్యపుస్తకాలు, జాతీయ విద్యా ప్రణాళిక చట్రం ఉపాధ్యాయ విద్య - 2009, పిల్లల ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం-2009 ప్రతిపాదనల దృష్టితో రూపొందించారు.

ఆధునిక సాంకేతిక ప్రపంచీకరణ నేపథ్యంలో ఎదురవుతున్న సవాళ్ళను అధిగమించేలా సమగ్రమైన, విశాలమైన బహుళ దృక్పథాన్ని పిల్లలలో పెంపొందింప చేయడానికి రాజ్యాంగ, మానవతా విలువలు కలిగిన వారుగా పిల్లలు ఎదగడానికి సాంఘికశాస్త్ర విద్యాప్రణాళిక ఒక నూతన దృక్పథాన్ని అందిస్తుంది.

## 2.1. మారుతున్న సమాజం - సాంఘికశాస్త్రాల అధ్యయనం

శాస్త్ర సాంకేతిక రంగాలలో వస్తున్న అనూహ్యమైన మార్పులు, అవి అందజేస్తున్న పరిశోధనల ఫలితాలు ప్రపంచీకరణకు దోహదం చేస్తున్నాయి. ప్రపంచం కుగ్రామంగా మారుతున్న నేపథ్యంలో మార్కెట్ శక్తులు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇలాంటి సామాజిక సందర్భంలో ఎదుగుతున్న పిల్లలకు వ్యక్తిగతంగా, సామాజికంగా ఎదగడానికి ఎన్నో అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. దీనితోపాటు మరెన్నో సవాళ్ళు కూడా ఎదురవుతున్నాయి.

ఈ మధ్యకాలంలోని ప్రపంచీకరణ, మార్కెటీకరణ, సాంకేతికీకరణల ప్రభావం మన రాష్ట్రం మీద ఎక్కువగా ఉంది. విపరీతంగా విస్తరిస్తున్న పారిశ్రామిక, సామాజిక, సాంకేతిక సేవారంగాలు పట్టణీకరణను ప్రోత్సహిస్తున్నాయి. నూతన పట్టణాలు రూపుదిద్దుకుంటున్నాయి. అంతర్జాతీయంగా వస్తున్న పెట్టుబడులతో విస్తరిస్తున్న నగరాలు వలసలకు కేంద్రబిందువులవుతున్నాయి. ఈ అభివృద్ధి వేగానికి మరో పార్శ్వంలో క్షీణించిపోతున్న వ్యవసాయరంగం, రైతుల ఆత్మహత్యలు విచక్షణారహితంగా కొల్లగొట్టబడుతున్న సహజవనరులు కన్పిస్తాయి. ఇవి క్రమక్రమంగా మన సంస్కృతి, సాంప్రదాయాలు, జీవన విధానం మీద తీవ్రమైన ప్రభావాన్ని చూపుతున్నాయి.

ఈ సవాళ్ళను సమర్థవంతంగా ఎదుర్కొన్న శక్తివంతమైన సమాజం నిర్మాణం జరగాలంటే 'విద్య' కీలకమైన సాధనంగా ఉపకరిస్తుందని 'అమర్త్యసేన్' వంటి మేధావులు పేర్కొంటున్నారు. ప్రపంచీకరణకు అనుకూలంగా మన సాంప్రదాయ జీవన విధానాలను మెరుగుపరచుకోవాలంటే నైపుణ్యంగల వ్యక్తులుగా మారడం అవసరం. ఇందుకోసం పెద్దఎత్తున విద్యావకాశాలు అందుబాటులోకి రావాలి. అదేసమయంలో అందరూ ఈ వనరులను న్యాయబద్ధంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉపయోగించుకోగలిగే అవకాశం ఉండాలి.

స్వాతంత్ర్యానంతర కాలంలో మన విధాన నిర్ణేతలు భారతరాజ్యాంగంలో పేర్కొన్నవిధంగా సమానత్వం, న్యాయం, సుస్థిర ప్రగతి సాధించడం ద్వారా జాతినిర్మాణం జరగడానికి పాఠశాల విద్యపై దృష్టి సారించడం అవసరమని గుర్తించారు. అయితే ప్రస్తుత పరిస్థితులలో ఇది కొత్త అర్థాన్ని అవసరాన్ని సృష్టించుకొని సమానత్వం, సామాజిక న్యాయమనే లక్ష్యాల సాధనలో కొంత వెనుకడుగుపడింది. మన తక్షణ కర్తవ్యమైన జాతి, మత, కుల, లింగ వివక్షతలు వంటి సామాజిక అసమానతలు తొలగించడం కూడా మనం అభివృద్ధిని పూర్తిగా సాధించలేము. రాజ్యాంగబద్ధంగా దేశ పౌరులందరికీ అందవలసిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అందించడం విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని కొఠారి కమీషన్ నివేదికలో పేర్కొన్నారు.

సాంఘికశాస్త్ర విద్యాబోధన ద్వారా భావి భారత పౌరులు ఈ సమస్యలను అర్థంచేసుకొని సవాళ్ళను

ఎదుర్కొనగలుగుతారు. ప్రపంచీకరణ నేపథ్యంలోని అభివృద్ధిని పిల్లలు తమ జీవితానుభవాల ద్వారా అర్థం చేసుకోవడానికి, బహుళ జాతీయ పౌరులుగా బహుళ గుర్తింపులు పొందడాన్ని అర్థం చేసుకోడానికి సాంఘికశాస్త్రం ముఖ్యంగా దోహదపడాలి. ఇందుకోసం సాంఘికశాస్త్రం సామాజిక విశ్లేషణా నైపుణ్యాలను పిల్లల్లో పెంపొందించడం ద్వారా సమాజంలోని అసమానతలను వైరుధ్యాన్ని అర్థం చేసుకొని ఎదుర్కొనేలా చేయగలగాలి. ఈవిధమైన శిక్షణ వల్ల పిల్లలను సమాజంలో వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొనే సమస్యలపట్ల సానుభూతితో స్పదించడం, వారు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనే దిశలో సంసిద్ధపరచడం చేయగలుగుతాం.

సాంఘికశాస్త్రం ప్రస్తుతం సానుకూల ఏక దృక్పథమనే కోణం నుండి బహుళ దృక్పథాలను విమర్శనాత్మకంగా అధ్యయనం చేసే పద్ధతుల వైపుకు సైద్ధాంతికంగా మార్పుచెందుతుంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశలో ఉన్న అనేక విద్యాసంస్థలు, మేధావులు సాంఘిక శాస్త్రాలలో సైద్ధాంతిక మార్పుకోసం విశేషంగా కృషి చేస్తుండడం ముదావహం. పాఠశాల విద్యలో సామాజిక వికాసానికి తోడ్పడే ఆధునిక మార్పులు తీసుకురావడానికి ఇదే సరైన సమయం.

విద్యారంగంలో ముఖ్యంగా సాంఘిక శాస్త్రాల బోధనా విధానాలలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పాఠ్యపుస్తకాలలో నిర్ధారించిన సమాచారాన్ని తరగతిగదులలో పిల్లలకు అందించడానికి బదులుగా సమాచారాన్ని అర్థం చేసుకోడానికి విశ్లేషించడానికి విభిన్న అవకాశాలు, అనుభవాలు కల్పించడం ద్వారా పిల్లలు తమ సొంత భావనలను పెంపొందించుకోవడమనే కోణంలో మార్పులు చోటుచేసుకోవాలి. తరగతిగదిలో ఎంత ఎక్కువ వైవిధ్యాలు, సామాజిక నేపథ్యాలు వుంటాయో పిల్లలు అంత ఎక్కువగా అనుభవాలు పొందగలుగుతారు. పిల్లలకు సవాళ్ళతో కూడిన అభ్యసన సన్నివేశాలు కల్పించడం ద్వారా మరియు ఇతర అనుభవాలు కల్పించడం ద్వారా వాటిని నిశితంగా పరిశీలింపజేయడం ద్వారా వివిధ సామాజిక నేపథ్యం గల పిల్లల అవసరాలను అర్థంచేసుకునే వీలుకలుగుతుంది. పిల్లలకు విస్తృత స్థాయిలో అనుభవాలు కల్పించడం, దానిని అర్థంచేసుకొనేలా చేయడం, వీని గురించి ప్రశ్నింపచేయడం ద్వారా వారిలో సామాజిక పరిస్థితుల పట్ల అవగాహన పెంపొందించడానికి వీలుకలుగుతుంది.

ఈవిధమైన బోధనా శాస్త్రం అమలుకావాలంటే పిల్లల జీవిత అనుభవాలను ప్రతిబింబించే, దాని ఆధారంగా రూపొందించిన విద్యాప్రణాళిక అవసరం. సాంస్కృతికంగా, భౌగోళికంగా ఉన్న వైవిధ్యాన్ని కల్గిఉన్న రాష్ట్రంలోని రాయలసీమ, ఆంధ్రప్రాంతాలు మరియు తూర్పు కనుమల ప్రాంతంలోని వ్యత్యాసాలు ప్రాధాన్యత నివ్వాలి. ఒక ప్రాంతంలో కూడా వేరు వేరు ప్రదేశాలలో ఉండే వ్యత్యాసాలు ప్రతిబింబించాలి. ఇది సవాలుతో కూడిదైనప్పటికీ విద్యాప్రణాళిక రూపకర్తలు ప్రాంతీయ, భౌగోళిక, సాంస్కృతిక వైవిధ్యతలను దృష్టిలో ఉంచుకొని విద్యాప్రణాళికను రూపొందించాల్సి ఉంటుంది. సాంఘిక శాస్త్రాల విద్యాప్రణాళిక రూపకల్పనలో ప్రాంతీయ వైవిధ్యాలతో పాటు విస్తృతమైన జాతీయ విద్యాప్రణాళికా లక్ష్యాలకు కూడా చోటు కల్పించాలి. సాంఘిక శాస్త్రాధ్యయనంలో పిల్లలు స్థానిక ప్రపంచాన్ని అర్థం చేసుకోవడాన్నే స్థానికీకరణగా అర్థం చేసుకోరాదు. పిల్లలు తమ స్వీయ ప్రపంచంతో పాటు విస్తృతమైన ప్రపంచాన్ని అర్థంచేసుకోవాలి. సాంఘిశాస్త్ర విద్యాప్రణాళిక స్థానిక మరియు బాహ్య ప్రపంచ స్వరూప స్వభావాలను అర్థంచేసుకోడానికి రెండింటి మధ్యగల సారూప్యాలను, వైరుధ్యాలను గుర్తించడానికి అవకాశం కల్పించేదిగా ఉండాలి. ఇదేసమయంలో పిల్లల పరిచిత ప్రపంచంలో ఎదురవుతున్న సంఘటనలు, సవాళ్ళను గురించి కూడా విద్యాప్రణాళిక చర్చించాలి. కాబట్టి పాఠ్యపుస్తకాలలో స్థానిక సామాజిక అంశాలు గురించి చర్చించడానికి, వాటిపట్ల సానుకూలంగా స్పందించటానికి అభ్యసనాంశాలుండాలి. సాంఘిక శాస్త్రాన్ని బోధిస్తున్న ఉపాధ్యాయుడు పాఠ్యాంశ సందర్భాలను స్థానిక సందర్భాలతో అన్వయించి చర్చించడానికి, స్థానిక సమస్యల పరిష్కారానికి ఆలోచించడానికి, పిల్లల్ని ప్రోత్సహించే దిశలో ఉపాధ్యాయునికి సహకరించేదిగా ఉండాలి.

సాంఘిక శాస్త్ర బోధనలో భాగంగా వివిధ ప్రసార మాధ్యమాలలోని దృక్పథాలను, సమాచారాన్ని విశ్లేషించే

నైపుణ్యాలను పెంపొందించడం అవసరం. అంటే వివిధ రకాల చిత్రాలు, పట్టికలు, పటాలు, కథనాలు, గ్రాఫ్‌లు, పై చిత్రాలు మొదలైన వాటిని అర్థం చేసుకోవడం, వాటిలోని సమాచారాన్ని విశ్లేషణ చేయడం అవసరం. పాఠ్యపుస్తకాలలో ఇచ్చిన సమాచారాన్ని అర్థంచేసుకునే క్రమంలో పిల్లలు దాని విలువను, ప్రాధాన్యతను గుర్తించడంతో పాటు దానిలోని లోపాలను నిశితంగా పరిశీలించడం, ప్రశ్నించడానికి విద్యాప్రణాళిక అవకాశం కల్పించాలి. ఇలా ప్రశ్నించడం ద్వారా పిల్లలు తమచుట్టూ ఉండే పరిసరాలలో జరిగే న్యాయాన్యాయాలపట్ల, అసమానతలపట్ల జాగరూకతతో వ్యవహరించగలుగుతారు మరియు నిలదీయగలుగుతారు.

## 2.2. సాంఘికశాస్త్ర విభాగాలు – దృష్టి పెట్టాల్సిన అంశాలు :

సాంఘికశాస్త్రాలు కోరిన విధంగానే ఉండేలా చేయడాన్ని, మూసతత్వాన్ని ఒకేరకంగా ఉండడాన్ని తరతరాలుగా ప్రోత్సహించింది. భౌగోళికంగా ఒకేరకంగా ఉండడం లేక ఆర్థికంగా ఒకేవిధంగా ఉండడం సమాజాలను మరియు దేశాలను మూసపోసిన విధంగా తయారుచేయడం సాంఘికశాస్త్ర బోధనలో ప్రత్యేకమైన / అధికారికమైన ముద్రగా ఉంటున్నది. దీనిని తొలగించాల్సిన అవసరం ఉంది. దీనిస్థానంలో విశాలదృక్పథాన్ని బహుళ సకారణాత్మక వివరణలు అనుమతించాలి. ఉదాహరణకు 'అడవులు' అనే అంశం భూగోళ శాస్త్రంలో ఉండడం కానీ విశ్లేషించడం గానీ జరగడం లేదు. అందువల్ల విస్తృ తంగా ఆలోచించడానికి వీలుగా సాంఘిక శాస్త్ర విభాగాలు మధ్య ఉన్న అడ్డగోడలు ఛేదించాలి. సమన్వయ పరిచే చర్యలకు శ్రీకారం చుట్టాలి.

సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన కీలకమైన విషయమేమిటంటే సామాజికంగా జరిగే మానవ ప్రతిచర్యలను బహుళ దృష్టి కోణాలలో చూడాలి తప్ప ఏదో ఒక కోణంలో మాత్రమే చూడడానికి, అర్థం చేసుకోవడానికి వీలుకాలేదు. ఇది ప్రజాస్వామ్య నియమాలను లోబడి జరగాలి. బహుళ దృక్పథ విధానాలు సమగ్రంగా, అర్థవంతంగా ఉంటాయి. ఇవి వివిధ వనరులను గుర్తించడానికి, వినియోగించడానికి తోడ్పడుతుంది. విశ్లేషణాత్మకంగా, విమర్శనాత్మక ఆలోచనలను వృద్ధిపరుస్తుంది.

ఏ సాంఘిక దృగ్విషయమైనా వ్యక్తుల పైన వివిధ రకాలుగా ప్రభావాన్ని చూపుతుంది. అయితే ఇది వ్యక్తి సమాజంలోని తాను ఉన్న స్థానంపై ఆధారపడి ఉంటుంది. అంటే ద్రవ్యోల్బణం అయితే దాని ప్రభావం ఆయా వర్గాలపై వేరువేరు రకాలుగా ఉండడాన్ని గుర్తిస్తాం. అందువల్ల విభిన్న దృష్టి కోణాలలో ఆలోచించడం బహుళ రీతుల్లో ప్రతిస్పందించడం అవసరం. సంపూర్ణమైనదిగా ఉండి వివిధ వనరులను సమన్వయించుకుని విశ్లేషించడానికి, విమర్శనాత్మకంగా ఆలోచించడానికి ఉపయోగపడుతుంది.

సాంఘికశాస్త్రం అంశాలను మరింత లోతుగా విచారించినపుడు మాత్రమే సాంఘిక శాస్త్ర విషయ స్వభావాన్ని నిశితంగా పరీక్షించడానికి దాని స్వరూపానికి ఒక స్పష్టత చేకూర్చడానికి వీలుకలుగుతుంది. అంటే సాంఘిక శాస్త్రాలను సంస్కరించడమనేది ఆయా సాంఘికశాస్త్ర విభాగాల చారిత్రక మూలాలను అర్థం చేసుకోవడం, తులనాత్మకంగా విశ్లేషించడం తద్వారా వివిధ సాంఘికశాస్త్ర విభాగాల మధ్య సంబంధాన్ని బలపరచడానికి ఒక విషయాన్ని అన్ని విభాగాల దృష్టికోణంలో చర్చించడానికి వీలుకలుగుతుంది.

సాంఘికశాస్త్రంలోని విభిన్న విభాగాలు అన్నీ పైన తెల్పిన ఉమ్మడి లక్షణాలను పొందినపుడు – ఒకదానికొకటి సంబంధం కలిగిన అంశాలుగా మారినపుడు విభిన్న బోధనా పద్ధతులు, విభిన్న బోధనావ్యూహాలు అభివృద్ధి చెందుతాయి. ఈవిధంగా సాంఘికశాస్త్రం అనే పేరుమీద అందులోని విభిన్న విభాగాలను సమన్వయపరచడం నూతనంగా వర్గీకరించడం ద్వారా సాంఘిక శాస్త్రాన్ని కొత్త కోణల్లో చూడడానికి, వినియోగించడానికి వీలుకలుగుతుంది.

## చరిత్ర :-

కాలక్రమానుగతంగా జరిగిన వివిధ ఘట్టాలను గురించి తెలుసుకోవడమే చరిత్ర. డా॥ రాధాకృష్ణన్ గారు చెప్పినట్లు దేశం యొక్క గత అనుభవాల పరంపరే చరిత్ర. చరిత్ర గత కాలంనాటి రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మతసంబంధమైన, విజ్ఞానశాస్త్ర, కళాసారస్వత రంగాలలో మానవుడు సాధించిన విజయాలను, పరాజయాలను చరిత్ర తెలుపుతుంది. ఈనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ తదితర పరిస్థితులను అవగాహన చేసుకోవాలంటే ఖచ్చితంగా చరిత్రను అధ్యయనం చేయవలసిందే. నేడు అనే ఈ భవనానికి చరిత్ర అనేది పునాది. ఈ పునాది ఆధారంగానే భవిష్యత్తు అనే అంతస్తును నిర్మిస్తాము. చరిత్ర మనకు ఎన్నో పాఠాలను నేర్పుతుంది. గతంలోని మంచిని కొనసాగిస్తూ, చెడును వదిలేసి, భవిష్యత్తు వైపు ప్రయాణం చేయాలి. చరిత్ర నుండి పాఠాలు నేర్చుకొని ముందుకు వెళ్ళాలి.

భారతదేశ చరిత్రలో మనం ప్రేరణ పొందదగిన, కొనసాగించదగిన అంశాలు ఎన్నో ఉన్నాయి.

- మహంజొదారో, హరప్పా నాగరికత సమకాలీన ప్రపంచంలోని ఇతర నాగరికతల కంటే ఎంతో ఉన్నతంగా ఉన్నది.
- ప్రపంచానికి విద్య గురించి అవగాహన లేని కాలంలో భారత దేశంలో తక్షశిల, ఉజ్జయిన్, విక్రమశిల, కాశీ మొదలగు ఎన్నో విశ్వవిద్యాలయాలు భారతదేశంలో విలసిల్లినాయి.
- ప్రపంచానికి గణితశాస్త్రాన్ని, వైద్యశాస్త్రాన్ని (ఆయుర్వేదం), ఖగోళశాస్త్రం, సున్నా, దశాంస పద్ధతి, లోహ శాస్త్రము, యోగ శాస్త్రము మొదలగు ఎన్నో శాస్త్రములను మొట్టమొదటగా అందించింది భారతదేశమే.

అలాగే మనలోని లోపాలను కూడా మనం తొలగించుకోవాలి.

- విదేశీయులు మనకంటే శక్తివంతులు, నాగరికులు కానప్పటికి మనలో అనైక్యత వల్ల చాలాసార్లు ఓడిపోయాము. కాబట్టి జాతీయ సమైక్యత మన ప్రధాన లక్ష్యం కావాలి. మనలో కులభేదములను తొలగించుకుని, సాంఘిక, ఆర్థిక అసమానతలను దూరం చేసికొని ఒక శక్తివంతమైన దేశంగా తయారు చేసుకోవాలి.

## భూగోళ శాస్త్రం :-

ఒక ప్రాంతం లేదా దేశం యొక్క సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ ఆదేశపు భౌగోళిక పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. ఇంకో మాటలో చెప్పాలంటే ఒక దేశ చరిత్రను ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకోవడానికి భూగోళశాస్త్ర పరిజ్ఞానం చాలా అవసరం.

- ప్రపంచంలోని గొప్ప నాగరికతలన్నీ నదీతీరాలలోనే విలసిల్లినాయి. కారణమేమంటే నీటి సౌకర్యం వల్ల పంటలు బాగా పండడం.

ఉదా: సింధూనాగరికత, ఈజిప్టు, మెసపుటేనియా, పర్షియా నాగరికతలు.

- మహారాష్ట్రులు గెరిల్లా యుద్ధంలో ఆరితేరడానికి కారణం వారు పశ్చిమ కనుమలలో తమ జీవితాన్ని కొనసాగించుటయే.
- ఆంగ్లేయులు, ఐరోపా దేశీయులు ప్రపంచమంతా విస్తరించడానికి ఒక ప్రధానకారణం సముద్ర తీర ప్రాంతాలలో ఉండడమే.
- ఈనాడు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందడం వల్ల కొంతమేర భౌగోళిక పరిస్థితుల వల్ల ఏర్పడిన పరిమితులను అధిగమించగలుగుతున్నారు.

ఉదా: ఎడారుగా ఉన్న అరేబియా ప్రాంతం ఈనాడు సంపన్న దేశాలుగా ఉన్నాయి.

- ఇజ్రాయిల్ లాంటి ఎడారులలో ఉన్న దేశం ఈనాడు ప్రపంచంలో ఒక శక్తివంతమైన దేశం.
- ఒకప్పుడు వలస దేశాలుగా ఉన్న ఆసియా దేశాలైన భారత్, చైనాలు ప్రపంచంలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థలుగా తయారవుతున్నాయి.

**అర్థశాస్త్రం :-**

మానవ జీవిత అవసరాలను తీర్చుకోవడానికి వనరులను తగువిధంగా ఉపయోగించుకోవడాన్ని గురించి అధ్యయనం చేసేదే అర్థశాస్త్రం. ఈనాడు అర్థశాస్త్రం కేవలం సంపదను సృష్టించడాన్ని గురించి మాత్రమే కాదు. పౌరుల సంక్షేమాన్ని గురించి ఆలోచిస్తున్నది. కేవలం తలసరి ఆదాయాన్నే గాక, పంపిణీకి ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నది. పౌరుల విద్య, ఆరోగ్యము, పోషకాహారము మొదలగు అంశాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతున్నది.

ఈనాడు ప్రపంచంలోని దేశాలన్నీ ఆర్థికంగా ఒకరిపై ఒకరు ఆధారపడుతున్నాయి. సరైన విధానాలతో ప్రపంచ విపణిలో మన స్థానాన్ని నిలబెట్టుకోవాలి. ఈనాడు చైనాలాంటి బలమైన ఆర్థికవ్యవస్థ మనలను బలహీనపరచి వారి ఉత్పత్తులతో మన మార్కెట్లను ముంచేస్తున్నాయి.

ఈరోజు మనం ప్రైవేటీకరణ, ప్రపంచీకరణవైపు వెళుతున్నప్పటికి మన దేశ ప్రయోజనాలకు భంగం కలుగకుండా జాగ్రత్త పడవలసిన అవసరం ఉన్నది. ప్రపంచంలోని అగ్రరాజ్యాలైన అమెరికా, ఇంగ్లాండులు కూడా వారి స్వప్రయోజనాల కొరకు ప్రపంచీకరణ నుండి వైదొలగుతున్నాయి.

మన ప్రజలను నిరుద్యోగిత నుండి కాపాడవలసిన అవసరం ఉన్నది.

**రాజనీతిశాస్త్రము, పౌరశాస్త్రము :-**

మన విద్యార్థులను బాధ్యతాయుతమైన ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దడమే పౌరశాస్త్రము యొక్క లక్ష్యం. పౌరుని విధులు, హక్కులు, బాధ్యతలు, ప్రభుత్వం పనిచేసే విధానం, రాజ్యాంగం, న్యాయం, కార్యనిర్వహణ, స్థానిక సంస్థల పాత్ర, ప్రజాస్వామ్యవిధానం, కలిసి మెలసి జీవించడం, దేశభక్తి మొదలైన అంశాలు దీనిలో చర్చించబడతాయి. జాతి, కుల, మత, ప్రాంతీయ తత్వాలకతీతంగా ఆలోచించడం, ప్రతివ్యక్తి దేశం కోసం నేనేమి చెయ్యగలననే భావనను పెంపొందించుకోవడం, నిష్పాక్షిక నిర్ణయాలు తీసుకోవడం, అరాచకం, హింస, దౌర్జన్యాల కతీతంగా శాంతి సౌభాగ్యాలతో విలసిల్లే సమాజ స్థాపనకు కృషి చేయడం వంటి కృత్యాల వైపు విద్యార్థుల్ని మళ్ళించాలి. ఓటు హక్కు గొప్పదనం, సరైన నాయకుల్ని ఎంచుకోవడానికి దేశప్రగతికి ఉండే సంబంధం, జాతీయతాభావం, సంక్షేమ రాష్ట్ర అవతరణ, ప్రతికా స్వాతంత్ర్యం వంటి అనేక విషయాల గురించి విద్యార్థులకు తెలియజేయాలి. పౌరశాస్త్రం వాస్తవమైన ప్రత్యక్ష అనుభవాల్ని విద్యార్థులకు కలుగజేస్తుంది. దీనిద్వారా ఇంటిలో, పాఠశాలలో, సమాజంలో దేశంలో ప్రజాస్వామిక రీతిలో ఏవిధంగా మెలగాలో విద్యార్థి తెలుసుకుంటాడు.

## 2.3. సాంఘిక శాస్త్రాల బోధన – సమ్మిళిత విధానం / ఇతివృత్తాలు :

2005 జాతీయ ప్రణాళికా చట్రంలో పేర్కొన్న విధంగా 'పౌరశాస్త్రం' అనే పదాన్ని తొలగించి సాంఘిక రాజకీయ శాస్త్రంగా మార్చటం జరిగింది. ఉన్నత పాఠశాల స్థాయిలో ఈ శాస్త్రాలను ముఖ్య విషయాలుగా బోధిస్తున్నారు. ఈ స్థాయి తరువాత విద్యార్థులు వారివారి అభీష్టం మేరకు ఎంపిక చేసుకొని అభ్యసించవచ్చు.

ఉపాధ్యాయుల నుండి సేకరించిన అభిప్రాయాల ప్రకారం ఎలిమెంటరీ స్థాయిలో సాంఘింక శాస్త్రాన్ని

విభాగాలుగా కాకుండా సమ్మిళితం చేసి చెప్పడం అవసరమని తేలింది. విషయగత బోధనా విధానాలు, అనుసరించడం వల్ల మన గత ప్రణాళిక రూపకల్పనలో జరిగిన విధంగా ఏ విభాగానికి ఆ విభాగం నిర్దిష్టంగా మారిపోతాయి తప్ప వాటిమధ్య సమన్వయం ఉండదు. దానికి బదులుగా అంశాలవారీ విధానాన్ని పాటించినట్లయితే ఆయా విభాగాలలో సమన్వయం సాధించడానికి వీలు కలుగుతుంది. కుటుంబం, వ్యవసాయం మొదలైన అంశాలను ఎంపిక చేసుకుంటున్నపుడు వాటిని చారిత్రక, భౌగోళిక కోణాలలో సమన్వయ పరచి చర్చించవచ్చు. అయితే బహుళ విభాగ విధానంలో బోధన జరగడానికి స్పష్టమైన రీతిలో ఆయా విభాగాలు, వాటి నేపథ్యంపై పూర్వశిక్షణ/జ్ఞానం కలిగి ఉండడం అత్యవసరం. ఉదాహరణకు ఒకప్పటి కాలనీ వ్యవస్థ సందర్భం నుండి ఆధునిక సందర్భం వరకు జాతి, తెగ, మత, కుల, వర్గ ఇతివృత్తాల నుండి కుటుంబ వ్యవస్థ ఎలా ఏర్పడుతుందో అర్థం చేసుకోవడానికి వీటి నేపథ్యాలపై కనీస అవగాహన కలిగిఉండాలి.

పై అంశాలపై లోతుగా పరిశీలిస్తే ఎంచుకొన్న ఇతివృత్తాన్ని సమ్మిళిత విధానంలో ఎలిమెంటరీ పాఠశాల స్థాయిలో తరగతులవారీగా ఒక క్రమపద్ధతిలో అర్థవంతంగా అధ్యాయాలలో పొందుపరచాలన్న విషయం అవగతమవుతుంది.

**ఎలిమెంటరీ స్థాయిలో ఉండదగిన ఇతివృత్త అంశాలు :**

- భౌగోళిక వైవిధ్యం – నేల స్వరూపాలు – శీతోష్ణస్థితులు
- ఉత్పత్తి – వినిమయం – జనావాసాలు
- పరిపాలన
- సామాజిక సంస్థలు, అసమానతలు, అణగారిన వర్గాలు, సామాజిక ఉద్యమాలు
- మతం – సమాజం
- సంస్కృతి – సమాచార ప్రసారం

విస్తృత అర్థంలో చెప్పబడిన పై ఇతివృత్తాల నుండి అంశాలను ఎంపిక చేసుకొని వివిధ విభాగాల్లో చర్చించాలి. ఉదాహరణకు భౌగోళిక వైవిధ్యం ఇతివృత్తంతో వివిధ రకాల నేలలు, శీతోష్ణ పరిస్థితులు తెలుసుకోవడం ప్రాంతాలవారీగా నివసించే ప్రజలు, వారి సమాజాలు చారిత్రక నేపథ్యాలతో ఎలా ప్రతిచర్యలు జరిపాయో చర్చించాలి. ఈ విధమైన సమ్మిళిత విధానం ఎనిమిదవ తరగతి వరకు కొనసాగడం అవసరం. సెకండరీ స్థాయిలో అనగా తొమ్మిదవ తరగతి నుండి వివిధ విభాగాలుగా వాటిని అవలంబించడం మంచిది.

అలాగే ఉత్పత్తి – వినిమయం, జనవాసాలు ఇతివృత్తంతో రాతియుగం లేదా మధ్యయుగ కాలంతోపాటు సమకాలీన ఉత్పత్తిలో ప్రాంతీయ ఆవర్తన నమూనాలను దృష్టియందుంచుకొని ఉత్పత్తి, వినిమయాన్ని అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

స్థూలంగా చెప్పాలంటే పైన పేర్కొన్న సమ్మిలిత విధానాన్ని 8వ తరగతి వరకు కొనసాగించాలి. ఆపైన అంటే 9వ తరగతి నుండి విభాగాల వారీగా సాంఘిక శాస్త్ర అధ్యయనం జరగాలి.

విద్యాప్రణాళిక, సిలబస్ రూపకర్తలు పాఠశాల స్థాయి అధ్యయనం కోసం ఇతివృత్తాలు ఎంపిక చేయడం అత్యంత కీలకం. నానాటికీ విస్తృతమైన జ్ఞాన పరిధిని దృష్టియందుంచుకొని ఇతివృత్తాలను ఎంపిక చేయకపోతే పిల్లలు వెనకబడ్తారనే భయంతో అధిక సమాచారాన్ని (ఉదా : సామాజిక ఉద్యమాలకు సంబంధించిన విస్తృత అంశాలు) పొందుపరచడం వల్ల పిల్లలపై ఒత్తిడి పెరుగుతున్నది. ఫలితంగా సాంఘికశాస్త్ర అధ్యయనం పిల్లల స్థాయికి, అభిరుచులకు దూరంకావడం జరుగుతున్నది.

మన పిల్లలకు విభిన్న సామాజిక అనుభవాలను అవగాహన చేసుకోవడానికి, ఆలోచించడానికి శిక్షణ నిస్తున్నామని గ్రహించాలి. పిల్లల స్థాయికి మించిన అధిక సమాచారాన్ని గుప్పించడం వల్ల మనం మన లక్ష్యాలకు

దూరమవుతున్నామని మరచిపోకూడదు. అయినప్పటికి అట్టడుగు బడుగువర్గాలు, స్థానిక, ప్రాంతీయ, జాతీయ ప్రపంచం వాటి మధ్య సమతుల్యతను పెంపొందించడం వంటి అంశాలను తప్పనిసరిగా వివరించాలి.

మనం 8వ తరగతి పాఠ్యపుస్తకంలోని 4వ పాఠం "ధృవ ప్రాంతాలు" పరిశీలిస్తే, అందులో భౌగోళిక అంశాలనైన టండ్రాలలో కాలాలు, వృక్షజాలం, సమాజ శాస్త్ర అంశాలైన టండ్రాప్రాంత ప్రజలు, సామూహిక జీవనం, వారి మతపరమైన నమ్మకాలు, ఆర్థిక అంశాలైన వేట, చేపలు పట్టడం, రాజనీతి అంశాలైన బయటి ప్రపంచంతో సంబంధాలు, సాంస్కృతిక అంశాలైన బట్టలు, కళలు అన్నింటికి సంబంధించిన వివరణలున్నాయి.

పైన పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే ఈ పాఠం ఫలానా సామాజిక శాస్త్రానికి (చరిత్ర, అర్థశాస్త్రం, భూగోళం, రాజనీతిశాస్త్రం, మొ॥) చెందినదని చెప్పడం కూడా కష్టమే అవుతుంది. అందుకే 6 నుండి 8 తరగతులలో 6 ఇతివృత్తాల ఆధారంగా పాఠాల రూపకల్పన జరిగింది. 9, 10 తరగతి పాఠాల రూపకల్పనకు అంశాల పద్ధతిని ఉపయోగించడం జరిగింది. ఇతివృత్తాధార పద్ధతిలో వివిధ సామాజిక శాస్త్రాలకు చెందిన అంశాలు, కలిసిపోయి పాఠ్యాంశాలు రూపొందించబడతాయి.

| క్ర.సం. | ఇతివృత్తాలు | లక్ష్యాలు |
|---|---|---|
| 1. | భూమి – వైవిధ్యం | అ) ప్రపంచవ్యాప్త వైవిధ్యాలను కింది అంశాల ఆధారంగా తెలుసుకొనుట.<br>– శీతోష్ణస్థితి మండలాలు<br>– భూ స్వరూపాలలో విభిన్నతలు<br>– అభివృద్ధి చెందే మండలాలు<br>ఆ) ప్రకృతి అంశాల మధ్యన ఉండే సంబంధాలను అర్థం చేసుకొనుట.<br>ఇ) మానవ సమాజాలు ఈ విభిన్నతలను వుపయోగించుకొని మార్పుచెందిన క్రమాన్ని అర్థం చేసుకొనుట.<br>ఈ) పటాన్ని చదివి అర్థం చేసుకోవడం, అన్వయించుకోవడం మొదలైన పట నైపుణ్యాలను పెంచుకొనుట.<br>ఉ) పోల్చడం, చిత్రాలను, సంభాషణలను చదివి అర్థం చేసుకోవడం మొదలైన నైపుణ్యాలను పెంచుకొనుట. |
| 2. | ఉత్పత్తి, వినిమయం మరియు జీవనాధారాలు | అ) వివిధ ఉత్పత్తులను, జీవనాధారాలను అవగాహన చేసుకొనుట.<br>ఆ) ఉత్పత్తులు మరియు జీవనాధారాలపై జాతీయకరణ, ప్రత్యేకీకరణ, భూస్వామ్య విధానం, పారిశ్రామికీకరణ, వలస విధానం, ప్రపంచీకరణల ప్రభావాన్ని అవగాహన చేసుకొనుట.<br>ఇ) అనాదిగా అభివృద్ధిలో శ్రామికుల పాత్రను ప్రశంసించుట.<br>ఈ) వినిమయము మరియు మారక ప్రక్రియలను మరియు సంస్థలను అర్థం చేసుకొనుట.<br>ఉ) ఛార్టులు, రేఖాచిత్రాలు, పట్టికలను చదువుట, మార్పులను అర్థం చేసుకొనుట మొదలైన నైపుణ్యాలను పెంపొందించు కొనుట.<br>ఊ) నటన ద్వారా, చిత్రాలను గీయడం ద్వారా, మట్టితో నమూనాలను తయారు చేయడం ద్వారా అవగాహన వ్యక్తపరచుట. |
| 3. | రాజకీయ వ్యవస్థలు – పరిపాలన | అ) చారిత్రకంగా వృద్ధి చెందుతూ వస్తున్న రాజకీయ సంస్థలు, నిర్ణయాలు తీసుకోవడంలో ప్రజల పాత్రను అర్థం చేసుకొనుట.<br>ఆ) ఆచరణలో ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థలు, ప్రజాస్వామిక పరిపాలనా సూత్రాలను అర్థం చేసుకొనుట. |

| క్ర.సం. | ఇతివృత్తాలు | లక్ష్యాలు |
|---|---|---|
| | | ఇ) నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ప్రజాస్వామిక సంస్థలు పనిచేస్తున్నాయా లేదా అనే విషయాన్ని అంచనా వేయుట.<br>ఈ) సర్వే మరియు ఇంటర్వ్యూలను నిర్వహించుట, పోల్చుట, సామాజిక అనుభవాల వినియోగం మొదలైన నైపుణ్యాలను అభ్యాసము చేయుట.<br>ఉ) చారిత్రక వనరుల అన్వయము మరియు వార్తాపత్రికల ద్వారా అనాదిగా వస్తున్న మార్పుల గుర్తింపు మరియు వివరించగలిగే నైపుణ్యాలను పెంచుకొనుట. |
| 4. | సామాజిక వ్యవస్థీకరణ మరియు అసమానతలు | అ) సామాజిక మరియు సాంస్కృతిక వైవిధ్యాలను అర్థం చేసుకొనుట మరియు ప్రశంసించుట.<br>ఆ) లింగ, కుల, వర్గ, సామాజిక, ప్రాంతాల ఆధారంగా చూపబడే వివిధ రూపాల అసమానతలు, వివక్ష మరియు సామాజిక బహిష్కరణలను అర్థం చేసుకొనుట.<br>ఇ) సమాజాన్ని ఒకటిగా, సమన్యాయంతో ఉండేవిధంగా దృక్కోణాన్ని ఏర్పరచుకొనుట.<br>ఈ) సామాజిక ఆదర్శాలు, నీతికి సంబంధించిన విషయాలను అవగాహన చేసుకొనుట.<br>ఉ) అల్పసంఖ్యాక, అల్పాదాయ సమాజాల మరియు వర్గాల అభివృద్ధిని ప్రభావితం చేస్తున్న అంశాల గురించి అవగాహన చేసుకొనుట.<br>ఊ) అణగారిన, అల్పాదాయ, సమాజానికిదూరంగా ఉంచబడిన వర్గాల రక్షణ కోసం చేపట్టిన చర్యలను, వాటి ప్రభావాన్ని అంచనా వేయుట.<br>ఋ) సర్వేను, ఇంటర్వ్యూలను చేపట్టుట, వార్తాపత్రికలలో వచ్చిన సమాచారాన్ని సేకరించుట, ముఖ్యపత్రాలలోని అంశాలను అవగాహన చేసుకొనుట మొదలైన నైపుణ్యాలను అభ్యాసం చేయుట. |
| 5. | మతం – సమాజం | అ) వివిధ మతాల విశ్వాసాలు, అలవాట్లు, ఆచరణలోని విభిన్నతలను ప్రశంసించుట.<br>ఆ) మతాచారాలు మరియు ఆదర్శాలను అర్థం చేసుకొనుట – అనాదిగా వస్తున్న సామాజిక మార్పులకు అనుగుణంగా వివిధ మతాచారాలలో వస్తున్న మార్పులను అర్థం చేసుకొనుట. |

| క్ర.సం. | ఇతివృత్తాలు | లక్ష్యాలు |
|---|---|---|
| | | ఇ) మతాలు వివిధ ఆలోచనలను ఇచ్చిపుచ్చుకుంటాయని, వాటిని ఆచరించే ప్రజలు వివిధ మతాల విశ్వాసాలను తమ జీవనంలో భాగంగా మలచుకుంటారని అవగాహన చేసుకొనుట.<br>ఈ) వివిధ మతాల మధ్య గొడవలు రావడానికి కారణాలను, ప్రస్తుత కాలంలో మతతత్వవాదం ఏర్పడిన విధానాన్ని అవగాహన చేసుకొనుట. |
| 6. | సంస్కృతి–సమాచారం | అ) భారతదేశ సంస్కృతిలోని విభిన్నతలు, గొప్పతనాన్ని ప్రశంసించుట.<br>ఆ) జానపద, సాంప్రదాయ, ప్రాంతీయ సంస్కృతులు మరియు ఉపఖండేతర సంస్కృతుల ప్రభావంతో అనాదిగా భారతీయ సంస్కృతి వృద్ధిచెందడాన్ని అవగాహన చేసుకొనుట.<br>ఇ) సంస్కృతీ ఆవిర్భావం మరియు సంస్కృతిలో వచ్చే మార్పులను అర్థం చేసుకొనుట, సామాజిక, రాజకీయ పరిస్థితుల ప్రభావాన్ని అవగాహన చేసుకొనుట.<br>ఈ) కళల పోషణ వలన కళలపై కలిగే ప్రభావాన్ని అవగాహన చేసుకొనుట.<br>ఉ) స్థానిక కళలు, కట్టడాల సంస్కృతిని, నిర్మాణాన్ని అధ్యయనం చేయుట.<br>ఊ) చిత్రాలు చదివి అర్థం చేసుకొనుట, పోల్చుట, సామాజిక అనుభవాలను వినియగించుట మొదలైన నైపుణ్యాలను అభ్యసించుట. |

పై పట్టిక 6 నుండి 8 తరగతుల సాంఘిక శాస్త్ర సిలబస్‌ను తెలుపుతుంది. మొత్తం సిలబస్‌ను 6 ఇతివృత్తాలుగా విభజించటం మీరు పరిశీలించి ఉంటారు. NCF-2005, APSCF-2011 లు సాంఘిక శాస్త్ర విషయంలో తెలిపిన అంశాల ఆధారంగా పై ఆరు ఇతివృత్తాలను ఎన్నుకోవటం జరిగింది. ఇదేవిధంగా 9, 10 తరగతులకు కూడా వివిధ ఇతివృత్తాల ఆధారంగా యూనిట్లను రూపొందించటం జరిగింది. కనుక పాఠ్యాంశ బోధనలో కూడా ఉపాధ్యాయులు ఇతివృత్తాలను దృష్టిలో ఉంచుకొని బోధించాలి.

## 2.4. అంతర్జాతీయ శాంతి సాధ – సమకాలీన భారతదేశం, సమస్యలు, సవాళ్ళు :

## 2.4.1. అంతర్జాతీయ శాంతి సమస్యలు :–

రెండో ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచం రెండు శక్తి కూటములుగా విడిపోయింది. మరో ప్రపంచయుద్ధ భయం కారణంగా ప్రపంచంలోని ప్రధానమైన శక్తులలో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ ఉద్రిక్త పరిస్థితిలో ప్రపంచంలోని దేశాలు ఆయుధాలను సమీకరించడానికి త్వరపడటం ప్రారంభించాయి.

ఐక్యరాజ్యసమితి చార్టర్ ఆయుధాలు క్రమబద్ధీకరణకు సంబంధించిన ఒక వ్యవస్థను ఏర్పాటు చేయడానికి తగిన పథకాలు రూపొందించమని భద్రతామండలిని కోరింది. అంతర్జాతీయ శాంతి భద్రతల ఏర్పాటును, పరిరక్షణను లక్ష్యంగా పెట్టుకోవడమైంది. ప్రపంచంలోని మానవ, ఆర్థిక వనరులను ఆయుధాలకోసం మళ్ళించకుండా చూడాలని కూడా లక్ష్యంగా పెట్టుకోవడమైంది. భద్రతామండలి చేసిన సిఫార్సులననుసరించి, క్రీ.శ. 1945 అక్టోబర్ 3న యునైటెడ్ స్టేట్స్, గ్రేట్ బిటన్, సోవియట్ యూనియన్, చైనా దేశాలు మాస్కోలో సాధారణ భద్రతకు సంబంధించిన ఒక ప్రకటనమీద సంతకాలు చేసాయి.

ఆయుధాలను తగ్గించే విషయంలో యూరప్‌కు సోవియట్ యూనియన్‌కూ మధ్య భిన్నాభిప్రాయాలు ఏర్పడ్డాయి. తక్షణం ఆయుధాలను తగ్గించడం అనేది ప్రపంచ విశ్వాసాన్ని పునరుద్ధరించే దిశలో ముందడుగుగా ఉంటుందని సోవియట్ యూనియన్ భావించింది. మరొకవైపు యునైటెడ్ స్టేట్స్ అలాంటి తొందరపాటు నిర్ణయానికి సిద్ధంగా లేదు.

ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి యుద్ద తీరాలను చేరవేస్తున్నది. మారణాయుధాలు, అణ్వస్త్రాల పోటీకి పురికొల్పుతున్నాయి.

ఆధునిక జాతీయ రాజ్యాలు తమ తమ జాతీయ ఆదాయాలలో అధికభాగం రక్షణపై వ్యయం చేస్తున్నాయి. మరొకవైపు ప్రపంచ ప్రజల దారిద్ర్యాన్ని, ఆకలిచావులు, అజ్ఞానం, వ్యాధులు మొదలైన పీడనల నుండి విముక్తి చేసి జీవన ప్రమాణాలు పెంపొందించడానికి ప్రయత్నాలు సాగిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులలో ప్రపంచశాంతి అవసరమైంది.

**ప్రపంచశాంతికి సవాలుగా ఉన్న సమస్యలు**

1. మారణాయుధాలు – అణ్వస్త్రాల మధ్యపోటీ.
2. ప్రపంచంలో అగ్రగామి కావాలనే తీవ్రమైన కోరిక
3. శాస్త్ర సాంకేతిక రంగాల త్వరితగతి అభివృద్ధి
4. అధునాతన యుద్ధపద్ధతుల అభివృద్ధి
5. ప్రపంచ వ్యాపార సంస్థలు వాటి మధ్య పోటీ.

అణ్వస్త్ర యుద్ధమే సంభవిస్తే అగ్రరాజ్యాలే లేకుండా, మరెన్నో దేశాలు తీవ్ర ప్రమాదానికి గురవుతాయి. జనాభా, సంపద పూర్తిగా నాశనమవుతుంది. కోలుకొని నిలదొక్కుకోవడం ఏ దేశానికైనా చావుతో సమానంగా పరిణమిస్తుంది. దీంతో మానవ జీవనం తీవ్ర గడ్డు సిత్థితికి చేరుకొంటుంది. కాబట్టి ప్రపంచ దేశాల మధ్య శాంతి నెలకొల్పవలసిన బాధ్యత ప్రపంచ అత్యవసర అంశంగా మారింది. పాఠశాల విద్యలో విద్యార్థికి పై అంశాలను వివరించి, రాబోయే తరాలు శాంతికాముకులుగా మారుటకై బాల్యం నుంచే వారిలో శాంతి బీజాలు నాటవలసిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయునిపై ఉంది. ఈ అంశం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి.

**శాంతి – అవగాహన :–**

"అహింసా పరమో ధర్మః" అన్న సంస్కృతికి పుట్టిల్లు భారతదేశం. శాంతిని ఆచరిస్తూ శాంతిని ప్రపంచ వ్యాప్తంగా విస్తృత పరచడంలో భారతీయ ఆధ్యాత్మిక, రాజకీయ పండితులు ఎంతగానో కృషి చేశారు. బుద్ధుడు

శాంతిని ప్రబోధిస్తూ ప్రపంచమంతా పర్యటించాడు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రపంచశాంతి కోరుతూ పంచశీల సిద్ధాంతాన్ని ప్రచారంలోకి తెచ్చాడు. భారతదేశం శాంతికాముక దేశం. ఏ దేశంతోనైనా యుద్ధం చేయాలని, ఆ దేశాన్ని ఆక్రమించుకోవాలనే దురాశ భారతదేశానికి లేదు. సరిహద్దులోని దేశాలు ఎంతగా కవ్వింపు చర్యలకు పూనుకున్నా, భారత్ మాత్రం శాంతిమంత్రం పఠిస్తూనే ఉంది.

నేటి ప్రపంచాన్ని అణుబాంబులు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అణుయుద్ధం సంభవిస్తే మానవ సంతతి, సంస్కృతి సర్వనాశనమైపోతుంది. ఇన్నేళ్ళుగా నిర్మించుకున్న నాగరిక సమాజం నామ రూపాల్లేకుండా పోతుంది. ఉద్రిక్తలను తగ్గించుకొని, పరస్పర చర్చలు, మధ్యవర్తిత్వాల ద్వారా శాంతియుత సహజీవనంతో, సమైక్యతతో మెలగి బ్రతుకుదాం! బ్రతకనిద్దాం! అన్న భావనతో మెలగవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది.

తరతరాలుగా మానవత్వ పునాదులపై నిర్మించబడ్డ ప్రపంచ సంస్కృతి, సాంప్రదాయాలు, శాంతి సౌభాగ్యాల పట్ల విద్యార్థికి అవగాహన కల్పించి, శాంతి సద్భావనలతో అందరూ కలిసి మెలసి జీవించే ఉదార వాద గుణం వారిలో పెంపొందించాలి. శాంతి, అహింసల యొక్క గొప్పతనాన్ని విద్యార్థుల హృదయాల్లో నాటుకొనేలాగ వారికి గతంలో జరిగిన రక్తపాతాలు, యుద్ధాల పట్ల అవగాహన కల్పించాలి.

"వసుదైక కుటుంబం" భావనతో అంతర్జాతీయ అవగాహనతో శాంతి సౌభాగ్యాలతో ప్రపంచం విలసిల్లాలంటే అంతర్జాతీయ సద్భావన పెంపొందించుకోవాలి.

## శాంతి – సార్వభౌమత్యం :

భారతదేశం శాంతికాముకదేశం. మనం ఏ దేశాన్ని ఆక్రమించే ప్రయత్నం చేయాలేదు. మన పొరుగుదేశాలైన చైనా, పాకిస్తాన్‌లతో మనం ఎప్పుడూ స్నేహాన్నే కోరుకున్నాము. కాని జరిగిందేమిటి?

హిందీ–చీనీ ఛైనా భాయి, భాయి, పంచశీల అనే ఆకర్షణీయమైన నినాదాలనిస్తూనే చైనా మనలను మోసం చేసింది. మోసం చేస్తూ ఉంది. దురాక్రమణ పంజా విసురుతున్నది.

1962లు ఏకపక్షంగా చైనా దాడి చేసి నేటి మన అరుణాచల్‌ప్రదేశ్, జమ్మూ కశ్మీర్‌లోని భూభాగాలను ఆక్రమించింది. మనం 18000 చదరపు కిలోమీటర్ల పైగా భూ భాగాన్ని కోల్పోయాము.

శాంతిని కోరుకోవడమంటే మన సార్వభౌమత్వాన్ని తాకట్టు పెట్టడం కాదు.

## అంతర్జాతీయ శాంతి – అనుసరించాల్సిన మార్గాలు :

### ఎ) అహింసా విధానం :

అహింస సిద్ధాంతానికి చక్కటి తార్కాణం గాంధీజీ నిర్వహించిన భారత స్వాతంత్రోద్యమం. హింసకు ప్రతిహింస పరమావధిగా కాకుండా అహింసా మార్గంలో హింసను రూపుమాపవచ్చునని గాంధీజీ ఆచరణలో చేసి చూపించారు.

ప్రపంచదేశాలన్నీ గాంధీజీని ఆదర్శంగా తీసుకొంటే విశ్వ సౌభ్రాతృత్వ భావన పరిఢవిల్లుతుంది. హింస ద్వారా రక్తపాతం, ప్రాణహాని, ధనహాని జరుగుతుందే తప్ప ప్రపంచానికి క్షేమకరం ఏమాత్రంకాదు. గాంధీజీ కలలుకన్న రామరాజ్య స్థాపనలో హింసకు ఏ మాత్రం తావులేదు. మత ప్రవక్తలు, వేదాంతవేత్తలు, తాత్వికులు హింసను సంపూర్ణంగా వ్యతిరేకించారు. ఆత్మశుద్ధిలేనిదే అహింసాధర్మపాలన సాధ్యపడదు. జీవన రంగంలో ప్రతి భాగం పరిశుద్ధంగా ఉండటం అవసరం. ఇటువంటి శుద్ధి అందరికీ సాధ్యమే, శుద్ధి కావడమంటే మానోవాక్కాయ కర్మేణ నిర్వికారుడు కావడమే, రాగద్వేష రహితుడు కావడమే. ఇటువంటి నిర్వికార ప్రవృత్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవడానికి ప్రతిక్షణం ప్రయత్నిస్తుండాలి. "అహింసా పరమో ధర్మః" అన్న బుద్ధుని మాటలు ప్రతి వ్యక్తి

చెవుల్లో మారుమ్రోగుతూండాలి.

అహింసా సిద్ధాంతానికి ప్రతిరూపం, ప్రతినిధిగా పూజ్య బాపూజీ ఆదర్శంగా తీసుకొని, అహింసావ్రతం ఆచరించడం విద్యార్థులకు చిన్న వయస్సునుంచే పాఠ్యాంశాలతో పాటుగా బోధించాలి. వారిలో చిన్న నాటి నుంచే అహింసా బీజాలు నాటాలి. ఈనాడు సమాజం ఎదుర్కొంటున్న హింస, మతోన్మాదం, తీవ్రవాదాలకు కారణాలు పిల్లలకు తెలియజేయాలి.

అహింస అనేది బలహీనుల ఆయుధం కాదు. బలవంతుల లక్షణం అన్నారు గాంధీజి.

మనం ఎల్లప్పుడు అహింసనే పాటిస్తున్నాము.కాని మన పొరుగుదేశాలైన పాకిస్తాన, చైనాలు మన దేశాన్ని అన్ని రంగాలలో బలహీన పరచడానికి ప్రయత్నిస్తున్నాయి.

ప్రత్యక్షయుద్ధంలో భారతదేశాన్ని గెలవలేమని గ్రహించిన పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నది. ఉగ్రవాదులకు శిక్షణ కేంద్రాలు నడుపుతున్నది. వారికి ఆయుధాలు, ఆర్థిక, సైనిక సహకారాలు అందిస్తున్నది. భారతదేశంలో అరాచకాన్ని, రక్తపాతాన్ని సృష్టిస్తున్నది. పార్లమెంటుపై దాడి, ముంబాయిలో దాడి, కాశ్మీర్‌లో నిరంతర కల్లోలం ఇవన్నీ పాక్ ప్రేరేపిత ఉగ్రదాడులే.

మనం శాంతి కాముకులమే అయినా శక్తివంతులుగా ఉండి పై దుశ్చర్యల నుండి ఈ దేశాన్ని కాపాడుకోవాలి.

## బి) ప్రపంచదేశాలు ఒక దానిపై ఒకటి ఆధారపడటం – సహకారం

మానవుడు సంఘజీవి, పరస్పర సహాయ సహకారాలతో మానవులంతా ఏదేశంలో జీవిస్తున్నా, ఒకేవిధమైన ఆకారాలతో ఉంటారు. అలాగే ఏ దేశమైనా ఒంటరిగా కాకుండా, తన ఇరుగు పొరుగు దేశాలతో పరస్పర అవగాహనతో ఇచ్చిపుచ్చుకునే విధానంతో వ్యవహరించాలి. ఏ దేశం అయినా వేరొక దేశం నుంచి సహాయ సహకారాలు లేకుండా అభివృద్ధిని సాధించలేదు. ప్రపంచీకరణ జరిగిన తరువాత ఏదేశం కూడా తనకు కావలసిన శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని ఇతరదేశాల నుంచి స్వీకరించడానికి ఎలాంటి ఆటంకాలుగాని అభ్యంతరాలుగానీ లేవు.

ఒక్కొక్క దేశానికి ఒక్కొక్క అనుకూల పరిస్థితులుండి, ఆయా దేశాలు ప్రత్యేక తరా వస్తు ఉత్పత్తికి, పరిశోధనా రంగాలకు ప్రముఖంగా నిలుస్తాయి. అలాంటి దేశాలు వారికికావలసిన ఇతర అంశాలను తప్పనిసరిగా ఇతర దేశాల నుంచి స్వీకరించక తప్పదు. ఈనాటి క్లిష్టతరమైన జీవన సరళిలో నూతన ఆవిష్కరణలనూ, ఆవిర్భావాలనూ సానుకూల ధోరణితో సమసమాజాభివృద్ధికోసం ఆహ్వానించక, స్వీకరించక, సమర్థించక తప్పదు. పర్యావరణ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ పర్యావరణంలో జరుగుతున్న అనేక మార్పులకు పరస్పర సహకారంతో సానుకూల దృక్పథతో ఆహ్వానించక తప్పదు.

విద్యార్థులకు చిన్ననాటి నుంచే సామాజిక జీవన సుఖ ప్రదమవడానికి పరస్పర సహాయ సహకారాలతో సహజీవనం సాగించడం శ్రేయదాయకమనే అంశాన్ని బోధించడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర వహించాలి. రాష్ట్రాల మధ్య దేశాల మధ్య పరస్పర సంబంధం బాంధవ్యాలుంటే వాటి అభివృద్ధి సులభసాధ్యమవుతుదనే భావన విద్యార్థుల్లో కల్పించి, దాని ప్రాముఖ్యాన్ని విద్యార్థులు గుర్తించేలా తరగతి గదిలో ఏకాంకికలు, రూపకాల రూపంలో మనస్సుకు హత్తుకునేలా చిత్రీకరించాలి. చిన్ననాటి నుంచి స్నేహం, సహకారం ఇచ్చిపుచ్చుకొనే ధోరణులు అలవడేట్లుగా కృషి సల్పాలి.

## సి) అంతర్జాతీయ సహకారం

ప్రపంచ దేశాలన్నింటిలో ఒకే రకమైన భౌగోళిక, శీతోష్ణ భూసార, ఖనిజ సంపద, అటవీ సంపద, మానవ సంపదలు లేవు శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక రంగాల అభివృద్ధిలో కూడా తరమత బేధాలున్నాయి. ఒక దేశ

సంపూర్ణాభివృద్ధికి సాధించాలంటే, తన దగ్గరలేని శాస్త్ర, సాంకేతిక, పారిశ్రామిక విజ్ఞానాన్ని, వనరులను ఇతర దేశాల నుంచి పొందవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఏదేశమైనా పరస్పర సహకారంతో మెలగని పక్షంలో తాను సంపూర్ణ అభివృద్ధిని సాధించలేదు. ఏదేశం తన అన్ని అవసరాలు తీర్చుకొని, మనుగడ సాగించడానికి ఏకాకిగా ఉండటం సాధ్యపడదు. ఇతరదేశాలలో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలి. ఒకదేశంలో అధికోత్పత్తి సాధించిన వస్తువును, సేవలమిగులును ఇతర దేశాలకు అందించి, ఇతర దేశాల్లోని మిగులును తనకు అవసరమున్నంత మేరకు పొందడానికి సంశయించకూడదు.

ప్రపంచదేశాలన్ని పరస్పరాశ్రయాలే. ప్రపంచీకరణ భావన ప్రాచుర్యం కావడం వల్ల ప్రపంచం ఒకటి అనే భావన ప్రాచుర్యం పొంది అంతర్జాతీయ శాంతి, సహకారాలు దినదిన ప్రవర్ధమానమవుతున్నాయి.

అంతర్జాతీయ శాంతి – భారతదేశం :

ఐక్యరాజ్యసమితి వ్యవస్థాపక సభ్యదేశాల్లో భారతదేశం ఒకటి, ఐక్యరాజ్యసమితి ప్రకటన పత్రంలో పొందు పరచిన సూత్రాలకు తన పూర్తి నిబద్ధతను ప్రకటించి వాటి అమలుకు భారతదేశం హృదయపూర్వక సహకారాన్ని అందించింది. "ఆలీన విధానం" ప్రాతిపదికపై భారతదేశం ఐక్యరాజ్యసమితిలో తనవంతు పాత్రను పోషిస్తుంది. ఐక్యరాజ్య సమితి వేదికపై నుంచి జాతి వివక్షను, వలస వాదాన్ని, సైనిక కూటాలు మధ్య శతృత్వాన్ని ఆయుధాల కోసం ఆరాటాన్ని వ్యతిరేకిస్తుంది. దేశాల మధ్య తగాదాలను శాంతియుతంగా పరిష్కరించడానికి కృషి చేయడమే కాక ప్రపంచవ్యాప్తంగా నియోగించబడిన ఐక్యరాజ్యసమితి శాంతి రక్షణ దళాల్లో భారతదేవం ఉత్సాహంగా, క్రియాశీలంగా పాల్గొంది. 1991–1992 వ సంవత్సరాల మధ్యకాలంలో భారతదేశం భద్రతామండలి తాత్కాలిక సభ్యదేశం కూడా.

భారతదేశం వలస రాజ్యపాలనకు విరుద్ధంగా స్వతంత్రం కోసం 1947వ సంవత్సరం వరకు పోరాటం సల్పింది. అందువల్ల పాశ్చాత్య దేశాల కూటమితో మనదేశం ఏకం కాలేదు. అంతేగాక సామ్యవాద దేశాల కూటమిలో కూడా చేరలేదు. దీనికి రెండు కారణాలున్నాయి. మొదటి కారణం భారతీయ నాయకులు సామ్యవాదాన్ని పూర్తిగా ఇష్టపడలేదు. భారతదేశం వాణిజ్యం కోసం, విదేశాల సాయంకోసం పాశ్చాత్యదేవాలపై ఆధారపడి వుండటం రెండోకారణం. అందువల్ల అలీన విధానం మన విదేశాంగ విధానానికి కేంద్రబిందువైంది. అలీన విధానం అంటే అంతర్జాతీయ వ్యవహారాల నుంచి దూరంగా ఉండటం కాదు. వివిధ దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాలను, సహకారాలను పెంపొందించడమే అలీనవిధానం యొక్క ప్రధాన ఆశయం. భారత విదేశాంగ విధానం యొక్క ప్రాతిపాదిక సూత్రాలు.

- వలసవాదాన్ని (పాసిజం – రేసిజం) ప్రతిఘటించడం
- దేశాల సమానత్వం
- స్వేచ్ఛ, శాంతిగల ప్రపంచం
- యుద్ధాలు, తగాదాలు లేని ప్రపంచం
- సమానత్వ భావనపై దేశాల మధ్య పరస్పర సహకారం.

మనదేశం అనుసరిస్తున్న అలీన విధానం పెక్కు మూడో ప్రపంచ దేశాలకు, ఆదర్శవంతమైంది. ప్రపంచ ఆర్థిక స్థితిగతులపై మూడో ప్రపంచ దేశాల థృక్పథాన్ని రూపొందించడంలో భారతదేశం కీలకపాత్ర పోషించింది. మూడో ప్రపంచ దేశాలకు ప్రయోజనం కలిగించని కొన్ని అంతర్జాతీయ ఒప్పందాలను కూడా భారత్ వ్యతిరేకించి, ఆ ఒప్పందాలు అగ్రరాజ్యాలకే వర్తిస్తాయని నొక్కిచెప్పింది.

## 2.4.2. సమకాలీన భారతదేశం – సవాళ్ళు

### భారత ప్రజాస్వామ్యం – సఫలత :

ప్రపంచంలో ఇంతవరకు ఏర్పడిన ప్రభుత్వ రూపాలలో ప్రజాస్వామ్యం ఉత్తమమైనది. ఈ వ్యవస్థ ప్రజలకు స్వేచ్ఛను, హక్కులను కల్పించటమే కాక ఆర్థిక, సామాజిక, రాజకీయ మానవత్వాలకై కృషి చేస్తుంది. ప్రొఫెసర్ సీలే అభిప్రాయంలో "రాజ్యమందలి పరిపాలనాధికారం ఒక వర్గానికి కానీ, కొన్ని ర్గాలకు కాని పరిమితం కాకుండా సమాజంలోని పౌరులందరికి చెందినటువటి ప్రభుత్వమే ప్రజాస్వామ్యం". బ్రిటన్‌లో ప్రారంభమైన ఈ వ్యవస్థ 20వ శతాబ్దం రెండవ భాగం నాటికి ప్రపంచంలో అనేక దేశాలు అనుసరించే విధానంగా రూపొందింది. భారతదేశంలో చోళుల కాలంలోనే ప్రజాస్వామ్య వ్యవస్థ రూపుదిద్దుకొన్నది.

భారత రాజ్యాంగ నిర్మాతలు ఎటువంటి అస్పష్టతకు తావులేకుండా రాజ్యాంగంలో ప్రజాస్వామ్య వ్యవస్థను చేర్చారు. రాజ్యాంగ పీఠికలో "ప్రజాస్వామ్యం" అనే పదం చేర్చారు. గత 40 సం॥ల భారత ప్రజాస్వామ్య అనుభవాన్ని పరిశీలించినట్లయితే అనేక సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ విజయవంతంగా కొనసాగుతుందని చెప్పవచ్చు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ సఫలమైందని చెప్పటానికి ఈ క్రింది అంశాలను మనం చెప్పవచ్చు.

**1. 45 ఏళ్ళుగా ప్రజాస్వామ్యం కొనసాగటం :**

రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత స్వాతంత్ర్యం పొందిన అనేక దేశాలు నియంతృత్వాన్ని చవిచూస్తున్నాయి. భారతదేశంతోపాటు ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రవేశపెట్టిన దేశాలలో ఆ వ్యవస్థ విఫలమై మిలటరీ నియంతల అధికారంలోకి వెళ్ళినాయి. పాకిస్తాన్, ఫిలిఫ్ఫైన్స్, చీలి, పెరూ, ఇండోనేషియా మొదలైన దేశాలన్నీ దీనికి ఉదాహరణలే. కాని భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికి విజయవంతంగా కొనసాగుతున్నది. 1975లో అత్యవసర పరిస్థితిని దేశ ప్రజలపై రుద్ది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి ప్రయత్నం చేసినప్పటికీ, 1977 ఎన్నికలలో భారత ప్రజలు తిరస్కరించి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారు.

**2. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ :**

భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థగా రూపొందింది. 1991 ఎన్నికల నాటికి సుమారు 550 మంది మిలియన్ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకొనే అధికారాన్ని కలిగి వున్నారు. ఎన్నికల నిర్వహణకై ప్రపంచంలో ఏ దేశంలో లేనంతగా విస్తృతమైన ఏర్పాట్లు చేయవలసి ఉంటుంది. అనేక ఇబ్బందులున్నప్పటికి గత 40 ఏళ్ళుగా ఈ ఏర్పాట్లన్నీ జరుగుతునే ఉన్నాయి.

**3. ఎన్నికలు – ఓటర్ల రాజకీయ చైతన్యం :**

భారత ప్రజలు వివిధ ఎన్నికలలో తమ చైతన్యాన్ని నిరూపించుకున్నారు. నిరక్షరాస్యులైనప్పటికి ఓటు హక్కు వినియోగంలో చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అనేక ఐరోపా దేశాలలో ఓటింగు శాతం తగ్గిపోతూ వుండగా భారతదేశంలో 60%పైగా వుంటున్నది. రాజకీయ ప్రత్యామ్నాయాలు ఏర్పడినప్పుడల్లా ప్రజలు వాటికి ఓటు వేస్తున్నారు.

**4. ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు :**

ప్రజాస్వామ్య వ్యవస్థ కావటం వలనే స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడుకుంటున్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రంగా వ్యవహరిస్తూ ప్రజల హక్కుల పరిరక్షణకై కృషి చేస్తుంది. ప్రజలు భావప్రకటనా స్వేచ్ఛను, పత్రికా స్వాతంత్ర్యాన్ని పొందుతున్నారు. బహు పార్టీ వ్యవస్థ మనగలుగుతున్నది.

**5. అణగద్రొక్కబడిన వర్గాలలో చైతన్యం :**

శతాబ్దాలుగా అణచివేతకు, పీడనకు గురైన ప్రజలలో నూతన చైతన్యం పొందుతున్నది. దీనికి ప్రధానకారణం ప్రజాస్వామ్య వ్యవస్థే. వయోజన ఓటింగ్ హక్కు ఈ ప్రజలలో చైతన్యాన్ని నింపినది. ఈ ఓటుహక్కు వలన ఈ

వర్గాల ప్రజలకు అనేక ప్రయోజనాలను ప్రభుత్వాలు కల్పించకక తప్పలేదు. ఈ ప్రయోజనాల వలన అణగద్రొక్కబడిన వర్గాలలో కొంతమందికైనా మేలు జరిగి మిగిలిన వారు తమ రాజకీయ చైతన్యం ద్వారా హక్కులను, ప్రయోజనాలను పొందాలని భావిస్తున్నారు.

## భారత ప్రజాస్వామ్య వ్యవస్థ – సమస్యలు

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలు క్రిందివిధంగా ఉన్నాయి.

**1. ఎన్నికల విధానంలో లోపాలు :**

గత 40 సం॥లుగా కొన్ని ఎన్నికల సంస్కరణలు ప్రవేశపెట్టినప్పటికీ అనేక లోపాలు కొనసాగుతూనే వున్నాయి. ఎన్నికల సమయంలో హింసాకాండ, ధనప్రాబల్యం, రిగ్గింగు, దొంగ ఓట్లు మొ॥నవి ప్రజాస్వామ్య వ్యవస్థను పరిహసించేవిగా వున్నాయి. ఈ లోపాల వలన అనేకమంది ఈ వ్యవస్థ పట్ల నిర్లిప్తంగా వుంటున్నారు. ఎన్నికల కమీషను సంస్కరణల ద్వారా ఈ లోపాలను తొలగించటానికి ప్రయత్నించటం సంతోషకరమైన అంశం.

**2. Criminalisation of Policitcs**

గత దశాబ్ధముగా భారత రాజకీయ వ్యవస్థలో నేర ప్రవృత్తి పెరగటమే కాక నేరస్థులు బహిరంగంగా వివిధ పార్టీలలో ఆధిపత్యం చలాయిస్తున్నారు. 1960, 70 దశకాలలో రాజకీయ పార్టీలతో సంబంధాలు కలిగి వున్న నేరస్థులు బయటపడకుండా అజ్ఞాతంగా పార్టీలకు సహాయం చేసేవారు. కాని గత 15 ఏళ్లుగా రాజకీయ పార్టీలు బహిరంగంగా నేరస్తులను ప్రోత్సహిస్తున్నాయి. రాజకీయ వ్యవస్థలో ఈ నేరపూరితమైన దృక్పధాన్ని తొలగించకుండా ప్రజాస్వామ్య వ్యవస్థ కొనసాగటం అసాధ్యం.

**3. రాజకీయ పార్టీల పనితీరు :**

అనేకమంది రాజనీతి శాస్త్రవేత్తల అభిప్రాయంతో భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రధాన శత్రువు రాజకీయ పార్టీల పనితీరే. అనేక రాజకీయ పార్టీలు జాతీయ ప్రయోజనాలను నిర్లక్ష్యం చేసి అధికారంలోకి రావటానికై, తక్షణ ప్రయోజనాలకై అవకాశవాద విధానాలను అవలంబిస్తున్నాయి. రాజకీయ పార్టీలు ఐరోపా దేశాలవలే జాతీయ ప్రయోజనాల దృష్ట్యా వ్యవహరించినట్లయితే భారత ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పటిష్టమవుతుంది. భారత రాజకీయ పార్టీలు ఈ క్రింది లోపాలతో పనిచేస్తున్నాయి.

ఎ) సైద్దాంతిక నిబద్దత లేకపోవడం.

బి) రాజ్యాంగ లక్ష్యాలకు కట్టుడకపోవడం

సి) వ్యక్తి ఆరాధన.

పై అంశాలు ఆయా రాజకీయ పార్టీలలో "అంతర్గత ప్రజాస్వామ్యం" లేకుండా చేస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం లేని పార్టీలు పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థను ఎలా నడిపిస్తాయి?

**4. మేధావుల నిర్లిప్తత :**

ప్రపంచంలో మార్పుకోసం జరిగే ఏ ఉద్యమంలోనైనా మేధావులు, మధ్యతరగతి వారు ప్రధాన పాత్ర నిర్వహిస్తారు. భారత జాతీయోద్యమ నాయకత్వం ఎక్కడ నుండి రూపొందినదో మనకందరకూ తెలిసినదే. అయితే సమకాలీన భారతదేశంలో మేధావులు జరుగుతున్న రాజకీయ, సామాజిక పరిణామాల పట్ల నిర్లిప్తంగా వుండటం ఆందోళన కలిగించే అంశము. వీరు సామాజిక రంగంలో ప్రముఖ పాత్ర వహించినపుడే ప్రగతి సాధ్యమవుతుంది.

**5. ఆర్ధిక, సాంఘిక స్వేచ్ఛ :**

ప్రొ. లాస్కీ అభిప్రాయంలో, "ఆర్ధిక స్వేచ్ఛలేని రాజకీయ స్వేచ్ఛ అర్ధరహితము". డా. అంబేద్కర్ "ఆర్ధిక సాంఘిక సమానత్వం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం" నిలబడ జాలదని చెప్పాడు. గత 40 సం॥లుగా భారతదేశంలో ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ కల్పించారు. కానీ సామాజిక, ఆర్ధిక రంగాలలో ప్రజలు నిరాశకు గురవుతున్నారు. పెరుగుతున్న నిరుద్యోగం, సామాజిక ఉద్రిక్తత ప్రజలను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఆర్ధిక అసమానతలు ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నాయి. సామాజిక, ఆర్ధిక విషయాలలో ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరచనట్లయితే రాజకీయ ప్రజాస్వామ్యం దెబ్బతినే అవకాశమున్నది.

**6. రాజకీయ, పాలనా అవినీతి :**

దేశంలో విస్శృంఖలంగా పెరిగిపోతున్న అవినీతి ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే అవకాశమున్నది. వివిధ స్థాయిలలో రాజకీయ, పాలనా రంగాలలో పెరిగిన అవినీతి, సామాన్య ప్రజల ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నది. రాజకీయ వ్యవస్థలోని పై స్దాయి నాయకులు కూడా అవినీతితో సంబంధాలు కలిగి వున్నారనే భావన ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నది.

భారత ప్రజాస్వామ్య వ్యవస్థ పైన వివరించిన సమస్యలను ఎదుర్కొంటున్నది. రాజకీయ వ్యవస్థ, రాజకీయ నాయకులు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయి.

ఇటీవలికాలంలో భారతప్రభుత్వం అవినీతి నిర్మూలనకు చేపడుతున్న చర్యలు ప్రశంసనీయం.

## 3. భారతదేశము - సమైక్యతా సమస్యలు

మిగిలిన అభివృద్ధి చెందుతున్న దేశాలలో వలె భారతదేశం కూడా సమైక్యతా సమస్యలను ఎదుర్కొంటున్నది. 1850 నాటికి భారతీయులలో జాతీయతాభావం అభివృద్ధి చెంది స్వాతంత్ర్యం కోసం చిరస్మరణీయమైన ఉద్యమం నిర్వహించినప్పటికీ స్వాతంత్ర్యానంతరం ఆ భావ సమైక్యత ఇంకా బలపడలేదు. అనేక అంశాలు జాతీయ సమైక్యతకు అవరోధాలుగా పనిచేస్తున్నాయి. వలస వారసత్వం, ఆర్ధికాభివృద్ధిలో గల తేడాలు, ఆర్ధిక అసమానతలు, భాషాపరమైన సమస్యలు దేశ సమైక్యతకు అనేక సమస్యలను సృష్టిస్తున్నాయి. భారత జాతీయ సమైక్యతకు అవరోధాలుగా 1)మతతత్వం, 2) ప్రాంతీయతత్వం, 3) భాషోన్మాదం, 4) కులతత్వం.

**1. మతం - రాజకీయాలు లేక ఆధునిక భారతదేశంలో మతత్వం :**

భారతజాతీయ సమైక్యత ఎదుర్కొంటున్న సమస్యలలో ముఖ్యమైనది మతత్వం. భారతదేశం బహుమతాలకు నిలయం. హిందువులు, మహమ్మదీయులు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు మొదలగు మతాలవారున్నారు. వీరందరి భాషా, సంస్కృతి, ఆహార వ్యవహారాలు, సాంఘిక కట్టుబాట్లు మొదలగు వాటిల్లో చాలా వ్యత్యాసాలున్నాయి. మతసామరస్యం కోసం భారతదేశాన్ని లైకిక రాజ్యాంగంగా ప్రకటించినప్పటికి వివిధ మతాల మధ్య సామరస్యం ఈనాటికి ఒక ప్రధాన సమస్యే అయినది. గత 40 సంవత్సరాలలో భారతదేశం అనేక ప్రాంతాల్లో మత కలహాలు తరచు సంభవిస్తున్నాయి. హైదరాబాదులో పాతబస్తీ, మీరట్, జంషెడ్‌పూర్, కాన్పూర్, బరోడా మొదలగు ప్రాంతాలలో తరచు మత ఘర్షణలు జరుగుతున్నాయి. అల్పసంఖ్యాకులకు, అధిక సంఖ్యాకులకు మధ్య పరస్పర విశ్వాసం, సామరస్యం లోపించడంతో అల్లర్లు, అలజడులు, ప్రాణనష్టాలు జరుగుతున్నాయి. వివిధ రాజకీయ పక్షాలు తమ

పాక్షిక ప్రయోజనాల సాధన కోసం మతకలహాలను ఆయుధంగా వుపయోగించుకుంటున్నాయి.

**మతము – రాజకీయము :**

మతం రాజకీయాలకుండవలసిన సంబంధము గురించి ప్రాచీన కాలము నుంచి చర్చ జరుగుతూనే వున్నది. కౌటిల్యుడు అర్థశాస్త్ర గ్రంథంలో రాజనీతి నుండి మతాన్ని వేరుచేశాడు. 16వ శతాబ్దంలో ఇటాలియన్ రాజనీతి శాస్త్రవేత్త మాకియవెల్లీ "ది ప్రిన్స్" గ్రంథంలో రాజకీయ వ్యవస్థను, మతాన్ని వేరుచేసి ఆధునిక లౌకిక దృక్పథానికి నాంది పలికాడు. మాకియవెల్లి మతాన్ని పూర్తిగా విస్మరించలేదు. అది వ్యక్తిగత విశ్వాసంగా కొనసాగుతూనే రాజ్య లక్ష్యాలకు కట్టుబడి వుండాలని చెప్పాడు. ఆధునిక ఉదారవాద తత్వవేత్తలైన జె.ఎస్.మిల్, ఎడ్మండ్ బర్గ్, బెండామ్ మొదలగువారు లౌకిక దృక్పధం వ్యాప్తి చెందటానికి దోహదపడ్డారు. ఆధునిక భారతదేశంలో రాజారామమోహన్‌రాయ్, గోపాలకృష్ణ గోఖలే, నెహ్రూ మొదలగు ప్రముఖులు మత విలువలంటే ఉదారవాద భావాలకు, విజ్ఞానానికి, లౌకిక విధానాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

మతము, రాజకీయాలు మిళితం కావటం వలన అభివృద్ధి వేగం మందగిస్తుంది. అభివృద్ది సమస్యలకు సమాధానాలను వైజ్ఞానిక దృక్పథంతో కంటే మతంతో పొందటానికి ప్రయత్నం జరుగుతుంది. ఐరోపాఖండ అభివృద్ధికి మధ్యయుగాల వరకు కొనసాగిన చర్చ ఆధిపాత్యాన్ని తొలగించి, 1453లో జరిగిన సాంస్కృతిక పునరుజ్జీవనం ద్వారా నూతన వికాసం వైజ్ఞానిక దృక్పథం హేతువాద భావాలు అభివృద్ధి చెందటమే కారణం. మతము, రాజకీయాలు కలిసి రావడం వలన తాత్కాలిక ప్రయోజనాలు వున్నప్పటికి, దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా చూసినపుడు అనేక సమస్యలకు, విచ్చిన్నకర ఉద్యమాలకు దారితీసినట్లు అర్థమవుతుంది.

**సి) రాజకీయ ప్రయోజనాలు :**

భారతదేశాన్ని లైకిక రాజ్యం అని ప్రకటించినప్పటికీ రాజకీయ పక్షాలు దాని కనుగుణంగా వ్యవహరించడం లేదు. మతప్రాదిపదికపైనే కొన్ని రాజకీయ పారీటలు ఏర్పడి పనిచేస్తున్నాయి. సెక్యులర్ పార్టీలు కూడా అనేక సందర్భాలలో మతాన్ని తమ ప్రయోజనాల నిమిత్తం ఉపయోగించుకోవటానికి వెనుకాడడం లేదు. ఇటీవల జరిగిన అనేక మతకలహాలలో రాజకీయ పార్టీల ప్రమేయమున్నట్లు స్పష్టంగా వెల్లడవుతుంది. 1985లో జరిగిన గుజరాత్ మతకల్లోలాలలో రెండు రాజకీయ పార్టీల ప్రమేయమున్నట్లు కమీషన్ పేర్కొన్నది. హైదరాబాద్ పాతబస్తీలో జరుగుతున్న మతకలహాలన్నింటిలో రాజకీయ ప్రమేయమున్నట్లు ప్రతివారికి తెలిసిన విషయమే. అంతేగాక ఎన్నికలలో ఒక మతానికి చెందిన ఓటరు నియోజకవర్గంలో అధికశాతం వుంటే, ఆ మతానికి చెందిన అభ్యర్ధిని ఎంపిక చేయటం, నోట్లకోసం మతగురువులు, మతాచార్యులతో ప్రకటనలు చేయించటం మొదలగున్నవన్నీ మతతత్వాన్ని పెంచడానికి దోహదపడతాయి.

**డి) ప్రార్థనా స్థలాల దుర్వినియోగం :**

మతం వ్యక్తిగతమైనది. ప్రతివ్యక్తి తను నమ్మిన మతాన్ని ఆచరించవచ్చు. ప్రచారం చేసుకోవచ్చు. మతాన్ని ఆచరించుకోవటానికి రూపొందించిన ప్రార్థనా స్థలాలను రాజకీయ ప్రయోజనాలకు, తీవ్రవాదులకు ఆశ్రయాలుగానూ ఉపయోగిస్తున్నారు. ఉదాహరణకు అమృతసర్‌లో స్వర్ణదేవాలయం తీవ్రవాదుల కేంద్రంగా మారింది. హిందూ ప్రార్థనా స్థలాలను కూడా రాజకీయ ప్రయోజనాలకుపయోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. జమ్మూ కాశ్మీర్ మొదలైన చోట్ల ప్రార్థనా స్థలాలను ఉపయోగించి రాజకీయప్రయోజనాలు పొందుతున్నారు. మన సైనికులపై దాడులు చేస్తున్నారు.

బ్రిటీష్ కాలంలో మతతత్వం ప్రారంభమైంది. వారు తమ సామ్రాజ్య సుస్థిరతకు మతతత్వాన్ని ప్రోత్సహించి తమ లక్ష్యాలు నెరవేర్చుకున్నారు. కాని లౌకిక దృక్పథాన్ని ప్రకటించుకొని లౌకిక భావాలను కలిగిన భారతదేశంలో ఈనాటికి మతతత్వం కొనసాగించటం ప్రజల తప్పుకాదు. ప్రజలను మత భావాల ఆధారంగాను వారిలో వెనుకబాటుతనం ఆధారంగాను, వారి నుపయోగించుకుంటున్న రాజకీయ పార్టీలు, ప్రభుత్వం యొక్క బాధ్యత వున్నది. రాజకీయాలను, మతమును మిళితం చేయటం వలన దేశ విభజన జరిగింది. మరొకసారి అలాంటి నష్టం సంభవించకుండా వుండాలంటే మతతత్వ నివారణకు ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

1. రాజకీయ పక్షాలకు ప్రవర్తనా నియమావళి రూపొందించి లౌకిక దృక్పథానికి కట్టుబడి ఉండేటట్లు చేయాలి.
2. మతపరమైన ప్రదర్శనలు నిషేదించడమే కాక ప్రార్థనా స్థలాలను దుర్వినియోగం కాకుండా చూడాలి. ఇటీవల భారత పార్లమెంటు ఆమోదించిన ప్రార్థనా స్థలాల బిల్లు ఈ విషయంలో పెద్ద ముందడుగు.
3. జాతీయ సమైక్యతా మండలిని సమర్థవంతంగా పనిచేయిస్తూ, మతకలహాలు జరిగే ప్రదేశాలలో అఖిలపక్ష శాంతి కమిటీలు ఏర్పాటు చేయాలి.
4. మతకల్లోలాలు నివారించటానికి ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేసి కారకులైన వారిని జాప్యం లేకుండా కఠినంగా శిక్షించాలి.
5. లౌకిక దృక్పథాన్ని హేతుబద్ధమైన ఆలోచనలను పెంపొందించే శాస్త్రీయ విద్యను ప్రోత్సహించాలి.
6. మైనారిటీల హక్కులను, విద్యా సాంస్కృతిక అంశాలను పరిరక్షించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.
7. రాజకీయవేత్తలు తమ మాటలలోను, చేతలలోను, లౌకిక దృక్పథాన్ని పెంపొందించాలి.

ఈ సూచనలను చిత్తశుద్ధితో అమలుచేస్తే మతతత్వ ప్రభావాన్ని తగ్గించి ఆధునిక భారతదేశాన్ని రూపొందించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

"గతంలో కలహించుకున్నామని వర్తమానంలో కూడా కలహించుకోవాలనుకుంటే మనం చరిత్ర నుండి గుణపాఠాలు నేర్చుకోనట్టే లెక్క. ఇస్లాంలోగాని, హిందూమతంలో గాని పరస్పరం కలహించుకోమని ఎక్కడా లేదనే నా నమ్మకం. యదార్థం ఏమిటంటే, రెండు మతాలలో వున్న స్వార్థపర శక్తులు, మత మౌఢ్యం తలకెక్కిన పూజారులు ప్రజలను పరస్పరం కలహించుకునేలా తయారు చేస్తున్నారు".

"మనకు చరఖా ఎంత ముఖ్యమో హిందూ – ముస్లిం ఐక్యత కూడా అంతే ముఖ్యం. అది మన జాతి జీవనానికి ప్రాణం". – మహాత్మాగాంధీ

"మత ప్రసక్తిలేని లౌకిక రాజ్యాన్ని సృష్టించుకోవాలని మనం అభిలషిస్తున్నాము. ఈ లౌకిక రాజ్యంలో ఒక మతం లేదా వర్గం లేదా పార్టీవారు ఇతర మతం వారి హక్కులను హరించేందుకు ఎంతమాత్రమూ వీలుండదు."

– నెహ్రూ

"మన రాజ్యాంగంలో లౌకిక వ్యవస్థను మనం ప్రతిపాదించుకోవడం చాలా సంతోషదాయకమైన విషయం. అయితే 'లౌకిక రాజ్యాన్ని' గురించి పదేపదే ప్రస్తావిస్తున్న సభ్యులు అసలు రాజ్యాంగంలో పొందుపర్చిన అర్థంలోనే ఆ మాటను ఉపయోగిస్తున్నారా అనే విషయం నాకు బోధపడడం లేదు. లౌకిక రాజ్యంలో మనం మతాన్ని నిషేధిస్తున్నామని అర్థం కాదు. ప్రజల మతపరమైన భావాలను గౌరవించడమే దీని భావం. లౌకిక రాజ్యం అంటే ఏదో ఒకమతాన్ని ఇతరులపై బలవంతంగా రుద్దేందుకు పార్లమెంటకు ఏ విధమైన అధికారాలు వుండవు అనేదే దీని అర్థం". – డా॥ బి.ఆర్. అంబేద్కర్

**అత్యధిక రక్షణ :**

మన రాజ్యాంగం అధికార మతాన్ని నిషేధించింది. ప్రతివ్యక్తికీ తన మతాన్ని ఆచరించేందుకూ, ప్రచారం చూసేందుకూ అనుమతి నిచ్చింది (25వ అధికరణ). ప్రతి మతానికీ తన వ్యవహారాలు నడుపుకునేందుకూ, మత సంస్థలను, విద్యాసంస్థలనూ నెలకొల్పుకునేందుకు, అవకాశాన్ని హక్కునీ కల్పించింది. మతబోధ చేసేందుకు హక్కు కల్పించింది (26వ అధికరణ). అయితే పూర్తిగా ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థలు మాత్రం మతబోధలు చేయకూడదని 28వ అధికరణ ఆదేశిస్తోంది. మతపరంగానూ, భాషాపరగానూ అల్పసంఖ్యాకులుగా నిర్ణయించబడిన ప్రజలకు, తమకు నచ్చిన రీతిలో విద్యాసంస్థలు నెలకొల్పడానికి, నడపడానికి హక్కు వుంది. అంతేకాక, వీరు అల్పసంఖ్యాక వర్గానికి చెందినవారనే మిషతో నిధులు నిరాకరించే అధికారం ప్రభుత్వానికి లేదు, ఈవిధంగా, దేశంలోని అన్ని మతాలవారికి మన రాజ్యాంగం పూర్తి రక్షణ కల్పిస్తోంది.

**ప్రాంతీయతత్వం :**

కులమత భాషా వివాదాలతో పాటు భారత అభివృద్ధిని భంగపరుస్తున్న మరొక అంశం ప్రాంతీయతత్వం. ప్రాంతీయ అభిమానం విపరీతంగా పెరిగినపుడు అది జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించడమే కాక వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తుంది.

మైనర్ సీనర్ ప్రాంతీయతత్వాన్ని "ఒక ప్రాంతంలో గుర్తింపు పొంది, తాము ఆ ప్రాంతానికి చెదినవారమని, చారిత్రకంగా, సాంస్కృతికంగా, సాంగికంగా ఇతరులు ఆ ప్రాంతానికి చెందనివారు అక్కడ ఎటువంటి ప్రయోజనాలు పొందరాదని చెపుతుంది" అని నిర్వహించాడు.

వెలింగ్‌సూన్ మరియు జాన్సన్ ప్రాంతీయ తత్వాన్ని క్రింది విధంగా చెప్పారు.

"కేంద్రీకరణ పేరుతో జరిగే అణచివేతకు వ్యతిరేకంగా ప్రాంతీయ ఉద్యమాలు ఆవిర్భవిస్తాయి".

భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం భాష ప్రాతిపదకై రాష్ట్రాలు ఏర్పడినప్పటికి కొత్త రాష్ట్రాలు కావాలనో లేక ఉన్న రాష్ట్రాల నుండి విడిపోతామనో అనేక ప్రాంతీయ ఉద్యమాలు జరిగాయి. కొన్ని సందర్భాలలో ప్రాంతీయ ఉద్యమాలు తీవ్రవాద ఉద్యమ రూపాలు తీసుకొని దేశమునుండి విడిపోయే ఉద్యమాలుగా కూడా రూపొందుతున్నాయి. ప్రాంతాల మధ్య ఆర్థిక అసమానతలు, విదేశీజోక్యం, కొన్ని ప్రాంతాలు అభివృద్ధిలో పూరితగా వెనుకబడి ఉండటం మొ॥గు కారణాలు ప్రాంతీయ తత్వానికి దారితీస్తున్నాయి. తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం, పంజాబ్ సమస్య, అస్సాం – ఉల్ఫా ఉద్యమం వంటివి పై కారణాల వలననే ఏర్పడ్డాయి. కనుక అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం వలన 'ప్రాంతీయతత్వం' ఏర్పడకుండా / సమసిపోయేలా చేయవచ్చు.

**ప్రాంతాలమధ్య ఆర్థిక అసమానతలు :**

భారతదేశంలో బ్రిటీష్‌వారి కాలం నుండి చారిత్రకంగా కొన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందగా మరికొన్ని ప్రాంతాలు వెనుకబడి ఉన్నాయి. బ్రిటీష్ పాలనా కాలంలో కోస్తా ప్రాంతాలైన బోంబాయి, మద్రాసు, కలకత్తా మొదలగు ప్రాంతాలు అభివృద్ధి చెందగా స్వదేశీ సంస్థలైన మధ్యప్రదేశ్, ఒరిస్సా మొదలగు రాష్ట్రాలు పూర్తిగా వెనుకబడ్డాయి. వెనుకబడిన రాష్ట్రాల్లో ప్రాంతీయ ఉద్యమాలు వస్తున్నాయి. స్వాతంత్ర్యానంతరం కూడా ఈ ప్రాంతాల ఆర్థిక అసమానతలు తొలగించడానికి, సంతులిత అభివృద్ధి సాధించడానికి తగినంత ప్రయత్నం జరుగలేదు. దీనివలన రాష్ట్రాలకూ, రాష్ట్రాలకూ మధ్య ఆర్థిక అసమానతలు ఒక రాష్ట్రంలోనే వివిధ ప్రాంతాల మధ్య ఆర్థిక అసమానతలు కొనసాగుతూ ప్రాంతియ ఉద్యమాలకు కారణమవుతున్నాయి.

**భూమి పుత్రుల సిద్ధాంతం :**

ఆర్థిక అసమానతల వలన ప్రాంతాలు అభివృద్ధి కాకపోవటంతో నిరుద్యోగం ప్రబలి విచ్చినకర సిద్ధాంతాలకు దారితీస్తున్నది. ఒక ప్రాంతం వారికి మరొక ప్రాంతంలో ఉద్యోగాలు ఇవ్వరాదని తప్పనిసరై వస్తే వారు ఆ ప్రాంతపు భాషను నేర్చుకోవాలనే సిద్ధాంతాలు ముందుకు వస్తున్నాయి. మహారాష్ట్రలో శివసేన ఆ విధమైన ప్రాతిపదక మీదే ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొడుతున్నది.

**భాషా సమస్య :**

జాతీయ సమైక్యతకు ఆటంకంగా నిలిచి దానిని విపరీతంగా బలపరచే శక్తులలో భాషోన్మాదం ఒకటి. భాషా ప్రాతిపదికపై రాష్ట్రాలు ఏర్పడినప్పటికి అది శాస్త్రీయంగా జరుగలేదు. దానితో ఒక భాష మాట్లాడే ప్రజలు ఇంకో భాష మాట్లాడే రాష్ట్రంలో ఉండిపోయారు. ఉదా : పంజాబ్‌ను ద్విభాషా రాష్ట్రంగా ఏర్పాటు చేయటంతో తిరిగి దానిని విభజించి హర్యానా ఏర్పాటు చేయవలసి వచ్చింది. మరాఠి భాష మాట్లాడే బెల్గాం జిల్లా కర్ణాటక రాష్ట్రంలో ఉండటంలో గత 25 సంవత్సరాలుగా ఆ ప్రాంతం గురించి కర్ణాటక, మహారాష్ట్రాల మధ్య వివాదం జరుగుతున్నది.

స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ రచనా ప్రక్రియ సమయంలో రాజ్యాంగ పరిషత్ హిందీని అధికార భాషగా నిర్ణయించింది. అందువల్ల రాజ్యాంగంలోని 343 నిబంధన ప్రకారం 1) దేవనాగరి లిపిలో హిందీని అధికార భాషగా గుర్తించారు. 2) ఆంగ్లభాష అధికార కార్యకలాపాల నిర్వహణ నిమిత్తం రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుండి 15 సంవత్సరాలు కొనసాగుతుంది. 3) పార్లమెంటు చట్టాల ద్వారా 15 సంవత్సరాల తర్వాత ప్రత్యేక కార్యక్రమాల విషయంలో ఆంగ్లభాష వాడకాన్ని నిర్ణయించవచ్చు.

పై విధంగా హిందీని అధికార భాషగా రాజ్యాంగం గుర్తించింది. అయితే రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 15 సంవత్సరాల వరకూ ఆంగ్లభాష కూడా అధికార భాషగా కొనసాగుతుందని ప్రారంభంలో నిర్ణయించారు.

అయితే హిందీని అధికార భాషగా అంగీకరించడానికి దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యంగా తమిళనాడు సిద్ధంగా లేదు. హిందీని కనుక అధికార భాషగా కొనసాగించి, ఆంగ్లభాషను తొలగించినట్లయితే హిందీ మాతృభాషగా లేనివారికి కేంద్ర ప్రభుత్వద్యోగాల్లో ప్రవేశ కష్టం అవుతుందని, అంతేగాక మాతృభాష ఏదైతే వారిలో ఇతరుల కంటే అధిక ప్రవేశం, సులువు ఉంటాయి. కాబట్టి రాజకీయంగా, పాలనాపరంగా తాము ఉత్తరాది వారితో పోలిస్తే వెనకబడతామని తమిళనాడులో డి.ఎమ్.కె. నాకత్వంలో కొంతకాలంపాటు హిందీతో పాటు ఆంగ్లభాషను అధికార భాషగా గుర్తించాలని సూచించింది. 1960లో అస్సామ్ విధానసభ హిందీ, ఆంగ్లభాషలను తిరస్కరించి అస్సామీ అధికార భాషగా గుర్తించి దానికి అనువైన శాసనాలను కూడా అమలు పరచింది. 1961లో అదేవిధంగా పశ్చిమ బెంగాల్ శాసనసభ ఆంగ్లభాషకు బదులు బెంగాలీ భాషను అధికార భాషగా గుర్తించింది. 1962లో పంజాబీ భాషలో ఉన్నత విద్యాబోధన నిమిత్తం పంజాబీ విశ్వవిద్యాలయాన్ని పాటియాలలో స్థాపించింది.

**1963 అధికార భాషా చట్టం :**

పై సంఘటనలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని 1963 అక్టోబర్‌లో పార్లమెంట్ అధికార భాషా బిల్లును ఆమోదించింది. అందులోని ప్రధానాంశాలు :

1. 1965 తర్వాత హిందీతో బాటు ఆంగ్లభాష కూడా అధికార కార్యనిర్వహణలో అధికార భాషగా కొనసాగుతుంది.
2. ఒక రాష్ట్ర ప్రభుత్వం హిందీకి బదుల ప్రాంతీయ భాషను అధికార భాషగా గుర్తిస్తే, హిందీ, ఆంగ్ల, అనువాదాలను కూడా ప్రచురించాలి.
3. రాష్ట్రపతి అనుమతిని పొంది ఒక రాష్ట్రం 1965 తర్వాత హిందీని అధికార భాషగా గుర్తించవచ్చు. అయితే

ఆంగ్ల అనువాదాన్ని కూడా ప్రచురించాలి.

పార్లమెంట్ ఆమోదించిన పై చట్టానికి నిరసనగా హిందీ యేతర రాష్ట్రాల్లో ముఖ్యంగా తమిళనాడులో నిరసన ఉద్యమాలు ఏర్పడ్డాయి. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని 1967లో రాజ్యాంగ సవరణ చేసి అధికార భాషా చట్టంలో మార్పులు తెచ్చి హిందీతో పాటు ఆంగ్ల భాషను కూడా ప్రత్యామ్నాయంగా పార్లమెంట్ కార్యకలాపాల్లో కేంద్రప్రభుత్వ వ్యవహారాల్లో వాడటం జరుగుతుంది.

ఈ విధంగా భాషా రాజకీయాల్లో చోటుచేసుకుంది. అధికార భాష ఏదైనప్పటికీ జాతీయ సమైక్యతా దృష్ట్యా రాజకీయ పక్షాలు నిగ్రహాన్ని ప్రదర్శించాలి.

## జాతీయ సమైక్యత సాధించే మార్గాలు

1. రాజకీయ పక్షాలు కుల, మత, భాషా వర్గాల్లోని భిన్నత్వాలను రెచ్చగొట్టే చర్యలకు పూనుకోకూడదు. తను పాక్షిక ప్రయోజనాల కోసం జాతి విచ్ఛిన్నకర శక్తులను ప్రోత్సహించరాదు. అతి సున్నితమైన మతం, భాష, కులం మొదలైన అంశాల పట్ల, అన్ని రాజకీయ పక్షాలు ఒక అవగాహన వచ్చి, వాటిని రాజకీయాలకు అతీతంగా ఉంచడానికి సాధ్యమైనంత మేరకు విజ్ఞతతో, దూరదృష్టితో ప్రయత్నించాలి.
2. ప్రజల శాంతిభద్రతలకు హానికల్గించే కార్యక్రమాలు, ఆందోళనలు, ఉద్యమాలు ప్రారంభించి తమ భాషా, ప్రాంతీయ మత సమస్యలకు పరిష్కారానికి వెదకడాన్ని ప్రయత్నించరాదు.
3. కొన్ని రాజకీయ పక్షాల సభలు, సమావేశాలు, ఊరేగింపులు మొదలైనవి ఇతర రాజకీయ పక్షాలు భంగం చేయరాదు. ప్రజాస్వామ్యంలో అన్ని రకాల సిద్ధాంతాలకు, ఆలోచనలకు సమానంగా అవకాశం ఉండాలి.
4. దేశంలో శాంతి భద్రతల పేరిట ప్రభుత్వం ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై ఆంక్షలను తరచూ విధించరాదు. రాజకీయ పక్షాల సాధారణ కార్యక్రమాలకు కూడా అడ్డంకులను సృష్టించడానికి ప్రయత్నించరాదు.
5. పార్టీ ప్రయోజనాలకు రాజకీయాధికారం వినియోగించరాదు. జాతి సమైక్యత సంఘం దేశంలో ఒక విద్యావిధానాన్ని అమలుపరచి, విద్యను ఉమ్మడి జాబితాలో చేర్చాలని సూచించింది. ఈ సూచనతో పాటు కేంద్రస్థాయిలో ఒక జాతి సమైక్యత సంఘమండలిని ఏర్పాటు చేయడం జరిగింది. దానిని సమర్థవంతంగా పని చేయించాలి.
6. ప్రాంతాల మధ్య ఆర్థిక అసమానతలను తొలగించడానికి అనువుగా ప్రణాళికా విధానాన్ని రూపొందించాలి. అసమానతలు తొలగిపోతే ప్రాంతీయతత్వం కూడా తగ్గిపోతుంది. దానికి అనుగుణంగా కేంద్రప్రభుత్వం తగిన పథకాలను రూపొందించి అవసరమైన నిధులను కేటాయించాలి.
7. రిజర్వేషన్ విధానంపై ఏకాభిప్రాయం ఏర్పరచుకోవటం చాలా అవసరం. రిజర్వేషన్ సౌకర్యం అనేక కులాలకు వెనుకబడ్డ తరగతుల పేరిట కల్పించడం వల్ల పాత కులాల స్థానంలో కొత్త కులాలు, కొత్త ఆధిక్యత వర్గాలు అవతరించి రాష్ట్ర రాజకీయాలు కులాల కురుక్షేత్రంగా మారిపోయే ప్రమాదం ఉంది. మత సామరస్యం కంటే కుల సామరస్యం అవసరం.

   షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు "రిజర్వేషన్" ప్రయోజనాలను రాజ్యాంగమే కల్పించింది. అయన వెనుకబడ్డ తరగతుల వారిని నిర్ణయించి వారికి రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించటానికి కేంద్రం ముందుకురాక దాన్ని రాష్ట్రాలకే వదలివేసింది. అందువల్ల అనేక రాష్ట్రాలు ఓట్లు మద్దతు కోసం విచక్షణా రహితంగా రిజర్వేషన్ సౌకర్యాలు వెనుకబడ్డ వర్గాల పేరిట అనేక కులాలకు విస్తరింపజేయటంతో అనేక ఆందోళనలు ఏర్పడుతున్నాయి. ఇవి జాతి సమైక్యతకు హానికరం. అందువల్ల రిజర్వేషన్ విధానంపై ఏకాభిప్రాయం

సాధించటమే కాకుండా అతి సున్నితమైన ఈ విధానం నిర్ణయించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి అప్పగించాలి. అపుడు జాతీయస్థాయిలో ఒక విధానం రూపొంది దేశమంతటా అమలు అవుతుంది.

8. భాషా సమస్యను కూడా వెనువెంటనే పరిష్కరించాలి. భారతదేశంలోనే వివిధ భాషాపరమైన అల్పసంఖ్యాక వర్గాల వారి సమస్యలను రాజ్యాంగ పరంగా పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ప్రయత్నించాలి.

9. సమైక్యతకు ప్రభుత్వం నిజానికి చేయాల్సిన ప్రయత్నాలు సరిగ్గా జరగడం లేదనే చెప్పవచ్చు. అంతేగాకుండా ఇటీవలికాలంలో ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవటానికి ప్రభుత్వం, ఇతర రాజకీయ పక్షాలతో ఒక అవగాహనకు వచ్చి దానికి అనుగుణంగా సరైన చర్యలను తీసుకోవడం ద్వారా జాతీయ సమైక్యత కొంతవరకు నిలబడటానికి దోహదమైంది.

10. చివరగా అల్పసంఖ్యాక వర్గాల వారికి రాజ్యాంగం కల్పించిన హామీని అమలు పరచాలి. వారిలో అభద్రతా భావాన్ని పోగొట్టాలి. అంతేగాకుండా వారిని జాతీయ స్రవంతిలో విలీనం చేయడానికి అనుకూలమైన రాజకీయ – సాంఘిక – ఆర్థిక వాతావరణాన్ని కల్పించాలి.

11. జాతీయ సమైక్యత ఒక్క భారతదేశానికే సమస్య కాదు. నిజానికి మూడో ప్రపంచదేశాలన్నీ దీన్ని ఎదుర్కొంటున్నాయి. భారత రాజకీయాలు, ప్రజల్లో పెరుగుతున్న ఆశలు అవి ఫలించనపుడు ఎదుగుతున్న నిరాశలు సహజంగానే మత దృష్టి స్థానంలో హ్రస్వదృష్టిని కల్గిస్తాయి. వీటిని అధిగమించడానికి జాతికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. అందువలన మనం నిరాశ చెందాల్సిన అవసరం లేదు.

12. విద్యార్థులకు పాఠశాల దశ నుండే జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించాలి.

## 4. సమాజ వ్యతిరేక కార్యకలాపాలు

సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక ప్రగతిని సాధించడంలో, ఉత్తమమైన ప్రజాస్వామ్య విలువలతో ఆదర్శ రాజ్యంగా రూపొందడంలో వ్యక్తులు, చట్టాలు ప్రముఖ స్థానం ఆక్రమిస్తాయి.

సాంఘిక, ఆర్థిక పురోగతి పథంలో స్వార్థపరులు, సంఘ వ్యతిరేక శక్తులు, దొంగ రవాణాదారులు, అవినీతిపరులు, లంచగొండులు, తీవ్రవాదులు, విదేశీ శక్తులు, వారికి మద్దతునిచ్చే దేశద్రోహులు, కాలులోని ముల్లులాగా ఆటంకాలు సృష్టిస్తున్నారు. ప్రజాజీవనానికి, స్వేచ్ఛకు భంగం కలిగించే సమాజ వ్యతిరేక కార్యకలాపాలు నేడు దేశంలో వికృత చేష్టలతో వికటట్టహాసం చేస్తూ ప్రభుత్వానికి ప్రజలకు సవాలుగా మారాయి.

ఇవి సమాజానికి విశేషమైన, తీవ్రమైన ద్రోహం చేస్తున్నాయి. వీటిని నిరోధించడం, వ్యతిరేకించడం, నివారించడంలో ప్రజలు, ప్రభుత్వం చిత్తశుద్ధితో, పరస్పర అవగాహన, పరస్పర సహకారాలతో బాధ్యతలను నిర్వర్తించాలి. సంఘ వ్యతిరేక శక్తులు ప్రజాజీవితంలో జోక్యం కల్పించుకోకుండా వారిని శాశ్వతంగా నిరోధించాలి. బహిష్కరించాలి. అపుడే శాంతమయ సామాజిక జీవనం సాధ్యపడుతుంది. గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్యం సిద్ధిస్తుంది.

రహస్యవ్యాపారం, అక్రమ లాభార్జన, మాదక ద్రవ్యాల ఉత్పత్తి రవాణా, వినియోగాల నియంత్రణ, లంచగొండితనం, రాజకీయ, సామాజిక రంగంలో నేరప్రవృత్తి మొదలైన వాటిపై ప్రభుత్వం, ప్రజలు సమగ్ర అవగాహనతో నిరంతరం కృషి చేయాలి.

## 5. స్త్రీల పట్ల వివక్షణ

సామాజిక జీవనంలో స్త్రీ, పురుషులు సమాన భాగస్వాములే. ప్రాచీన నాగరికత నుంచి అనేక రంగాల్లో స్త్రీ, పురుషులు సామాజిక బాధ్యతతో మెలగి, సమాజ ఔన్నత్యానికి కృషి చేసినట్లుగా ఆధారాలున్నాయి.

స్త్రీకి సహజ సిద్ధంగా ఉన్న శారీరక బలహీనతను ఆధారంగా తీసుకొని, పురుషుడు తానే అధికుడినన్న భావనతో స్త్రీ స్వేచ్ఛకు అనేక ఆటంకాలు కల్పిస్తూ, స్త్రీని కేవలం ఒక విలాస వస్తువుగానే భావించి, వంట ఇంటి కుందేలుగా, తనకు బానిసగా మార్చుకోవడం జరిగింది. స్త్రీలు భావ ప్రకటన, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కోల్పోయి నేడు సంక్లిష్ట పరిస్థితులలో సతమతమవుతూ కూడా సామాజిక ప్రగతికి నిస్వార్థంగా తమవంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూన్నా వారిని పీడిస్తున్న కొన్ని సమస్యలు నేటికీ ఉన్నాయి.

దేశం అభివృద్ధి చెందాలంటే సమాజంలో సగభాగమైన స్త్రీలను శక్తివంతులుగా చేయాలి. వారికి అన్ని రంగాలలో తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకోవడానికి అవకాశం కల్పించాలి. ఎక్కడ స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు ఆనందిస్తారు అనేది ఆర్యోక్తి.

స్త్రీల సంక్షేమంతో పాటుగా తగిన శక్తియుక్తులతో ముందుకు వెళ్ళడంతో వారికి తగిన అవకాశాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వం మీద, సమాజం మీద ఉంది. విద్యలో, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కల్పనకే పరిమితం కాకుండా చట్ట సభల్లో కూడా రిజర్వేషన్లు కల్పించే మహిళా చట్టం ఆమోదింపజేయాలి.

ఈనాడు స్త్రీలు వారికి అందుబాటులో ఉన్న అవకాశాలు ఉపయోగించుకుని అనేక రంగాలలో పురుషులతో పాటు ముందంజ వేస్తున్నారు. దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో వారిపాత్ర కడు ఆవశ్యకం. ఆహ్వానించదగినది. వారి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు భంగం కల్గించడం సమాజ శ్రేయస్సుకు గొడ్డలిపెట్టు లాంటిది.

## 6. కాశ్మీర్ సమస్య

1947కు ముందు అధికార మార్పిడి సమయంలో రాచరిక సంస్థానాలకు సంబంధించి ప్రభుత్వానికి కొన్ని సమస్య లెదురయ్యాయి. ఇలాంటి సంస్థానాలు మన దేశంలో 562 వున్నాయి. వీటిలో కొన్ని చిన్నవయితే మరికొన్ని పెద్దవి.

ఉక్కు మనిషిగా పేరుపొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ విపరీతమైన ధైర్య సాహసాలను ప్రదర్శించే రాచరిక సంస్థాలన్నింటిని భారత్ రిపబ్లిక్‌లోకి విలీనం చేసారు. 1947 ఆగస్ట్ 15 నాటికి జనాఘడ్, హైదరాబాద్, జమ్ము కాశ్మీర్‌లను మినహాయిస్తే మిగతా రాచరిక సంస్థానాలన్నీ భారత్‌లో కలసిపోయాయి. బాగా ఒత్తిడిని తీసుకురావడం ద్వారా ఈ మూడింటిని కూడా భారత యూనియన్‌లో సమ్మీనం చేసారు. ఇవి సమ్మీనం చెంది 70 సంవత్సరాలు అవుతున్నప్పటికినీ కాశ్మీర్ సంక్షోభం ఆరని మంటలా ఇంకా రగులుతూనే ఉంది.

1949 జనవరి 1వ తేదీన భారత్ పాకిస్తాన్‌ల మధ్య "పరస్పర కాల్పుల విరమణ ఒప్పందం" జరగడంతో తాత్కాలికంగా ఇరుదేశాల మధ్య రగులుతున్న అసంతృప్తులకు తెరపడినట్లయింది. 156లో జమ్ము-కాశ్మీర్ నూతన రాజ్యాంగం సర్వసన్నద్ధమయింది. ఇండియన్ యూనియన్‌లో జమ్ము-కాశ్మీర్ ఒక భాగంగా చట్టబద్ధంగా గుర్తింపు పొందింది.

భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా జమ్ము-కాశ్మీర్ ప్రజలను రెచ్చగొట్టడమే ఏకైక లక్ష్యంగా పెట్టుకుని పాకిస్తాన్ సైనిక దళాలు 1965 ఆగస్ట్ నెలలో కాశ్మీర్‌లోకి చొచ్చుకొని రావటంతో ఇండియా - పాకిస్తాన్‌ల మధ్య

యుద్ధం సంభవించింది. అప్పటి సోవియట్ యూనియన్ ప్రధాని కొసెగిన్ చేపట్టిన చొరవ వల్ల భారత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మరియు పాకిస్తాన్ అధ్యక్షుడు ఆయుబ్‌ఖాన్‌ల మధ్య 1966లో తాష్కెంట్‌లో సమావేశం జరిగింది. శాంతి స్నేహ సంబంధాల అభివృద్ధి ఒప్పందంపై ఇరు దేశాల నాయకులు సంతకాలు చేశారు. అయితే కాశ్మీరీ సమస్య ఇరు దేశాల మధ్య మరో యుద్ధానికి కారణమైంది. భారత, పాకిస్తాన్‌ల మధ్య 1971లో తిరిగి యుద్ధం జరిగింది. అదే చివరకు స్వతంత్ర బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారి తీసింది. బంగ్లాదేశ్ ఏర్పడిన సందర్భంలోనే భారత్ పాకిస్తాన్‌ల మధ్య 1972 జులైలో సిమ్లాలో ఒక ఒప్పందం కుదిరింది. శాంతియుత వాతావరణంలో ద్వైపాక్షిక చర్చల ద్వారా ఇరు దేశాల మధ్యన వున్న సమస్యలను పరిష్కరించుకోవాలని సిమ్లా ఒప్పందంలో పేర్కొనడం జరిగింది.

అయినా పాకిస్తాన్ కాశ్మీర్ సమస్యను ఎత్తడం మానలేదు. సమయం చూసుకొని తీవ్రవాదులను అక్కడకు తరలించడం ద్వారా సమస్యకు నేటికీ మరింత ఆజ్యం పోస్తూనే ఉంది.

ఈమధ్య కాలంలో కాశ్మీరీ యువతకు అక్రమ నిధులు సమకూరుస్తూ భారతసైన్యంపై, కాశ్మీరీ పోలీసులపై రాళ్ళు వేయడానికి పాకిస్తాన్ ప్రేరేపిస్తున్నది. యూరిలో పాకిస్తాన్ ఉగ్రవాదులు 18 మంది భారతీయ సైనికులను చంపిన తరువాత భారతదేశం పాకిస్తాన్‌కి గట్టి గుణపాఠం చెప్పాలని నిర్ణయించింది. పాకిస్తాన్‌పై సర్జికల్ దాడులు జరిపి ఉగ్రవాద శిబిరాలపై దాడి జరిపి పాకిస్తాన్ గడ్డపై ఉగ్రవాదులను మట్టుపెట్టింది. పాకిస్తాన్‌కు జీవనాధారమైన సింధూనదీ ఒప్పందాన్ని సమీక్షిస్తామనే సంకేతాన్ని పంపింది. సింధూనదీ జలాలను మనం బిగించినట్లయితే పాకిస్తాన్ ఎడారిగా మారుతుంది. పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడానికి కావలసిన అన్ని మార్గాలను భారతదేశం అన్వేషించాలి. ఉగ్రవాద శిబిరాలను మూసివేసే వరకు పాకిస్తాన్‌తో ఏవిధమైన చర్యలు జరిపేది లేదని; ఆ చర్చల వల్ల ప్రయోజనం లేదని భారతదేశం తెగేసి చెప్పింది. ఇంత దృఢమైన నిర్ణయాలు తీసుకోవడం స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఇదే మొదటిసారి. ఈ ధృఢ వైఖరి కొనసాగించడం ఎంతైనా అవసరం. పాకిస్తాన్‌కు అర్ధమయ్యే భాష ఇదే. దీనితో పాటు పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్, సింధ్ ప్రాంతాలలో పాకిస్తాన్ సైన్యం జరుపుతున్న మారణహోమాన్ని, మానవ హక్కుల ఉల్లంఘనను ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్యసమితి దృష్టికి తీసుకొచ్చింది.

## అంతరిక్ష రంగంలో అద్భుత విజయాలు

- 1980లో ప్రారంభమైన మన అంతరిక్ష విజయయాత్ర నిరాఘాటంగా కొనసాగుతున్నది.
- అనేక అవసరాల కోసం మనం ఉపగ్రహాలను ఉపయోగించుకొంటున్నాము. (సమాచార ప్రసార రంగాల కోసం, విద్య, వాతావరణం, రక్షణరంగం తదితరములకు)
- ప్రపంచంలో అతిచౌకగా ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రవేశపెడుతున్నదేశం.
- చంద్రయాన్ ద్వారా వాహననౌకను చంద్రునిపైకి పంపగలిగినాము. ప్రపంచంలో అతి తక్కువ ఖర్చుతో పంపగలిగినాము.
- ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపగలిగినాము. (పి.ఎస్.ఎల్.వి.–సి37 ఫిబ్రవరి 15, 2017) ఒకేసారి ఇన్ని ఉపగ్రహాలను పంపిన మొట్టమొదటి దేశం. ఇంతకుముందు కేవలం రష్యా ఒకేసారి 3 ఉపగ్రహాలను పంపగలిగింది.
- చాలా దేశాల ఉపగ్రహాలను మన ఇస్రో ద్వారా అంతరిక్షంలోనికి పంపి విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదిస్తున్నాము.

## రక్షణ రంగంలో గొప్ప ప్రగతి

- భారత రక్షణ పరిశోధన సంస్థ డిఆర్‌డిఓ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) ప్రపంచంలోనే క్షిపణులను తయారుచేసే మొదటి 4 దేశాలలో మనదేశం ఒకటి.
- రక్షణ అవసరాల కోసం స్వయం సంమృద్ధి దిశగా భారతదేశం ముందుకు వెళుతున్నది.
- డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్ కృషి ఎంతో అభినందనీయం.

## స్వతంత్ర భారతదేశం సాధించిన కొన్ని గొప్ప అంశాలు

- షుమారు 125 కోట్ల జనాభా గల భారతదేశం నుండి పోలియోను తరిమికొట్టగలిగాము.
- సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రపంచంలో గొప్ప స్థానాన్ని పొందగలిగాము.
- ఆహారధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించగలిగాము.
- మహిళల భాగస్వామ్యం అన్ని రంగాలలో పెరుగుతూ ఉన్నది.
- రాజ్యాంగ అమలు చేసిన మొదటి రోజునే వయోజన ఓటు హక్కును ఇచ్చిన మొదటి దేశం. అదే అమెరికాలో స్వతంత్రం వచ్చిన 150 సంవత్సరముల తరువాత అందరికీ ఓటు హక్కు ఇవ్వబడింది.
- స్వతంత్రం రాగానే దేశంలోని 560 స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి, దేశంయొక్క అఖండతను, సమైక్యతను నిలుపుకోగలిగినాము. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషి చిరస్మరణీయము.
- 29 భాషలు, 1650 మాండలికాలు, ఎన్నో మతాలు, వేషాలు, ఆహార పద్ధతులు ఉన్నప్పటికీ సమ సమైక్యతను కొనసాగించ గలుగుతున్నారు.
- ప్రపంచంలో అత్యధిక ప్రజా ప్రతినిధులు ఎన్నుకోబడుతున్న అతిపెద్ద వ్యవస్థ మన పంచాయితీ రాజ్‌వ్యవస్థ.
- అతితక్కువ ఖర్చుతో అణువిద్యుచ్ఛక్తిని ఉత్తత్తి చేసే దేశం.
- న్యూక్లియర్ సబ్ మెరైన్‌లు గల మొదటి ఐదు దేశాలలో ఒకటి.
- మానవరహిత వాహనాన్ని చంద్రునిపైకి పంపిన ఐదు దేశాలలో ఒకటి.
- అతితక్కువ ఖర్చుతో సూపర్ కంప్యూటర్‌ను ఉత్పత్తి చేసిన దేశం.
- ప్రపంచంలో అతిపెద్ద ద్విచక్రవాహన ఉత్పత్తిదారు.
- ప్రపంచంలో అతిపెద్ద పాల ఉత్పత్తిదారు.
- రెండవ అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు.
- అతి ఎక్కువ పోస్టాఫీసులు గల దేశం (1.5 లక్షలు)
- అతిఎక్కువ బ్యాంక్ ఎకౌంట్‌లు గల దేశం.
- మూడవ అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్
- అమెరికాలో 3800 డాక్టర్‌లు భారతీయులే. 124 మంది శాస్త్రవేత్తలే, 2800 ఐబిఎమ్ ఉద్యోగులు భారతీయులే. 36 శాతం నాసా (అమెరికా అంతరిక్ష కేంద్రం) ఉద్యోగస్థులు భారతీయులే. 17 శాతం ఇంటెల్ ఉద్యోగస్థులు, 34 శాతం మైక్రోసాఫ్ట్ ఉద్యోగస్థులు భారతీయులే.
- అతిపెద్ద ప్రజాస్వామ్యం, సమర్ధవంతమైన ఎన్నికల విధానం.

## 3.6. బోధన వనరులు – వినియోగంలో ఉపాధ్యాయుల పాత్ర

3.6.1. బోధనా వనరులు :

తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియలు సమర్థవంతంగా నిర్వహించడానికి వనరులు దోహదపడతాయి. పిల్లలకు అదనపు సమాచారం అందించడానికి, ఒక విషయం అర్థం చేయించడానికి, పిల్లలు సామగ్రితో ప్రతిచర్యలు జరపడానికి, బోధనను ఆకర్షణీయంగా చేయడానికి, పిల్లలు అదనపు సమాచారం సేకరించడానికి, పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందించడానికి, ఒక విషయం గురించి తెలుసుకొనడానికి, ప్రశ్నించడానికి వనరులు తోడ్పడుతాయి. ఉపాధ్యాయులు ఈ క్రింది వనరులను తప్పక సమకూర్చుకోవాల్సి ఉంటుంది.

**సాంఘికశాస్త్రం – బోధనకు అవసరమైన వనరులు :**

| | |
|---|---|
| 1. రిఫరెన్స్ పుస్తకాలు | – ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరాల భూగోళం, చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం |
| | – డిగ్రీ తెలుగు అకాడమీ భూగోళశాస్త్రం |
| | – యోజన |
| | – ఇండియాటుడే |
| | – CBSE Books (NCERT) |
| | – ICSE Books |
| | – ఏకలవ్య ప్రచురణలు |
| | – దినపత్రికలు |
| | – దినపత్రికలలోని ఆర్టికల్స్ |
| 2. సోషల్ స్టడీస్ ఫోరాలు/క్లబ్‌లు | – సోషల్ స్టడీస్ ఫోరం / క్లబ్‌లు |
| | – ఉపాధ్యాయ సంఘాలు |
| 3. వనరుల కేంద్రాలు | – SCERT, Hyd |
| | – DIET |
| | – జిల్లా గ్రంథాలయాలు |
| | – పాఠశాల గ్రంథాలయాలు |
| 4. మానవ వనరులు | – బ్యాంక్ సిబ్బంది |
| | – అడ్వకేట్స్ |
| | – పోలీస్ సిబ్బంది |
| | – ప్రజా ప్రతినిధులు |
| | – MRO, MPDO, MEO మొ|| |
| 5. మీడియా | – టెలికాన్ఫరెన్స్‌లు |
| | – Subject వారి C.D. లు |
| | – MANA TV |
| | – సప్తగిరి ఛానల్ |
| 6. వెబ్‌సైట్స్ | – www.weekly.com |
| | – www.aravindaguptatoys.com |

– www.pbs.org/teachers

– www.new/teaching strategies

**తరగతి వారీగా సమకూర్చుకోవలసిన బోధనా సామగ్రి :**

8వ తరగతి కావలసిన బోధనా సామగ్రి

1. ప్రపంచపటం (భౌతిక, రాజకీయ)
2. గ్లోబు
3. అట్లాసు
4. చార్టులు
5. భారతదేశపటం (రాజకీయ, భౌతిక)
6. 2011 జనాభా వివరాలు
7. ఆంధ్రప్రదేశ్ (భౌతిక, రాజకీయ) పటం
8. ఉష్ణమాపకం
9. భూచలనాలు (వీడియో సిడి)
   (ఎ) భూభ్రమణం (బి) భూపరిభ్రమణం
10. అందుబాటులో ఉండే కొన్ని ముడి ఖనిజాలు
11. వివిధ రకాల మట్టి నమూనాలు
12. కరెన్సీ – కాయిన్స్ – నోట్స్ పాతవి/కొత్తవి (అందుబాటును బట్టి)
13. బ్యాంకు లావాదేవీల స్టేషనరీ
    (ఎ) చెక్కు, (బి) డ్రాఫ్టు, (సి) నగదు జమ ఫారం, (డి) నగదు తీసుకునే ఫారం
    (ఇ) పాసుపుస్తకం, (ఎఫ్) ఎటిఎమ్ కార్డు ప్రారంభానికి అప్లికేషన్ ఫారం మొ॥వి.
14. జాతీయ నాయకుల చిత్రాలు
15. భారతరాజ్యాంగం ప్రతి
16. జాతీయ చిహ్నాలు
17. పార్లమెంటు చిత్రం
18. రాష్ట్రపతి భవన్ చిత్రం
19. ఎఫ్.ఐ.ఆర్. ఫారం నమూనా
20. బి.ఎమ్.ఐ. ఛార్ట్
21. విద్యాహక్కు చట్టం ప్రతి
22. సమాచార హక్కు చట్టం ప్రతి
23. వివిధ సంగీత వాయిద్య పరికరాలు
24. వివిధ నాట్యరూపాల వీడియోలు, చిత్రాలు
25. వివిధ క్రీడోపకరణములు
26. దినపత్రికల నుండి సేకరించిన విపత్తులకు సంబంధించిన చిత్రాలు

**క్షేత్ర పర్యటన :**

1. బొగ్గు గనులు
2. అడవులు
3. బ్యాంకు
4. ఎటిఎమ్ సెంటర్లు
5. ఆసుపత్రి
6. పరిశ్రమ
7. పోలీస్ స్టేషన్
8. న్యాయస్థానం
9. చౌకధరల దుకాణం
10. సినిమాహాలు సందర్శన
11. ప్రింటింగ్ ప్రెస్

**9వ తరగతికి కావలసిన బోధనా సామగ్రి :**

1. అంతరిక్షం వీడియో
2. ప్రపంచ పటం
3. అట్లాసు
4. వివిధ రకాల శిలలు
5. చార్టులు
6. గ్లోబు

7. భారతదేశపటం
8. చిరుధాన్యాలు
9. స్థిర, చర ఆస్తులను చూపే చార్టు
10. యూరప్ పటం
11. ఆఫ్రికా పటం
12. ట్రాఫిక్ గుర్తులు
13. డ్రైవింగ్ లైసెన్స్ వివిధ ఫారములు

**సందర్శన చేయదగినవి :**

1. నక్షత్రశాల
2. బీచ్‌లు (అవకాశమున్నవారు)
3. పరిశ్రమ (ఏదేని)
4. అటవీశాఖ కార్యాలయంః
5. స్వయం సహాయక సంఘాలతో మాట్లాడించటం
6. ఆదాయ పన్నుశాఖ కార్యాలయం

పైన సూచించిన వనరులతో పాటు విద్యకోసం కృషి చేసిన సంస్థలు, పరామర్శ గ్రంథాలు, ఉపయుక్తమైన వెబ్‌సైట్స్, చలనచిత్రాలు ఇవ్వడం జరిగింది. వీటిని చదవడం, చూడడం ద్వారా తరగతిగదిలో మరింత సమర్ధవంతంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించవచ్చు.

బోధన వనరుల గురించి మరింత వివరంగా తదుపరి అధ్యాయంలో తెలుసుకుంటారు.

# అధ్యాయం - 3

**అధ్యాయంలోని అంశాలు**

3.1 సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ఇమిడివున్న తాత్వికత, మార్గదర్శక సూత్రాలు

3.2 సాంఘికశాస్త్ర బోధనాలక్ష్యాలు

3.3 విద్యాప్రమాణాలు - అభ్యసన సూచికలు

3.4 సాంఘికశాస్త్ర బోధనా ఉపగమాలు - పద్ధతులు

3.5 సాంఘికశాస్త్ర బోధనావనరులు - వినియోగంలో ఉపాధ్యాయుని పాత్ర

**లక్ష్యాలు :-**

1. ఛాత్రోపాధ్యాయులు సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ఇమిడి వున్న తాత్వికత మరియు మార్గదర్శకత సూత్రాలను తెలుసుకుంటాడు.
2. సాంఘికశాస్త్ర బోధనా విస్తృత లక్ష్యాలను అవగాహన చేసుకుంటాడు.
3. సాంఘికశాస్త్ర బోధన ద్వారా సాధించాల్సిన విద్యా ప్రమాణాలను, అభ్యసన సూచికలను తెలుసుకొని తరగతిగదిలో అన్వయిస్తారు.
4. సాంఘిక శాస్త్రం బోధనలో ఉపయోగించాల్సిన వివిధ ఉపగమాలు - పద్ధతులను అవగాహన చేసుకొని, తరగతిగదిలో బోధించాల్సిన విషయాలకనుగుణంగా బోధనా పద్ధతులను ఎంపిక చేసుకుంటాడు.
5. సమర్ధవంతమైన బోధనకు కావలసిన వనరులను గుర్తించి తరగతిగదిలో వినియోగిస్తారు.

**పరిచయము :-**

3.1 సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ఇమిడివున్న తాత్వికత, మార్గదర్శక సూత్రాలు:

చాలాకాలంగా సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాలను రూపొందించడంలో విశేషంగా కృషి జరుగుతున్నది. పాఠ్యవిషయాలను ఉపాధ్యాయులు తరగతి గదులలో సమర్ధవంతంగా బోధిస్తున్నారు. అయితే ఈ పాఠ్యపుస్తకాల ద్వారా సామాజిక అంతరాలు తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ ఆ ప్రయత్నాలు నెరవేరడం లేదు. ఇంకా సమాజంలో కుల, మత, లింగ వివక్షతలు కొనసాగుతూనే ఉండడాన్ని గమనించవచ్చు.

1993 యశ్‌పాల్ కమిటీ నివేదిక పాఠ్యపుస్తకాలను వివరణాత్మక సమాచారంతో నింపడానికి బదులుగా సామాజిక - రాజకీయ సత్యాలను విశ్లేషించడంలో పిల్లల సామర్థ్యాలను పెంపొందిచడానికి కృషి చేయాలని పేర్కొన్నది. ఈ కమిటీ పౌరశాస్త్ర బోధనలో విప్లవాత్మక మార్పులు రావాలని సూచించింది. సాంప్రదాయకంగా వస్తున్న క్లిష్టమైన పాఠ్యాంశాల స్థానంలో సరళంగా, సులభంగా అర్థమయ్యే రీతిలో ఉండే విషయాలు ఉండడం అవసరమని పేర్కొన్నది. జాతీయ విద్యా ప్రణాళిక చట్రం 2005 సాంఘికశాస్త్ర విద్యా ప్రణాళికలో తీసుకురావలసిన కీలక మార్పుల గురించి చర్చించింది. సమానత్వం, సామాజిక న్యాయం, వ్యక్తి గౌరవం మొదలైన అంశాలను లింగ వివక్షత లేకుండా

పాఠ్యప్రణాళికలో పొందు పరచాలని సూచించింది.

**సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాల రూపకల్పన – నేపథ్యం, తాత్వికత:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాపరిశోధనా శిక్షణా సంస్థ కూడా ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సాంఘికశాస్త్రాల బోధన, ప్రణాళికలో విప్లవాత్మక మార్పులు అవసరమని పేర్కొంది. సాంఘికశాస్త్రం అనగానే అది అంత ప్రాధాన్యత లేని పాఠ్య విషయమని, అనాసక్తికరంగా ఉంటుందని, ఉపాధి అవకాశాలు లేవనే అభిప్రాయం సమాజంలో బలంగా నాటుకుని ఉంది. పిల్లల అవసరాలు, ఆసక్తులు, సామర్థ్యాలను సాంఘికశాస్త్రాల విద్యాప్రణాళిక ఏమాత్రం ప్రతిబింబించడం లేదు. దీనిలో వివరించే విషయాంశాలు ఏవీ పిల్లల స్థానిక అంశాలకు సంబంధించినవి కానీ, వారి వారి సామాజిక అనుభవాలను, అవసరాలను ప్రతిబింబించేవిగా గానీ లేకపోవడం వల్ల పిల్లలకు అనాసక్తిని కల్గిస్తున్నాయి. ఇవి నిరాసక్తతతోపాటు స్తబ్ధతకు దారితీస్తున్నది.

పాఠశాల ఉపాధ్యాయులు సాంఘికశాస్త్రానికి కేటాయించిన పీరియడ్లు, మార్కుల దృష్ట్యా సాధారణంగా ఒకే సబ్జక్టుగా పరిగణిస్తున్నారు. వారు దీనిని ఎన్నోమార్లు మళ్ళీమళ్ళీ ప్రస్తావించారు. ఐతే సిలబస్ రూపకర్తలు వివిధ సబ్జక్టులయొక్క డిమాండు, అవసరాలను దృష్టిలో పెట్టుకొని సాంఘికశాస్త్రాన్ని మూడు లేదా నాలుగు సబ్జక్టులుగా చూస్తున్నారు. ఇది పాఠ్యపుస్తక రచయితలపై తీవ్రమైన ఒత్తిడిని చూపుతున్నది. దీనివల్ల పాఠ్యపుస్తక రచయితలు పాఠాలలో సంక్షిప్త లేదా ముఖ్యమైన సమాచారాన్ని నింపుతున్నారు. దీనివల్ల విషయావగాహన జరగడానికి, భావనలు రూపుదిద్దుకోవడానికి, విశ్లేషణాత్మకంగా ఆలోచించడానికి అవకాశం లేకుండా పోయింది. ఇది పిల్లల్లో సందిగ్ధతకు కారణమవుతున్నది. దీనివల్ల పిల్లలు సబ్జక్టునుండి దూరమౌతున్నారు. విద్యా ప్రణాళికలో ఎక్కువ పాఠాలు మరియు విపరీతంగా విషయాన్ని చొప్పించడం ద్వారా పిల్లలపై కలుగుతున్న ఒత్తిడిని తగ్గించడం అవసరం. సాంఘికశాస్త్రాలలోని నాలుగు విభాగాలను సమన్వయపరచి ఉమ్మడి ప్రణాళికను రూపొందించడం అవసరం జరిగినది.

బోధనాంశాలకోసం పాఠ్యపుస్తకాన్నే ఏకైక వనరుగా భావిస్తున్నారు. ఈ పాఠ్యపుస్తకాల్లో కూడా సమకాలీన అంశాలు, వివిధ సబ్జక్టులలో చోటుచేసుకొన్న అభివృద్ధిని పొందుపర్చడంలేదు. సాధారణంగా తరగతి గదులలో పాఠ్యపుస్తకాలలో ఉన్న సమాచారాన్ని యధాతథంగా అందజేయడమే తప్ప పిల్లల అనుభవాలకు, సమాజంలోని పెద్దలకు దీనిలో ఏమాత్రం భాగస్వామ్యం ఉండడంలేదు. స్థానిక అనుభవాలు పరిగణనలోకి తీసుకోకపోవడం వల్ల సాంఘికశాస్త్రం క్లిష్టమైన విషయంగా మారిపోయింది. ఇంతేగాకుండా పాఠ్యపుస్తకాలలో సైతం విషయాన్ని సంక్షిప్తంగా వివరించడం సమకాలీనంగా వివిధ రంగాలలో వస్తున్న మార్పులను ప్రగతిని పరిగణనలోకి తీసుకోకపోవడం మరియు వాటిని తరగతి గదిలో చర్చింపకపోవడం వల్ల కూడా సాంఘికశాస్త్రం నిరాసక్తికరంగా మారింది.

పాఠ్యపుస్తకం ద్వారా అందించే అన్ని రకాల జ్ఞానాన్ని వివరించడానికి "పదాలను" మాత్రమే వినియోగిస్తున్నారు. ఇతర ముఖ్యమైన చార్టులు, చిత్రాలు, ప్రత్యక్ష అనుభవాలకు అవకాశం లేదు.

కృత్యాలకు చోటు లేదు. ఇది పిల్లలకు ఆకర్షణీయంగా ఉండదు. ఈ పాఠ్యపుస్తకాలు పెద్దవిగా, అనాసక్తికరంగా తయారయినవి. వీటితోపాటు నాసిరకమైన కాగితం, ముద్రణతో కూడినవిగా ఉండడం వల్ల పిల్లలను సంతృప్తిపరచలేకపోతున్నాయి.

విద్యాప్రణాళికను అమలుచేయడంలో విద్యార్థులు చురుకుగా పాల్గొనడమనేది చాలా తక్కువగా లేదా అసలు లేకుండా ఉంటున్నది. వారు కేవలం సమాచార గ్రహీతలుగా మిగులుతున్నారు. వ్యక్తీకరించడానికి ప్రోత్సహించడం అయితే ఏమి నేర్చుకుంటున్నారనేది మాత్రం తెలిసి ఉంటున్నది. పాఠ్యపుస్తకంలో కృత్యాధారంగా నేర్చుకోడానికి అవకాశం తక్కువగా ఉంటున్నది. సొంతంగా నేర్చుకోవడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనానికి ఈ పాఠ్యపుస్తకాలలో అవకాశం తక్కువగా ఉంటున్నది.

ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో పిల్లల సామర్థ్యాలు, సబ్జక్టు స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొని బోధనాకృత్యాలను తయారుచేయడంలో ఉపాధ్యాయులపాత్ర సంక్లిష్టంగా మారింది. ఉపాధ్యాయుడు తరగతిలో పాత్రకు, సన్నద్ధతల మధ్య సమన్వయం ఉండడం లేదు. ఎక్కువమంది ఉపాధ్యాయులకు చరిత్ర, భౌగోళికశాస్త్రం, అర్థశాస్త్రం, రాజనీతిశాస్త్రం మొదలైన సాంఘికశాస్త్ర విభాగాలలో నిపుణత ఉండదు. ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధికి అవకాశాలు కల్పించే సెమినార్లు, గోష్ఠులు, సదస్సులు, వర్కుషాపులు అందుబాటులో లేకపోవడంవల్ల సబ్జక్టు స్వభావాన్ని బోధనాశాస్త్రంతో సమన్వయపరచడంలో ఇబ్బంది పడుతున్నారు.

ఉపాధ్యాయుల తయారీ (Teacher Preparation) అతి బలహీనంగా మారినందువల్ల తరగతిగదిలో బోధనాభ్యసన ప్రక్రియలు అత్యంత స్తబ్ధంగా మారాయి. ఇవి ఉపాధ్యాయ కేంద్రంగానో లేక పాఠ్యపుస్తక కేంద్రంగానో మారి పరీక్షలకు శిక్షణనివ్వడానికి పరిమితమౌతున్నాయి. నిర్మాణాత్మకవాదానికి చెందిన తాత్వికతను అనుసరించకపోవడంవల్ల పిల్లల యొక్క సామర్థ్యాలు, నైపుణ్యాల అభివృద్ధికి తక్కువ అవకాశం లభిస్తున్నది. పిల్లలకు అర్థవంతమైన అభ్యసనా కృత్యాలను రూపొందించే ప్రయత్నం, స్థానిక, సామాజిక వనరుల వినియోగం కూడా అత్యల్పంగా మారింది.

పాఠశాలల్లో వివిధ రకాల మ్యాపులు, గ్లోబులు ఉన్నాయి. మన రాష్ట్రంలో సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో పాఠశాలలకు బోధనాభ్యసన సామాగ్రి సరఫరా చేశారు. ప్రతీ ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలలకు గ్రంథాలయాల పుస్తకాలను సరఫరా చేశారు. దీనిని మరింత బలోపేతం చేయడం అవసరం. దాదాపు 40 శాతం పాఠశాలలకు కంప్యూటర్లు కూడా ఉన్నాయి. అట్లాసులు, రిఫరెన్సు పుస్తకాలు సరఫరా చేయడం అవసరం. అట్లే పాఠశాలలకు సి.డి.లు, సినిమాలు, విజ్ఞాన సర్వస్వాలు వంటివి అందచేసి కంప్యూటర్లు సద్వినియోగం చేసుకునేలా చూడాలి.

ప్రస్తుతం పాఠశాలలో బట్టీపట్టడాన్ని, గుర్తుంచుకుని పరీక్షలలో గుప్పించడానికి ప్రాధాన్యతనిచ్చేదిగా మూల్యాంకనం ఉంటున్నది. పాఠశాలలో నిర్వహించే యూనిట్ పరీక్షలు మొదలు వార్షిక పరీక్షలు / బోర్డు పరీక్షలు సైతం ఇదే విధంగా జరుగుతున్నాయి. కాబట్టి మూల్యాంకనం నిరంతర సమగ్ర మూల్యాంకనంగా మార్పుచెందాలి. మూల్యాంకనం సాంఘికశాస్త్ర బోధనా లక్ష్యాలు సాధించేవిగా ఉండాలి.

**పాఠ్యపుస్తకాల రూపకల్పన – మార్గదర్శక సూత్రాలు:**

సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాల రూపకల్పనలో ఈ క్రింద మార్గదర్శక సూత్రాలను అనుసరించటం జరిగింది. అవి:

1) సమ్మిళిత విధానం
2) నిత్యజీవిత అనుభవాలకు, పాఠ్యాంశాలకు అనుసంధానం
3) బట్టీ విధానానికి దూరం – అర్థవంతమైన అభ్యసనానికి అనుకూలం
4) ఉపాధ్యాయులు – విద్యార్థుల మధ్య చర్చ
5) విద్యార్థులు ప్రశ్నించుట
6) విద్యార్థులు సొంతంగా చదివి, విషయాలను అర్థం చేసుకోవడం, చదివిన అంశాలపై చర్చ
7) స్వీయ మూల్యాంకనానికి అవకాశం
8) ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులే నిర్వహించేటట్లుగా ప్రయోగాలు, ప్రాజెక్టులు ఇవ్వడం
9) ఇతర సబ్జెక్టులతో అనుసంధానం
10) పట/చిత్ర నైపుణ్యాలను పెంపొందించడం, పటం ద్వారా విషయాన్ని అవగాహన చేసుకోవడం
11) పిల్లలలో ఆలోచించే నైపుణ్యాలను పెంపొందించడం, ఆలోచించి దానిని స్వంతంగా రాయడం, మాట్లాడటం చేయడం
12) నిరంతర సమగ్ర మూల్యాంకనం

**1. సమ్మిళిత విధానం:**

భౌగోళిక ప్రాంతాల విస్తృతిని గుర్తించడం, వివిధ రకాల పటాలుగీసి వివరించడం, పటాలను చదవడం లాంటి నైపుణ్యాలు భూగోళశాస్త్ర విద్య అందిస్తుంది. పటాలను కేవలం భౌగోళిక సమాచారం ఇచ్చే సాధనాలుగానే గాక సామాజిక సందర్భాలలో చారిత్రక పటాలు గీయటంలో కూడా ఉపయోగించగలగాలి.

చరిత్ర బోధనలో స్థానిక, ప్రాంతీయ, ఉపఖండ, ప్రపంచ విషయాల మధ్య సమతుల్యతను పాటించాలి. విద్యార్థులు సామాజిక పరిస్థితులను, చరిత్రను విమర్శనాత్మకంగా అధ్యయనం చేయాలి. ఇవి వివిధ సామాజిక శ్రేణుల, సంస్కృతి, శాస్త్రసాంకేతిక, జానపదాల, రాజనీతి, సాంఘిక, ఆర్థిక పరిస్థితుల వంటి వాటి చర్చకు దోహదం చేయాలి.

భావి పౌరులుగా కాబోయే బడిపిల్లలకు తాముజీవించే ప్రపంచ సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలను అందజేయడం సాపేక్షంగా విద్యాప్రణాళిక భావన. ఈ ప్రణాళికలో సామాజిక శాస్త్రం, అర్థశాస్త్రం, రాజనీతి శాస్త్రాలు కలిసి ఉంటాయి. సామాజిక శాస్త్రాలు అనేక విభాగాలుగా ఉన్నాయి. ఒక విభాగంతో మరొక విభాగం అంత: సంబంధాన్ని కల్గి ఉంది. అందువల్ల ఈ సంబంధాలను గుర్తెరిగి మనం సమన్వయాన్ని పాటించడం జరిగింది.

ఒక విభాగం బహుళ విభాగాలతో సంబంధం కల్గి ఉన్నందున ఉపాధ్యాయుడు కుటుంబం, వ్యవసాయం, చరిత్ర భూగోళం వంటి విభిన్న అంశాలను బోధించేటప్పుడు ఆయాకాలాల సమకాలీనతలను తెలుసుకోవాలి. గతంలో వ్యవసాయం, పరిశ్రమలు, జనాభా పాఠాలను భూగోళ శాస్త్రంలోనూ, అర్థశాస్త్రంలోనూ చర్చించేవారు. అదేవిధంగా పరిపాలన సంబంధ వ్యవహారాలు, చట్టం, న్యాయం, సంస్కృతి, కళలు వంటి అంశాలను చరిత్ర, పౌరశాస్త్రంలోనూ చర్చించేవారు. కొన్నిసార్లు ఒకే పాఠ్యాంశం రెండు సామాజిక శాస్త్రాలలోనూ చెప్పబడేది. కానీ నూతన పాఠ్యపుస్తకాల తయారీలో పదే పదే పాఠ్యాంశాన్ని రెండింటిలో చర్చించే వీలులేకుండా సమ్మిళిత విధానాన్ని అనుసరించారు.

ఎందువలన అంటే భూగోళశాస్త్రంలోని అంశాలకు ఆర్థికశాస్త్రంలోని అంశాలకు చాలా దగ్గరి సంబంధం ఉంటుంది. ఎందుకంటే భౌగోళిక పరిస్థితులను బట్టి అనగా నేల స్వభావం, నదీ పరివాహక ప్రాంతాలు, సముద్రతీర ప్రాంతాలు మొదలగు వానిని బట్టి ప్రజల జీవన విధానం, ఆర్థిక, సామాజిక పరిస్థితులు ఉంటాయి. కావున అర్థశాస్త్రం, భూగోళశాస్త్రాలను సమ్మిళితం చేసి చదవాల్సి ఉంటుంది. అలానే చరిత్ర, రాజనీతిశాస్త్ర అంశాలకు కూడా అదేవిధమైన దగ్గరి సంబంధం ఉంటుంది. అందువల్ల 6 నుండి 8వ తరగతి సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాలలో విభాగాలుగా పాఠ్యాంశాలను రూపొందించలేదు. తద్వారా ఒక పాఠం ఏ శాస్త్ర పరిధిలోకి వస్తుందనే దానికంటే పాఠ్యాంశాలలోని అన్ని విషయాలను కూలంకషంగా తెలుసుకునే విధంగా సమ్మిళిత విధానంలో రూపొందిచబడ్డాయి.

భూగోళశాస్త్రం, చరిత్ర, రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం విడివిడిగా కాకుండా సమ్మిళితంగా పాఠ్యాంశాలను రూపొందించారు.

### 2. నిత్యజీవిత అనుభవాలకు అనుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన

విద్యార్థులు తమచుట్టూ ఉన్న సమాజంలోని నిజజీవిత అంశాల ఆధారంగా పాఠ్యాంశాలున్నాయి. పిల్లలలో ఉన్న ఆయా అంశాల పూర్వ భావనలను మరింత బలోపేతం చేస్తూ వాటికి సంబంధించిన తరగతి స్థాయి అంశాలను పాఠ్యాంశాలుగా ఇవ్వడం జరిగింది. పిల్లలు బడికిరాకముందే సమాజంలోని అనేక అంశాలపై అవగాహన కలిగి ఉంటారు. వారికి సమాజంలోని వివిధ జ్ఞాన వ్యవస్థలపై అవగాహన ఉంటుంది.

ఉదా:- 8టవ తరగతిలో ద్రవ్యం - బ్యాంకింగ్ పాఠంలోని స్వయం సహాయక సంఘాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరిగే కార్యకలాపాలను నిత్యజీవితంతో అనుసంధానం చేసి విద్యార్థి సరిచూస్తాడు.

### 3. బట్టీ విధానానికి దూరం - అర్థవంతమైన అభ్యసనానికి అనుకూలం

బట్టీ విధానాలకు అతీతంగా అర్థవంతమైన అభ్యసనాన్ని చేకూర్చేలా బోధనాభ్యసన ప్రక్రియలు ఇవ్వబడ్డాయి. పాఠ్యాంశాలలోని ప్రశ్నలు ఆలోచింపజేసేవిగా, బట్టీ పట్టడానికి అవకాశం లేకుండా

అర్థం చేసుకున్న పాఠ్యాంశాన్ని నిత్యజీవిత అనుభవాలకు అనుసంధానం చేసేటట్లుగా ఉన్నాయి. పాఠం చివరలో ఇచ్చిన "మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి" లోని అంశాలకు పాఠంలో నేరుగా జవాబులు ఉండవు. ఒకే ప్రశ్నకు విద్యార్థులు విభిన్న సమాధానాలు పేర్కొనే వీలుంది. వారి స్వీయ అనుభవాల ద్వారా ఇవ్వబడిన కృత్యాలు, ప్రాజెక్టులను పూర్తిచేసే అవకాశం ఉంది.

## 4. ఉపాధ్యాయులు - విద్యార్థుల మధ్య చర్చకు అవకాశం :

ప్రతి పాఠం ప్రారంభంలో, మధ్యలో అనేక చిత్రాలు, ఆలోచింపజేసే ప్రశ్నలు ఉన్నాయి. ఈ అంశాలపై చర్చ జరగాలి. పిల్లలు ఆలోచించేటట్లు ఉపాధ్యాయులు &ప్రశ్నించడం, విద్యార్థులు తమ అనుభవాలు పంచుకోవడం, విద్యార్థుల మధ్య చర్చ జరగాలి.

ఉదా: 1. 6వ పాఠం – చిత్రం 6.1, 7వ పాఠం – చిత్రం 7.1 చిత్రాలపై చర్చలను నిర్వహించుట

2. 6వ పాఠంలోని పట్టిక–2, తర్వాత బాక్స్‌లో ఇచ్చిన ఒక ప్రశ్నలు పరిశీలిద్దాం. వ్యవసాయ భూమిని సాగుచేసే వ్యక్తికి, వ్యవసాయ కూలీకి మధ్యగల తేడాలేమిటి?

3. 15వ పాఠం 207వ పేజీలోని బాక్స్ ఐటమ్‌లోని 3వ ప్రశ్న – దేశాభివృద్ధికి, స్వాతంత్ర్యానికి, స్త్రీ, పురుషులకు సమాన అవకాశాలు, వాళ్ళ సమాన భాగస్వామ్యం అవసరమన్న దృక్పథంతో మీరు ఏకీభవిస్తారా?

### 5. విద్యార్థులు ప్రశ్నించగలగాలి

పాఠ్య పుస్తకంలోని వివిధ అంశాలు అభ్యసించేందుకు ఉపాధ్యాయులు చెబితే వినడం కాకుండా విద్యార్థులు ప్రశ్నించి విషయాలు తెలుసుకోవాలి. బోధనాభ్యసన ప్రక్రియలో అన్ని సందర్భాలలో విద్యార్థులకు ప్రశ్నించే అవకాశాన్నిచ్చే రకంగా పాఠ్యాంశ బోధన జరగాలి. దీనికి అనుగుణంగా పాఠ్యపుస్తకాలు రూపొందించబడ్డాయి.

ఉదా: – లోక్ అదాలత్ వల్ల కలిగే లాభాలు తెలుసుకొనుటకు సంబంధిత వ్యక్తులను ఇంటర్వ్యూ చేయుటకు ప్రశ్నలు రూపొందించుట.

– సమాచార హక్కు కార్యాలయాల సిబ్బందిని కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకొనుటకు ప్రశ్నలను రూపొందించుకొనుట.

### 6. విద్యార్థులు సొంతంగా చదివి విషయాలను అర్థం చేసుకోగలగడం

పాఠ్యపుస్తకాన్ని విద్యార్థులు సొంతంగా చదువుకొని విషయాలను అర్థం చేసుకొనేట్లుగా వాడుకపదజాలంలో భాష, పాఠ్యాంశాలు, చిత్రాలు, ఉదాహరణలు, కృత్యాలు ఇవ్వబడ్డాయి. నిఘంటువులు, పదకోశాల అవసరం లేకుండా విద్యార్థులు అన్ని పాఠ్యాంశాలను అర్థం చేసుకోగలరు.

ఇదే విధంగా ప్రతి పాఠంలోనూ ప్రశ్నలు, బాక్స్‌లు, గ్రాఫులు, టేబుల్స్, రంగురంగుల చిత్రాలు, ఆలోచింపజేసే బొమ్మలు, కార్టూన్లు, కల్పిత కథలు, యదార్థగాథలు, కేస్‌స్టడీలు, ప్రాజెక్టుల ద్వారా విద్యార్థి స్వీయ అభ్యాసనాన్ని పెంపొందించే విధంగా పాఠ్యపుస్తకాలు రూపొందించబడ్డాయి.

**7. స్వీయ మూల్యాంకనానికి అవకాశం**

ఒక పాఠం పూర్తయ్యాక ఏఏ అంశాలలో విద్యార్థికి అవగాహన కలిగిందో సొంతంగా తెలుసుకొనుటకు వీలుగా ప్రతిపాఠం చివర స్వీయ మూల్యాంకన అంశాలు ఇవ్వబడ్డాయి. అదేవిధంగా ఎప్పటికప్పుడు పాఠం మధ్యలోని ప్రశ్నలు కూడా విద్యార్థి తాను ఏ స్థాయిలో ఉన్నాడో తెలుసుకొనుటకు అవకాశం ఇచ్చునట్లుగా పాఠ్యాంశాలన్నీ స్వీయ మూల్యాంకనానికి అనుకూలంగా ఉన్నాయి.

ఉదా: 8వ పాఠంలో ప్రజలు–వలసలు అనే భావనను అధ్యయనం చేసి విద్యార్థులు సొంతంగా మూల్యాంకనం చేయగల్గుతారు.

**8. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో విద్యార్థులే నిర్వహించేటట్లుగా ప్రయోగాలు, ప్రాజెక్టులు**

విద్యార్థులు సొంతంగా సామగ్రిని సేకరించుకొని, రూపొందించుకొని కృత్యాలు, ప్రయోగాలు, ప్రాజెక్టులు, పరిశోధనల వంటివి ఉపాధ్యాయ మార్గదర్శకత్వంలో నిర్వహించేటట్లుగా ఇవ్వబడ్డాయి. విద్యార్థులు ఉపాధ్యాయ మార్గదర్శకత్వంలో నిర్వహించడం, నిర్వహించిన అంశాల పరిశీలనలపై చర్చించడం, తద్వారా అర్థవంతమైన అభ్యసనం జరుగునట్లుగా అన్ని పాఠ్యాంశాలున్నాయి.

**9. ఇతర సబ్జెక్టులతో అనుసంధానం**

భాష, గణితం, సైన్సు, పర్యావరణం వంటి అనేక సబ్జెక్టులతో పరిసరాలను అనుసంధానం చేస్తూ పాఠ్యాంశాలున్నాయి. ఏ పాఠం అయినా పరిపుష్టం కావాలంటే ఇతర సబ్జెక్టులపై ఎంతో కొంత ఆధారపడక తప్పదు.

ఉదా: ఆహార భద్రత. పట్టిక: 1. తలసరి ఆహార ధాన్యాల లభ్యతను చేయడం, కనుగొనడంలో గణిత పరిజ్ఞానాన్ని, సమానత – సుస్థిర అభివృద్ధిలో భాగంగా పర్యావరణం, పరిరక్షణ గూర్చి చర్చించడంలో సైన్సు పరిజ్ఞానాన్ని వినియోగించాల్సి ఉంటుంది.

**10. పటనైపుణ్యాలను పెంపొందిచడం – చిత్రాలను పరిశీలింపజేయడం**

నూతన సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలోని పాఠ్యాంశాలు విద్యార్థులలో చక్కటి నైపుణ్యాలను పెంపొందించేవిధంగా రూపొందించబడ్డాయి. గత పాఠ్యపుస్తకంలో మాదిరిగా కేవలం పటాలలో ప్రదేశాలను గుర్తించడమే కాకుండా పటాలను తయారుచేయడం, పటాలను చదవడం వంటి విషయాలను కొత్తగా పరిచయడం చేయడం జరిగింది.

ఉదా: – అట్లాసు ద్వారా ప్రపంచ జనాభా, భారతదేశ జనసాంద్రత, ఆంధ్రప్రదేశ్ జనాభాలపై చర్చ.

– చిత్రాల ద్వారా పాఠాలలోని భావాలను మరింత సులభంగా అర్థం చేసుకునే రకంగా పాఠ్యాంశాలు రూపొందించారు:

చిత్రాలు విద్యార్థులలో అవగాహనకు ఉపయోగపడటమే గాకుండా వారిలో నూతన ఆలోచనలు రేకెత్తించే రకంగా, సహజసామర్థ్యాలను వెలికితీసే రకంగా, సృజనాత్మకతను పెంపొందించే రకంగా

రూపొందించబడ్డాయి.

**11. పిల్లల్లో ఊహాత్మకశక్తిని, ఆలోచించే నైపుణ్యాలను పెంపొందించే రకంగా రూపొందించబడ్డాయి**

నూతన సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాలలో, పిల్లలలో వివిధ సన్నివేశాలను, జరగబోయే పరిస్థితులను ఊహించేరకంగా ప్రశ్నలు ఇవ్వబడ్డాయి. అన్నింటికంటే ముఖ్యంగా ఉన్నత ఆలోచనలను పెంపొందించే రకంగా ప్రశ్నలు రూపొందించబడ్డాయి. పిల్లలలో సమైక్య ఆలోచన ప్రజ్ఞను, విభిన్న ఆలోచనలను పెంపొందించే రకంగా పాఠ్యాంశాలు రూపొందించడం జరిగింది.

**12. నిరంతర సమగ్ర మూల్యాంకనానికి వీలుగా రూపొందించబడ్డాయి:**

పాఠం ప్రారంభానికి ముందు, పాఠం మధ్యలో, ప్రతి కొత్త "భావన" పరిచయం చేయునప్పుడు, పాఠం పూర్తయ్యే సమయంలో, కృత్యాలు, ప్రాజెక్టులు, ప్రయోగాలు, పరిశోధనల వంటి చోటా, ఇలా ప్రతి సందర్భంలో నిరంతర మూల్యాంకనం చేయడానికి వీలుగా, "అభ్యసనం కొరకు మూల్యాంకనం" అనే విధంగా పాఠ్యాంశాలు ఉన్నాయి. ఆయా సందర్భాలలో విద్యార్థుల ప్రతిస్పందనను బేరీజు వేసే విధంగా 'సమగ్ర' మూల్యాంకన ప్రక్రియకు దోహదం చేసేటట్లుగా పాఠ్యాంశాలన్నీ ఉన్నాయి. స్వీయ మూల్యాంకనం, "అభ్యసనాన్ని మెరుగు పరుచుకుందాం" వంటివి కూడా నిరంతర సమగ్ర మూల్యాంకనంలో భాగంగా ప్రతి పాఠంలో చేర్చబడ్డాయి.

## 3.2 సాంఘిక శాస్త్ర బోధనా లక్ష్యాలు:

సమాజ ప్రగతికి, శ్రేయస్సుకు, సంక్షేమానికి, సామాజిక అధ్యయనం ఎంతో తోడ్పడుతుంది. సమాజ ప్రగతి బహుముఖమైంది. సామాజిక అధ్యయన ఉద్దేశాలను సఫలీకృతం చేయడానికి అన్ని సమాజ శాస్త్రాలు తమవంతుగా దోహదం చేస్తాయి. సామాజిక శాస్త్రాలు ఎన్నో ఉన్నా సామాజిక అధ్యయనాలు మచ్చుకు ఐదింటిని ప్రముఖమైనవిగా గుర్తించాయి. అవి చరిత్ర, భూగోళశాస్త్రం, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం, సమాజశాస్త్రాలు. వీటిలో ఒక్కొక్కదానికి కొన్ని కొన్ని ఉద్దేశాలు ప్రత్యేకంగా ఉన్నాయి. వీటన్నింటి సమూహ రూపమే సాంఘిక అధ్యయనాలు కాబట్టి వాటికి సంబంధించిన బోధన ఉద్దేశాలను / లక్ష్యాలను కింద పేర్కొనడం జరిగింది.

**సాంఘిక అధ్యయనాల ఉద్దేశాలు మరియు లక్ష్యాలు – కొఠారి కమిషన్**

(Recommendations of Kothari Commission, NPE 1986, NCF 2005 సిఫారసులు)

**సామాజిక అధ్యయనాల లక్ష్యాలు – కొఠారి కమిషన్ సిఫారసులు**

కొఠారి కమిషన్ (విద్యా కమిషన్ 1964–55) సోషల్ స్టడీస్ అధ్యయనం లక్ష్యాలుగా ఈ దిగువ వాటిని పేర్కొంది.

1. వారి పరిసరాల జ్ఞానాన్ని పొందటానికి విద్యార్థులకు దోహదపడటం.
2. మానవ సంబంధాలు గురించిన అవగాహనను పెంపొందించుకోవటానికి అవసరమైన

జ్ఞానాన్ని విద్యార్థులకు అందించటం.

3. సముదాయంలో, ప్రభుత్వం, జాతీయ, ప్రపంచ వ్యవహారాల్లో తెలివిగా పాల్గొనటానికి అవసరమైన ముఖ్యమైన వైఖరులను, విలువలను పెంపొందింపజేయటం.

4. విద్యార్థుల్లో మంచి పౌరసత్వ భావన, భావోద్రేక సమైక్యత అభివృద్ధి కావటానికి దోహదపడటం.

సాంఘిక శాస్త్రం బోధనా లక్ష్యాలపై 1986 జాతీయ విద్యా విధానం సిఫారసులు

1986 జాతీయ విద్యా విధానం పది జాతీయ మౌలిక అంశాలను ప్రకటించింది. అవి (1) భారతదేశ స్వాతంత్రోద్యమ చరిత్ర, (2) రాజ్యాంగ బాధ్యతలు, (3) జాతీయ ఐక్యతను పెంపొందించటం, (4) భారతదేశ సామాన్య సాంస్కృతిక వారసత్వము, (5) సమానత్వం, ప్రజాస్వామ్యం మరియు లౌకిక వాదం, (6) లైంగిక సమానత్వం, (7) సాంఘిక సమానత్వం, (8) సాంఘిక అడ్డంకులను తొలగించడం, (9) చిన్న కుటుంబ ప్రమాణాన్ని పాటించటం, (10) శాస్త్రీయ అవగాహనను పెంపొందిచటం. అన్ని సబ్జెక్టుల విద్యా ప్రణాళిక తయారీకి ఈ అంశాలనే ప్రాతిపదికగా తీసుకోవాలని 1986 జాతీయ విద్యా విధానం సూచించింది. ఆ ప్రకారం మన రాష్ట్రం, ఇతర రాష్ట్రాలు ఒకటి నుంచి అయిదవ తరగతి వరకు పరిసరాల విజ్ఞానం అనే పేరు మీద, ఆరు నుంచి పదవ తరగతి వరకు సాంఘిక శాస్త్రం పేరు మీద పాఠ్యపుస్తకాలను తయారుచేసి బోధిస్తున్నారు. NCERT కూడా పై పది మౌలిక అంశాలను ప్రాతిపదికగా తీసుకొని సాంఘికశాస్త్ర పాఠ్యపుస్తకాలను తయారుచేసింది. ఈ పూర్వరంగంలో 1986 జాతీయ విద్యా విధానం ప్రకారం సాంఘికశాస్త్రం బోధనా లక్ష్యాలుగా ఈ క్రింది వాటిని పేర్కొనవచ్చు.

1. విద్యార్థులలో రాజ్యాంగ బాధ్యతలు, హక్కులు గుర్తెరిగేటట్లు చేయటం.

2. భారతదేశ సాంస్కృతిక వారసత్వం యొక్క గొప్పదనాన్ని గుర్తించేటట్లు చేయటం.

3. విద్యార్థులు నివసించే భౌతిక, సామాజిక పరిసరాలను అర్థం చేసుకునేటట్లు చేయటం పరిసరాల పరిరక్షణ పట్ల వారిలో చైతన్యాన్ని కలుగచేయటం.

4. ప్రపంచశాంతి, అవగాహనను పెంపొందిపచేయటం, ప్రపంచశాంతికి భారతదేశ కృషిని మెచ్చుకునేటట్లు చేయటం.

5. పౌరవిద్య ద్వారా విద్యార్థులలో సమానత్వం, ప్రజాస్వామ్యం మరియు లౌకికవాద విలువలను పెంపొందిపచేయటం.

6. సమాజంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను అవగాహన చేసుకొని వాటి పరిష్కారంలో తన వంతు కృషి చేసేటట్లు చేయటం.

7. శాస్త్రీయ వైఖరులను కలుగజేయటం.

8. జాతీయ సమైక్యతకు పాటుపడేటట్లు చేయటం.

NCF-2005 పేర్కొన్న సామాజిక అధ్యయనాల బోధనా లక్ష్యాలు

జాతీయ విద్యా ప్రణాళికా చట్రం 2005 ప్రకారం సాంఘికశాస్త్ర లక్ష్యాలుగా ఈ క్రింది వాటిని పేర్కొనవచ్చు.

1. న్యాయమైన, శాంతియుతమైన సమాజాన్ని స్థాపించడానికి అవసరమైన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించటం.
2. సామాజిక యదార్థాన్ని విమర్శనాత్మకంగా అన్వేషించటం, ప్రశ్నించటం ద్వారా విద్యార్థులకు మేలుకొలుపును పెంచటం.
3. విద్యార్థులలో వారు సమాజాన్ని విమర్శనాత్మక దృష్టితో అవగాహన చేసుకునే వైఖరి అభివృద్ధి చేయటం.
4. అంతకంతకూ ఎక్కువగా పరస్పరాధారితమవుతున్న ఈ ప్రపంచంతో సర్దుబాటు కావటానికి, రాజకీయ, ఆర్థిక, యదార్థాలతో వ్యవహరించడానికి అవసరమైన సాంఘిక, సాంస్కృతిక విశ్లేషణాత్మక నైపుణ్యాలను అందించటం.
5. పరీక్షలకు గుర్తుపెట్టుకోడానికి వీలుగా విషయాలను వరుసలో అమర్చటం కాకుండా విద్యార్థులలో భావనాత్మక అవగాహన అభివృద్ధి అయ్యేలా చూడటం.
6. ప్రకృతి, భౌతిక శాస్త్రాలవలె శాస్త్రీయ అన్వేషణ చేసే తత్వాన్ని అభివృద్ధి చేయటం.
7. స్వాతంత్ర్యం, నమ్మకం, పరస్పర గౌరవం, విభిన్నత పట్ల గౌరవం వంటి మానవ విలువలను విద్యార్థులలో అభివృద్ధి చేయటం.
8. ఈ విలువలను అపాయకరంగా దాపురించిన సామాజిక శక్తుల పట్ల అప్రమత్త కావటానికి తగిన నైతిక మానసిక శక్తిని విద్యార్థులలో అలవరచటం.

## 3.2. సాంఘిక శాస్త్ర బోధనా లక్ష్యాలు
## (Aims and objectives of Teaching Social Studies)

చుక్కాని లేని నావ ఒడ్డుకు చేరుకోలేదు. లక్ష్యాలు లేని ప్రయాణం గమ్యాన్ని చేరుకోలేదన్న విషయం వాస్తవం. ఇదే భావాన్ని చెస్టర్. ఎమ్. ఆల్టర్ చక్కగా వర్ణించారు. ఎందుకు వెళ్తున్నామో, ఎక్కడికి వెళ్తున్నామో, ఎలా వెళ్తున్నామో తెలియకుండా చేసే ప్రయాణం ఎన్నిరోడ్లు త్రిప్పినా గమ్యాన్ని చేర్చలేదో అదేవిధంగా ఉద్దేశ్యాలు లేని బోధన లక్ష్యాల్ని నెరవేర్చలేదు. నిర్దిష్టమైన లక్ష్యాలను స్థిరీకరించినప్పుడే బోధన ఫలవంతమవుతుంది. లక్ష్యాలు విద్యార్థుల ప్రగతికి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి, మారుతున్న సమాజపు అవసరాల్ని తీర్చడానికి; వ్యక్తుల మరియు సమాజ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలి. ఇవి నమ్యత (flexibility) ని కలిగి వుండాలి. మనం స్థిరీకరించుకున్న లక్ష్యం సరైనదికాదని ఋజువయినపుడు వెంటనే దానిని విడిచిపెట్టి మరొక ఉపయుక్తమైన లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి. మనిషి సంఘజీవి. అతని అభివృద్ధి సంఘంలోనే వుంటుంది. అందుకే సాంఘిక అధ్యయనంలో ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాల్సి ఉందని ప్లేటో తన గ్రంథమైన రిపబ్లిక్‌లో నొక్కి వక్కాణించాడు.

1. సామాజిక విషయాల మౌలిక భావనలను కలుగజేయడం : సమాజం యొక్క ఆవశ్యకత, దాని అభివృద్ధి, సమాజాన్ని నడిపించే ఆర్థిక, భౌగోళిక, చారిత్రాత్మక, సౌందర్యాత్మక, రసాత్మక, సాంస్కృతిక మొదలైన ఎన్నో అంశాలకు సంబంధించిన, ప్రాథమిక భావనలను విద్యార్థులకు కలుగజేయడం.
2. మనిషికి, సమాజానికి ఉన్న సంబంధాన్ని తెలియజేయడం : నీవు నేను కలిస్తే మనం. మనం, మనం కలిస్తే జనం. జనం, జనం కలిస్తే సమాజం. అప్పుడే ప్రయోజనం. అందుకే వ్యక్తులు లేకుండా సమాజం లేదు. సమాజం లేకుండా వ్యక్తి మనుగడ సాగించలేడు. సమాజాభివృద్ధి కోరుతూ, వ్యక్తి ఎదుగుదల ఏ విధంగా ఉండాలో తెలియజేయడమే సాంఘిక అధ్యయనం యొక్క ప్రధాన విధి.
3. మన వారసత్వ సంపద చూసి గర్వపడడం : దేశ సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఆవిష్కరణలు, వివిధ రంగాలలో మన పూర్వీకులు చేసిన కృషి, కళలు, కట్టడాలు, వ్యక్తుల్ని అభినందించడం, గౌరవించడం అలాంటి ప్రగతిని సాధించినందుకు గర్వపడే మనస్థత్వాన్ని పెపొందించడమే సాంఘిక అధ్యయనం యొక్క ఆశయము.
4. సాంఘిక, ఆర్థిక అంశాల పట్ల ఇష్టతను పెంపొందించడం : సమాజ ప్రగతికి సాంగిక మరియు ఆర్థిక అంశాలు జీవనాధారాలు, కుటుంబం, వివాహం, సాంఘిక ఆచారాలు, సంప్రదాయాలు, ఆర్థిక లావాదేవీలు, పంచవర్ష ప్రణాళికలు, బడ్జెట్, తలసరి ఆదాయం, బ్యాంకులు, రుణాలు, వడ్డీలు, పరిశ్రమలు, రాజకీయ సంస్థలు, రాజ్యం మొదలైన విషయాలను గురించి విద్యార్థికి తెలియజేయడమే సాంఘిక అధ్యయనం యొక్క లక్ష్యం.
5. పౌరసత్వ విలువల్ని పెంపొందించడం : సమాజంలోని పౌరుని యొక్క విధులు, బాధ్యతలు, హక్కులు మొదలైనవాటిని తెలియజేసి ప్రతి విద్యార్థిని ఒక ఆదర్శమైన పౌరునిగా తీర్చిదిద్దడమే సాంఘిక అధ్యయనం యొక్క లక్ష్యం.
6. ప్రజాస్వామ్య విలువల్ని పెంపొందించడం : ప్రజాస్వామ్యం ఒక రకమైన ప్రభుత్వ రూపం కాదు. ఇది ఒక జీవన విధానమని విద్యార్థులకు తెలియజేయాలి. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ఆశయాలను, సంఘీభావం, సహకారం, త్యాగం, శ్రమ విభజన, శ్రమైక జీవనం వంటి అనేక సుగుణాలను అభివృద్ధి చేయడమే సాంఘిక అధ్యయనం యొక్క లక్ష్యం.
7. పర్యావరణంతో పరిచయం : మన చుట్టూ ఉండే అడవులు, కొండలు, నేల, నదులు, గాలి, నీరు, మొదలైన నిర్జీవ అంశాలు సమాజ ప్రగతికి ఏ విధంగా ఉపకరిస్తున్నాయో తెలియజేసి పర్యావరణ సమతుల్యతను కాపాడాలని చెప్పడం ఈ శాస్త్ర అధ్యయనం యొక్క లక్ష్యాలలో ఒకటి.
8. సమగ్ర మూర్తిమత్వాభివృద్ధికి తోడ్పడడం : సత్శీలం, దేశభక్తి, అంతర్జాతీయ అవగాహన, మంచి పౌరునిగా బాధ్యతలు నిర్వహించి, ఒక మనిషిగా ప్రవర్తిస్తూ సమాజంలోని అందరు ప్రజల్ని అభివృద్ధి పథంలోకి పయనించే విధంగా ప్రతివ్యక్తిలో సంపూర్ణ మూర్తిమత్వ వికాసానికి

సాంఘిక అధ్యయనం తోడ్పడాలి.

9. నాయకత్వ లక్షణాల్ని అభివృద్ధి చేయడం : నిస్వార్థమైన, మంచి నాయకుడిగా ఎదిగి ప్రజలను మంచిబాటలో నడిపి యావత్ ప్రపంచానికి మంచిపేరు తెచ్చే గొప్ప నాయకత్వ లక్షణాల్ని పెంపొందిచడమే సాంఘికశాస్త్ర అధ్యయనం యొక్క ముఖ్య లక్ష్యం.

10. నాది అనే భావాన్ని కలుగజేయడం : 'నేను', 'నాది' అనే భావం నుండి 'నా ఊరు', 'నా జిల్లా', 'నా రాష్ట్రం', 'నా దేశం', 'నా భూమి' అనే అంతర్జాతీయ భావాన్ని పెంపొందించి, వసుదైక కుటుంబ భావన బీజాల్ని విద్యార్థి మెదడనే సుక్షేత్రంలో నాటడమే ఈ శాస్త్ర అధ్యయనం యొక్క ముఖ్య లక్ష్యం.

11. సామాజిక మార్పులకు సిద్ధం చేయడం : విద్యార్థుల్లో చైతన్యమైన మనసును అభివృద్ధి చేయాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా మారే సర్దుబాటు ధోరణిని పెంపొందించుకోవాలి. పూర్వం గంపెడు పిల్లల్ని కని సుఖసంతోషాలతో జీవించండని పెద్దలు దీవించేవారు. మరి మన పూర్వుల దీవెనలు కదా అని నేడు పాటించగలమా ? అది అప్పటి అవసరం అందుకే అలా దీవించారు. చిన్నకుటుంబం నేటి అవసరం. మార్పుకు సంసిద్ధం చేయడమే సాంఘిక అధ్యయనం యొక్క పరమావధి.

12. సాంఘికీకరణం చేయడం : విద్యార్థికి అడుగడుగునా తమ సంఘంలో ఒక సభ్యుడినన్న విషయాన్ని తెలియజేస్తూ తన విధానాలను నిర్వర్తించే విధంగా, ఒక సాంఘిక జీవిగా రూపుదిద్దే విధంగా సాంఘికీకరణం చేయడమే ఈ శాస్త్ర అధ్యయనం యొక్క ముఖ్య లక్ష్యం.

13. సహన గుణాన్ని పెంపొందించడం : మతాలు, జాతులు, కులాలు, ఆచారాలు, వ్యవహారాలను గౌరవిస్తూ సహనాన్ని పాటించే గుణాన్ని అభివృద్ధి చేసి తద్వారా సమాజాభివృద్ధిని కాంక్షించడమే ఈ శాస్త్ర అధ్యయనం యొక్క ముఖ్య లక్ష్యం.

14. విరామ కాలాన్ని సద్వినియోగ పరచడం : వివిధ చారిత్రాత్మక విషయాల సందర్శన, జలపాతాలు, లోయలు, వివిధ ప్రజల ఆచార వ్యవహారాలను తెలుసుకోవడం, వివిధ సాంఘిక కార్యక్రమాలైన అక్షరాస్యత ఉద్యమం, మూఢాచారాలను విడిచిపెట్టమని చెప్పడం వంటివి చేబట్టడం ద్వారా విద్యార్థులు తమ విరామ కాలాన్ని సద్వినియోగపరచుకునే అలవాటును పెంపొందించడమే ఈ శాస్త్ర అధ్యయనం యొక్క ముఖ్య లక్ష్యం.

15. అంతర్జాతీయ అవగాహన : ప్రపంచంలో ప్రతిజాతికి ఒక విశిష్ట లక్షణం ఉంటుంది. ఆ విశిష్టతను కాపాడుకుంటూ, పరస్పర సహకారంతో జాతులన్నీ మెలగడమే అంతర్జాతీయ అవగాహన.

16. విద్యార్థుల్లో తన చుట్టూ ఉండే భౌతిక, సామాజిక, రాజకీయ, ఆర్థిక, చారిత్రాత్మక మరియు సాంస్కృతిక పరిసరాలను పరిశీలించడానికి తోడ్పడాలి.

17. నేను, నాదీ అనే స్థాయి నుండి మనం, మనది అనే స్థాయికి, ఆ పైన నా మానవజాతి అనే స్థాయికి ఎదిగేటట్లు చేయాలి. దానికోసం కుటుంబం, పాఠశాల, సమాజం, ప్రపంచం అనే

భావనల్ని విద్యార్థులలో కలిగించాలి.

18. విద్యార్థుల్లో శ్రమైక జీవనం యొక్క విలువలను ఆకలింపు చేసుకునేటట్లు చేయాలి.
19. జీవనస్థాయిని పెంచుకుంటూ మెరుగైన జీవితాన్ని గడపడానికి కావలసిన పునాదులు వేయడం.
20. దేశంలోని అనేక ఆచారాలు, వ్యవహారాలు, కట్టుబాట్లు, సాంప్రదాయాలను, గేయాలు, కథలు, పాటల రూపంలో విద్యార్థులకు తెలియజేయడం.
21. మతం యొక్క ప్రాముఖ్యత, వివిధ మతాలు, వాటి మంచిని చెప్పి విద్యార్థుల్లో లౌకికతత్త్వం మరియు మత సహనం వంటి లక్షణాల్ని పెంపొందింపచేయడం మొదలయిన ప్రాథమిక స్థాయిలో పెంపొందించవలసిన ఉద్దేశ్యాలు. అన్ని మతాల యెడల గౌరవ భావం పెంపొందించడం.
22. ధనిక, పేద, ఆడ, మగ, జాతి, కుల, మత, భాషా బేధాల కతీతంగా మనుషులంతా ఒకటే అనే భావనను విద్యార్థుల్లో కలుగజేసి సమసమాజ నిర్మాణానికి పునాదులు వేయడం.
23. దేశభక్తి, జాతీయతా భావాల్ని పెంపొందిపజేయడం.
24. ప్రేమ, అభిమానం, సోదరభావం, ఏకతాభావం, త్యాగం వంటి లక్షణాల్ని అభివృద్ధి చేయడం – ఇవన్నీ ప్రాథమిక స్థాయిలో సాధారణ బోధనా ఉద్దేశ్యాలే.

## 3.3 సాంఘికశాస్త్ర విద్యా ప్రమాణాలు – అవగాహన
## (Academic Standards / Learning Indicators)

సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకాలు కేవలం సమాచారం అందించేవిగా కాకుండా పిల్లల్లో జ్ఞాన నిర్మాణం చేయడానికి గానూ రూపొందించడం జరిగింది. బోధనాభ్యసన ప్రక్రియలో వ్యక్తిగత కృత్యాలు, జట్టు కృత్యాలు, చర్చలు, చిత్రాలు గీయడం, పట్టికలు చదవటం, విశ్లేషించటం వంటి వాటికి ప్రముఖ స్థానం ఇవ్వటం వలన తార్కిక ఆలోచన, విమర్శనాత్మక దృష్టి పెరుగుతుంది.

జాతీయ విద్యా ప్రణాళికా చట్రం – 2005, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా ప్రణాళికా చట్రం – 2011, సాంఘికశాస్త్రం ఆధారపత్రం ప్రతిపాదనల ఆధారంగా సాధించాల్సిన సామర్థ్యాలను విద్యా ప్రమాణాలుగా రూపొందించారు. సాంఘికశాస్త్రంలో నిర్ధారించిన ఆరు విద్యా ప్రమాణాలను సాధించుటకు వీలుగా తరగతి గది సమయాన్ని ప్రణాళికాబద్ధంగా విభజించి బోధనాభ్యసన కృత్యాన్ని నిర్వహించాలి. అందుకే వీటిని "అభ్యసన సూచికలు" (Learning Indicators) అని కూడా అంటారు. తరగతిలో అన్నీ ఒకే విధమైన ప్రశ్నలు కాకుండా విద్యా ప్రమాణాలను దృష్టి యందుంచుకొని వివిధ కోణాలలో విద్యార్థి ఆలోచించి, సమాధానం చెప్పడానికి అవకాశం కల్పించే ప్రశ్నలు ఇవ్వాలి. ఒకే ప్రశ్న పిల్లలందరినీ అడిగినా, వారు ఒక ప్రశ్నకు అనేక కోణాల నుండి సమాధానాలు చెప్పడానికి తరగతిలో అవకాశం ఇవ్వడం వలన మనం ఏ ఉద్దేశ్యంతో విద్యా ప్రమాణాలు నిర్ధారించుకున్నామో ఆ ఉద్దేశ్యం నెరవేరుతుంది. అన్ని విద్యా ప్రమాణాలు తరగతి గదిలోనే సాధించాలనే నియమం

లేదు. ప్రాజెక్టులు, క్షేత్ర పర్యటనల ఆధారంగా, ఇంటర్వ్యూలు నిర్వహించడం ద్వారా కూడా వీటిని సాంఘిక శాస్త్రంలో సాధించాల్సిన విద్యా ప్రమాణాలను గురించి విపులంగా తెలిసికొందాం.

విద్యా ప్రమాణాలు (Academic Standards): సాంఘిక శాస్త్ర బోధన ద్వారా సాధించాల్సిన విద్యాప్రమాణాలు 6. అవి :

1. విషయావగాహన (Conceptual Understanding)

2. ఇచ్చిన పాఠ్యాంశాన్ని చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించటం (Reading the text given, understanding and interpretation)

3. సమాచార నైపుణ్యాలు (Information gathering & processing skills)

4. సమకాలీన అంశాలపై ప్రతిస్పందించుట – ప్రశ్నించుట (Reflection on Contemporary issues and Questionings)

5. పటనైపుణ్యాలు (Mapping Skills)

6. ప్రశంస / అభినందన – సున్నితత్వం (Appreciation and Sensitivity)

1. విషయావగాహన

పాఠ్యాంశాల్లోని కీలక పదాలు, కీలక భావనలు, విద్యార్థులు అర్థం చేసికొని వారికి అర్థమయిన అంశాలను చెప్పగలగాలి. కారణాలు చెప్పడం, వర్గీకరించటం, ఉదాహరణలు ఇవ్వడం, పోలికలు భేదాలు తెలియజేయడం, విశ్లేషించటం, ఊహించటం, వివరించటం వంటివన్నీ విషయావగాహన క్రిందికి వస్తాయి.

- తాను చూసిన సంఘటన గురించి గానీ, తాను చేసిన పనిని గురించి గానీ తన సొంత మాటల్లో వివరించగలగాలి.
- ఇతరులు చెప్పే వాటిని వింటూ సహేతుకంగా ఆలోచించగలగాలి.
- తాను పరిశీలించిన వివిధ అంశాల మధ్య గల సంబంధాలను గుర్తించగలగాలి
- తాను పరిశీలించిన అంశాల యొక్క లక్షణాల ఆధారంగా వాటిని వర్గీకరించగలగాలి. వాటి మధ్య గల పోలికలు, భేదాలు చెప్పగలగాలి.
- ఉపాధ్యాయుడు చెప్పిన పాఠ్యాంశం యొక్క ముఖ్యాంశాలను సొంతమాటల్లో చెప్పగలగాలి.

విషయావగాహన ఎలా పెంపొందించాలి?

పాఠ్యాంతర ప్రశ్నలను జట్లలో చర్చించటం ద్వారా పిల్లల్లో విషయావగాహన పెంపొందుతుంది.

ఉదా: 1. యుద్ధ సమయంలో సైన్యానికి పటాలు ఏవిధంగా ఉపయోగపడతాయి? (8వ తరగతి పేజి నెం. 8). పిల్లలు ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు చర్చించి రాస్తారు.

2. నీలగిరి చెట్లు – తేయాకు తోటలకు – అడవికీ మధ్య ఏమైనా తేడాలున్నాయా? తరగతిలో చర్చించండి: (8వ తరగతి పేజీ 57) చర్చతో బాటు ఈ దిగువ కృత్యాలను నిర్వహించటం ద్వారా విషయావగాహన కలిగించవచ్చు.

- చిత్రాలను పరిశీలించడం, చర్చించడం

- చదివి భావనలను అర్థం చేసుకోవటం
- వివిధ కార్యాలయాలు

ఉదా: పోలీస్ స్టేషన్, న్యాయస్థానం వంటివి పరిశీలించి బావనలను అర్థం చేసుకోవటం.

- ప్రాజెక్టులు పూర్తిచేసి వాటి నివేదికను తరగతిలో సమర్పించటం.

పిల్లలకు ఉపాధ్యాయుడు అందించాల్సిన సహాయం ఏమిటి? (ఉపాధ్యాయుని పాత్ర)

. పిల్లలు సమాచారం కోసం ఉపాధ్యాయునిపై ఆధారపడే వాతావరణం సృష్టించరాదు. స్వయంగా నేర్చుకొనేలా ప్రోత్సహించాలి.

. భావనలు అవగాహన పొందేలా బోధనాభ్యసన ప్రక్రియలుండాలి.

. పిల్లలు ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి. జట్టు పనులను, చర్చలను ప్రోత్సహించాలి.

. పిల్లల అభిప్రాయాలు అసంబద్ధమైనవిగా ఉన్నప్పుడు వారిని నిరుత్సాహపరచరాదు. సరియైన పద్ధతిలో ఆలోచించేలా సలహాలివ్వాలి. అవసరమైతే తాను ఆ గ్రూపులో కొద్దిసేపు పాల్గొనాలి.

. క్షేత్ర సందర్శనలు, ఇంటర్వ్యూ, ప్రాజెక్టు పనులు పూర్తయిన తర్వాత వారి అనుభవాలు, అభిప్రాయాలు, విశ్లేషణలు ఆధారంగా వారు తయారు చేసిన నివేదికలను తరగతి గదిలో చెప్పించి ప్రోత్సహించాలి.

ఉదాహరణలుగా కొన్ని ప్రశ్నలను పరిశీలిద్దామా?

1. ఏడవ తరగతిలో మీరు భూమధ్యరేఖా ప్రాంతం గురించి చదివిన దాన్ని బట్టి, దానికి ధృవ ప్రాంతంలో గల తేడాలు ఏమిటో చెప్పండి. (8వ తరగతి పేజి 48)
2. డబ్బు మార్పిడిని చెక్కులు ఏవిధంగా సులభతరం చేశాయి? (8వ తరగతి పేజి 88)
3. ప్రభుత్వం విధించిన భూమి శిస్తును గిరిజనులు కట్టలేక పోవడానికి గల కారణాలు ఏవి? (8వ తరగతి పేజి 58)
4. వివిధ భూస్వరూపాలను తెలిపి వాటిని శ్రేణి వారీగా వర్గీకరించడం. (8వ తరగతి)

విద్యార్థి స్మృతిలో దీర్ఘకాలిక స్మృతి, స్వల్పకాలిక స్మృతి ఉంటాయి. దీర్ఘకాలిక స్మృతి లో ఉన్న విషయానికి స్వల్పకాలిక స్మృతి ద్వారా మనం చర్చించే విషయాన్ని అనుసంధానం చేయాలి. తరగతిలో చర్చించడం, విద్యార్థి భాగస్వామి కావటం. పంచుకోవడం ద్వారా జ్ఞాన నిర్మాణం జరగటం వల్ల ఇది విద్యార్థి కేంద్రితమై అర్థవంతమైన అభ్యసనం (Meaningful Learning) అనబడుతుంది. దీనిని చురుకైన అభ్యసనం అని అంటారు. దీనిలో విద్యార్థి పూర్తిగా పాల్గొంటారు.

2. ఇచ్చిన పాఠ్యాంశాన్ని చదివి, అర్థం చేసుకొని వ్యాఖ్యానించటం : పిల్లలు పాఠ్యాంశాన్ని చదివి అందులోని విషయాన్ని అర్థం చేసుకొని వివిధ సందర్భాలలో పొందిన అనుభవం ఆధారంగా వ్యాఖ్యానం చేయగలగాలి.

పిల్లలు తమ తమ అభిప్రాయాలను చెప్పే విధంగా ప్రోత్సహించాలి. ఇది ప్రశ్నకు జవాబులివ్వడం అనేది కాకుండా వాస్తవస్థితులను అర్థం చేసుకొని వ్యాఖ్యానించేలా చేయాలి.

ఉదా: గాలి, నీరు, నేలలో విషపూరితమైన పదార్థాలు కలవటం మరొక ఉదాహరణ. అనేక పరిశ్రమలు, లోహాలు, రసాయనాలు వినియోగిస్తాయి. వాటి నుంచి వ్యర్థాలు వాగులు, నదులలో కలుస్తాయి. దీనివల్ల నీటిలో రసాయనాల మోతాదు గణనీయంగా పెరిగిపోతుంది. నీటిలోని పాదరసం వంటి రసాయనాలు సూక్ష్మజీవుల శరీరాల్లోకి ప్రవేశిస్తాయి. ఈ సూక్ష్మజీవులను చేపలు తిన్నప్పుడు అవి చేపల శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఈ చేపలను మనుషులు తిన్నప్పుడు వాళ్ళ ఆరోగ్యం దెబ్బతినే స్థాయికి పాదరసం చేరుకునే అవకాశం ఉంది.

. పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థాల వల్ల ఇంకా ఏ ఏ అనర్థాలున్నాయో తెలియజేయండి. ఈ పేరాలోని విషయంతో మీరు ఏకీభవిస్తారా? ఎందుకు?

సాధారణంగా మనం వార్తాపత్రికల్లో వార్తలు చదివి, అర్థం చేసుకొని వెంటనే దానిపై ఒక వ్యాఖ్య చేస్తాం. అలాంటిదే ఈ విద్యా ప్రమాణం.

3. సమాచార నైపుణ్యాలు

విద్యార్థుల పాఠ్యాంశాల అవగాహనకు అవసరమైన సమాచారాన్ని సేకరించాలి. సేకరించిన సమాచారాన్ని పట్టికల రూపంలో నమోదు చేయగలగాలి. విశ్లేషించాల్సిన అంశాలను దృష్టియందుంచుకొని పట్టికలో కాలమ్స్ నిర్ణయించుకోవాలి. సమాచార పట్టికలను పరిశీలించి, విశ్లేషించి వాటి ఆధారంగా నిర్ధారణ చేసి నివేదికలు రూపొందించాలి. దీని ద్వారా ఇతరులతో మాట్లాడటం. అవసరమైన విధంగా ప్రశ్నించడం, జట్టులో కలిసి పనిచేయడం వంటి లక్షణాలు పిల్లలకు అలవడతాయి.

ప్రాజెక్టు పనులు కూడా సమాచార నైపుణ్యాలలో భాగంగా నిర్వహించాలి. పిల్లలు సహజ వాతావరణములో తమంతట తాముగా అన్వేషించి, పరిశోధించి అవసరమగు సమాచారం సేకరించి ఒకే విషయం పట్ల గానీ, అంశం పట్ల గానీ అవగాహన ఏర్పరచుకొని నిర్ధారణకు రావడానికి దోహదపడే కృత్యాలనే ప్రాజెక్టులు అని పిలుస్తారు.

ప్రాజెక్టు పనులు కూడా సమాచార నైపుణ్యాలలో భాగంగా నిర్వహించాలి. పిల్లలు సహజ వాతావరణములో తమంతట తాముగా అన్వేషించి, పరిశోధించి అవసరమగు సమాచారం సేకరించి ఒకే విషయం పట్ల గానీ, అంశం పట్ల గానీ అవగాహన ఏర్పరచుకొని నిర్ధారణకు రావడానికి దోహదపడే కృత్యాలనే ప్రాజెక్టులు అని పిలుస్తారు.

సమాచార నైపుణ్యాలలోని సేకరణ, నమోదు, విశ్లేషణ, నిర్ణయానికి రావడం, నివేదిక తయారీ, నివేదికను సమర్పించుట అనే విషయాలు ఒక అంశానికి వర్తింపజేసిన అది ప్రాజెక్టుగా భావించాలి.

సమాచార నైపుణ్యాలలో దిగువ విధంగా చేయించవచ్చు.

ఉ|| 1. Text to table, 2. Table to questions, 3. Table to Graph, 4. Graph to questions, 5. Graph to table, 6. Graph to text, 7. Text to graph.... వీటిలో ఏది తగినది అనిపిస్తే దానికి సంబంధించిన కృత్యం ఇవ్వవచ్చు.

ఉదా:-

1. మీ ప్రాంతంలో పండే పంటల జాబితా తయారు చేసి వాటిని ఈ కింది పట్టికలో పొందుపరచండి.

క్ర.సం. పంటలు రకాలు పంటలు

1. ప్రధాన పంటలు
2. పప్పు ధాన్యాలు
3. నూనె గింజలు
4. ఆహారేతర పంటలు

2. ఆహార ధాన్యాల ఉత్పత్తి

పై గ్రాఫ్ను పరిశీలించి దిగువ ప్రశ్నలకు సమాధానం రాయండి.

1. 2000-01 నుండి 2010-11 వరకు ఆహారధాన్యాల ఉత్పత్తి ఎన్ని మి.టన్నులు పెరిగింది?
2. ఏ దశాబ్దంలో పెరుగుదల శాతం ఎక్కువగా ఉంది?
3. 1950-51 నాటి ఉత్పత్తికి 2010-11 నాటి ఉత్పత్తి దాదాపు ఎన్నిరెట్లు పెరిగింది?

ప్రశ్నలు అన్నీ ఒకే అంశాన్ని ప్రతిబింబించేలా ఉండకూడదు. విభిన్న కోణాలు స్పృశించేలా ప్రశ్నలుండాలి. విశ్లేషణకు అవకాశం ఇవ్వాలి.

3. చేనేత యూనిట్లలో మార్పు

చేనేత యూనిట్లలో మార్పు

| రాష్ట్రం | 1988 | 2009 |
|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 5,29,000 | 1,24,700 |
| గుజరాత్ | 24,000 | 3,900 |
| కర్ణాటక | 1,03,000 | 40,500 |
| మహారాష్ట్ర | 80,000 | 4,500 |
| మధ్యప్రదేశ్ | 43,000 | 3,600 |
| పంజాబ్ | 22,000 | 300 |
| తమిళనాడు | 5,56,000 | 1,55,000 |

పై పట్టికను పరిశీలించి దిగువ ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1. ఏ రాష్ట్రంలో చేనేత యూనిట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది?

2. 1988లో అత్యధిక, అత్యల్ప యూనిట్లు గల రాష్ట్రాలేవి?

3. 2009 నాటికి ఏ రాష్ట్రంలోనూ యూనిట్ల సంఖ్య పెరుగలేదు. ఎందుకో తెలుసా? విశ్లేషించుము.

4. సమకాలీన అంశాలపై ప్రతిస్పందించుట – ప్రశ్నించుట

విద్యార్థులు పాఠ్యాంశాలను విమర్శనాత్మకంగా అవగాహన చేసుకొని, జీవితంలో ఎదురయ్యే అనేక సమస్యలను పరిష్కరించుకోగలిగిన జ్ఞానం పొందవలసి యుంటుంది. కాబట్టి తరగతి గదిలో పాఠ్య విషయానికి మాత్రమే పరిమితం కాకుండా సమకాలీన అంశాలను విశ్లేషించడం ద్వారా విద్యార్థి ఫలితాలను రాబడతాడు. జరుగబోయే ఫలితాలను ఊహిస్తాడు. పాఠ్యాంశంలోని విలువలను అన్వయించుకుంటాడు. వివిధ సమకాలీన అంశాలపై తనకు గల వైఖరిని వ్యక్తం చేయగల్గుతాడు.

పాఠ్యాంశమును నిత్య జీవితానికి సంబంధించిన అంశాలతో జోడించాలి. పాఠాన్ని నేర్చుకుంటున్న సమయంలో ఆ కాలానికి సంబంధించిన సంఘటనలను తరగతిగదిలో చర్చించాలి. పిల్లలు ప్రశ్నించేలా చేయాలి. ఒక ప్రాంత ప్రజల జీవన విధానం గురించి చర్చించేటప్పుడు తమ ప్రాంత ప్రజల జీవన విధానంతో పోల్చమనడం ద్వారా సమకాలీన అంశాలు ప్రశ్నించబడతాయి. మయన్మార్ దేశంలో ప్రజాస్వామ్య ఉద్యమం గురించి చర్చించేటప్పుడు మన దేశంలో ప్రజాస్వామ్యం గురించి, ఇతర ఉద్యమాల గురించి ప్రతిస్పందించే విధంగా, పిల్లలకు ప్రశ్నించే అవకాశం కల్పించి లోతుగా ఆలోచించే విధంగా చేయాలి.

ఉదా॥ 1. "రోడ్డు భద్రతా విద్య" గురించి బోధన జరిపేటప్పుడు హైదరాబాద్ నగరంలోని ప్రమాదాల గురించి చర్చిస్తాడు. ఆ సమయంలో "ఈ రోజుల్లో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుటకు కారణాలు ఏమై ఉంటాయి? అనే ప్రశ్నవేసి చర్చింపజేయాలి. ఇతర ప్రశ్నలు పిల్లలు వేసేలా ప్రోత్సహించాలి.

2. 8వ తరగతి – 7వ పాఠం "ద్రవ్యం – బ్యాంకింగ్" బోధన చేసేటప్పుడు రహీం, లీల, శాంతల గురించి మాట్లాడేటప్పుడు అలాంటి పరిస్థితులున్నవారు మీ ప్రాంతాల్లో ఉన్నారా? అని ప్రశ్నించి, వారి పరిస్థితులపై చర్చింపచేయాలి.

5. పటనైపుణ్యాలు

సాంఘిక శాస్త్ర పాఠ్య పుస్తకాలలో వివిధ చిత్రాలు, పటాలు ఇవ్వబడినాయి. పటాలు అందం కోసం పొందుపరచినవి కావు. వాటిని చదవడం కోసం, చర్చించడం కోసం, వాటి గురించి మాట్లాడటం కోసం ఇవ్వబడినాయి. దీనితో విషయం సులభంగా అర్థమౌతుంది.

పటనైపుణ్యాలలో ప్రధానంగా మూడు అంశాలుంటాయి.

1. పటాలు గీయడం (Map Drawing)
2. పటాలు చదవడం (Map Reading)

3. పటాలలో వివిధ అంశాలను గుర్తించటం (Map Pointing)

పటనైపుణ్యాలు పెంపొందించడం ఎలా?

1. పటాలు పాఠ్యపుస్తకంలో వివిధ రంగుల్లో ఇవ్వడమైనది. వాటిని చదివి వివిధ ప్రదేశాలకు సంబంధించిన అంశాలను రాయించవచ్చు.

2. నదులు, రవాణా మార్గాలు, వివిధ ప్రదేశాలను గుర్తింపజేయవచ్చు.

3. గుర్తులు, సంకేతాలను బట్టి (పంటలు, ఖనిజాలు, పరిశ్రమలు మొ॥ విశ్లేషణలు చేయించవచ్చు.

4. రాజకీయ పటాల విశ్లేషణ – సరిహద్దులు, సరిహద్దు జిల్లాలు / రాష్ట్రాలు : సామ్రాజ్యాల విస్తరణ వంటి వాటిని గుర్తించటం, చదవటం చేయించవచ్చు.

5. అట్లాస్, గోడపటాల ద్వారా రకరకాల కృత్యాలు చేయించవచ్చు.

ఉదాహరణలు

పటాలు గీయడం : 1. భారతదేశం ఔట్‌లైన్ పటం గీయండి.

2. గ్రామం / పాఠశాల పటం గీయడం.

పటాలను చదవటం

ఉదా: 7వ తరగతిలోని 17వ పాఠం పేజి నెం.152లోని 3వ పటం పరిశీలించండి.

ఎ) ఈ పటములో కనిపిస్తున్న బ్రిటిషుపాలనలోని రాజ్యాలు ఏవి?

బి) 1857 నాటికి బ్రిటిషు పాలనలో లేని రాజ్యాలు ఏవి?

పటంలో గుర్తించడం:

ఉదా: భారతదేశ పటంలో దిగువ సూచించిన ఇనుము – ఉక్కు కర్మాగారాలను గుర్తించుము.

1. భద్రావతి 2. భిలాయ్ 3. రూర్కెలా 4. బొకారో 5. జంషెడ్‌పూర్

6. ప్రశంస / అభినందన – సున్నితత్వం

పాఠ్యబోధన ద్వారా పిల్లల్లో "తోటి వారితో కలిసి పనిచేయటం, ఇతరుల అభిప్రాయాలను గౌరవించటం, స్వేచ్ఛగా ప్రశ్నించటం, అవసరమైన వారికి సహాయం చేయడం వంటి లక్షణాలు, వైఖరులు అలవర్చడం ద్వారా ప్రశంస / అభినందన అనే విద్యా ప్రమాణం సాధించగలం.

ఈ విద్యా ప్రమాణం పెంపొందించడానికి ఉపాధ్యాయులు ఏమేం చేయాలి?

. పిల్లలచే వివిధ సమస్యలపై తమ స్పందనను తెలిపే నినాదాలు, పోస్టర్లు, కరపత్రాలు తయారు చేయించవచ్చు.

. వివిధ సమస్యలపై విశ్లేషణ చేస్తూ పత్రికలకు, అధికారులకు లేఖలు రాయించవచ్చు.

. స్వేచ్ఛ, సమానత్వం, సౌభాతృత్వం, న్యాయం, దేశ సమైక్యత వంటి రాజ్యాంగపరమైన విలువలు కూడా పెంపొందించాలి.

. సభలు, సమావేశాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలి.

. జీవన నైపుణ్యాలు పెంపొందించాలి.

. వివిధ వ్యక్తులు, తోటివారు చేసిన మంచి పనులను ప్రశంసించగలిగే వైఖరిని నిర్మాణం చేయాలి.

. దయ, ప్రేమ, వంటి మానవతా విలువలు పిల్లల్లో కల్పించాలి.

. పాఠం చర్చించేటప్పుడు పిల్లల్లో సంబంధిత చిత్రాలు రూపం దాల్చుతాయి. ఆ చిత్రాలు గురించి మౌఖికంగా చెప్పించాలి లేదా రాయించాలి.

ఉదా॥ ప్రశ్నలు

1. కళాకారులను మనం ఏవిధంగా గౌరవించాలి?
   ఈనాడు కళాకారుల స్థితి ఎలా ఉంది? (8వ తరగతి – పాఠం 21)

2. మీ ప్రాంతంలో మత సామరస్యం సాధించడానికి ఏమి చేయాలో తెలియజేస్తూ ఒక కరపత్రం తయారుచేయండి. (8వ తరగతి పాఠం 20)

3. 'సమానత్వం' ప్రధాన భావనగా 2 నినాదాలు తయారుచేయండి. (8వ తరగతి – పాఠం 13)

విద్యా ప్రమాణాలు కేవలం పరీక్షల సమయంలో, ప్రశ్నాపత్రంలో ఇవ్వడానికి, విద్యార్థిని ప్రశ్నించడానికి ఉద్దేశించినవి కావు. ప్రతి పాఠం బోధించేటప్పుడు ఆ పాఠంలో ఎక్కడెక్కడ ఏయే విద్యా ప్రమాణాలు పొందుపరచబడి ఉన్నాయో ఉపాధ్యాయుడు గుర్తించి, వాటిని దృష్టి యందుంచుకొని పాఠం బోధించాలి. సమకాలీన అంశాలు ఏ సందర్భంలో చర్చించాలో ముందుగా ఆలోచించుకోవాలి. పటనైపుణ్యాలు, సమాచార నైపుణ్యాలు తరగతిగదిలో ఏయే అంశాలపై దృష్టి ఉంచాలో, అవి ఏ సమయంలో నిర్వహించాలో ప్లాన్ చేసుకోవాలి. పాఠం పూర్తయ్యేసరికి ఆ పాఠంలోని ఆరు విద్యా ప్రమాణాలు పూర్తిగా చర్చించబడాలి. విద్యార్థి ఏం నేర్చుకున్నాడో తెలుసుకోవటానికి మూల్యాంకనం ఉద్దేశించబడలేదు. మూల్యాంకనం విద్యార్థి నేర్చుకోవటానికి దోహదపడేది అనే విషయం మరువరాదు.

## 3.4 సాంఘికశాస్త్రం – బోధన పద్ధతులు, ఉపగమాలు

అభ్యసనానికి పునాది ప్రేరణ. ఉపాధ్యాయుడు సరైన బోధనావ్యూహాన్ని ఎన్నుకోవడం ద్వారా విద్యార్థిలో ప్రేరణ కలిగించవచ్చు. ఉదా: పొగడటం, గుర్తింపునివ్వడం, బహుమతులు ఇవ్వడం మొదలైన పునర్బలన చర్యలు మెరుగైన అభ్యసనాన్ని పెంపొందిస్తాయి.

ఉపాధ్యాయులకు, అభ్యాసకులకు, బోధనాభ్యసనవ్యూహాలు అనేక రకాలైన కృత్యాలనందిస్తాయి. ఉదా: పరిశీలించడం, సామగ్రులను, సమాచారాన్ని సేకరించడం, ప్రదర్శన, ప్రయోగాలు, ప్రాజెక్టు నియోజనాలు, క్రీడా పద్ధతి కార్యక్రమాలు, విద్యా సంబంధిత ఆటలు, విజ్ఞానయాత్రలు, పాత్రపోషణ, నాటకీకరణ, బృందచర్చ (Group Discussion), ఇతర సామూహిక కృత్యాలు, నిగమన – ఆగమన బోధన, సమస్యా పరిష్కారం అన్వేషిస్తూ అభ్యసనం, సృజనాత్మకంగా రాయటం మొదలైనవి.

విద్యాగమ్యాలను సాధించటం కోసం అనేక వ్యూహాలు రూపొందాయి. ఇలా అభ్యసన ప్రక్రియను నిర్దేశించే బోధనా వ్యూహం ఏ ఒక బోధనా పద్ధతి సంపూర్ణంగా ఉత్తమ పద్ధతి లేదా

దోషభూయిష్టమైన పద్ధతి రాదు ఏదీ లేదు. అందువల్ల బోధనా పద్ధతి సరళంగా (flexible) నిర్వర్తించతగింది (workable) గానూ ఉండాలి.

**బోధన పద్ధతులు – భావన – వర్గీకరణ:**

బోధనాభ్యాసనా ప్రక్రియను ప్రభావితం చేయడానికి, మనం ఒక అనుకూలమైన బోధన పద్ధతిని అవలంభించాలి. అందువల్ల విషయాలను విద్యార్థులకు వారి మానసిక స్థాయిల ప్రకారం, తరగతి ప్రకారం ప్రదర్శించగలం. "మాధ్యమిక విద్యా కమిషన్ వారు తెలిపినట్లు ఉత్తమమైన ప్రణాళిక అనేది సరియైన బోధనా పద్ధతుల వల్ల, సరియైన ఉపాధ్యాయుల వల్ల సజీవంగా ఉ ంటుంది. ఈ రెండు లేకపోతే ఇవి నిర్జీవాలుగా తయారవుతాయి."

ప్రతిభావంతుడైన ఉపాధ్యాయుడు సరియైన పద్ధతిని ఎప్పుడైతే ఉపయోగిస్తాడో అప్పుడు తన విద్యార్థులను సాంఘికాధ్యయనాల ఆశయాలు, లక్ష్యాలవైపు విజయవంతంగా ప్రయాణించ నిర్దేశించడాన్ని ఆశించగలడు.

వెస్లీ, రాన్స్‌ప్లీలు, "అభ్యసన ప్రక్రియను నిర్దేశించడానికి ఉపాధ్యాయుడు అనుసరించే విధమే పద్ధతి" అని నిర్వచించారు.

విద్యార్థికి జ్ఞానం అందించడానికి ఉపాధ్యాయుడు ఉపన్యాస పద్ధతి, పాఠ్యపుస్తక పద్ధతి, చర్చాపద్ధతి మొదలైన వానిని ఉపయోగించవచ్చు. వాంఛనీయ మార్పులు, వైఖరులను, నైపుణ్యాలను వృద్ధిపరచడానికి ప్రాజెక్టు పద్ధతి. సమస్యా పద్ధతి, ప్రయోగ పద్ధతి, వనరుల పద్ధతి శ్రేష్టమైనవిగా భావించవచ్చు. వీటిని ఉపాధ్యాయ కేంద్రిత పద్ధతులు, విద్యార్థికేంద్రిత పద్ధతులుగా కూడా విభజించవచ్చు.

ఈ పాఠ్యవిభాగంలో మనం విద్యార్థులలో భావనలను, విజ్ఞానాన్ని పెంపొందిచడానికి, వారిలో వైఖరులను, నైపుణ్యాలను పెంపొందించడానికి తోడ్పడే వివిధ బోధన పద్ధతుల ఉపగమాలను పరిశీలిద్దాం.

**ఉపగమం – స్వభావం, నిర్వచనం:**

ఏదో ఒక దానిని ఆదరించడం, నిర్వహించడాన్ని ఉపగమమని అంటారు. ఉపగమం అంటే తరగతి గదిలో మనం సాంఘికశాస్త్రాన్ని బోధించే విధానం.

ఉపాధ్యాయుడు బోధనను సరైన విధంగా అమలుజరిపే ఈ ప్రక్రియకు సరైన విధానం కావాలి. ఈ విధానం పాఠ్యాంశాన్ని ఎలా, ఏ పద్ధతుల్లో బోధించాలో తెలియచేస్తుంది. ఉపాధ్యాయుడు మొదట తన ధోరణిని నిర్ణయించుకోవాలి. ఎందువల్ల అంటే ముందు ముందు అది తన ప్రయత్నాలకు సహకరిస్తుంది. ఉపాధ్యాయుడి ధోరణి తన కార్యక్రమంలోని వివిధాంశాలను స్థిరపరుస్తుంది. ఈ ధోరణినే 'ఉపగమం' (approach) అంటారు. దీని ఆధారంగానే ఉపాధ్యాయుడు బోధనావ్యూహాలను, బోధనా పద్ధతులను రూపొందించుకుంటారు.

సాధారణంగా బోధనలో మూడు అంశాలు ప్రాధాన్యం పొందుతాయి. అవి (1) బోధకుడు, (2) బోధనాంశం, (3) బోధనావ్యూహం. అంతేకాక బోధన అభ్యాసకుని స్థాయిని, అభిరుచిని,

పూర్వజ్ఞానాన్ని ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకొని జరపవలసిన ప్రక్రియ. అందువల్ల బోధనలోని ప్రతి వ్యూహాన్ని ఉపాధ్యాయులు తెలుసుకోవాలి.

ఒక విషయాన్ని ప్రతి ఉపాధ్యాయుడు ఒకే మాదిరిగా బోధించడు. అదీకాక బోధనాంశాలన్నీ ఒకే మాదిరిగా ఉండవు. అందువల్ల ఉపాధ్యాయుడు శ్రద్ధగా ఆలోచించి తన బోధనావ్యూహాన్ని ఎప్పటికప్పుడు రూపొందించుకోవాలి. కాబట్టి ప్రతి ఉపాధ్యాయుడు వివిధ బోధనావ్యూహాల గురించి, వివిధ బోధనా పద్ధతుల గురించి వృత్తిపూర్వక శిక్షణలో అభ్యాసించాలి.

ప్రక్షేపణ పద్ధతి, ప్రకల్పనా పద్ధతి (Project Method)

ఈ పద్ధతి జాన్ డ్యూయీ ప్రతిపాదించిన వ్యవహారిక సత్తావాదంలోని విద్యాతత్వ ఫలితం. ఇది అభ్యసనానికి కార్యకలాప దృక్పథాన్నిస్తుంది. విద్యార్థులు "జీవించడానికి నేర్చుకోక" (Not learning to live) "జీవిస్తూ నేర్చుకోవాలి" (Learning through living) అనే సూత్రంపై ఈ ప్రాజెక్టు పద్ధతి ఆధారపడింది. వాస్తవిక సన్నివేశంలో ఒక కార్యాన్ని పూర్తి చేయడానికి భౌతిక, మానసిక కృత్యాలనుపయోగించే ప్రక్రియ ప్రాజెక్టు.

డా. కిల్‌పాట్రిక్ ప్రాజెక్టు అనే పదానికి ఇచ్చిన నిర్వచనం ప్రకారం ఇది "సాంఘిక పరిసరాల్లో హృదయపూర్వకంగానూ, ఉద్దేశ పూర్వకంగానూ కొనసాగే ఒక కార్యకలాపం" (wholehearted purposeful activity proceeding in a social environment). ఇలా విద్యార్థి హృదయపూర్వకంగానూ, ఉద్దేశపూర్వకంగానూ స్వీకరించే ఏ కార్యకలాపాన్నైనా ప్రాజెక్టు కింద చేర్చవచ్చు.

జె.ఎ. స్టీవెన్‌సన్ ఇచ్చిన నిర్వచనం ప్రకారం ప్రతి ప్రాజెక్టు "సహజమైన సన్నివేశంలో పూర్తిచేసిన సమస్యాత్మక కార్యకలాపం" (The project is a problematic act carried to completion in its natural setting).

"నిజ జీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్షణాత్మక కృత్యమే ప్రాజెక్టు" అని బైనింగ్ అండ్ బైనింగ్ నిర్వచించారు. బిల్లార్ట్ అభిప్రాయం ప్రకారం "పాఠశాల వాతావరణంలోనికి తీసుకొచ్చిన జీవిత అంశమే ప్రాజెక్టు" (A project is a bit of real life that has been imported into the school).

ఈ నిర్వచనాలను పరిశీలిస్తే ప్రక్షేపణ (ఎ) లక్షణాత్మక కృత్యమని, (బి) దానిని విద్యార్థులు పథకం ప్రకారం సహజమైన సన్నివేశంలో సాధించాలని విశదమవుతుంది. అంతేకాక ప్రాజెక్టు అనే పదం ఎంతో విశాలమైన అర్థాన్ని సూచిస్తుందని తెలుస్తుంది. దీనిలో నాటకీకరణ, బహిరంగ ఉత్సవం లేదా వేడుక (జ్ఞుఖ్రమ్ఘుత్ం), నమూనాలను తయారుచేయడం, పటాలను, చార్టులను గీయడం, చిత్రాల సేకరణ, క్షేత్రయాత్రలకు పోవడం, ఇంకా ఇతర విద్యా సంబంధిత నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టడం ద్వారా "విద్యార్థులు ముఖ్యమైన నైపుణ్యం లేదా ఒక ప్రక్రియను నేర్చుకొంటారు.

ఇలా ప్రాజెక్టులో అనేక రకాల కార్యకలాపాలు – మానసిక, చలనాత్మక లేదా నేర్పుతో పనిచేసే కృత్యాలు చేరి ఉంటాయి. ప్రాజెక్టులు కృత్యాలను బట్టి సులభంగా గాని, సంక్లిష్టంగా గాని

ఉంటాయి. వ్యక్తిగత ప్రాజెక్టును ఒక వ్యక్తి నిర్వహిస్తాడు. సమిష్టి ప్రాజెక్టును లేదా సాంఘిక ప్రాజెక్టును వ్యక్తుల బృందం నిర్వహిస్తుంది.

ప్రాజెక్టు పద్ధతిలోని సోపానాలు

**1. సన్నివేశాన్ని ఏర్పరచడం** (Providing a situation):

ప్రాజెక్టును ఎన్నిక చేసుకోవడానికి ముందుగా ఉపాధ్యాయుడు కొన్ని సన్నివేశాలను ఏర్పరచాలి. ఈ సన్నివేశాలలో విద్యార్థులు చురుకుగా పాల్గొనేటట్లు చేయాలి. విద్యార్థులు సన్నివేశాలలో పాల్గొనేటప్పుడు సంభాషణలు, చర్చల ద్వారా అధ్యాపకులు విద్యార్థుల అభిరుచులు, అవసరాలు, ఆసక్తులు, సహజ సామర్థ్యాలను కనుక్కోవచ్చు. వివిధ అంశాలపై సంభాషణలు, కట్టడాలు, నగరాలకు చెందిన చిత్రాలపై చర్చలు, కథలు చెప్పడం, విహారయాత్రను నిర్వహించటం మొ॥ వాటిలో కూడా సన్నివేశాలు ఏర్పరచాలి. ఇట్లా ఏర్పడిన సన్నివేశాలలో పాల్గొనే విద్యార్థులకు అన్వేషణాశక్తి కలిగించాలి. ఆయా సన్నివేశాలలో విద్యార్థులు వివిధ సమస్యలనెదుర్కొంటారు. వారికి కలిగిన అనుభావాలను బట్టి మరికొన్ని విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస సహజంగా కలగాలి. అంతేగాని సన్నివేశాలను, తదనుగుణమైన ప్రాజెక్టులను ఉపాధ్యాయుడు విద్యార్థులపై బలవంతంగా రుద్దరాదు.

**2. ఎంపిక చేసుకోవడం, ధేయ్యాన్ని రూపొందించడం** (Choosing & Purposinmg):

సన్నివేశాన్ని ఏర్పరచిన తరువాత మంచి ప్రాజెక్టును ఎంపిక చేయాలి. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగాను, ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టును ఎంపిక చేయాలి. ఈ దశలో ఉపాధ్యాయుడు విద్యార్థులు వారి వారి అభిరుచులకు తగిన ప్రాజెక్టులను ఎన్నుకోవడంలో సహాయపడాలి.

ప్రాజెక్టును ఎంపిక చేసిన తరవాత ధ్యేయాన్ని రూపొందించటం చాలా ముఖ్యం. ప్రాజెక్టు నిర్వచనంలో కూడా ఉద్దేశ్యపూర్వకమైన కార్యకలాపానికి ఉద్ఘాటన ఇవ్వడం జరిగింది. అందువల్ల ఎంపిక చేసిన ప్రతి ప్రాజెక్టు వల్ల ఒక నిర్దిష్ట అవసరం లేదా ప్రయోజనం సిద్ధించాలి. దానికి ప్రాజెక్టువల్ల సాధించవలసిన ప్రయోజనాలను నిర్ధారించాలి. దీనిలో ఉపాధ్యాయుడు తగు సూచనలిస్తూ, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్ణయాలను తీసుకోవాలి. ప్రాజెక్టును తామే ఎంపిక చేసుకొన్నామనే భావన విద్యార్థులలో కలగాలి.

**3. ప్రణాళికా రచన** (Planning):

ప్రాజెక్టును ఎంపిక చేసిన తరవాత దానిని నిర్వహించానికి ఒక పథకాన్ని తయారుచేయటం అవసరం. ప్రాజెక్టు పద్ధతిలోని ముఖ్యమైన సూత్రాలలో ఒకదాని ప్రకారం ఉపాధ్యాయుని మార్గదర్శకత్వం కింద విద్యార్థులు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. ప్రతి విద్యార్థి సూచనలను ఇవ్వాలి. వివిధ ప్రతిపాదనలను తీసుకోవాలి. ప్రత్యామ్నాయాలను ఆలోచించాలి. వనరులను, పథకాలలోని పరిమితులను దృష్టిలోనికి తీసుకొని ఒక పథకాన్ని రూపొందించి, విద్యార్థులను తమ ప్రాజెక్టు పుస్తకంలో

ఒక పథకాన్ని రాయమని అడగాలి.

**4. ప్రణాళికను నిర్వర్తించడం** (Executive the plan):

ప్రాజెక్టు పద్ధతి సోపానాలలో ఇది అతి ముఖ్యమైంది, దీర్ఘమైన సోపానం. ఇందులో విద్యార్థులందరూ సహకారంతో అనేక కృత్యాలను నిర్వహించవలసి ఉంటుంది. ప్రాజెక్టులోని విభిన్న కార్యకలాపాలను తరగతిలోని విద్యార్థుల వ్యక్తిగత ఆసక్తుల ప్రకారం సామర్థ్యం ప్రకారం విభజించాలి. ఇందులో ఉపాధ్యాయుడు విద్యార్థులకు తగిన సూచనలివ్వాలి గానీ, వారిని నియంత్రించరాదు. ఈ దశలో విద్యార్థులు తాము నిర్వహించే కృత్యాల ద్వారా ఉపయోగకరమైన అనుభవాలను పొందుతారు. సమాచారాన్ని సేకరించడం, వివిధ భాషలలో చదివి రాయటం, స్థలాలను, వ్యక్తులను సందర్శించడంలో, ప్రముఖులతో జరిపే పరిపృచ్ఛలో (interview) మాతృకలను (specimens) పరిశీలించడంలో, పటాలను, చార్టులను పరిశీలించడం, తయారుచేయడంలో, సేకరించిన దత్తాంశాల ఆధారంగా రేఖాపటాలను, డయాగ్రమ్‌లు గీయడంలో, విలువలను లెక్కకట్టడంలో, ధరలను తెలుసుకోవడంలో, లేఖలు రాయడంలో, కృతజ్ఞతలు తెలపడంలో, ధరలను లెక్కచూడటంలో, వివిధ వస్తువుల నమూనాలను సేకరించడం, మార్కెట్లను, మ్యూజియమ్‌లను, జంతు ప్రదర్శనశాలను దర్శించటం మొ॥ వాటిల్లో విద్యార్థులు ప్రాజెక్టు పూర్తయ్యేవరకు నిమగ్నులై ఉంటారు.

**5. ఉపయుక్తత లేదా మూల్యాంకనం** (Judging or evaluation)

పనిని పూర్తి చేసిన తరవాత దానిని సమీక్షించాలి. విద్యార్థులు తమ తప్పులను తెలుసుకొని పథకం ప్రకారం కార్యకలాపాలన్నీ నిర్వహించిందీ, లేనిదీ ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇది చాలా ముఖ్యమైన శిక్షణ పొందే మార్గం. దీనిని నిర్లక్ష్యం చేయరాదు. ఎందుకంటే, వారు చేసిన లోపాలను గుర్తుపెట్టుకోవడం వల్ల ముమ్ముందు చేపట్టవలసిన ప్రాజెక్టులలో తిరిగి అవి జరుగకుండా జాగ్రత్త వహిస్తారు. ఇంతేగాక కార్యక్రమాలను నెరవేర్చడంలో వారు తెలుసుకొన్న నూతన జ్ఞానాన్ని గుర్తుంచుకోవాలి.

**6. నమోదు చేయటం** (Recording):

విద్యార్థులంతా ఒక ప్రాజెక్టు పుస్తకాన్ని తయారుచేసుకోవాలి. దీనిలో ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని కార్యకలాపాలను నమోదు చేయాలి. ఈ రికార్డులో ప్రాజెక్టు ఎంపికను, దాని పథకరచనను, దానికి సంబంధించిన చర్చలను, కేటాయించిన విధులను, పొందిన అనుభవాలను, పరామర్శించిన గ్రంథాలు, సంచికలు, సేకరించిన సమాచారం, ఎదుర్కొన్న కష్టాలు, కలుసుకొన్న వ్యక్తుల పేర్లు మొదలైన వాటిని నమోదు చేసుకోవాలి.

ఈ ప్రాజెక్టు పుస్తకాన్ని జాగ్రత్తగా నిర్వహిస్తే మున్ముందు చేపట్టే ప్రాజెక్టులకు ఉపయోగపడుతుంది. ఎందుకంటే విద్యార్థులు తాము గడించిన అనుభవాలను ఇందులో భద్రపరుస్తారు.

ఉదాహరణ-1: రిపబ్లిక్ దినోత్సవాన్ని విద్యార్థులు ప్రాజెక్టుగా తీసుకోవచ్చు. దీనిలో ఈ కింది అంశాలను చేర్చాలి.

- ఈ రోజును మనం ఎందుకు ఉత్సవంగా చేసుకుంటాం ?
- పాఠశాల ఉత్సవ కార్యక్రమం
- వివిధ పద్దుల కింద ఖర్చుల అంచనాలు, బడ్జెట్ తయారుచేయడం
- ఖర్చులకు నిధులను ఎక్కడ నుంచి తీసుకోవాలి?
- స్థానికంగా చేసిన వసూళ్ళ లెక్కలు
- విద్యార్థుల నుంచి వసూలు చేసిన నిధుల లెక్కలు
- కార్యక్రమంలోని వివిధ అంశాలను తయారుచేసుకొని ఏర్పాటు చేసుకోవడం
- కార్యక్రమానికి చేసిన కొనుగోళ్ళు
- చేసిన ఖర్చుల లెక్కలను రాసి ఉంచటం
- వివిధ కార్యక్రమాలను నిర్వహించడం
- ఉత్సవం అంతటినీ మూల్యాంకనం చేయడం

ఉదాహరణ-2: "బుద్ధుని జీవితంపై బహిరంగ ఉత్సవం లేదా వేడుక నిర్వహించడం

చరిత్ర: బుద్ధుని జీవిత సమాచారానికి వనరులను పరిశీలించి నేటి సాంఘిక, మరియు రాజకీయ పరిస్థితులను పరిగణన చేయడం.

భూగోళశాస్త్రం: బుద్ధుని జీవితానికి సంబంధించిన వివిధ ప్రదేశాలు, వీటిని చూపే పటాలను తయారుచేయడం

భాష: బుద్ధుని జీవితం గురించి తెలిపే పుస్తకాల పఠనం, ప్రాజెక్టు వివరాలను రాయడం

మతాలు: బుద్ధుని బోధనలైన అహింస, సత్యం, అందరిపై ప్రేమ, అంటరానితనం వల్ల కలిగే హాని మొదలైనవి.

పౌరశాస్త్రం: ప్రాజెక్టును విజయవంతం చేయడానికి సహకార భావం

చిత్రలేఖనం: రంగస్థలాన్ని తయారుచేయడం, దీపాలను ఏర్పరచడం

కళ: ప్రాజెక్టును సుందరంగా ఉండేటట్లు చేయడం

ప్రయోజనాలు:

- అభ్యసన మనోవిజ్ఞానశాస్త్ర సూత్రాలపై ఆధారపడి వుంది.
- శ్రమకు గౌరవం అనే భావన పెంపొందుతుంది
- విద్యార్థులు సామూహికంగా పనిచేయడం వల్ల వారి మధ్య సహకారం పెంపొంది ప్రజాస్వామ్య లక్షణాలు అలవరచుకొంటారు
- విద్యార్థులు బట్టీపట్టవలసిన అవసరం ఉండదు
- ఆత్మవిశ్వాసం, స్వయంకృషి మొదలైన మంచి భావనలు పెంపొందుతాయి
- అన్ని సబ్జెక్టుల మధ్య సహ సంబంధం స్థాపించవచ్చు

- సామాజిక క్రమశిక్షణ అలవడుతుంది
- నిజ జీవితానికి అనువైన పద్ధతి
- సమస్యా పరిష్కారానికి పురికొల్పుతుంది
- క్రమశిక్షణ అలవడుతుంది

**పరిమితులు :**

1. ఈ పద్ధతి ద్వారా సంపాదించిన జ్ఞానం సహేతుకంగాను, క్రమంగాను ఉండక అస్తవ్యస్తంగా వుంటుందని కొందరి అభిప్రాయం.
2. కాలయాపనతో కూడుకుంది, అందుబాటులో లేనిది, ఖర్చుతో కూడుకుంఉది
3. ఉపాధ్యాయునికి శ్రమతో కూడుకున్న పని – అన్ని విషయాలలో ప్రతి ఉపాధ్యాయుడు సమర్ధుడు కాదు. ఇంతేకాక ప్రాజెక్టు పద్ధతి ప్రకారం రాసిన పాఠ్య గ్రంథాలు అందుబాటులో లేవు కాబట్టి ఈ పద్ధతి ఉపయోగించడం ఉపాధ్యాయులకు కష్టతరం.
4. పాఠశాల కార్యక్రమాలను తారుమారు చేస్తుంది. ఈ పద్ధతిలో కచ్చితమైన కాలనిర్ణయ పట్టికను అనుసరించడం సాధ్యంకాదు. ఖచ్చితమైన విద్యా ప్రణాళిక పాఠశాల విద్యా సంవత్సరం ముగిసేటప్పటికి పాఠ్యప్రణాళికను పూర్తి చేయడం కష్టం.
5. విద్యార్థులందరూ సమాన అభ్యసనం చేయడం కష్టం.
6. విద్యార్థి విద్యను తరువాతి దశలో ముఖ్యమైన అభ్యసన పరికరాలను ప్రాజెక్టు పద్ధతిలో అసంపూర్తిగా నేర్చుకోవడం జరుగుతుంది.
7. ప్రాజెక్టును స్వీకరించటం, వదిలివేయటం ఇష్టప్రకారం జరిగేపని.
8. క్రమబద్ధమైన నిరంతర బోధన సాధ్యం కాదు.

వ్యక్తిగత లేదా ఇరుగుపొరుగున నివసించే విద్యార్థులకు సమిష్టి ప్రాజెక్టును, ఇంటి ప్రాజెక్టులూ ఇవ్వవచ్చు. వారంలో ఒక రోజును ప్రాజెక్టు పనికి కేటాయించవచ్చు. ఉపాధ్యాయుడు మొదటి రెండు సోపానాలను, చివరి సోపానాన్ని తరగతిగదిలో చేపట్టి, నిర్వహించడాన్ని ఇంటివద్ద చేయవచ్చు.

కృత్యం: సాంఘికాధ్యయనాలలోని కొన్ని ప్రాజెక్టులను గుర్తించి, వాటిలో ఒకదానిని విద్యార్థులతో ఎలా నిర్వహింపచేస్తారో వివరించండి.

**సమస్యా పద్ధతి:**

దీనిని సమస్యాపరిష్కార పద్ధతి అని కూడా అంటారు. గమ్యం చేరడానికి అధిగమించవలసిన ఒక రకమైన ఆటంకం లేదా కష్టం అనేదే సమస్య. సమస్యా పరిష్కారం కనుక్కొనే ప్రయోజనంతో, ఒక కష్టాన్ని ప్రణాళికాబద్ధంగా ఎదుర్కొనే సన్నాహమే సమస్యా పరిష్కార పద్ధతి అనవచ్చు.

సి.వి.గుడ్ నిర్వచించినట్లు "సమస్యాపద్ధతి పరిష్కారాన్ని అభ్యర్థించే సన్నివేశాలను సవాళ్ళవలె సృజించి, దాని ఫలితంగా అభ్యసనాన్ని ప్రేరేపించే బోధనా పద్ధతి. ఇది ఒక ప్రత్యేక పద్ధతి ద్వారా అనేక చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తూ, చివరిగా పెద్ద సమస్యను పరిష్కరించే విధానం."

తరగతి గది సమస్యలు స్వభావంలోను, సంక్లిష్టతలోను విభిన్నంగా ఉంటాయి. సరలీకృతమైన సమస్య ఒక మామూలు ప్రశ్న రూపంలో ఉండి, దాని పరిష్కారం విషయజ్ఞానం మీద ఆధారపడి ఉ

ంటుంది. కష్టమైన సమస్య యూనిట్ ఆకారంలో ఉంటుంది. భారతదేశంలో కులమత ప్రాతిపదికపై శాంతి ఎలా లభ్యమౌతుంది? భారతదేశం ఒక జాతి (Nation) అవునా, కాదా? భారతదేశంలోని లౌకిక రాజ్యాన్ని ఎలా బలీయం చేయాలి? మనం దేశంలోని ఆర్థిక వ్యవస్థను ఇంకా మిశ్రమ వ్యవస్థగా ఉంచాలా? వంటి ప్రశ్నలు కొన్ని సమస్యలుగా చెప్పవచ్చు.

బైనింగ్ పేరుగల ఇద్దరు అమెరికన్ రచయితలు కూడా పై సమస్యలను ప్రశ్నల రూపంలోనే ఉదహరించారు. ప్రతి ప్రశ్నకు సమాధానం ఎలా అవసరమో ప్రతి సమస్యకు పరిష్కారం అంతే అవసరం. అంతేకాక ప్రశ్నల రూపంలో వ్యక్తం చేసిన సమస్య విద్యార్థులకు తగిన ప్రేరణ నిస్తుంది. సమస్యల పరిష్కారం కోసం తగిన సమాచారాన్ని, వాస్తవాలను సేకరించాలి. వాటిని వివిధ ఆధారాల నుంచి కొన్ని వారాల్లో గాని, ఇంకా ఎక్కువ కాలంలో గాని సేకరించాలి.

సమస్య పరిష్కారంలోని సోపానాలు:

సమస్యా పరిష్కారం జాన్‌డ్యూయీ కృషి వల్ల ఒక బోధనా పద్ధతిగా అభివృద్ధి చెందింది. దీనిలో ఈ క్రింది బోధనా సోపానాలను రూపొందించారు.

1. సమస్యను గుర్తించడం, నిర్వచించడం
2. పరికల్పనలు చేయడం
3. సమాచారం సేకరించటం, అన్వయించటం
4. నిర్ధారణాంశాలను తీసుకొని, సాధారణీకరణాలను రూపొందించటం

## 1. సమస్యను గుర్తించడం, నిర్వచించడం

మీరు విద్యార్థులు ప్రశ్నలడిగే అవసర సందర్భాలను కల్పించాలి. కొన్ని సందర్భాలలో మీరు విద్యార్థులలో చింతనాపూర్వకమైన మానసికస్థితిని, హేతువాదనను కలిగించి ప్రశ్నలను అడగాలి. పై రెండు సందర్భాలలోనూ విద్యార్థులు సమస్యను గుర్తించే అవకాశం ఉంది. అయితే ఈ సమస్యలు విద్యాప్రణాళికకు అనుగుణంగా ఉండాలి, అనేకమంది విద్యార్థులు స్వీకరించడానికి వీలుగా ఉండాలి.

విద్యార్థులు నిర్దిష్టమై, స్పష్టమైన భాషలో తమ సమస్యను స్వీకరించాలి. సమస్యను నిర్వచించేటపుడు విద్యార్థికి ఉపాధ్యాయుడు తోడ్పడాలి. దీని వివరణ రాసుకొమ్మని వారిని అడగాలి. సమస్యను నిర్వచించడంలో పరిధిని పరిమితం చేయవచ్చు.

ఉదాహరణకు ఈ క్రింది ప్రశ్నలను సమస్యలుగా పరిణగించవచ్చు.

- మన ప్రభుత్వాలకు ఆర్థిక వనరులెలా సమకూరుతాయి?
- మానవ అవసరాలు ఎలా నెరవేరుతాయి?
- వస్తువులకు, సేవలకు మనం ఏ విధంగా విలువను చెల్లిస్తాం?
- జీవనోపాధిని పొందే మార్గాలేవి?
- ప్రపంచశాంతికి ఐక్యరాజ్యసమితి చేసే సేవ ఏమిటి?

**2. పరికల్పనలు చేయడం:**

ఈ సోపానంలో సమస్యను విశ్లేషించి దానిలోని వివాదాంశాలను విద్యార్థులు గుర్తిస్తారు. ఈ వివాదాంశాలు సమస్యకు సంబంధించిన పరిష్కారాన్ని పొందడానికి సంకేతాలను ఇస్తాయి. ఉదాహరణకు బ్రిటిష్ వర్తకులు ఎలా భారతదేశం పాలకులయ్యారు అనే సమస్యను తీసుకొని దానిలో ఈ క్రింది వివాదాంశాలను గమనించవచ్చు.

- భారతీయులలో స్వతస్సిద్ధంగా ఉన్న ఐక్యత
- మహారాష్ట్రుల పరిపాలన పతనం
- హైదర్ ఆలీ, టిప్పుసుల్తానుల ఉత్థానం, పతనం
- ఫ్రెంచివారు, పోర్చుగీసువారు మొదలైన యూరోపియన్ వర్తకులు బ్రిటిషువారితో పోటీ చేసి ఓడిపోవడం.

సమాచారాన్ని వ్యవస్థీకరించి అన్వయించిన తరువాత విద్యార్థులు తాము విషయం నుంచి నిశ్చయించిన అనుమతులను (inferences) సాక్ష్యాధారాలతో రాయాలి. వీటిని నిరూపించాలి.

ఈ క్రింది వాటిలాగా కొన్ని ప్రాక్కల్పనావాదాలను వారు రూపొందించవచ్చు.

- కొందరి స్వప్రయోజనాలు, అంత:కలహాలు బ్రిటీషు వర్తకులు భారతదేశ పాలకులు కావడానికి దోహదం చేశాయి.
- బ్రిటిషు వారి విధానమైన “విభజించు పాలించు” అనేది వారు పాలకులు కావడానికి తోడ్పడింది.

**3. సమాచారం సేకరించటం, అన్వయించడం:**

ఉపాధ్యాయుడు సూచించిన పరిశీలనా గ్రంథాలను సంప్రదించి విద్యార్థులు సమస్యకు తగిన సమాచారాన్ని ఆధారాలను సేకరిస్తారు. దీనికోసం విద్యార్థులు క్షేత్రయాత్రలను, మ్యూజియమ్‌లను, గ్రంథాలయాలను దర్శించడం, నమూనాలను, చిత్రాలను ఉపయోగించడం చేస్తారు.

ఇందులోని విద్యార్థి సేకరించిన సమాచారాన్ని వ్యవస్థీకరించి, సమస్యా పరిష్కారానికి ఉపయోగించే సమాచారాన్ని తార్కికంగా అమర్చడానికి సిద్ధపడతాడు. దీనివల్ల సమస్యకు తగిన పరిష్కారం లభ్యమవుతుంది. ఈ ప్రక్రియలో అనవసరమైన సమాచారాన్ని వదిలేయడం కూడా జరుగుతుంది.

**4. నిర్ధారణాంశాలను తీసుకొని, సాధారణీకరణాలను రూపొందించటం:**

పరీక్షించిన ప్రాక్కల్పనావాదాలే మనం చేయవలసిన నిర్ధారణలు. వీటి నుంచే సాధారణీకరణాలను రూపొందిస్తారు.

ఉదా: విభజింపబడి, పతనం చెందడం, ఐక్యమై నిలబడటం.

సమస్యా పరిష్కారంలో ప్రముఖమైన దృక్పథాలు:

సమస్యా పరిష్కారంలో నాలుగు దృక్పథాలను అనుసరించవచ్చు. అవి ఆగమనాత్మక (inductive), నిగమనాత్మక (Deductive), విశ్లేషణాత్మక (Analytic), సంశ్లిష్టాత్మక (Synthetic) దృక్పథాలు.

ఆగమనాత్మక దృక్పథం:

ఇందులో విద్యార్థులు ప్రత్యక్ష ఉదాహరణలను కొన్ని ప్రత్యేక విషయాలను పరిశీలించి సూత్రాలను కాని, సాధారణీకరణాలను కాని, సాధారణ నిర్ణయాలను కాని చేస్తారు. నిర్ధారించిన ఒక సార్వత్రిక సత్యం ఆ తరువాత కూడా అనేక సందర్భాలలో సత్యమేనని నిరూపణ అవుతుంది. ఉదాహరణకు భూగోళశాస్త్రంలోని పాఠంలో విద్యార్థులు ఎత్తయిన ప్రదేశాల ఎత్తును పరీక్షించటం వల్ల ఎత్తు పెరిగిన కొద్దీ ఉష్ణోగ్రత తగ్గుతుందని నిర్ణయం చేస్తారు.

సిమ్లా, నైనిటాల్, డార్జిలింగ్ మొ॥ స్థలాల ఉష్ణోగ్రతలను, ఎత్తులను ఇందుకు పరిశీలించవచ్చు. ఇలా ఆగమనాత్మక పద్ధతిలో విద్యార్థులు కొన్ని ప్రత్యేక ఉదాహరణల నుంచి సాధారణీకరణాలకు వెళతారు.

**నిగమనాత్మక దృక్పథం :**

ఇది ఆగమన దృక్పథం వ్యతిరేకమైంది. ఇక్కడ అభ్యాసకుడు సాధారణ స్థితి నుంచి ప్రత్యేక స్థితికి, అమూర్తస్థాయి నుంచి మూర్తస్థాయికి ముందుకు సాగుతాడు. ఇందులో విద్యార్థులకు నియమాలను, సాధారణీకరణాలను, సూత్రాలను ముందు ఇవ్వడం జరిగి తరువాత వాటిని వారు ప్రత్యేక ఉదాహరణల సాయంతో నిరూపించడం జరుగుతుంది. ఉదాహరణకు, విద్యార్థులు ఎక్కువ ఎత్తున ఉన్న ప్రదేశాలు చల్లగా ఉంటాయని తెలుసుకొని ఈ విషయాన్ని ప్రత్యేకమైన ఉదాహరణలను తీసుకొని నిరూపిస్తారు.

ఈ రెండు దృక్పథాల మధ్య పోలికలు – భేదాలు:

| ఆగమనాత్మకం | నిగమనాత్మకం |
|---|---|
| 1. మొదట ప్రత్యేకమైన విషయాల నుంచి సాధారణ సూత్రాలను రూపొందిస్తారు. | 1. సాధారణ సూత్రాలను ముందు తెలిపి ప్రత్యేకమైన అంశాలను వాటిని నిరూపించడానికి ఉదాహరణలుగా తీసుకుంటారు. |
| 2. ఇది నూతన జ్ఞానానికి దారితీస్తుంది. | 2. ఇది నూతన జ్ఞానానికి దారి తీయదు. |
| 3. ఇది అన్వేషణా పద్ధతి కాబట్టి దానిని విద్యాపద్ధతిగా కూడా అనవచ్చు. | 3. ఇది నిరూపణకు, వివరణకు ఉపయోగించే పద్ధతి కాబట్టి దీనిని బోధనా పద్ధతి అనవచ్చు. |
| 4. విద్యార్థి వివిధ అంశాలను పరిశీలించి ప్రత్యేకంగా సమాచారాన్ని పొందుతాడు. కాబట్టి ఎక్కువ నిదానంగా సాగుతుంది. | 4. విద్యార్థి ముందుగా సిద్ధం చేసిన సమాచారాన్ని పొంది, ఇతరులు సంపాదించిన జ్ఞానాన్ని ఉపయోగిస్తారు కాబట్టి, ఇది చాలా వేగంగా పూర్తవుతుంది. |

| | |
|---|---|
| 5. ఇది విద్యార్థి స్వయంకృషిలో శిక్షణనిచ్చి, అతనిలో ఆత్మవిశ్వాసాన్ని చొరవను పెంపొందిస్తుంది. | 5. ఇది ఇతరుల నుంచి జ్ఞానాన్ని పొందడంపై ఆధారపడి ఉంది కాబట్టి విద్యార్థిని ఇతరులపై ఆధారపడటాన్ని ప్రోత్సహిస్తుంది. |
| 6. ఇది ఊర్ధ్వముఖమైన ఆలోచనాగమనం, నియమాలకు,నిర్వచనాలకు, సూత్రాలకు దారి తీస్తుంది. | 6. ఇది అధోముఖమైన ఆలోచనాగమనం (Downwar Movement of thought) సూత్రాలను, సాధారణీకరణాలను సమగ్రంగా, పరిపూర్ణంగా పొందడానికి దారితీస్తుంది. |

ఈ రెండు పద్ధతులు భేదించినా సత్యాన్వేషణకు రెండూ అవసరమే. ఎలాగంటే, నడవడానికి రెండు కాళ్ళూ అవసరమైనట్లు ఒకదానికొకటి అనుపూరకం. మన దృక్పథం ఆగమన, నిగమన దృక్పథాల మిశ్రమం.

విశ్లేషణా దృక్పథం:

విశ్లేషణ అంటే సంబంధిత సమస్యను విభజించి, తుదకు వీటి అంతస్సంబంధాన్ని వ్యక్తమైనదానితో రూపొందించడం. మనం దేనినైతే కనుక్కోవాలో దానితోనే ప్రారంభిస్తాం. తదుపరి మనకు తెలిసినదానిని, తెలియనిదానితో సంబంధమేర్పరచి, మనం కోరుకున్న ఫలితాలను కనుక్కోవడానికి దారితీసే చర్యలను, సాధ్యాసాధ్యాలను ఆలోచిస్తాం.

సంశ్లేషణా దృక్పథం:

ఇది విశ్లేషణా దృక్పథానికి వ్యతిరేకం. ఇక్కడ మనం తెలిసిన దాని నుండి తెలియని దానికి సాగిపోతాం. ఇది విడిగా ఉన్న విషయాలను కలుపుతుంది. ఇది మనకు తెలిసిన సమాచారంలోని అంశాలను కలిపి, తెలియని సమాచారం వ్యక్తమై, యదార్థం కావడానికి తోడ్పడే ప్రక్రియ.

ఈ రెండు దృక్పథాలను పోల్చటం:

| విశ్లేషణం | సంశ్లేషణం |
|---|---|
| 1. ఇది తెలియని విషయాల నుంచి తెలిసిన వాటికి సాగిపోతుంది. | 1. ఇది తెలిసిన విషయాల నుంచి తెలియని వాటికి సాగిపోతుంది. |
| 2. తీర్మానం (conclusion) నుంచి ప్రారంభిస్తుంది | 2. ప్రాక్కల్పనా వాదంతో ప్రారంభించి తీర్మానానికి పోతారు. |
| 3. ఇది ఒక ఆలోచనా ప్రక్రియ (అన్వేషణ) | 3. ఇది ఆలోచనా ఫలితం (product of thought) |
| 4. ఇది పరిష్కారం కింద ఉంచిన వివరణను ముక్కలుగా విభజించడం గాని, విశ్లేషించడం గాని చేస్తుంది. | 4. ఇది తెలిసిన విషయాలను, కలపడం కాని సంశ్లేషించడం కాని చేస్తుంది. |

| | |
|---|---|
| 5. ఇది అతిదీర్ఘమైన ప్రక్రియ. నెమ్మదిగా సాగుతుంది. ప్రయత్న దోష జ్ఞానంతో సాగుతుంది. | 5. ఇది శీఘ్రంగాను, సంక్షిప్తంగాను, యత్న–దోష జ్ఞానం లేకుండాను సాగుతుంది. |
| 6. ఇది మేధావంతుడికి వచ్చే ఏ ప్రశ్నకైనా తృప్తికరంగా జవాబును అందిస్తుంది | 6. ఇది అభ్యాసుకునిలో వచ్చే అనుమానాలను ప్రశ్నలను తృప్తి పరచదు. |
| 7. ఆలోచనాపరునికి, అన్వేషకునికి ఉపయోగపడే పద్ధతి. | 7. కంఠస్థం చేసేవారికి ఇది ఒక పద్ధతి. |
| 8. ఇది సహజత్వాన్ని (originality) పెంపొందిస్తుంది. | 8. ఇది జ్ఞాపకశక్తిని పెంపొందిస్తుంది. |
| 9. ఇది యాదృచ్ఛికమైంది. | 9. ఇది నియతమైంది. |
| 10. ఇది మనస్తత్వశాస్త్ర ప్రకారం రూపొందింది. | 10. ఇది తార్కిక సంబంధమైంది. |
| 11. విద్యార్థులు తాము మరిచిపోయిన ఏ సోపానాన్నైనా సులభంగా జ్ఞప్తికి తెచ్చుకొని పునర్నిర్మాణం చేయగలరు. | 11. మరచిపోయిన ఏ సోపాన్నైనా జ్ఞప్తికి తెచ్చుకొని, పునర్నిర్మాణం చేయటం సులభం కాదు. |
| 12. ఇది సంశ్లేణకు పురోగామి. | 12. ఇది విశ్లేషణకు అనుయాయి. |

ఈ రెండు పద్ధతులూ భేదించినా, ఈ రెండు కలసి కొనసాగాలి. విశ్లేషణ అవగాహనకు సహాయపడుతుంది. సంశ్లేషణ జ్ఞానాన్ని నిలిపి ఉంచుతుంది. విశ్లేషణ ప్రారంభం, సంశ్లేషణ అనుక్రమం ఈ రెండు పరస్పరాధారాలు.

సమస్యా పరిష్కారం, బోధనాపద్ధతి కాదు, ఇది సమాజంలోని సమస్యలను (పరిష్కారమైనవి, పరిష్కారం కానివి) అధ్యయనానికి సంబంధించిన విషయాన్ని సంఘటితం చేసే పద్ధతి. సమస్యా పరిష్కారంలో విద్యార్థులకిచ్చే ఈ శిక్షణ వీరి నిజజీవితంలో సమస్యలను ఎదుర్కోవడానికి ఎంతో ఉపయోగపడుతుంది.

చర్చా పద్ధతి:

సాంఘిక అధ్యయనాలలో అత్యంత విలువైన బోధన పద్ధతి చర్చ. ఇది ఉపనిషత్తులలో ఉపయోగించబడిన పద్ధతి. ఈ పద్ధతి భారత దేశంలోని ప్రాచీన 'నలంద' విశ్వ విద్యాలయంలో ప్రముఖంగా ఉపయోగించబడిన బోధన పద్ధతి. దీనిని గ్రీకు తత్వవేత్తలు కూడా తమ శిష్యులతో అనేక విషయాలపై చర్చించేవారు. ఈ బోధన పద్ధతి విద్యార్థి కేంద్రీకృత పద్ధతిగా చెప్పవచ్చు. దీనిలో విద్యార్థికి ప్రథమ స్థానం ఇవ్వడం జరుగుతుంది. దీనిలో విద్యార్థులు సాధారణ శ్రోతలుగా కాకుండా క్రియాశీలురుగా అభ్యసన ప్రక్రియలో పాల్గొంటారు. చర్చా పద్ధతి "ఒకరి ఆలోచనకంటే ఇద్దరి ఆలోచనలు మంచివి". అన్న సామెతను కలిగి ఉంది. చర్చా పద్ధతిలో ఉపాధ్యాయుడు, విద్యార్థి ఇద్దరూ ఎవరి పాత్రను వారు కలిగి, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనే విధంగా చేస్తుంది. చర్చా పద్ధతి తరగతిగదిలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని సృష్టించి, విద్యార్థి తన ఆలోచనలను, భావాలను స్వేచ్ఛగా, నిర్భయంగా వ్యక్తీకరింపచేయడంలో సహకరిస్తుంది.

చర్చా పద్ధతి ద్వారా సమిష్టి నిర్ణయాన్ని ఒకే క్రమమైన ప్రక్రియలో తీసుకునొ రావచ్చు. చర్చలో సమస్యకు సామూహిక, ఆలోచన, విశ్లేషణ ద్వారా పరిష్కారాన్ని సూచించవచ్చు. చర్చ సమూహాలలోని వ్యక్తులచే భాధ్యతాయుతంగా తమ భావాలను వ్యక్తీకరింపచేస్తుంది. చర్చలో పాల్గొన్న వ్యక్తులలో సామూహిక పోటీతత్వంను ఇనుమడిస్తుంది. అయినప్పటికీ దీని అంతిమ లక్ష్యం అంగీకారం అవుతుంది. సాధారణంగా చర్చ అంటే సమస్య పరిష్కారానికి సమూహం అంతా కలిసి ఏకగ్రీవంగా ఒకే విధమైన అభిప్రాయాన్ని సూచించడానికి చేసే ప్రయత్నంగా చెప్పవచ్చు. చర్చలో మానసిక అంశాలైన ఆలోచన, విశ్లేషణ, ఊహ, విచక్షణ మొదలయినవి యిమిడి ఉన్నాయి. అందువలన దీన్ని ఒక మానసిక ప్రక్రియగా చెప్పవచ్చు.

**చర్చ రూపాలు:-**

చర్చను వివిధ రూపాలుగా నడపవచ్చు. ఉదాహరణకు వక్తృత్వం, సెమినార్లు, వర్క్‌షాపు, కాన్ఫరెన్సులు, సింపోజియమ్‌లు. వీటన్నింటిలో విద్యార్థులు క్రియాశీలురుగా వ్యవహరిస్తారు. వీటిలో ఉపాధ్యాయుని పాత్ర స్వల్పంగాను, విద్యార్థుల పాత్ర అధికంగాను ఉంటుంది. చర్చలో వివిధ రూపాలు ఉన్నప్పుడు ఉపాధ్యాయుడు పాఠ్యాంశానికి తగిన, సందర్భోచితమైన ఏ రూపాంతరాన్నైనా ఎంచుకొని తరగతి గదిలో విద్యార్థుల చేత నడిపించాలి. విద్యార్థి అభ్యసన స్థాయి, తరగతి విషయాన్ని అనుసరించి చర్చలో ఏదైనా రూపాన్ని ఎంచుకోవచ్చు. దీని ఎంపికలో విద్యార్థులకు కూడా అవకాశాన్ని కల్పించినట్లయితే విద్యార్థులు ఉత్సాహంతో చర్చలో పాల్గొంటారు.

**చర్చా ప్రక్రియ:**

1. ప్రణాళిక:- చర్చా ప్రక్రియలో ప్రథమ సోపానం ప్రణాళిక రూపకల్పన. చర్చను ఒక క్రమమైన విధానంలో, అర్థవంతంగాను, ఉపయుక్తంగాను నిర్వహించడానికి చక్కని ప్రణాళిక ఎంతో ఆవశ్యకమైంది. మంచి ప్రణాళిక మంచి చర్చకు దోహదపడుతుంది.

2. సంసిద్ధత:- సిద్ధపరచుట మంచి చర్చకు తప్పని సరయింది. చర్చకు ముందుగా ఉపాధ్యాయుడు చర్చా అంశానికి సంబంధించి విషయ సమాచారాన్ని సేకరించి విమర్శనాత్మకంగాను, అర్థవంతంగాను క్షుణ్ణంగా పఠించాలి. చర్చించబోయే అంశాలకు సంబంధించి విషయాల పూర్వాపరాలను గురించి లోతైన జ్ఞానాన్ని సంపాదించింది. చర్చించబోయే అంశాలను తార్కికంగా అమర్చుకొని, ఆ సమాచారాన్ని ఒక నివేదిక రూపంలో తయారు చేసుకోవాలి. విద్యార్థులలో చర్చపట్ల సంసిద్ధత ఉన్నట్లయితే ఆ చర్చ మంచి ఫలితాలను ఇస్తుంది. విద్యార్థులలో సరియైన సంసిద్ధత ఉన్నప్పుడు ఉపాధ్యాయుడు చర్చను సమర్థవంతంగా, విజయవంతంగాను నిర్వహిస్తాడు.

3. నిర్వహణ:- చర్చ నిర్వహణలో ఉపాధ్యాయుడే మాడరేటరుగా ఉండి ప్రతి ప్రధాన పాత్రను పోషిస్తాడు. చర్చను క్రమశిక్షణతో కూడిన ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే విధంగా ఉపాధ్యాయుడు చూడాలి. చర్చలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించాలి. చర్చలో సరయిన ప్రశ్నలను,

వ్యాఖ్యానాలను ప్రోత్సహిస్తూ చర్చ ఆద్యంతం ఆహ్లాదంగా, ఉత్సాహంగా కొనసాగి మంచి విషయజ్ఞానాన్ని అందించేదిగా చూడాలి. చర్చలో పాల్గొనే జట్ల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొల్పాలి. చర్చలో ప్రతి ఒక్కరు ఇతరులు చెప్పేది శ్రద్ధగా వింటూ వారి అభిప్రాయాలను గౌరవిస్తూ, చర్చ విజయవంతమయ్యే విధంగా చూడాలి.

చర్చ ముగిసిన తరువాత మాడరేటర్ చర్చలోని సారాంశాన్ని పున:శ్చరణ చేసి చర్చలోని ముఖ్య అంశాలన్నింటిని క్లుప్తీకరించి, నిర్ణయించిన తీర్మానాన్ని ప్రకటిస్తారు.

4. మూల్యాంకనం:- చర్చా ప్రక్రియలోని ఆఖరి మూల్యాంకనం సోపానం. చర్చ ముగిసిన తరువాత చర్చలోని అంశాలు విద్యార్థి అభిరుచులకు తగినట్టుగా ఉండి, అవి ఎంతవరకు అతని వైఖరులను ప్రభావితం చేసింది మూల్యాంకనం చేసుకోవాలి. చర్చ మంచి ఫలితాల సాధనకు దోహదపడేదిగా ఉండి, విద్యార్థుల ప్రవర్తనలో మంచి మార్పులను తీసుకొని రాగలిగిందా లేదా అనేది మూల్యాంకనం చేయాలి.

చర్చ విద్యార్థులలో మంచి అభిరుచులను పెంపొందించి, సరైన వైఖరులను అభివృద్ధి పరచి, విస్తృత సమాచారాన్ని సేకరించి, వారిలో ఉన్న దురభిప్రాయాలను తొలగించి మంచి పౌరులకు కావలసిన ఉత్తమ లక్షణాలను అలవర్చుకొనేందుకు దారితీయాలి.

**ఉపయోగాలు:-**

1. చర్చా పద్ధతి విద్యార్థులు సాంఘిక అధ్యయనాలను ఆసక్తితో అభ్యసించేందుకు సహాయపడుతుంది.
2. ఈ పద్ధతి ప్రజాస్వామ్య వాతావరణంలో అభ్యసన జరిగే విధంగా ప్రోత్సహిస్తుంది.
3. విద్యార్థులకు, ఉపాధ్యాయునికి మధ్య మంచి సంబంధాలను పెంపొందిస్తుంది.
4. విద్యార్థుల మధ్య స్నేహపూరిత వాతావరణాన్ని ప్రోత్సహిస్తుంది.
5. చర్చా పద్ధతి ద్వారా విద్యార్థులు తమ సమస్యలను వెనువెంటనే పరిష్కారాన్ని పొందుతారు.
6. ఈ పద్ధతి విద్యార్థులలో సమూహ / జట్టు మనస్తత్వాన్ని, జట్టు పోటీని, జట్టు సహకారాన్ని ప్రోత్సహిస్తుంది.
7. ఇది తోటి విద్యార్థుల అభిప్రాయాలను, భావాలను గౌరవించే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తుంది.
8. ఉపాధ్యాయుడు విద్యార్థులలో ఉన్న ప్రతిభాపాటవాలను గుర్తించేందుకు అవకాశాన్నిస్తుంది.
9. విద్యార్థులు వేదికపై నిర్భయంగా మాట్లాడడంలో, స్వేచ్ఛగా, తమ తమ భావాలను వ్యక్తపరచడానికి దోహదపడుతుంది.
10. విద్యార్థులు వేదికపై కూర్చోవడం, నిలబడడం, మాట్లాడడంలో సభాపద్ధతులను పాటించడంలో శిక్షణనిస్తుంది.
11. ఈ పద్ధతి బట్టీ స్మృతి లేదా బట్టీ అభ్యసన విధానాన్ని వ్యతిరేకిస్తుంది.

12. విద్యార్థులలో తార్కిక, విశ్లేషణాత్మక ఆలోచన విధానాన్ని పెంపొందిస్తుంది.
13. విద్యార్థులను నూతన విషయాలను అభ్యసించేందుకు ప్రోత్సహిస్తుంది.
14. విద్యార్థులకు వివిధ మానసిక అంశాలపై శిక్షణనిస్తుంది.
15. విద్యార్థులలో ఉన్న నాయకత్వ లక్షణాలను గుర్తించే విధంగా ఉపాధ్యాయునికి సహకరిస్తుంది.

**పరిమితులు:-**

1. అన్ని పాఠాలను చర్చా పద్ధతిలో బోధించలేం.
2. ఈ పద్ధతి కొద్దిమంది చురుకైన విద్యార్థులచే అధిగమించబడింది.
3. ఇది అవసరమైన వాగ్వివాదాలకు, భేదాభిప్రాయాలకు, ఆవేశాలకు దారితీస్తుంది.
4. చర్చలో జరిగే వాగ్వివాదాలు చర్చను పక్కదోవపట్టించేందుకు అవకాశముంటుంది.
5. విద్యార్థులకు భావోద్రేకాలకు లోనయ్యేలా చేస్తుంది.
6. ఇది కాలయాపనతో కూడింది.
7. సుశిక్షితులైన ఉపాధ్యాయులు తప్పనిసరి.

**వక్తృత్వం:**

వక్తృత్వం చర్చా పద్ధతికి ఒక రూపాంతరంగా చెప్పవచ్చు. దీనిలో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది విద్యార్థులు / వ్యక్తులు ఏదైనా ఒక వివాదాస్పద అంశంపై తమ తమ అభిప్రాయాలను వెల్లడిస్తారు. ఈ విధానంలో ఇతరుల వాదనను వ్యతిరేకిస్తూ తమ తమ వాదనలను సమర్థించుకునేందుకు అవకాశం ఉంటుంది. వీలైనంతవరకు ప్రత్యర్థుల అభిప్రాయాలను తప్పుగా నిరూపించేందుకు ప్రయత్నిస్తూ, తమది సరయిందిగా చూపేందుకు ప్రయత్నిస్తారు.

**ఉదాహరణ:-**

1. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధికి పారిశ్రామికీకరణ తప్పనిసరి.
2. ఆంధ్రప్రదేశ్ అవతరించినప్పుడు మనది “వెనుకబడ్డ ఆర్థిక వ్యవస్థ”

**నిర్వహణ:-**

దీన్ని నిర్వహించడంలో ఉపాధ్యాయుడు ప్రధాన పాత్రను పోషిస్తాడు. వక్తృత్వానికి సంబంధించిన ప్రస్తుత పరిస్థితులకు సంబంధించి, విద్య విలువలను కలిగిన అంశాన్ని సాధారణంగా ఎంపిక చేస్తారు. ఇరుపక్షాల సభ్యులు తమ తమ వాదనలను వినిపించిన తరువాత తరగతిలోని మిగిలిన విద్యార్థులు వక్తృత్వపు అంశం మీద ప్రశ్నించడానికి లేదా చర్చించడానికి అనుమతించడం జరుగుతుంది. వారు అడిగిన ప్రశ్నలకు వివరణ ఇవ్వడం జరుగుతుంది.

**ఉపాధ్యాయుని పాత్ర:–**

దీనిలో ఉపాధ్యాయుడు ఒక మాడరేటరుగా ఉండి ఇరు పక్షాల వాదనలను ప్రక్కదోవ పట్టకుండా, భావావేశపూరిత పరిస్థితులు లేకుండా చూసి, మంచి స్నేహపూరిత వాతావరణంలో వక్తృత్వం జరిగేలా చూస్తాడు. వక్తృత్వం వల్ల మంచి ఫలితాలు కలిగేలా ఉపాధ్యాయుడు ఇరువర్గాల వారిలోను, మిగిలిన విద్యార్థులతోను కలిసి పనిచేస్తాడు. ఇరువర్గాల మధ్య సంధానకర్తగా ఉండి పరిస్థితులను సమన్వయ పరచి వక్తృత్వం మంచి ఫలితాలను ఇచ్చేందుకు కృషిచేస్తాడు.

ఇది సామూహిక ఆలోచనకూ, సమిష్టినిర్ధారణకూ, సంబంధించిన ఒక ప్రక్రియ. ఇది అంగీకారానికి సన్నాహం, అంగీకారం లభించనపుడు అంగీకార స్వభావాన్ని స్పష్టీకరించడానికి, అధికం చేయడానికి ఇది ఉపకరిస్తుంది. చర్చకు అంతిమ ధ్యేయం అంగీకారం. ఏకాభిప్రాయం ద్వారా సాంఘిక సమస్యను పరిష్కరించడానికి తీసుకునే సాంఘిక చర్యయే ఈ చర్చ అని చెప్పవచ్చు.

**ప్రశ్నాపద్ధతి:**

ఇది పాఠశాల స్థాయిలోని బోధనలో అవలంభించే తరగతి కార్యకలాపాలలో ఎంతో ప్రధానమైంది. అభ్యసించడంలో, బోధించటంలో, పరీక్షించడంలో ప్రశ్నలు చాలా ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తాయి. బోధన సాఫల్యం, వైఫల్యం మనం ప్రశ్నలను వేసేటప్పుడు వ్యక్తమయ్యే నైపుణ్యం, నిర్ణయాలపై ఆధారపడతాయి. ఎప్పుడూ ప్రశ్నించని ఉపాధ్యాయుడు బోధించడు. వాస్తవానికి ప్రశ్నలను బాగా వేయగల సామర్థ్యం బోధనకు చెందిన ఉత్తమ కళలలో ఒకటి. రుడ్యార్డ్ కిప్లింగ్ దీనిని ఈ కింది విధంగా పేర్కొన్నారు.

నేను నిజాయితీతో ఉన్న ఆరుమంది సేవకులను నియమించుకున్నాను.

నాకు తెలిసిందంతా వారు బోధించిందే

వారి పేర్లు – ఏమని? ఎందుకు? ఎప్పుడు? ఎట్లా? ఎక్కడ? ఎవరు?

ప్రశ్నించడం అనేది ఆలోచనలనూ, అభ్యసనలనూ బాగా ప్రోత్సహించే సాధనం. ఇది విద్యా కార్యకలాపాలన్నింటికి కీలకం.

**ప్రశ్నల ప్రయోజనాలు**

- కొత్త భావాలను, దృక్పథాలను, అన్వేషణా ఆలోచనలను ప్రోత్సహించడానికి వీటిని వుపయోగిస్తారు.
- ఇబ్బందులను తెలుసుకోవడానికి, వాటిని అధిగమించడానికి వీటిని ఉపయోగిస్తారు.
- విద్యార్థులు మానసికంగా జాగరూకులై ఉండేందుకు ఇవి తోడ్పడతాయి.
- ముందుగా పూర్తి చేసిన పనిని పున: సమీక్ష చేయడానికి సహాయపడతాయి.
- చొరవను, సహజత్వాన్ని (Originality) పెంపొందిస్తాయి.
- పిల్లల అవధానాన్ని (Attention) పొందడానికి, దుష్ప్రవర్తనను నివారించడానికి తరగతిలో

అడిగే మౌలిక ప్రశ్నలు తోడ్పడతాయి. అందువల్ల వీటికి క్రమశిక్షణా విలువ కూడా ఉంది.

- విద్యార్థులు కొత్త సమాచారాన్ని పొందడానికి మానసికంగా సంసిద్ధం చేస్తాయి. సమాచారం పరిమితులను చూపిస్తాయి. ఇంకా జ్ఞానాన్ని పొందాలనే భావాన్ని పెంపొందిస్తాయి.
- విద్యార్థుల సహకారాన్ని సమకూరుస్తాయి.

**మంచి ప్రశ్నల లక్షణాలు**

1. స్పష్టత – విద్యార్థి ప్రశ్నను సులభంగా, స్పష్టంగా అర్థం చేసుకోవాలి.
2. సరళత – అసాధారణమైన, క్లిష్టమైన పదాలతో కాకుండా, సరళమైన భాషలో ప్రశ్నను అడగాలి.
3. నిర్దిష్టత – అస్పష్టమైన ప్రశ్నలను అడగకూడదు. ఒక నిర్దిష్ట ప్రయోజనాన్ని ప్రశ్న సాధించాలి.
4. సవాలు – మంచి ప్రశ్న విద్యార్థులందరిలో ఆలోచనను ప్రేరేపించాలి. ప్రతి విద్యార్థి ఆలోచించడానికి, పోల్చడానికి మూల్యాంకనం చేసి ముగింపును రాబట్టేందుకు ఈ ప్రశ్నలు తోడ్పడాలి. అంతేకాని సమాచారాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవడానికి కాదు.
5. ఖచ్చితత్వం – ప్రశ్న నిర్దిష్టంగాను, సంక్షిప్తంగాను ఉండి ఖచ్చితమైన సమాధానానికి మాత్రమే అవకాశం ఇవ్వాలి.
6. యుక్తత – ప్రశ్న విద్యార్థుల సామర్థ్యానికి, పరిణతికి తగిన భాషతో, వాంఛనీయమైన ప్రతిస్పందనకు యుక్తంగా ఉండాలి.

ఇట్లా మంచి ప్రశ్నలు ఆసక్తికరంగాను, సవాలుగాను, ఆలోచనలను ప్రేరేపించేదిగాను వుండాలి.

**ప్రశ్నల వర్గీకరణ**

ప్రశ్నలు

నియత ప్రశ్నలు సహజ ప్రశ్నలు

పరీక్షించే ప్రశ్నలు బోధించడం లేదా పాఠాన్ని అభివృద్ధి చేసే ప్రశ్నలు

ప్రారంభ ప్రశ్నలు పునర్విమర్శ ప్రశ్నలు

సహజ ప్రశ్నలు – సమాచారం రాబట్టడానికి ప్రశ్నలను అడగాలి. ఈ ప్రయోజనంతో తయారయ్యే ప్రశ్నలను సహజ ప్రశ్నలంటారు.

నియత ప్రశ్నలు – తరగతిగదిలో విద్యార్థులను ఉపాధ్యాయుడు అడిగే ప్రశ్నలను నియత ప్రశ్నలనవచ్చు. ఇందులో ప్రశ్నించేవారికి, ఆ ప్రశ్నకు సమాధానం ముందుగానే తెలిసి ఉంటుంది. విద్యార్థులు ఉపాధ్యాయుడిని అడిగే ప్రశ్నలు మాత్రం సహజమైనవే.

నియత ప్రశ్నలను రెండు రకాలుగా వర్గీకరించారు. అవి 1. పరీక్షించడానికి ఉపయోగపడే ప్రశ్నలు. 2. బోధించడానికి లేదా పాఠ్యాభివృద్ధికి తోడ్పడే ప్రశ్నలు.

ఎ.	పరీక్షించడానికి ఉపయోగపడే ప్రశ్నలు తిరిగి రెండు రకాలు. అవి

1.	ప్రారంభ లేదా పరిచయ ప్రశ్నలు – సాధారణంగా వీటిని పాఠం ప్రారంభంలో అడుగుతారు. వీటి ప్రయోజనాలేవంటే

– విద్యార్థుల పూర్వ జ్ఞానాన్ని పరీక్షించడం
– కొత్తగా పొందిన జ్ఞానాన్ని ముందుగా అభ్యసించిన జ్ఞానంతో అనుసంధానం చేయడం
– విద్యార్థికి ప్రేరణ ఇచ్చి, అతనిలో కుతూహలాన్ని పెంచడం.

ఈ ప్రశ్నల వల్ల విద్యార్థుల మానసిక సంసిద్ధతను ఉపాధ్యాయుడు పరీక్షించగలుగుతాడు. ఈ దశలో ప్రశ్నించడం వల్ల ఉపాధ్యాయుడు తెలిసిన దాని నుంచి తెలియనిదానికి అనే సూక్తిని అనుసరించడానికి వీలవుతుంది. ప్రారంభ ప్రశ్నలు చాలా తక్కువగా ఉండాలి. వీటిని చురుకుగా అడగాలి. ప్రశ్నలు పాఠ్యాంశానికి సంబంధించి ఉండాలి. సుసంగతంగా (Relevant) ఉండాలి.

2.	పునర్విమర్శ ప్రశ్నలు – ఒక పాఠం బోధించేటప్పుడు ప్రతి అంశం చివరలోను, పాఠ్యం చివర వీటిని అడుగుతారు. వీటివల్ల ఈ కింది రెండు ప్రయోజనాలు కలుగుతాయి.

– ఉపాధ్యాయుడు, విద్యార్థులు నేర్చుకోవాలని ఉద్దేశించిన పాఠ్యాంశాలను వారు అభ్యసించింది, లేనిదీ తెలుసుకోవడానికి ఇవి తోడ్పడతాయి.

– విద్యార్థులకు పాఠ్యాంశాన్ని పున:సమీక్షించుకుని, అభ్యాసం చేసుకునే అవకాశాన్ని కలిగిస్తాయి.

1)	పునర్విమర్శ ప్రశ్నలు:– పాఠంలోని ప్రతి అంశం చివర అడిగే ప్రశ్నలవలె కాక, భిన్నమైన పదజాలంతో రూపొందించి ఉపయోగించాలి. ఈ దశలోని ప్రశ్నలు విషయజ్ఞానాన్ని పరీక్షించడానికి, అభ్యసించిన విషయాలలోని సంబంధిత సూత్రాలను వినియోగించటానిన పరీక్షించాలి.

2)	బోధనలో ఉపయోగపడే లేదా పాఠ్యాభివృద్ధి ప్రశ్నలు:– ఉపాధ్యాయుడు ఈ ప్రశ్నలను పాఠం జరిగేటపుడు వేస్తాడు. వీటి ద్వారా అతడు ఒక ప్రత్యేక ఆలోచనాధోరణిని పాఠంలో రూపొందిస్తాడు. ఈ ప్రశ్నలవల్ల విద్యార్థులు విషయాలను స్వయంగా కనిపెట్టి, కొత్త సాధారణీకరణాలను రూపొందిస్తారు. ఈ కింది వాటి కోసం వీటిని ఉపయోగిస్తారు.

– ముఖ్యమైన విషయాలపై దృష్టిని కేంద్రీకరించడానికి.
– జ్ఞానాన్ని క్రమక్రమంగా పెంపొందించడానికి.
– విద్యార్థుల్లో ఉన్న పరిశీలనా శక్తిని, పోల్చుకునే శక్తిని, విషయంపై కేంద్రీకరించే శక్తిని ఉపయోగించుకునే అవకాశాన్ని ఇవ్వడానికి.
– కథనాన్ని మధ్యలో ఆపి, తాను చెప్పే అంశాలను తరగతి అధిగమిస్తుందని నిర్ధారించడానికి.
– పాఠంపై దృష్టిలేని పిల్లల దృష్టిని పాఠంవైపుకు మళ్ళించడానికి, పాఠాన్ని రూపొందించడంలో అడిగే ప్రశ్నలను ఎంతో శ్రద్ధతో అడగాలి. ఉపాధ్యాయుడు విద్యార్థుల నుంచి ఎంత వరకు రాబట్టాలి. ఎంత చెప్పాలి అనే విషయం తెలుసుకుని ఉండాలి. విద్యార్థులు ప్రశ్నలు అడగడాన్ని ప్రోత్సహించి, వారి జ్ఞానాభివృద్ధికి తోడ్పడాలి.

ప్రశ్నల రకాలు

1. జ్ఞాపకశక్తి ఉదా : హైద్రాబాద్ ఎక్కడ ఉంది?
2. పోల్చడం లేదా తారతమ్యాన్ని చూపడం ఉదా : సంపదకు, మూలధనానికి తేడా ఏమి ?
3. అనుకూలం లేదా ప్రతికూల నిర్ణయం ఉదా : చంద్రగుప్త మౌర్యుని భారతదేశంలో మొదటి చక్రవర్తి అని అనడం ఎంతవరకు సమంజసం ?
4. నూతన సందర్భాలలో వినియోగం ఉదా : నిరక్షరాస్యతను తొలగించడానికి కొన్ని చర్యలను సూచించండి.
5. వర్గీకరణ ఉదా : ఈ కింది అంశాలు ఉచితవస్తువులా లేదా ఆర్థిక వస్తువులా – గాలి, సూర్యరశ్మి, యంత్రసాధనాలు, ఆహారం.
6. కారణానికి, ఫలితానికి గల సంబంధం ఉదా: భారతదేశంలో జనాభా పెరుగుదల, దారిద్ర్యానికి గల సంబంధం ఏమిటి?
7. ఉదహరించడం – ఉదా : 'కొన్ని వస్తువుల సరఫరా తగ్గినపుడు ఆ వస్తువుల ధరలు పెరుగుతాయి'. సోదాహరణంగా వర్ణించండి.
8. విమర్శ – ఉదా: గాంధీజీ సహాయనిరాకరణోద్యమాన్ని చేపట్టడం ఎంతవరకు సమంజసం ?
9. అనుమితి – ఉదా: ఇచ్చిన సమాచారం మేరకు ఏ ప్రదేశం ఎక్కువ ఉష్ణోగ్రత కలిగిన ప్రదేశం ?
10. చర్చించడం – ఉదా: మతతత్వాన్ని ప్రతిఘటించడానికి ముఖ్యమైన ప్రతిపాదనలను చర్చించండి.
11. సారాంశం – ఉదా: విజయనగర సామ్రాజ్య పతనానికి కారణాలేవి?
12. వ్యాఖ్యానించడం (Comment) – ఉదా: జనాభా గణన అంటే ఏమిటి? పట్టిక ఆధారంగా వ్యాఖ్యానించండి.
13. నిర్వచనం – ఉదా: ప్రజాస్వామ్యాన్ని నిర్వచించండి.
14. పరిశీలనాత్మక ప్రశ్నలు – ఉదా: ఈ పటంలోని భావాన్ని తెలపండి.

ప్రశ్నించడంలో సాంకేతిక విధానాలు

1. ప్రశ్నలు అడిగే విధం – ప్రశ్న ఆహ్లాదంగా ఉండేలా అడగాలి.
2. సంబోధన పద్ధతి – మొదట ప్రశ్నను అడగాలి. తరవాత విద్యార్థిని జవాబు ఇవ్వమని కోరితే వారు ఆలోచించడంలో నిమగ్నమై ఉంటారు. అంతేకాని ఒక్కరు మాత్రమే ఆలోచనా నిమగ్నులు కారు.
3. ప్రశ్నల పంపకం – తరగతిలోని అధిక సంఖ్యాకులు చర్చలో పాల్గొనడానికి వీలుగా, తరగతి అంతటా ప్రశ్నలను పంచాలి. ఏ విద్యార్థినీ నిర్లక్ష్యం చేయరాదు
4. ప్రశ్నలను అడిగే వేగం – ఆలోచించడానికి కావలసిన సమయం ఇవ్వకుండా ప్రశ్నలను

అతివేగంగా అడగటం మంచిది కాదు. అయినప్పటికీ ప్రశ్న స్వభావాన్ని బట్టి సమయం ఇవ్వడం ఆధారపడి ఉంటుంది. సాధ్యమైనంతవరకు తరగతిలో ప్రశ్నించడం ఎప్పుడూ వేగంగానే జరగాలి.

5. ప్రశ్నల పునరావృతం – ప్రశ్నలను అనవసరంగా పునరావృతం చేయడం నివారించాలి.

6. విద్యార్థుల సమాధానాలతో వ్యవహరణ – విద్యార్థులను ప్రశ్నలడగటం ఎంత ముఖ్యమో, వారి సమాధానాలను ఉపాధ్యాయుడు స్వీకరించే విధం కూడా అంతే ముఖ్యం. విద్యార్థులు తరగతిలో ప్రశ్నలకు స్వేచ్ఛగా ప్రతిస్పందించాలి. ఉపాధ్యాయుని వ్యాఖ్యలు వారిని ప్రోత్సహించాలి కాని, నిరుత్సాహపరచరాదు.

**విద్యార్థుల ప్రశ్నలు**

పాఠ్యాంశంపై విద్యార్థులు వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలను అడిగేటట్లు ప్రోత్సహించాలి. విద్యార్థులు ప్రశ్నలు వేసేటపుడు ఉపాధ్యాయుడు ఈ క్రింది విధంగా వ్యవహరించాలి.

ప్రశ్నలు విషయానికి సంబంధించేటట్లు ఉండాలి అని పట్టుపట్టాలి.

– విద్యార్థులందరూ ఒకేసారి ప్రశ్నలను అడగడానికి అవకాశం ఇవ్వకుండా ప్రతి ఒక్క విద్యార్థి ఇతరులు అడిగే ప్రశ్నను వినాలని చెప్పాలి.

– విద్యార్థుల ప్రశ్నల నుంచి ఒక చిన్న ప్రాజెక్ట్ ప్రారంభం కావచ్చు.

– ఉపాధ్యాయుడు, ఏదైనా ప్రశ్నకు తనకు జవాబు తెలియనపుడు, తన అశక్తతను ఒప్పుకోడానికి వెనుకాడకూడదు. అయితే కాలక్రమంలో దానికి జవాబు ఇవ్వాలి. ఇందువల్ల ఉపాధ్యాయ, విద్యార్థి సంబంధాలను మెరుగ్గా ఉంచడానికి వీలవుతుంది.

విద్యార్థి సమాధానాలతో వ్యవహరణ

ప్రశ్నలడగటం ఎంత ముఖ్యమో, వాటి జవాబులను అంగీకరించడం అంతే ముఖ్యం. విద్యార్థుల జవాబులను అయిదు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. మొత్తం సమాధానం సరైంది : ఇట్లాంటి సమాధానాలను స్వాగతించి అభినందించాలి. ఇట్లాంటి జవాబులు పునరావృతం చేయదగినవి.

2. మొత్తం సమాధానం తప్పు : దీనిని హాస్యాస్పదం చేయకుండా నిరాకరించాలి. అప్పుడే ఇతర విద్యార్థులతో సరైన సమాధానం సరిదిద్దించాలి. తప్పుచెప్పిన విద్యార్థితో ఇతర విద్యార్థి చెప్పిన సరైన సమాధానాన్ని పునరావృతం చేయించాలి.

3. కొంతవరకు సరైంది, కొంతవరకు తప్పు : ఉపాధ్యాయుడు జవాబులో సరైన భాగాన్ని నిరాకరించాలి. అనుబంధ ప్రశ్నను వేసి, తప్పున్న భాగాన్ని సరిదిద్దాలి.

4. సరైంది, అయితే అసంపూర్ణమైంది : దీనిలో కూడా, ఉపాధ్యాయుడు సరైన దానిని స్వీకరించి, అనుబంధ ప్రశ్నల ద్వారా అసంపూర్తి భాగాన్ని పూర్తి చేయించాలి.

5. తప్పు జవాబు, అయితే ప్రజ్ఞాపూర్వకమైంది : ఇది కొన్ని కారణాలవల్ల జరగవచ్చు. ఉ

దాహరణకు ప్రశ్నలో కఠినమైన భాష, లేదా క్లిష్టమైన పాఠ్యాంశం. విద్యార్థి నిజాయితీతో ఈ జవాబు చెప్పాడు కాబట్టి, ఎంతో సానుభూతితో ఈ విషయాన్ని సంభాళించాలి. నిజాయితీతో ఇచ్చే జవాబును అణచివేయరాదు.

సమాధానాలతో వ్యవహరించడానికి కొన్ని మార్గదర్శకసూత్రాలు

- విద్యార్థులు చెప్పే సమాధానాలు భాషాపరంగా, విషయపరంగా, సంపూర్ణంగా, సంగ్రహంగా, స్పష్టంగా, కచ్చితంగా ఉండాలి.
- జట్టుసమాధానాలు నిరుత్సాహపరచాలి.
- ఇతర విద్యార్థులు అందించే సమాధానాలను నిరుత్సాహపరచాలి.
- యాంత్రికంగా విద్యార్థుల జవాబులను పునరావృతం చేయరాదు.
- సిగ్గుపడే, బిడియపడే విద్యార్థులను జవాబివ్వటానికి ప్రోత్సహించాలి.
- పాఠం సారాంశాన్ని జవాబుల సహాయంతో రూపొందించాలి.
- విద్యార్థులిచ్చే జవాబులను ఉత్తమస్థాయిలో వినియోగించాలి.
- ఉపాధ్యాయుడు, కొద్దిమంది విద్యార్థులే అతిగా సమాధానం ఇవ్వటాన్ని నివారించి మిగిలిన విద్యార్థులకు మానసిక క్షోభ కలగకుండా చూడాలి.
- తరగతిలోని వారందరికీ వినిపించేంత బిగ్గరగా జవాబులు చెప్పించాలి.
- సమాధానాలను స్వీకరించేటపుడు, బాగుంది, చాలా బాగుంది అనే ఒకే పదబంధాలతో ప్రశంసించాలి.

సరైన, స్పష్టమైన, ఆలోచనా పూర్వకమైన సమాధానాలు స్పష్టమైన, ఆలోచనా ప్రేరకమైన ప్రశ్నల ద్వారా లభిస్తాయి. విద్యార్థుల నుంచి మంచి ప్రతిస్పందనలను పొందే ఉత్తమ సాధనాలేవంటే సానుభూతి, ఓరిమి, ప్రోత్సాహం, అంతేకాని, ఓరిమి లేకుండటం, కరకుదనం అణచివేతకాదు. ప్రశ్నలు సముచితంగా సన్నాహం పొంది, జాగ్రత్తగా ఎంచుకున్న మాటలతో (carefully worded) సమానంగా పంచబడి, శాస్త్రీయంగా, మనస్తత్వ ప్రకారంగా అడగబడి, నిజాయితీతో ప్రతిస్పందించబడి, ప్రజ్ఞతో అనుక్రమం పొంది ఉంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

1. ప్రతిస్పందన పద్ధతుల ద్వారా అభ్యసనం :

నేర్చుకోడానికి ముఖ్యమైనది

తరగతి గది వాతావరణం, అనగా భయరహిత వాతావరణం. పిల్లలకు భద్రత, ప్రేమ, ఆప్యాయత చూపించడం, ఉపాధ్యాయుడు పిల్లలతో కలసిపోయి వారు నేర్చుకునేటట్లు చేయడం, వ్యక్తిగతంగా చెప్పడం, తెలియని విషయాలు అడగమని పిల్లలు ప్రశ్నించడాన్ని ప్రోత్సహించాలి. తరగతి గది పరిశుభ్రంగా ఉండాలి. నల్లబల్ల, చార్టులు ఉపయోగించి బోధించాలి. తరగతి గది పరిశుభ్రంగా ఉండాలి. పాఠానికి సంబంధించి వివిధ భావనల అవగాహనకు, కొన్ని ప్రశ్నలు నల్లబల్ల పై రాసి, ఆ ప్రశ్నలపై చర్చింపజేయాలి. చర్చ జరిపిన అంశాలపై పోల్చుకోవాలి. పిల్లలచే పాఠం చదివించి, చర్చలు చేయించలి. ముఖ్యమైన వాటిని నల్లబల్లపై రాయాలి. దీనివల్ల పిల్లలు ఆ ప్రశ్నల గురించి ఆలోచిస్తారు. తామే జవాబులు సొంతంగా చెబుతారు. ఇతరులు చెప్పిన దాన్ని

వింటారు. ఇలా తరగతి గదిలో నేర్చుకోవడం జరుగుతుంది. దీన్నే (interactive learning) చర్చలు, ప్రతిస్పందనల ద్వారా నేర్చుకోవడం అంటారు. ఒక మంచి సామాజిక వాతావరణం తరగతి గదిలో ఏర్పడుతుంది. పిల్లలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే అవకాశం ఇలాంటి విధానాల ద్వారా లభిస్తుంది. అందరు పిల్లలు చురుగ్గా ఉంటారు. చర్చల్లో పాల్గొంటారు. ఇలాగే కృత్యాలు, ప్రయోగాలు పరిశీలనలు కూడా చేయించడం ద్వారా అభ్యసనాన్ని ఉత్సాహభరితం చేసి పిల్లలందరూ నిమగ్నం అయ్యేటట్లు చెయ్యవచ్చు.

ఐతే నేర్చుకునేటప్పుడు తప్పులు జరగడం చోటు చేసుకుంటుంది. పిల్లల తప్పులను ఎత్తి చూపడంఒ, నిందించడం, ఇతరులతో పోల్చడం, కించపరచడం వంటివి చేయకూడదు. పిల్లలు చేసిన వాటిలో ఏమేం చేశారో గుర్తించాలి. అభినందించాలి. వారు చేసిన తప్పులను పిల్లలే సరిదిద్దుకునేలా తరగతిలో చర్చ నిర్వహించాలి. సరియైనది ఏదో ఉపాధ్యాయుడు వివరించి, పిల్లల్ని తాము రాసిన వాటిని సరిపోల్చుకోమని అనాలి. (Competition) దీనివల్ల పిల్లలు నేర్చుకునే ప్రక్రియలో తమ కోసం పాల్గొంటారు. అదే పనిగా తప్పులు ఎత్తిచూపినంత మాత్రాన, ఆ తప్పు ఎందుకు జరిగిందో గుర్తించలేడు. తప్పులు పోతాయన్న భయంతో / న్యూనతా భావంతో మాట్లాడటానికి, తెలియజేయడానికి, ప్రదర్శించడానికి ముందుకు రారు. దీనివల్ల అభ్యసనం కుంటుపడుతుంది. జరగదు.

ఆలోచన అభ్యసనానికి మూలం. మానసిక శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు పరిశోధనల ప్రకారం పిల్లలలో నేర్చుకోగలిగిన శక్తి అంతర్గతంగా ఉంటుంది. ఇది పుట్టుకతోనే సంక్రమిస్తుంది. పిల్లలు సాధారణంగా పరిసరాల ద్వారా వస్తువులతో పరస్పర ప్రతిచర్యలు జరిపి సమవయస్కులు, పెద్దల సహకారంతో నేర్చుకుంటారు. పాఠశాలలో ఉపాధ్యాయుడు కల్పించిన సందర్భోచితమైన అర్థవంతమైన కృత్యాలలో పాల్గొని పూర్వజ్ఞానం ఆధారంగా నూతన జ్ఞానాన్ని నిర్మించుకుంటాడు. అయితే పిల్లలు నేర్చుకోవడంలో ముఖ్యపాత్రను పోషించే ప్రక్రియలను తెలుసుకుందాం.

- ఆలోచించడం
- పరిశీలించడం
- ప్రశ్నించడం
- భాగస్వాములు కావడం
- పరస్పర ప్రతిచర్య జరపడం
- నిరంతర అన్వేషణ
- కనుగొనడం
- చర్చించడం
- పరస్పర భావాలను పంచుకోవడం
- భౌతిక, మేధోపరమైన కృత్యాలలో పాల్గొనడం
- సందర్శించడం

**భాగస్వామ్య అభ్యసనం** (colloborative learning)

నేర్చుకోవడం అనేది ఒక సామాజిక ప్రక్రియ, ఇతరులతో మాట్లాడుతూ, ఇతరులు మాట్లాడేది వింటున్నప్పుడు, చర్చల్లో పాల్గొంటున్నప్పుడు, తోటివారితో కలసి పనిచేయడం ద్వారా అప్రయత్నంగానే అనేక విషయాలను గ్రహిస్తుంటారు. ఇది సందర్భోచితంగా కూడా ఉంటుంది. ఐతే సాధారణంగా పెద్దలకు గానీ, తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులు తాము చెప్పడం వల్ల అన్ని విషయాలను పిల్లలు నేర్చుకుంటున్నారని భావిస్తుంటారు. కొన్ని పిల్లలకు మనం ఏ విషయాలు చెప్పాలి? కేవలం ఇవి మాత్రమే పిల్లలకు తెలుసా? మిగతావి పిల్లలకు ఎలా తెలుసు? అని ఆలోచిస్తే పిల్లలు నేర్చుకునే విధానం బోధపడుతోంది. పిల్లలు తమ తోటివారితో కలసి ఆడడం, పాడడం, ముచ్చటించడం, చర్చించడం, వాదించడం వల్ల వారి జ్ఞానం విస్తృతమౌతుంది. ఇలా ఇతరులతో కలిసి నేర్చుకునే పద్ధతిని జట్టు పనుల ద్వారా కల్పించవచ్చు. ఇది భాగస్వామ్య అభ్యసనానికి తోడ్పడుతుంది. కృత్యం అంటే ఇప్పటికీ చాలా మంది ఉపాధ్యాయులు రకరకాలుగా అభిప్రాయపడ్తుంటారు.

ఉదా: 1. కృత్యం అంటే కేవలం శారీరకమైనది. అసలు అభ్యసన ప్రక్రియతో దానికి ఎలాంటి సంబంధం ఉండదు. కృత్యాలు 1, 2 తరగతులకు మాత్రమే ఉపయోగకరం. పై తరగతులలో వీటిని ఉపయోగించడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదు. కృత్యాధార బోధన వల్ల సకాలంలో సిలబస్ పూర్తి చేయడం సాధ్యం కాదు అని రకరకాల అపోహలు ఉన్నాయి.

ఇవన్నీ కేవలం అపోహలు మాత్రమే. పిల్లలు చర్చించడం వంటి ఇతర కృత్యాల ద్వారా సాంఘిక శాస్త్ర అంశాలను సులభంగా అవగాహన చేసుకోగలరు.

ఉదా: 1. గ్లోబును పరిశీలించి, అక్షాంశ – రేఖాంశాల మధ్య భేదాలు రాయండి – చర్చ పరిశీలన.

2. మీ గ్రామం చుట్టుపక్కల గల జనవనరుల సమాచారాన్ని సేకరించడం – జట్టు పని

3. బాలలను కార్మికులుగా ఎందుకు నియమించరాదో తెలపండి – చర్చ.

అయితే పిల్లలకు అభ్యసనానుభవాలను కల్పించేటప్పుడు మనం ఈ అంశాలన్నింటినీ పరిగనణనలోనికి తీసుకొంటున్నామా ? అభ్యసనంలో ఈ ప్రక్రియలు చోటు చేసుకోకపోతే నేర్చుకున్నది తాత్కాలికమా ? శాశ్వతమా ? అసంపూర్ణమా ? అని తప్పక ఆలోచించాలి.

కృత్యాధార అభ్యసనం :

తరగతి గదుల్లో పిల్లల అభ్యసనం కృత్యాల ఆధారంగా జరిగే దానిని కృత్యాధార అభ్యసనం అని చెప్పవచ్చు. ఈ పద్ధతి గత కొన్ని సంవత్సరాలుగా ఆచరణలో ఉంది. కాని చాలామంది ఇప్పటివరకు ఈ పద్ధతిపైన సరైన అవగాహన లేకుండా, సరిగా అన్వయించకుండానే ఈ పద్ధతి ద్వారా బోధించడానికి ప్రయత్నం జరుగుచున్నది. కృత్యాధార పద్ధతిని అవలంభించాలి ? నిజంగా ఇది అవసరమా ? అసలు ఈ పద్ధతి ఎలా అవలంభించింది ? అనే ప్రశ్నలు ఉపాధ్యాయుని ఇప్పటికి వేధిస్తూనే ఉన్నాయి.

అభ్యసనంలో వారిని భాగస్వామ్యం చేసినప్పుడు అనగా ప్రశ్నించి ఆలోచింప చేసినప్పుడు, అభ్యసనం జరుగుతుంది. కృత్యాల ద్వారా నేర్చుకోవడం అనేది అనుభవపూర్వకంగా నేర్చుకోవడం

(experimental learning). కృత్యాలు పనిచేయడం కావచ్చు. పరిశీలనలు కావచ్చు. గ్రూపు చర్చ కావచ్చు.

కృత్యానికి ఉండవలసిన లక్షణాలు:

పిల్లలలో ఆశించిన విధంగా అభ్యసనం వేగంగా, అర్థవంతంగా ఉండాలంటే కృత్యానికి నిర్దిష్ట లక్షణాలు ఉండాలి. అందుకోసం కృత్యాలు ఈ క్రింది లక్షణాలు కలిగి ఉండాలి.

ఆలోచనలు రేకెత్తించేలా ఉండాలి.

సవాలుతో కూడా ఉండాలి

వ్యక్తిగతంగా, జట్లలో, పూర్తి తరగతిలో చేసేదిగా ఉండాలి.

...... తరగతి బోధనకు ఉపయోగపడేదిగా ఉండాలి. కృత్యాలు పిల్లల స్థాయికి తగినట్లుగా ఉండాలి.

లక్ష్యాత్మకంగా ఆచరణాత్మకంగా ఉండాలి. అంతేకాకుండా కృత్యాలు పిల్లలు ఆసక్తికరంగా, పాల్గొనడాన్ని పురికోల్పేదిగా ఉండాలి.

తగిన చేర్పులు, మార్పులకు వీలైనదిగా ఉండాలి. వీలైనంత తక్కువ ఖర్చు, ఖర్చులేనిదిగా ఉండాలి. "ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్యా పథకం (APPEP)" సూచించిన ఆరు అభ్యసన సూత్రాలు విద్యార్థి కేంద్రీకృత కృత్యాధార బోధనకు ఉపకరిస్తాయి. అవి

ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక విద్యా పథకం :-

- ఉపాధ్యాయుడు అభ్యసన ప్రక్రియలను కల్పించడం
- క్రియలు, అన్వేషణ, ప్రయోగాల ద్వారా అభ్యసనాన్ని అభివృద్ధి పరచడం
- వ్యక్తిగత, జట్టు, పూర్తి తరగతి పనిని అభివృద్ధి పరచడం.
- వైయుక్తిక భేదాలకు తగిన అభ్యసనాన్ని కల్పించడం
- స్థానిక పరిసరాలను ఉపయోగించడం
- విద్యార్థుల పనిని ప్రదర్శించి ఉత్సాహవంతమైన అభ్యసన వాతావరణం ఏర్పరచడం. సమర్థ అభ్యసనం కోసం ఉపాధ్యాయుడు కల్పించే కృత్యాలు విషయాల వారీగా కూడా ఉండాలి. ఏ సందర్భంలో ఏ కృత్యం కల్పించాలన్నది ఉపాధ్యాయుడి సామర్థ్యం, చొరవను బట్టి ఉంటుంది. అన్ని సందర్భాలలో ఉపకరించే కొన్ని కృత్యాలు దిగువ పొందుపరచబడ్డాయి. ఇవి బోధన అభ్యసన వ్యాసక్తులు – నైపుణ్యాలను వృద్ధి చేయడానికి తోడ్పడతాయి.

1. కార్య శిబిరం Workshop
2. సదస్సు Seminar
3. సింపోజిమ్ Symposium
4. పానల్ చర్చ Panel Discussion
5. నాటకీకరణ Dramatisation
6. సారూప్య పద్ధతి (Simulation) లను ఉపయోగించి పలు కృత్యాలు ఏర్పాటు చేయవచ్చు.

**కార్య శిబిరం (Workshop) :**

పిల్లలను కార్యక్రమంలో పాల్గొనే వ్యక్తులను ఒక నిర్దిష్టమైన పనిలో నిమగ్నం చేయడం కార్యగోష్ఠిలో భాగం. కర్మాగారాల్లో కార్మికులు, యంత్రాలు, పనిముట్లతో పనిచేసి ఉత్పత్తిని సాధించేటట్లు పిల్లలకు పరికరాలు లేదా వస్తుసామాగ్రిని ఇచ్చి సృజనాత్మక కృత్యాలలో పాల్గొనేటట్లు చేస్తారు. ఈ కృత్యాలు వ్యక్తిగతమైనవి కావచ్చు లేదా జట్ల వారీగా కావచ్చు. పాఠశాలల్లో గల మినీకిట్‌ను ఉపయోగించి పిల్లలతో వ్యక్తిగతంగా గానీ జట్లలో గానీ కొన్ని కృత్యాలు చేయించవచ్చు. ఉపాధ్యాయులు తాము బోధించవలసిన పాఠానికి సంబంధించిన బోధానాభ్యసన సామగ్రిని ఇలాంటి కార్యశిబిరాల్లో తయారుచేసుకోవచ్చు. ఇందులో పాల్గొనే వ్యక్తులు రంగుల కాగితాలు, డ్రాయింగ్ కాగితాలు, స్కేలు, కత్తెర, రబ్బరు లేదా క, మట్టి మొదలైన వాటినిన ఉపయోగించి అవసరమయ్యే సామాగ్రిని తయారు చేసుకోవచ్చు. జట్లలో చర్చల ద్వారా ప్రణాళికలను, నివేదకలను తయారుచేయవచ్చు. సంక్షిప్తంగా చెప్పాలంటే వ్యక్తిగతంగా గానీ, జట్లలో గానీ చర్చ, సృజనాత్మక చర్యల ద్వారా అవసరమయ్యే వస్తువులను / ప్యాకేజీలను తయారుచేయడానికి ఉపకరించేదే కార్యశిబిరం అని చెప్పవచ్చు.

**2. సెమినార్ / సదస్సు:**

దీనికింద అనేకమంది విద్యార్థులు ఒక సమస్యను గురించి దర్యాప్తు చేసి తమ ఫలితాలను నివేదిస్తారు. వారు వ్యక్తిగతంగాగాని, సమిష్టిగా గాని సమస్యను దర్యాప్తు చేస్తారు. నివేదికలను సమావేశానికి సమర్పిస్తారు. వాటిని సమావేశంలో చర్చిస్తారు. దీనిలో పాల్గొనే వ్యక్తులు కొన్ని అంశాలను స్పష్టం చేసుకోవడానికి స్వేచ్ఛగా ప్రశ్నిస్తారు. నాయకుడు ప్రతి వ్యక్తికీ చర్చలో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తాడు.

**3. సింపోజియం గోష్ఠి** (Symposium):

ఇందులో ఎంపిక చేసిన విషయంలోని వివిధ అంశాలపై పాల్గొనే సభ్యులు తమ అభిప్రాయాలను ఉపన్యాసాల ద్వారా గాని, తాము రచించిన విషయాలను చదివి వినిపించటం ద్వారా గాని అందిస్తారు. స్టక్ మహాశయుని ప్రకారం సింపోజియం వ్యాఖ్యానాల సముదాయంగా ఉంటుంది. ఇవి మౌఖికంగా గాని, లిఖితంగా గాని ఉండవచ్చు. విభిన్న భావాలను, దృక్పథాలను అందిస్తుంది. దీని ముఖ్య ఉద్దేశం ఏమంటే వివాదాస్పదమైన విషయాలపై స్పష్టమైన అవగాహన పొందడం శ్రోతలు చర్చను విని సమర్పించిన భిన్న దృక్పథాలపై వాటి ప్రాముఖ్యంపై నిశ్చయాత్మక అభిప్రాయాలను ఏర్పరచుకొంటారు. సభ్యులు తమలోతాము ప్రశ్నలు వేసుకొని వివరాలను పరిశీలించుకునే అవకాశం ఇవ్వడం జరుగుతుంది. ఈ చర్చా కార్యక్రమం తరగతి ఎదుట జరుగుతుంది. తరగతి నుంచి కూడా ప్రశ్నలను స్వీకరించి సింపోజియంలో చర్చిస్తారు. చర్చలో పాల్గొనేవారి సంఖ్య 4 లేదా 5 ఉంటే మంచిది.

**4. పానల్ చర్చ** (Panel Discussion):

ఇది పెద్ద గ్రూపులో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని తరగతిలోని చిన్న గ్రూపు ఒకటి (4 నుండి 8 మంది) తరగతి ఎదుట నిర్వహిస్తారు. ఈ గ్రూపును "పానెల్" అంటారు. దీనికి ఒక అధ్యక్షుడు ఉంటాడు. సభ్యులు ఇతని ఆధ్వర్యంలో చర్చిస్తారు. వీరంతా సాధ్యమైనంత

వరకు ఎత్తయిన ప్లాట్‌ఫారం మీద కూర్చుంటారు. ఈ ప్లాట్‌ఫారంపై అర్ధవృత్తాకారంలో కుర్చీలు, బల్లలు వేస్తారు. ఇందువల్ల పానెల్‌లోని సభ్యులు ముఖాముఖి కూర్చోవడమే కాక, వారు శ్రోతలకెదురుగా ఉంటారు. ఈ చర్చలో వంతుల మార్పిడి పద్ధతిన సభ్యులు ఒక్కొక్కరు వంతుల ప్రకారం తమ అభిప్రాయాలను వ్యక్తీకరిస్తారు. లేదా సభ్యులు ఆలోచన రావటంతోనే ఒకరి తరువాత మరొకరు తమ అభిప్రాయాలను వ్యక్తీకరిస్తారు. దీనిని ఫలప్రదంగా నిర్వహించటానికి ఛైర్మన్ ఉంటాడు. కొన్ని సందర్భాలలో ఛైర్మన్ విషయంపై తయారుచేసిన కొన్ని ప్రశ్నలను పాలెన్ సభ్యులతో చర్చిస్తారు. పానెల్ సభ్యులు వీటిపై తమ సమాధానాలు ప్రకటిస్తారు. ఈ సమాధానాలు ముందుగా తయారుచేసుకున్న ఉపన్యాసాలు కావు. ఛైర్మన్ ఈ సమాధానాల సారాంశాన్ని తెలుపుతూ పానెల్ సభ్యులకు కూడా మళ్ళీ అవకాశమిచ్చి చర్చను కొనసాగిస్తాడు. పానెల్ సమర్పణ తరువాత మిగతా విద్యార్థులు పానెల్ సభ్యులను ప్రశ్నలు అడుగుతారు. దీని సాఫల్యం చాలావరకు ఛైర్మన్ మీద ఆధారపడుతుంది. చర్చలు జరిగే సమయంలో ఒక విద్యార్థి తరువాత మరొక విద్యార్థి మార్గదర్శకుడుగా వ్యవహరించవచ్చు. ఆ విధంగా విద్యార్థులు, ఉపాధ్యాయుడు కలసిమెలసి పనిచేస్తారు.

**5. నాటకీకరణ** (Dramatisation)

అనుభవాలను, మానవ సంబంధాలు, పాత్రలు, సందర్భాలు, కథలు, ఉద్వేగాలు మొదలయిన వాటిని నాటకీకరణలో సజీవంగా వ్యక్తీకరించవచ్చు. నాటకీకరణం విద్యార్థుల భావాలను సులభంగా గ్రహించడానికి ఉపయోగపడుతుంది. నాటకీకరణం విద్యార్థుల్లో వైఖరి మార్పులకు, ప్రవర్తనా మార్పులకు దారి తీస్తుంది. నాటకీకరణ సహజంగా నటించి గాని ముందుగా ప్రాక్టీసు చేసిగాని చేయవచ్చు.

చారిత్రాత్మక సంఘటనలను వ్యక్తీకరించడానికి నాటకీకరణం అనువైన పద్ధతి. నాటకీకరణం విజయవంతంగా నిర్వహించడానికి ఉపాధ్యాయుడు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

- తరగతిలో పిల్లలందరూ దీన్ని ప్రత్యేక దృష్టితో నిర్వహించునట్లు చూడాలి. ఇది ఆషామాషీగా జరగకూడదు.
- ఉపాధ్యాయుడు ప్రదర్శనను నియంత్రించకూడదు. రంగస్థలంపై ఆధిపత్యం ప్రదర్శించకూడదు. కేవలం తెరవెనుక సూచనలు మాత్రం ఇస్తూ ఉండాలి.
- పాత్రధారులను జాగ్రత్తగా ఎంపిక చేయాలి. ఏ ఒక్కరూ మొత్తం కార్యక్రమానికి ఆధిపత్యం వహించకూడదు.
- రంగస్థలం ఏర్పాటు ప్రత్యేకంగా అవసరం లేదు. తరగతి గదినే రంగస్థలంగా భావించాలి. నటనపై, మాటలపై భావ వ్యక్తీకరణపై శ్రద్ధ వహించాలి. కానీ వేషం, వస్త్రధారణ, సెట్టింగులు అవసరం లేదు.
- నాటకీకరణకు అవసరమయ్యే స్క్రిప్టును ముందుగానే తయారు చేసుకోవాలి.

దాని ద్వారా భావ వ్యక్తీకరణను అత్యంత నైపుణ్యంతో నిర్వహించవచ్చు. విద్యార్థులకు లబ్ధి చేకూర్చవచ్చు.

**6. సిములేషన్** (Simulation):

కల్పిత సన్నివేశంలో సమస్యల పరిష్కారానికి ఉపకరించే అభ్యసన ప్రక్రియ లేదా శిక్షణా విధానంగా సిములేషన్‌ను విద్యావేత్తలు భావిస్తున్నారు. శిక్షణా కార్యక్రమంలో ఉపన్యాసకులు ప్రదర్శనా పాఠాలు ఇవ్వవలసి ఉంటుంది. ఈ బోధనా పద్ధతిని గురించి వివరించవలసి ఉంటుంది. అన్ని వేళల్లో పిల్లలను ఆయా సంస్థలకు తీసుకొని పోలేం. అలాంటి సమయాలలో ఛాత్రోపాధ్యాయులనే పిల్లలుగా ఎన్నుకొని సన్నివేశాన్ని ప్రదర్శిస్తారు. అంటే ఉపన్యాసకులు సిములేషన్ విధానాన్ని అనుసరించాలని అర్థం. అందువల్ల సామాన్య పద్ధతి (Simulation) లో లేనిది ఉన్నట్లు నటించడం సిములేషన్ అని చెప్పవచ్చు.

సిములేషన్‌ను అభివృద్ధి చేసిన నాటిక అని చెప్పవచ్చు. అయితే ఇది ఉపాఖ్యాన పాత్రాభినయం కాదు. ఇది ప్రేక్షకుల ముందు ప్రదర్శించిన ఏకాంత సన్నివేశం కాదు. పాత్రధారులు వృత్తిపరమైన సన్నివేశంలో మౌలికమైన సమాచారాన్ని సంపూర్ణంగా తెలిసికొని ఉండాలి. కాని ఈ సమాచారాన్ని వారు సృష్టించుకోవలసిన అవసరం లేదు.

సిములేషన్ ఒక ప్రత్యేకమైన రూపంలో లేదా పరిస్థితులలో ఉన్నట్లు ఊహిస్తున్న సన్నివేశం. ఉదాహరణకు ఒక మగబిడ్డ గడ్డాలు, మీసాలు పెట్టుకొని కూర్చోగా మరో ఆడబిడ్డ ఆహారాన్ని వడ్డిస్తున్నట్లు నటిస్తే వార తమ తల్లిదండ్రుల పాత్రలను అనుకరిస్తున్నట్లు భావిస్తాం. చాణక్యుడు చంద్రగుప్తుణ్ణి సిములేషన్ సన్నివేశంలో చూస్తాడు. తాను రాజుగా నటించడమే కాకుండా తన సహచరుల సమస్యలను ఫిర్యాదులను విని పరిష్కరిస్తాడు. అప్పుడు చాణక్యుడు చంద్రగుప్తునిలో రాజరిక లక్షణాలను గమనిస్తాడు.

సిములేషన్ నిర్వహణలో ఉపాధ్యాయుడు లేదా శిక్షకుడు అంటూ ఉండడు. భాగస్వాములకు, పాల్గొనేవారికి సంపూర్ణ స్వేచ్ఛ ఉంటుంది. తప్పులు చేసే అధికారం కూడా ఉంటుంది. సిములేషన్ బోధింపబడని సంఘటన. బోధింపబడినచో అవి సిములేషన్ కాజాలదు. తప్పిదాలు అనివార్యంగా ఉంటాయి. ఇవి వాంఛనీయం కూడా అనే సిద్ధాంతం సిములేషన్‌కు మూలాధారం. ఇది అనుభవపూర్వకమైన అభ్యసనం. వ్యక్తులు తప్పులు చేసి వాటి ద్వారా నేర్చుకుంటారు. తప్పులు ఎంత ఎక్కువయితే అభ్యసనం అంత ఎక్కువగా జరుగుతుంది.

# యూనిట్ 4 : సాంఘిక శాస్త్ర బోధన

4.1. తరగది నిర్వహణ, సమ్మిళిత తరగతిగది రూపకల్పన.

4.2. బోధనా ప్రణాళికలు – వార్షిక, పాఠ్య (యూనిట్), పీరియడ్ ప్రణాళికలు

4.3. సాంఘికశాస్త్ర భావనల పట్ల పిల్లల అవగాహన, సాంఘికశాస్త్ర అవగాహనలో సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల ప్రాధాన్యత, బహుళ ప్రతిస్పందన ప్రశ్నలు మరియు జట్టుకృత్యాలను ఉపయోగించి తరగతిగదిలో సాంఘికశాస్త్ర జ్ఞానాన్ని పెంపొందించడం, వాస్తవాలు మరియు అభిప్రాయాల మధ్య గల బేధాలు.

4.4. అన్వేషణ (ఆధారిత ఉపగమం) పద్ధతి, ప్రశ్నలు/సమస్యలు రూపొందించటం, జట్టుపని, క్షేత్ర అనుభవం, సమాచార సేకరణ, నిర్వహణ, వ్యాఖ్యానించడం మరియు విశ్లేషించడం, నివేదికలు రాయడం మొ။

4.5. చరిత్ర బోధనలో కాలక్రమ పట్టికలు, కళాకృతులు, అధికార పత్రాలు (డాక్యుమెంట్స్), రికార్డులు, దస్త్రాలు, రాతలు (Texts), మానచిత్రాలు (Maps), లేఖలు, డైరీ, లిఖిత ఆధారాలు/రాతప్రతులు (రైటింగ్స్), మౌఖిక చరిత్ర (Oral History), పురావస్తు ప్రదర్శనశాలలు, పురాతన కట్టడాల సందర్శనలు మొ။ వాటిని వినియోగించడం, ఆధారాల ప్రాముఖ్యతను గుర్తించడం, వివిధ ఆధారాల మధ్య పరస్పర సంబంధాలను నెలకొల్పడం ద్వారా చరిత్రను అర్థం చేసుకోవడం.

4.6. కథలు, ప్రయాణఘట్టాలు, యాత్రల అనుభవాలు, పట్టికలు, గ్రాఫులు, సమాచారాలు, మానచిత్రాలు, పాత్రపోషణ దృశ్య చిత్రాలు, ఛాయాచిత్రాలు, క్షేత్ర పర్యటనలు, సర్వే అనుకరణలు (సిమ్యులేషన్), పరిపృచ్ఛ (ఇంటర్వ్యూ) మొ။ వాటిసాయంతో సాంఘికశాస్త్ర బోధన.

4.7. సాంఘిక శాస్త్ర బోధనలో సమాచార ప్రసార సాంకేతిక సమైక్యత (ICT) ద్వారా అవగాహన కల్పించడం, సన్నివేశాల రూపకల్పన ద్వారా ఆలోచింపజేయుట, ఫ్లో చార్టుల వినియోగం, భావన చిత్రాలు, డాక్యుమెంటరీలు, ధారావాహికలు, చరిత్ర – ఖగోళ చలన చిత్రాలను ఉపయోగించుట.

4.8. సాంఘికశాస్త్ర భావనల బోధన, తరగతి గది నిర్వహణ, సమ్మిళిత తరగతి గది రూపకల్పనలలో ఉత్తమ సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుని పాత్ర మరియు బాధ్యతలు.

## 4. సాంఘిక శాస్త్ర బోధన

**లక్ష్యాలు :**

1. తరగతి గది నిర్వహణ, విద్యార్థుల భాగస్వామ్యమును సమర్థవంతంగా నిర్వహించుట.
2. బోధనా ప్రణాళిక – వార్షిక ప్రణాళిక, యూనిట్ ప్రణాళిక, పీరియడ్ ప్రణాళిక తయారీ, నిర్వహణ.
3. సాంఘికశాస్త్ర భావలన గురించి విద్యార్థుల అవగాహన, సాంఘికశాస్త్రమును అవగాహన చేసికొనుటలో విద్యార్థుల సాంఘిక సాంస్కృతిక భూమిక – సామూహిక కృత్యాలు, ప్రశ్నల ద్వారా సాంఘికశాస్త్ర జ్ఞానమును నిర్మించుట – వాస్తవాలకు, అభిప్రాయాలకు మధ్య గల తేడాలను తెలియజేయుట.
4. అన్వేషణ ఆధారిత ఉపగమము – ప్రశ్నలు సమస్యలు తెలియచేయుట, సామూహిక పని ప్రణాళిక, క్షేత్రస్థాయిలో పని విషయ సేకరణ – వ్యవస్థీకరణ, వ్యాఖ్యానించుట, విశ్లేణ, నివేదిక తయారు చేయుట.
5. కాలక్రమ చార్టులు, కళాఖండములు, అధికారిక ఆధార పత్రములు, ఫైళ్ళు, ప్రామాణిక గ్రంథములు, మ్యాప్‌లు, వ్యక్తిగత ఉత్తరాలు, డైరీలు, వ్రాతలు, మౌఖిక చరిత్ర, మ్యూజియంలను ప్రాచీన

భాండాగారములను క్షేత్రపర్యటనలు, వనరుల ప్రాముఖ్యత, వనరుల మధ్య సంబంధములను పెంపొందించుట ద్వారా గతాన్ని నిర్మించుట గురించిన అవగాహన కలిగించుట.

6. కథలు, ప్రయాణ దైనందిని, ప్రయాణ కథనాలు, పట్టికలు, గ్రాఫ్‌లు, ప్రమాణిక గ్రంథాలు, మ్యాప్‌లు, పాత్రపోషణ, ఫిల్ములు, క్షేత్ర పర్యటనలు, సర్వేలు, సిమ్యులేషన్, ఇంటర్వ్యూ మొ॥ వాని ద్వారా సాంఘికశాస్త్ర బోధన.

7. సాంఘికశాస్త్ర బోధనలో కంప్యూటర్ ఆధారిత అభ్యసనను సమన్వయం చేయుట – ఫ్లో చార్టులు – కాన్సెప్టులు – డ్యాకుమెంటరీలు – సీరియళ్ళు – చరిత్ర ఖగోళ ఆధారిత ఫిల్ములు.

8. సాంఘికశాస్త్ర భావనలను బోధించుటలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుని పాత్ర – బాధ్యత – తరగతి గది నిర్వహణ – బోధనలో విద్యార్థులను భాగస్వాములను చేయుట.

**4. సాంఘికశాస్త్ర బోధన :**

సాంఘికశాస్త్ర బోధన సమర్థవంతంగా నిర్వహించడం పైనే బోధనా లక్ష్యాలు సాధించబడతాయి. ఈ బోధనలో ఉపాధ్యాయుని వ్యక్తిగత తయారీ, బోధనా ప్రణాళిక, విద్యార్థుల స్థాయిని అర్థం చేసుకోవడం, వాళ్ళ సామర్థ్యాలు, అభిరుచులు, స్థాయిలకనుగుణంగా బోధించడం, బోధనాభ్యసన సామాగ్రిని సిద్ధం చేసుకోవడం, విద్యార్థి కేంద్రిత బోధనా పద్ధతులను, అధునాతన పద్ధతులను, కంప్యూటర్ ఆధారిత పద్ధతులను ఎంచుకోవడం ప్రాముఖ్యత వహిస్తాయి.

బోధన విజయవంతం కావడానికి ఉపాధ్యాయునికి బోధనాంశాలపై మంచి పట్టు, సమగ్రమైన అవగాహన, నిరంతర అధ్యయనం, విద్యార్థులపై మంచి ప్రభావం కలగజేయగలిగిన వ్యక్తిత్వం ఎంతో అవసరం. ఏ పాఠ్యాంశ బోధనకు ఏ ప్రక్రియనుపయోగించాలో కూడ నిరంతరం ఆలోచించాలి. విద్యార్థులను బోధనాభ్యసన ప్రక్రియలలో చురుకైన భాస్వాములను చేయాలి.

ఈనాడు కంప్యూటర్ ఆధారిత బోధన ఒక తప్పనిసరి పరిస్థితి – చాలా సందర్భాలలో విద్యార్థులే చురుకుగా ఉన్నారు. ఈ పరిస్థితులలో మనం దీనిని సమర్థవంతంగా ఉపయోగిస్తే బోధన విజయవంతమవుతుంది.

మొత్తం మీద మనం ఉపయోగించే ప్రక్రియలు విద్యార్థిని చురుకుగా ఉంచాలి. ఆసక్తిని పెంపొందించేదిగా ఉంచాలి. అతని చొరవను, అన్వేషణను పెంపొందించేవిగా చేసి నేర్చుకునేలా, అతని సృజనాత్మకతను పెంపొందించేవిగా విద్యార్థికి స్వేచ్ఛనిచ్చేవిగా, అతని పరిశీలనను, ప్రాయోగిక సామర్థ్యాన్ని పెంపొందించేవిగా ఉండాలి. మన బోధన అతనిని శాశ్వతంగా మనపై ఆధారపడే వ్యక్తిగాకాక, మనను ఒక సలహాదరునిగా, మార్గదర్శిగా మార్చాలి.

విద్యార్థికి స్వంతంగా నేర్చుకోవడంలో, ప్రయత్నించడంలో ఉన్న ఆనందాన్ని, అనుభూతిని కలిగించాలి. అపుడు ఎవరు చూచినా, చూడకున్నా ఆత్మానందం కోసం ఆపనిని కొనసాగిస్తాడు. అదే ఉపాధ్యాయుడు విద్యార్థికిచ్చే అత్యున్నత బహుమతి.

తన ప్రయత్నంలో విద్యార్థులు అప్పుడప్పుడు పొరపాట్లు చేస్తుంటారు. విఫలం చెందుతారు. పరవాలేదు, మరల ప్రయత్నించు, ఇవి సహజమే అనే భరోసా ఇవ్వాలి. ఏ పరిస్థితుల్లోను అతనిని కించపరచడం, అతని ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం చేయరాదు. తగు జాగ్రత్తలు తీసుకోమని చెప్పవచ్చు.

ఉపాధ్యాయుడు విద్యార్థులతో కలిసి పనిచేసే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలి. కొన్ని ప్రాజెక్టులు, కృత్యాలు వారితో కలిసి తానూ చేయాలి. అప్పుడు వారికి నిజమైన ప్రేరణ లభిస్తుంది. అలాంటి ఉపాధ్యాయుని పిల్లలు ఎంతగానో ఇష్టపడతారు.

ఒక వ్యక్తిని నీవు మార్చాలంటే అతనికి ఉపదేశాలూ, ఉపన్యాసాలు ఇవ్వకు. అతనితో కలిసి పనిచేయి.

**4.1. తరగతి గది నిర్వహణ, సమ్మిళిత తరగతి గది రూపకల్పన :**

తరగతి గది వైవిధ్యాల నిలయం. ప్రతి విద్యార్థి ఒక ప్రత్యేకత కలిగినవాడే. వారి సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యాలు భిన్నంగా ఉంటాయి. వారి స్వభావాలు అభిరుచులలో తేడాలుంటాయి. సామర్థ్యాలలో కూడా తేడాలుంటాయి.

ఉపాధ్యాయుడు విద్యార్థులందరినీ భాగస్వాములను చేయాలి. వైవిధ్యాన్ని ఒక బలహీనతగా కాక బలంగా మార్చుకోవాలి.

- విద్యార్థులందరికీ తన భావాలను వ్యక్తం చేయగలగేలా, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేలా తరగతి గది కార్యక్రమం రూపొందించాలి.
- అందరికి అవకాశాలు కల్పించాలి.
- విద్యార్థుల మధ్య స్నేహబంధం పెంపొందేలా, వారిని సమూహాలుగా ఏర్పరచి కృత్యాలు, ప్రాజెక్టులు ఇవ్వాలి.
- ప్రతివిద్యార్థి ప్రగతి సాధించగలడన్న నమ్మకం ఉపాధ్యాయునికి ఉండాలి.
- తానుపయోగించే భాష అతిసామాన్యమైన విద్యార్థి కూడ గ్రహించగలిగేలా ఉండాలి.
- ఆడ, మగ పిల్లలందరినీ సమానంగా చూడాలి.
- ముఖ్యంగా ఉపాధ్యాయునికి మాతృహృదయం ఉండాలి. తల్లి వివిధ స్వభావాలు గల పిల్లలను ఎలా అర్థం చేసుకొని వ్యవహరిస్తుందో ఉపాధ్యాయుడు కూడా అలాగే ఉండాలి. తల్లి ఏ పిల్లవానికి ఏ ఆహారం ఇష్టం, ఏది అతని ఆరోగ్యానికి మంచిది, అతని స్వభావం ఎలాంటిది గ్రహించి అతనికి తగినట్లుగా ఇంటిని నడుపుతుంది. నిజమైన భాగస్వామ్య పద్ధతంటే ఇదే.
- బోధనాసామగ్రి, సామర్థ్యం ఎంతముఖ్యమో అందరినీ తనలో ఇముడ్చుకోగల మాతృహృదయం అంతకంటే ముఖ్యం.

**4.2. బోధనా ప్రణాళిక :**

ఏ పనికైనా ప్రణాళిక అవసరం. ప్రణాళిక వేసుకొని పనిచేస్తే ఫలితాలు బాగుంటాయి. బోధన అనేది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే పవిత్ర కార్యం. కాబట్టి ఇంకా శ్రద్ధతో, ఏకాగ్రతతో, ఈ బోధనా ప్రణాళికలను రూపొందించాలి. ఆలోచన, వివేచనను ఉపయోగించి తాను ఏ విషయాన్ని బోధిస్తున్నాను, ఎవరిరికి బోధిస్తున్నాను, ఈ బోధన ద్వారా ఏమి సాధించాలి, యేయే ఉపకరణాలను ఉపయోగిస్తే ఆయా బోధనాలక్ష్యాలను బాగా సాధించగలం అనేవి నిరంతరం ఉపాధ్యాయుని మనస్సులో ఉండాలి.

సాధారణంగా మాధ్యమిక పాఠశాల స్థాయిలో సబ్జెక్టు వారి బోధనే ఉంటుంది. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు సాధారణంగా సాంఘిక శాస్త్రాన్నే బోధిస్తాడు. ఉపాధ్యాయుడు ఏ తరగతికి బోధించాలో ముందుగానే నిర్ధారించ బడుతుంది. కాబట్టి తాను బోధించవలసిన ఆయా అంశాలపై సంవత్సర ప్రారంభంలోనే ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలి. ఇది సాధారణంగా ఒక సంవత్సరానికి సంబంధించినదై ఉంటుంది. దీనినే వార్షిక ప్రణాళిక లేక వార్షిక పథకం అంటాం. దీనితో పాటు యూనిట్ పథకం లేక యూనిట్ ప్రణాళిక, పిరియడ్ లేదా కాలాంశ ప్రణాళిక తయారుచేసుకుంటారు.

**4.2.1. వార్షిక పథకము :**

వార్షిక పథకం ఒక సంవత్సర కాలంలో విద్యార్థులకు బోధించవలసిన యూనిట్లు లేదా పాఠ్యాంశాలకు సంబంధించిన పథకం. సంవత్సరం మొత్తం బోధించవలసిన బోధనాంశాలను ఏయే నెలలో ఏయే యూనిట్‌లు బోధించాలి, వాటి బోధనా లక్ష్యాలేమిటి, వానికి ఏ బోధనా వ్యూహాలను అనుసరించి, ఏ బోధనాభ్యసన సామాగ్రిని ఉపయోగించాలి. ఆశించిన ఫలితాలను ఏ మేరకు సాధించాము. నిర్వహించవలసిన కార్యక్రమములు, ఇవ్వవలసని ప్రాజెక్టులు మొ॥ అంశాలు.

**వార్షిక ప్రణాళిక తయారీ ఉపయోగాలు :**

1. వార్షిక ప్రణాళిక తయారుచేసుకోవడం వల్ల ఆ సంవత్సరం మొత్తంలో ఆ తరగతికి తాను నిర్వహించాల్సిన అంశాలపై ఉపాధ్యాయునికి సమగ్ర అవగాహన ఏర్పడుతుంది.
2. తాను బోధించాల్సిన అంశాలపై క్షుణ్ణంగా ముందే అధ్యయనం చేసే అవకాశం ఉంది.
3. తగిన బోధనా వ్యూహాలను రూపొందించుకుంటాడు.
4. తగిన బోధనాభ్యసన సామాగ్రిని సంసిద్ధం చేసుకుంటాడు.
5. తగిన పరామార్శ గ్రంథాలను, కార్యక్రమాలను సంసిద్ధం చేసుకుంటాడు.
6. తగినంత ముందుగా ఆలోచించగలగడం, సంసిద్ధం కావడానికి అవకాశం ఉంది.

**వార్షిక ప్రణాళిక తయారీలో దృష్టిలో పెట్టుకోవలసిన అంశాలు :**

నెల :

ఏ నెలలో ఎన్ని పనిదినాలున్నాయి, తాను వ్యక్తిగతంగా ఎన్ని సెలవులు ఉపయోగించుకుంటాడు, ఆ నెలలో వచ్చే అత్యవసర పరిస్థితులు మొ॥ ఆధారంగా ఆ నెలలో ఎన్ని పాఠ్యాంశాలు బోధించగలడో నిర్ణయించుకుంటాడు.

పాఠ్యాంశాలు :

ఆ నెలలో ఉండే పనిదినాలు, పీరియడ్‌లు/కాలాంశాలు, పాఠ్యాంశ బోధనకు ఎన్ని కాలాంశాలు అవసరం మొ॥వాని ఆధారంగా ఆయా నెలలకు పాఠ్యాంశాలు కేటాయించుకోవాలి.

పీరియడ్‌లు :

పీరియడ్ యొక్క నిడివిని బట్టి ఏ పిరియడ్‌లో ఒక పాఠ్యాంశాన్ని ఎంతమేరకు బోధించాలో నిర్ణయించుకోవాలి.

వార్షిక ప్రణాళిక (నెల మరియు యూనిట్ వారీగా)

| నెల | పాఠము | పీరియడ్ల్ సంఖ్య | బోధనా సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమములు |
|---|---|---|---|---|
| జూన్ | | | | |
| జూలై | | | | |
| ఆగష్టు | | | | |
| సెప్టెంబర్ | | | | |
| అక్టోబర్ | | | | |
| నవంబర్ | | | | |
| డిసెంబర్ | | | | |
| జనవరి | | | | |
| ఫిబ్రవరి | | | | |
| మార్చి | | | | |
| ఏప్రియల్ | | | | |

**4.2.2. యూనిట్ / పాఠ్య ప్రణాళిక**

వార్షిక ప్రణాళికలో మనం ఏ నెలలో ఏ యూనిట్‌ను బోధించాలి, ఎన్ని కాలాంశాలలో/పిరియడ్‌లలో బోధించాలో ముందే నిర్ధారించుకున్నాము.

యూనిట్/పాఠప్రణాళికలు ఇంకా వివరంగా ప్రణాళిక వేసుకుంటాము.

ఒక యూనిట్‌లో ఏమి బోధించాలి; ఎలా బోధించాలి, ఎటువంటి కృత్యాలు ఇవ్వాలి, పిల్లల్ని ఏవిధంగా అభ్యసనంలో భాగస్వాముల్ని చేయాలి, ఏమి కొత్త విషయాలు చేయాలి అనేవి ఉపాధ్యాయుడు ముందుగా ఆలోచించి ప్రణాళిక తయారు చేసుకోవాలి. ప్రణాళిక సులభతరంగా, ఆచరణయోగ్యంగా, ఆలోచించే విధంగా ఉండాలి. పాఠ్యప్రణాళికలోని సోపానాలు ఈక్రిందివిధంగా ఉంటాయి.

యూనిట్ :

యూనిట్ / పాఠ్యప్రణాళికలోని సోపానాలు :

1. యూనిట్ / పాఠం పేరు
2. తరగతి
3. యూనిట్‌కు కేటాయించిన మొత్తం పిరియడ్‌ల సంఖ్య
4. సాధించాల్సిన విద్యాప్రమాణాలు
5. పీరియడ్ వారీగా భావనలు, బోధనా అంశాలు మరియు విధానాలు.

| పిరియడ్‌ల సంఖ్య | బోధించాల్సిన అంశం/భావనలు | బోధనా వ్యూహాలు అభ్యసనా భావాలు | బోధనాభ్యసన సామాగ్రి | విద్యార్థుల అవగాహన పరిశీలన |
|---|---|---|---|---|
| 1 | | | | |
| 2 | | | | |
| 3 | | | | |

6. టీచర్‌నోట్స్ (Teacher Notes), బోధనాంశాలు మరియు విధానాలపై ఉపాధ్యాయుడు అదనంగా సేకరించుకోవాల్సిన సమాచారం అనగా రిఫరెన్స్ పుస్తకాలు, మాగజైనులు, జర్నల్స్ నుండి అదనపుసమాచారం, మరికొన్ని ఆలోచింప చేసే వ్యూహాలు, కృత్యాలు,కథలు, వ్యాస సంఘటనలు వంటివి.
7. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు.

## మాదరిపాఠం – సోపానాలు

**పాఠం లక్ష్యాలు :**

(పాఠం లక్ష్యాలు ఆరు విద్యా ప్రమాణాలను ప్రతిబింబించే విధంగా ఉండాలి)

1. ఉపోద్ఘాతం
    1. పలకరింపు
    2. మైండ్ మ్యాపింగ్ / పునశ్చరణ ప్రశ్నలు
    3. పాఠ్యాంశ ప్రకటన
2. పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట

1. గుర్తించుట
2. అవగాహన కల్గించుట

3. భావనల అవగాహన – చర్చ
1. మాట్లాడించుట : పిల్లలు చదివిన అంశంపై మాట్లాడించుట
2. ప్రశ్నించుట : చదివిన పాఠ్యాంశంపైన, అర్థంకాని అంశాలపైన పిల్లలను ప్రశ్నలు అడుగుట
3. పాఠ్యాంశ భావనలపై అవగాహన ప్రశ్నలు.

ఉపాధ్యాయుడు సమకాలీన అంశాలను జోడిస్తూ, పాఠ్యాంశం అవగాహన ప్రశ్నలు / చిత్రం లేదా పటంపై ముందుగా తయారుచేసుకున్న ప్రశ్నలను నల్లబల్లపై రాయుట.

4. నైపుణ్యాలను అభ్యసనం చేయుట
- సమాచార నైపుణ్యాలు
- పట నైపుణ్యాలు

4. ఇంటిపని :

బోధనా సోపానాల గురించి తెలుసుకున్నారు కదా మరి తరగతి గదిలో వీటిని నిర్వహించడానికి ఒక్కొక్క సోపానం గురించి వివరంగా తెలుసుకందామా!

**1. ఉపోద్ఘాతం :**

ఉపాధ్యాయుడు తరగతిగదిలోకి ప్రవేశించిన తరువాత మొదట తానే పిల్లలను పలకరించాలి. తరువాత చెప్పబోయే పాఠ్యాంశానికి సంబంధించి భావనలపై మైండ్ మ్యాపింగ్ / కాన్సెప్ట్ మ్యాపింగ్ ద్వారా పిల్లల పూర్వ అనుభవాలను తెలుసుకోవాలి. దీనివల్ల చెప్పబోయే భావనల గురించి పిల్లలకు ఏమి తెలుసో, ఉపాధ్యాయుడు తెలుసుకోవచ్చు. దీనిద్వారా ఉపాధ్యాయునికి తాను ఏమి అందించాలో ఒక అవగాహన ఏర్పడుతుంది. అలాగే ఒకే భావన రెండో పిరియడ్‌లో కూడా చెబుతున్నప్పుడు మొదటి పిరియడ్‌లో నేర్చుకున్న అంశాలపై పునశ్చరణ ప్రశ్నలు అడగాలి. తరువాత పాఠ్యాంశ ప్రకటన చేయాలి. నల్లబల్లపై వ్రాయాలి.

**2. పాఠ్యాంశం చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట :**

ఉపాధ్యాయుడు చెప్పబోయే పాఠ్యాంశానికి సంబంధించి పిల్లలను వ్యక్తిగతంగా చదవమనాలి. పాఠంలోని విషయాలను, చిత్రాలను, పట్టికలను, పటాలను, గ్రాఫ్‌లను పరిశీలించి అవగాహన చేసుకోమనాలి. పిల్లలను పాఠం చదివిన తరువాత తమకు అర్థంగాని భావనలు, సాంకేతిక పదజాలం, తెలియని పదాల క్రింద పెన్సిల్‌తో గీత గీయమనాలి.

ఉపాధ్యాయుడు పిల్లలకు తెలియని పదాలు, గీత గీసిన వాటిని పూర్తిగా తరగతి కృత్యంగా నిర్వహించాలి. తెలియని పదాలను విద్యార్థులు ఒక్కొక్కరుగా చెబుతూ ఉంటే ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి. ఉపాధ్యాయుడు ఒక్కొక్క పదాన్ని పిల్లలచే చర్చింపజేసి పాఠ్యాంశంపై అవగాహన కల్గించాలి.

**3. భావనల అవగాహన– చర్చ :**

ఉపాధ్యాయుడు పిల్లలచేత పాఠ్యాంశం గురించి మాట్లాడించాలి. అందరు పిల్లలు మాట్లాడేటట్లు ప్రోత్సహించాలి. తర్వాత పాఠ్యాంశంలో తమకు అర్థంకాని మరియు సమకాలీన అంశాలపై పిల్లలు ప్రశ్నలు అడిగేటట్లు ప్రోత్సహించాలి. వాటిని నల్లబల్లపై వ్రాయాలి. తరువాత ఉపాధ్యాయుడు పాఠంలోని విషయము / చిత్రము / పటము / గ్రాఫ్ / పట్టిక గురించి అవగాహన చేయించడానికి కొన్ని ఆలోచింపజేసే ప్రశ్నలు (విద్యా ప్రమాణాల ఆధారంగా) నల్లబల్లపై రాయాలి. ఈ ప్రశ్నలను మొత్తం తరగతి కృత్యంగా నిర్వహించాలి. ఉపాధ్యాయుడు ఒక్కొక్క ప్రశ్నకు పిల్లలు చెప్పిన సమాధానాలను నల్లబల్లపై ముఖ్యాంశాలుగా Concept Mapping చుట్టూ రాయాలి.

ఒకవేళ పిల్లల నుండి సరియైన సమాధానం రాకపోతే ఉపాధ్యాయుడు సమాధానాన్ని తాను కూడా జోడించాలి. ఇలా Concept Mapping చుట్టూ ముఖ్యాంశాలు రాస్తూ ఉపాధ్యాయుడు ప్రశ్నల వారీగా మొత్తం పాఠ్యాంశంపై అవగాహన కల్పించాలి.

**నైపుణ్యాలను అభ్యసనం చేయడం :**

ఉపాధ్యాయుడు సమాచార నైపుణ్యాలు, పట నైపుణ్యాలను తరగతి గదిలో అభ్యాసం చేయించాలి. పాఠ్యాంశంలోని సమాచార పట్టికలను పూర్తి చేయించడం, విషయం ఆధారంగా పట్టికలను తయారు చేయించడం, పట్టిక ఆధారంగా ప్రశ్నలు ఇచ్చి విశ్లేషింపచేయడం, పట్టిక ఆధారంగా గ్రాఫ్ రూపంలో చూపటం, గ్రాఫ్ ఆధారంగా ప్రశ్నలు ఇచ్చి విశ్లేషింపచేయడం వంటివి తరగతి గదిలో ఉపాధ్యాయుడు పిల్లలతో అభ్యాసం చేయించాలి. ఒకవేళ చెప్పే పాఠంలోని సమాచార నైపుణ్యాలకు అవకాశం లేనట్లయితే ఉపాధ్యాయుడు స్వయంగా పట్టికలను తయారు చేయడం, టెక్స్ట్, గ్రాఫ్‌లను సేకరించి పిల్లలచే అభ్యాసం చేయించడం. ఇలా అభ్యాసం చేయించడం వల్ల పిల్లలో సమాచార నైపుణ్యాలైన సేకరణ, నమోదు, విశ్లేషణ, నిర్ధారణకు రావడం వంటివి పెంపొందుతాయి.

అలాగే పట నైపుణ్యాలలోని పాఠ్యాంశంలోని పటాలను పరిశీలించడం, గుర్తించడం, విశ్లేషించడం, గీయడం వంటివి పిల్లలచే అభ్యాసం చేయించాలి. ఒకవేళ పాఠ్యాంశంలో పటాలు లేనట్లయితే ఉపాధ్యాయుడు స్వయంగా పాఠ్యాంశానికి అనుబంధ అంశాలపై పటాలను సేకరించి పిల్లలచే అభ్యాసం చేయించాలి. అలాగే పటాలు గీయడంలో తరగతి గది మొదలుకొని భారతదేశ పటం వరకు అభ్యాసం చేయించాలి.

**4. ఇంటిపని :**

ఉపాధ్యాయుడు తరగతి గదిలో చర్చించిన ప్రశ్నలకు / చిత్రాలకు / పటాలకు / గ్రాఫ్‌లకు / పట్టికలకు సంబంధించిన వాటి సమాధానాలను విద్యార్థులను తరగతిగదిలో రాయమనాలి. ఒకవేళ సమయం లేనట్లయితే విద్యార్థులకు ఇంటిదగ్గర సమాధానాలు రాసుకు రమ్మనాలి.

బోధనా సోపానాల గురించి వివరంగా తెలుసుకున్నాం కదా! మరి ఇప్పుడు పాఠానికి పీరియడ్ ప్రణాళిక ఎలా రాయాలో చూద్దాం. మొదటి పీరియడ్ ప్రణాళిక రాసే ముందు పాఠం మొత్తానికి లక్ష్యాలు రాసుకోవాలి. దీనివల్ల పాఠం పూర్తి అవగాహన కావడమే కాక, పిల్లల్లో ఏ ఏ సామర్థ్యాలు పెంపొందించాలో కూడా తెలుస్తుంది. పాఠం లక్ష్యాలు విద్యాప్రమాణాల వారిగా రాయాలి.

## 8వ తరగతి
## పటాల అధ్యయనం – విశ్లేషణ

**పాఠం లక్ష్యాలు :**

1. విషయావగాహన
   - చిత్రాలు, పటాల మధ్య గల తేడాలను చెప్పగలరు.
   - పటాల చరిత్రను వివరిస్తారు.
   - పటాల రకాలను బట్టి వర్గీకరిస్తారు.
   - పటాల సహాయంతో భౌగోళిక పరిస్థితులు, శీతోష్ణస్థితుల గురించి విశ్లేషిస్తారు.
   - ప్రాచీన పటాల సహాయంతో భౌగోళిక పరిస్థితులు, శీతోష్ణస్థితుల గురించి విశ్లేషిస్తారు.
   - ప్రాచీన పటాల సహాయంతో ప్రాచీన నాగరికత విశేషాలను వర్ణిస్తారు.
   - పటాల తయారీ అవసరం ఎందుకు ఏర్పడిందో కారణాలు చెప్పగలరు.
   - సంకేతాల గురించి వివరిస్తారు.

2. పాఠ్యాంశం చదివి, అర్థం చేసుకుని వ్యాఖ్యానించుట :

- వివిధ కాలాల్లో తయారు చేసిన పటాలపై వ్యాఖ్యానిస్తారు.
- వలసల ఏర్పాటు, వనరుల దోపిడి గురించి వ్యాఖ్యానిస్తారు.

3. సమాచార నైపుణ్యాలు :

- అక్షాంశ, రేఖాంశాలు ఏఏ దేశాల గూండా పోతున్నాయో పట్టిక తయారు చేయగలరు.
- వార్షిక సగటు వర్షపాతం, మృత్తికలు, అడవులు, ఖనిజాల గురించి సమాచారాన్ని సేకరిస్తారు.

4. సమకాలీన అంశాలపై ప్రతిస్పందన, ప్రశ్నించడం :

- పటాల వినియోగం వల్ల జరిగిన పరిణామాలపై ప్రతిస్పందిస్తారు.
- పటాల తయారీ గురించి ప్రశ్నిస్తారు.

5. పట నైపుణ్యాలు :

- ప్రపంచ పటంలో దేశాలు గుర్తిస్తారు.
- భారతదేశ పటంలో జనసాంద్రత గల రాష్ట్రాలకు రంగులు వేస్తారు.
- భారతదేశ పటంలో వార్షిక సగటు వర్షపాతం, మృత్తికలు, ఖనిజాల గురించి పరిశీలించి విశ్లేషిస్తారు.

6. ప్రశంస - సున్నితత్వం :

- పటాలు తయారు చేసిన వారి గొప్పతనాన్ని ప్రశంసిస్తారు.


**4.2.3. పీరియడ్ ప్రణాళిక - 1**

1. ఉపోద్ఘాతం :

1. పలకరింపు :

శుభోదయం పిల్లలూ! ఎలా ఉన్నారు? సెలవులు ఎలా గడిపారు? సెలవులలో ఎక్కడికైనా వెళ్ళారా? కొత్తనగరాలు, ప్రదేశాలకు వెళ్ళాలంటే ఏమి చేస్తారు? ఈ రోజు మనం పటాల గురించి కొత్త పాఠ్య పుస్తకాలలో ఏముందో తెలుసుకుందాం? తెలుసుకునే ముందు పటాల గురించి మీకు ఏమి తెలుసో చెప్పండి.

2. మైండ్ మ్యాపింగ్ :




3. పాఠ్యాంశ ప్రకటన : పటాల అధ్యయనం

(ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి)

2. పాఠ్యాంశం, చదువుట తెలియని పదాలు / భావనలు గుర్తించుట :

పిల్లలూ... పాఠ్యపుస్తకం తీయండి. మొదటిపాఠంలో 1వ పేజీ నుండి 3 వ పేజీలోని ఎడమవైపు ఉన్న రెండు పేరాల వరకు చదవండి. మీకు తెలియని పదాలు గుర్తించి, వాని కింద గీత గీయండి.

ఉదా : నమూనా

సుమేరియన్లు

పిల్లలూ... అందరూ తెలియని పదాలను గుర్తించారుకదా! ఒక్కొక్కరు లేచి చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై కుడివైపు చివర రాసి, ఒక్కొక్క పదం గురించి విద్యార్థులతో చర్చిస్తూ వివరించాలి.)

3. భావనల అవగాహన - చర్చ.

1. మాట్లాడించుట :

పిల్లలూ... పాఠం చదివారు కదా! చిత్రాలను చూసారు కదా! మీకు ఏమి అర్థమైందో చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలందరూ మాట్లాడేటట్లు ప్రోత్సహించాలి)

2. ప్రశ్నించుట :

పిల్లలూ... పాఠం గురించి కాని, పాఠానికి సంబంధించిన అంశాలపై తెలుసుకోవడానికి ప్రశ్నలు అడగండి.

(ఉపాధ్యాయుడు పిల్లలను ప్రశ్నలు అడిగేటట్లు ప్రోత్సహించాలి. పిల్లలు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై వ్రాయాలి)

3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు :

1. చిత్రానికి, పటానికి మధ్యగల తేడాలు తెల్పండి?
2. ప్రాచీన కాలంలో మట్టి పలకల ద్వారా వివిధ పటాలు తయారుచేయుటకు గల కారణాలు తెలపండి?
3. పటాలు తయారు చేయుటకు ఏయే అంశాలను సూచికలుగా తీసుకుని పటాలను తయారుచేస్తారు?
4. గ్రీకులు, రోమన్లు పటాలు తయారు చేయడానికి ఆసక్తి చూపారు - ఎందుకు ?

(ఉపాధ్యాయుడు ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి. పిల్లలు అడిగిన ప్రశ్నలను, ఈ ప్రశ్నలను కొన్ని జట్లలో, కొన్ని పూర్తి తరగతిలో చర్చించాలి. పిల్లలు చెప్పిన విషయలను కాన్సెప్ట్ మ్యాప్ ద్వారా చుట్టూ కీలక పదాల రూపంలో రాయాలి. ఇలా అన్ని ప్రశ్నలను చర్చించాలి.)

4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం.

- పటనైపుణ్యాఅలు

పిల్లలూ.... హెకెటియస్ ఆధారంగా గీచిన ప్రపంచ పటాన్ని పరిశీలించారు కదా! ఇది మీరు గీయగలరా? ప్రయత్నించండి. అందులో కిందివాటిని గుర్తించండి.

1. లిబియా 2. యూరప్ 3. అరేబియా సముద్రం 4. ఇండియా 5. గ్రీసు

6. ఇంటిపని :

పిల్లలూ... పటాల గురించి చాలా విషయాలు చర్చించాం కదా! మరి పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలకు జవాబులు రాయండి.

(ఉపాధ్యాయుడు ప్రశ్నలకు జవాబులు తరగతి గదిలో రాయించాలి. ఒకవేళ సమయం లేకపోతే ఇంటిపనిగా ఇవ్వాలి).

**4.2.3.1 పీరియడ్ ప్రణాళిక -2**

1. ఉపోద్ఘాతం

1. పలకరింపు :

పిల్లలూ - శుభోదయం ఎలా ఉన్నారు? నిన్నటి తరగతిలో పటాల అధ్యయనం గురించి తెలుసుకున్నారు కదా! మరి మీకు ఏమి అర్థమైందో చెప్పండి.

2. పునశ్చరణ ప్రశ్నలు :

- చిత్రానికి, పటానికి గల తేడాలను రెండు చెప్పండి.
- పటాలు ఎందుకు తయారు చేస్తారు?
- పటాలు తయారు చేయడానికి ఎవరు ఆసక్తి చూపారు ?
- పటాల తయారీకి ఏయే అంశాలు పరిగణనలోకి తీసుకున్నారు?

పిల్లలూ... బాగా సమాధానాలు చెప్పారు. ఈ రోజు పటాల గురించి మరింత సమాచారం తెలుసుకుందామా!.

3. పాఠ్యాంశ ప్రకటన :

పిల్లలూ... ఈ రోజు పటాల తయారీ గురించి వివరంగా తెలుసుకుందాం.

**పటాల తయారి**

(ఉపాధ్యాయుడు నల్లబల్లపై రాయాలి)

2. పాఠ్యాంశం చదువుట, తెలియని పటాలు / భావనలు గుర్తించుట :

పిల్లలూ... పాఠ్యపుస్తకం తీయండి... పేజి నెం. 3లోని నావికులకు ఉపయోగపడే పటాల నుండి 6వ పేజీలోని ప్రక్షేపణం వరకు చదవండి.

మీకు తెలియని పదాలు/భావనలు గుర్తించి, వాటి కింద గీత గీయండి. ఉదా: మెరిడియన్, నావికులు.

పిల్లలూ... తెలియని పదాల గుర్తించారు కదా? మీరు రాసిన వాటిని ఒక్కొక్కరు లేచి చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలు చెప్పిన పదాలను నల్లబల్లపై వ్రాసి, ఒక్కొక్క భావన గురించి పిల్లలచే చర్చిస్తూ ముగించాలి.)

3. భావనల అవగాహన - చర్చ :

1. మాట్లాడించుట :

పిల్లలూ... అందరూ పాఠం చదివారు కదా! మీకు ఒక్కొక్కరు లేచి చెప్పండి.

(ఉపాధ్యాయుడు పిల్లలను మాట్లాడేటట్లు ప్రోత్సహించాలి)

2. ప్రశ్నించుట :

పిల్లలూ... పటాల గురించి తెలుసుకోవడానికి మీరు కొన్ని ప్రశ్నలు అడగండి.

(పిల్లలు-ప్రశ్నించేటట్లు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. పిల్లలు అడిగిన ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి)

3. పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలు, చిత్రం ఆధారంగా ప్రశ్నలు :

పిల్లలూ... మీరు కొన్ని ప్రశ్నలు అడిగారు కదా! నేను కొన్ని ప్రశ్నలు నల్లబల్లపై రాస్తాను... పరిశీలించండి.

మెరిడియన్ అనగా...

- టాలమీ పుస్తకాలు ప్రాచీన గ్రీకుల కాలంలో ఎందుకు ప్రాచుర్యం పొందాయి?
- ఆల్ ఇద్రిసి గీసిన ప్రపంచ పటంలో ఏయే అంశాలను ఏ విధంగా చూపించాడో వివరింపుము?

– 15వ శతాబ్దంలో ఏయే కొత్త సంప్రదాయాలు వెలసిల్లినాయి? అందుకు గల కారణాలు తెలుపుము?
– బైబిల్ ప్రకారం ప్రపంచం నమూనాను పరిశీలించి వివరాలు రాయండి.
– మెర్కెటర్ ప్రక్షేపణం అనగా...

(ఉపాధ్యాయుడు ఒక్కొక్క ప్రశ్నను పూర్తి తరగతిలో చర్చిస్తూ.. పిల్లలు చెప్పిన విషయాలను కాన్సెప్ట్ మ్యాపింగ్ చుట్టూ రాస్తూ అవసరమైతే తాను జోడిస్తూ ముగించాలి)

4. నైపుణ్యాలను అభ్యాసం చేయడం.

సమాచార నైపుణ్యాలు

ప్రాచీనకాలంలో శాస్త్రవేత్తలు ఏయే పటాలు తయారు చేసినారో సేకరించి పట్టికలో రాయండి.

| వ.సంఖ్య | పటాలు తయారు చేసిన వారి పేరు | పటంలో చూపించిన అంశాలు | పటం పేరు |
|---|---|---|---|
| 1 | | | |
| 2 | | | |
| 3 | | | |
| 4 | | | |
| 5 | | | |

4. ఇంటిపని :

పిల్లలూ... పటాల తయారీ గురించి చాలా విషయాలు తెలుసుకున్నారు కదా! పాఠ్యాంశ అవగాహన ప్రశ్నలకు జవాబులు రాయండి. అలాగే మీ అభ్యసన మెరుగుపరచుకోండిలో 4వ ప్రశ్నకు కూడా సమాధానం రాయండి. (ఉపాధ్యాయుడు సమయం ఉంటే తరగతిలో రాయించాలి. లేకుంటే ఇంటి పనిగా ఇవ్వాలి)

## 4.3.1. సాంఘికశాస్త్ర భావనలు :

మనం వివిధ తరగతులలో విద్యార్థుల యొక్క స్థాయిని బట్టి వివిధ సాంఘిక శాస్త్ర భావనలు ప్రవేశపెడతాయి. వాటిపై విద్యార్థుల అవగాహనను పెంపొందిస్తాయి.

ఈ క్రింది కొన్ని సాంఘిక శాస్త్ర భావనలను గమనించండి.

1. మాన చిత్రాల అధ్యయనం తయారీ.
2. మన గ్రామం, జిల్లా, రాష్ట్రం, దేశము, ప్రపంచము.
3. ప్రాచీన కాలం నుండి నేటి వరకు మానవ వికాసం.
4. ప్రధాన భూ స్వరూపాలు – రాష్ట్రము, దేశము, ప్రపంచము.
5. చరిత్ర – గ్రామము, జిల్లా – రాష్ట్రము – దేశము – ప్రపంచము.
6. ప్రజాస్వామ్యము – పరిపాలన
7. గ్రామపంచాయితీ, మండలము, జిల్లా, దేశము, వాటి పరిపాలన, ఎన్నికల నిర్వహణ, బాధ్యతలు, అధికారాలు.
8. సమాజంలోని వైవిధ్యం, వైవిధ్యంలో ఏకత్వం.
9. భారతదేశ సాంస్కృతిక, వారసత్వ విశిష్టత.
10. వివిధ సామాజిక సమస్యలు – బీదరికము, నిరక్ష్యరాస్యత, సామాజిక అసమానతలు – వాటిని అధిగ

మించడానికి జరుగుతున్న ప్రయత్నాలు – సాధించిన విజయాలు – ఇంకా చేయవలసిన ప్రయత్నాలు.

11. భారత రాజ్యాంగము – విశిష్టత – రాజ్యాంగంలోని హక్కులు – బాధ్యతలు.

12. భారతదేశ ఆర్థికవ్యవస్థ–ఆర్థిక సమస్యలు – ఈ సమస్యలను అధిగమిస్తూ మనం సాధించిన – సాధిస్తూ ఉన్న ప్రగతిని చర్చిస్తుంది.

13. భారతదేశ భవిష్యత్తుపై ఆశావాహ దృక్పథం.

**4.3.2. సాంఘిక శాస్త్రాన్ని అర్థం చేసుకోవడంలో సాంఘిక – సాంస్కృతిక పదాలు :**

సాంఘికశాస్త్రాన్ని అర్థం చేసుకోవడంలో విద్యార్థుల సాంఘిక – సాంఘిక నేపథ్యం ఎంతో ప్రాముఖ్యత వహిస్తుంది. వాళ్ళ నేపథ్యం ఆధారంగా విషయాన్ని తగు విధంగా అర్థం చేసుకుంటారు.

– ఉదాహరణకు గ్రామీణ నేపథ్యం గల విద్యార్థులు ఈ క్రింది విషయాలను సులభంగా అర్థం చేసుకోగలరు.

– గ్రామ పంచాయితీ, గ్రామపంచాయితీ ఎన్నికలు, గ్రామపంచాయితీ విధులు మొదలైనవి.

– వ్యవసాయము, మనం పండించే పంటలు, నేలలో రకాలు, గ్రామంలో ఉండే వివిధ వృత్తులు.

– గ్రామీణ ప్రాంతంలోని జంతువులు, అవి దేనికి ఉపయోగపడతాయి.

– పట్టణ నేపథ్యం గల విద్యార్థులకు ఈ క్రింది విషయాలు సులభంగా అర్థం చేసుకోగలరు.

– పట్టణ జీవనం, పట్టణ జీవన సరళి, ట్రాఫిక్ సమస్యలు, వాతావరణ కాలుష్యం మొదలైనవి నిత్యం అనుభవంలోకి వచ్చే అంశాలు.

– మార్కెట్‌లు, వివిధ రకాలైన మార్కెట్‌లు, పరిశ్రమలు, కార్యాలయాలు, వివిధ రకాల ఉద్యోగాలు, వాళ్ళ జీవన విధానం మొ॥ అంశాలు.

– గిరిజన ప్రాంత విద్యార్థులు ఈ క్రింది విషయాలను సులభంగా అర్థం చేసుకోగలుగుతారు.

– అడవులు, అడవులలో దొరికే వస్తువులు, వాటిని ఎలా సేకరిస్తారు, అడవుల ఉపయోగాలు.

– రకరకాల జంతువులు, అడవులలో ఉండే జంతువులు మొ॥నవి.

కాబట్టి పాఠ్యాంశాలను బోధించేటపుడు విద్యార్థులనేపథ్యం గ్రహించి వారి అనుభవంలోలేని విషయాలను బోధించేటపుడు ఉపాధ్యాయుడు తగు బోధనోపకరణాలను ఉపయోగించడం, తాను ప్రత్యక్షంగా తరగతి గదిలోకి తేలేని అంశాలను కంప్యూటర్ ఆధారిత అంశాల ద్వారా బోధించవచ్చు.


– ఉదాహరణకు ఒక గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 'పరిశ్రమలు' పాఠాన్ని బోధించేటపుడు – వివిధ చార్టులను ఉపయోగించవచ్చు – అంతర్జాలం ఆధారంగా కూడా బోధించవచ్చు.

– తాను క్షేత్ర పర్యటనలకు తీసుకుని వెళ్ళేటపుడు ఇలాంటి పాఠ్యాంశాలకు సంబంధించి భావనలను ముందే వ్రాసి ఉంచుకొని ప్రణాళిక వేసుకుంటే విద్యార్థులకు బోధించడం సులభమవుతుంది.

**4.3.3 విభిన్న సమాధానాలు గల ప్రశ్నలు, సామూహిక కృత్యాల ద్వారా జ్ఞానాన్ని నిర్మించడం :**

మనం పాఠ్యాంశాలను బోధించటపుడు విద్యార్థులను ఆలోచింపజేయాలి. పాఠం ప్రారంభంలో, పాఠం మధ్యలో, పాఠం చివరలో కూడ పాఠ్యాంశ బోధనలో ప్రతి మెట్టులోను వారిని మనతో తీసుకుని వెళ్ళాలి. ముఖ్యంగా విభిన్న సమాధానాలు గల ప్రశ్నలు, సామూహిక కృత్యాలు జ్ఞానాన్ని నిర్మించడంలో బాగా ఉపయోగ పడతాయి.

ఉదాహరణకు 'బ్యాంకింగ్' అనే పాఠం బోధిస్తున్నారు అనుకుందాం. 'బ్యాంకింగ్' అంటే మీకేమి తెలుసో చెప్పండి. అప్పుడు పిల్లలు ఆలోచిస్తారు.




పై అంశాలను ఆధారం చేసుకొని మనం ఆ పాఠాన్ని బోధించవచ్చు. దీనినే మనం ప్రస్తుతం మైండ్ మాపింగ్ అంటున్నారు.

ఇదే పాఠ్యాంశ్యాన్ని ఇంకా ముందుకు తీసుకొని వెళుతూ జట్టు కృత్యాలు ఇవ్వవచ్చు.

1. బ్యాంకులలో ఎన్ని రకాల డిపాజిట్‌లు ఉంటాయి?
2. బ్యాంకులు ఏఏ అవసరాలకు అప్పులిస్తాయి?
3. మీకు తెలిసిన బ్యాంకుల పేర్లు వ్రాయండి ?
4. ఈ బ్యాంక్‌లపైన ఎవరు నియంత్రణ చేస్తారు? ఎలా నియంత్రణ చేస్తారు?

మొదలైన కృత్యాలు ఇచ్చి విద్యార్థులు తాము చర్చించిన తరువాత వారు చర్చించిన అంశాలను తరగతికి నివేదిస్తారు.

ఇంకోవిధంగా చెప్పాలంటే అభ్యసనము అనగా అనుసంధానమే. తాను ఇంతవరకు నేర్చుకున్న పూర్వజ్ఞానంతో కొత్త జ్ఞానాన్ని అనుసంధానం చేయడం (Leadership in completing). తెలిసిన దాని నుండి తెలియని దానికి, తేలికైన దాని నుండి కష్టమైన దానికి, సరళమైన దాని నుండి క్లిష్టమైన దానికి.

### 4.3.4 వాస్తవాలు – అభిప్రాయాలు :

వాస్తవాలు ఖచ్చితంగా ఆధారాలపై ఏర్పడినవి. విషయ నిర్దిష్టత గలవి. ఖచ్చితంగా నిరూపించదగినవి. నిరూపించబడినవి. వాస్తవాలు చరిత్రలో ఎపుడూ నిలిచి ఉంటాయి. కొన్నిసార్లు గణాంకాలపై ఆధారపడినవి.

వెబ్‌స్టర్ నిఘంటువు వాస్తవాన్ని ఇలా నిర్వచించింది – ఏదైనా జరిగిన లేదా సంభవించిన సంఘటన; నిజంగా ఉన్న స్థితి; నిజమైన ప్రకటన; సత్యము, వాస్తవము.

అభిప్రాయాన్ని ఇలా నిర్వచించింది – అభిప్రాయమనగా నమ్మకము, దృక్పథము, మనోబావము, భావము.

- మనం ఏదైనా నిర్ణయం తీసుకునేటప్పుడు, మనకు ఏర్పడే పరిస్థితులను అంచనా వేయడానికి వాస్తవాలకు, అభిప్రాయాలకు మధ్య గల తేడాను తెలుసుకోవాలి.
- వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకొన్నట్లయితే ఎక్కువ సత్ఫలితాలనిస్తాయి. విశ్లేషణాత్మక సామర్థ్యం దీనికి తోడ్పడుతుంది.
- ఇది తేలికగా అనిపించవచ్చు కాని అంత తేలిక కాదు.
- సాధారణంగా అభిప్రాయాలు ఏర్పరచుకోవడానికి వాస్తవాలను వాడుకుంటాము.

- చాలాసార్లు రచయితల అభిప్రాయాలను మనం వాస్తవాలుగా పొరపడుతుంటాము.

ఈ క్రింది విషయాలను గమనించండి.


మహాత్మా గాంధి గుజరాత్‌లోని పోరుబందర్‌లో జన్మించారు. ఆయన న్యాయవాదిగా పనిచేశారు. ఆయనకు సత్యము అహింసలపై అపరిమితమైన నమ్మకం. ఆయన అందరికి ఆమోద యోగ్యమైన నాయకుడు. గాంధీజీ విధానాలను అందరు ఇష్టపడేవారు. ఆయన అభిప్రాయాలను ఆమోదించేవారు.

పై అంశాలను మనం జాగ్రత్తగా గమనిస్తూ మొదటి మూడు వాక్యాలు వాస్తవాలు. చివరి మూడు వాక్యాలు అభిప్రాయాలు.

ఈ క్రింది ఉదాహరణలలో ఏవి వాస్తవాలో, ఏవి అభిప్రాయాలో తెలపండి, ఎందుకో వివరించండి.

- వేసవికాలం చలికాలం కంటే ఆహ్లాదకరంగా ఉంటుంది.
- ఉగ్రవాదం పెరుగుదలకు ఆర్థిక పరిస్థితులే కారణం.
- ఆర్థిక వెనుకబాటుతనం వల్ల తల్లిదండ్రులు పిల్లలను బడికి పంపరు.
- అక్షరాస్యతను పెంచడం ద్వారా ఆరోగ్యంపై చైతన్యాన్ని పెంచవచ్చు.
- ఔరంగజేబు పతనానికి ఆయన మతవిధానమే కారణం.
- ప్రజలను విద్యావంతులను చేస్తే అవినీతి నిర్మూలించవచ్చు.
- అన్నిరకాల అవినీతికి రాజకీయ అవినీతే మూలము.
- ఉద్యోగస్తుల జీతాలు పెంచితే పనిసామర్థ్యం పెరుగుతోంది.

వాస్తవానికి, అభిప్రాయానికి గల తేడాను తెలుసుకోవడానికి ఈ క్రింది విశ్లేషణా ప్రక్రియను గమనించండి.



**4.4.1. అన్వేషణ ఆధారిత ఉపగమం :**

ఇది విద్యార్థి తనకు తానే సొంతంగా అధ్యయనం చేసి కొత్త విషయాలను కనుగొనే విధానం. దీనిలో విద్యార్థే పరిశోధకుడు. విద్యార్థి నేర్చుకునే ప్రక్రియను మనం నేర్పుతాము. విద్యార్థికి మనం తక్కువ చెప్పాలి. అతడు సొంత ప్రయత్నం ద్వారా ఎక్కువ నేర్చుకోవాలి. అన్వేషించాలి, పరిశోధించాలి. ఇది విద్యార్థి ఆలోచనకు పదును పెడుతుంది. జ్ఞాన తృష్ణను రగిలిస్తుంది. అతనికి సవాళ్ళను విసురుతుంది. సవాళ్ళను ఎదుర్కొని సమస్యను పరిష్కరించిన తరువాత ఎంతో ఆనందం కలుగుతుంది. ఆ అనుభవం, ఆ ఆత్మవిశ్వసం అతనిని ఇంకా ముందుకు తీసుకువెళ్ళి జీవితంలో ఇంకెన్నో విజయాలను అందిస్తుంది. సమస్యాపరిష్కార పద్ధతి, అన్వేషణాపద్ధతి, ప్రాజెక్టు పద్ధతి, ప్రయోగపద్ధతి ఇవన్నీ అన్వేషణ ఆధారిత ఉపగమం క్రిందనే వస్తాయి.

ఉదాహరణకు ఈ క్రింది సమస్యలను తీసుకుందాం.

1. మన గ్రామంలో ఏయే పంటలు పండిస్తున్నారు? ఎందుకు?
2. మన గ్రామంలో గత సంవత్సరంగా ఏయే వ్యాధులు ఎక్కువగా వచ్చాయి? ఎందుకు?
3. మన గ్రామంలో అక్షరాస్యతాశాతం ఎంత? ఎందుకు?
4. మన గ్రామంలో పిల్లలు ఏయే పాఠశాలలకు వెళుతున్నారు – కారణాలేమిటి?

పైన పేర్కొన్న సమస్యలలో ఏదైనా ఒక సమస్యను తీసుకున్నాము అనుకుందాం. తీసుకొని ఆ సమస్యను స్పష్టంగా పేర్కొని, దానికి సంబంధించి పనిని ఎలా చేయాలో ఒక ప్రణాళిక వేసుకొని, కొన్ని సమూహాలుగా ఏర్పడి, గ్రామంలో ఇంటింటికి వెళ్ళి సమాచారం సేకరించి, సమాచారాన్ని క్రమపద్ధతిలో అమర్చి విశ్లేషించి కారణాలు తెలుసుకొని పరిష్కారాలు సూచిస్తూ ఒక నివేదిక తయారుచేయాలి.

**ఇందులోని సోపానాలు :**

1. సమస్యను స్పష్టీకరించడం : మనం ఏ సమస్యను పరిష్కరిద్దామనుకుంటున్నామో, లేదా ఏ సమస్యపై వివరాలు సేకరించాలనుకుంటున్నామో ఆ సమస్యను వివరంగా పేర్కొనాలి.

2. సమస్య : ఈ గ్రామంలో పంటలు – రైతుల స్థితిగతులు.

   ప్రణాళిక : దీనికి స్పష్టమైన ప్రణాళిక వేసుకోవాలి.

   ఉదా:– ఈ గ్రామంలో రైతులు ఏయే పంటలు పండిస్తున్నారు. ఎందుకు పండిస్తున్నారు. వారి ఆదాయం ఎలా ఉంది. పంటధర ఎలా ఉన్నది. పెట్టుబడి ఎంత? ఎరువులు, పురుగుమందులు అందుబాటులో వున్నాయా? పంట రుణాలు సకాలంలో అందుతున్నాయా? పొలంలో పని చేయడానికి కార్మికులు అందుబాటులో ఉన్నారా? మొదలగు విషయాలపై స్పష్టమైన అవగాహనతో సమస్య ప్రణాళిక వేసుకోవాలి. ప్రశ్నావళి తయారు చేసుకోవాలి.

   పై ప్రశ్నలతో ఒక ప్రశ్నావళి తయారు చేసుకోవాలి. దానిపై సమాచారం సేకరించి, విశ్లేషించాలి. పరిష్కారం కనుగొనాలి.

3. సమూహాల నేర్పరచడం :–

   విద్యార్థులందరిని సమూహాలుగా ఏర్పరచడం, సమూహంలో ఎంతమంది ఉన్నారు ? ఎవరెవరు ఏయే వీధులలో సేకరించాలి. ఎంతకాలం సేకరించాలి మొదలగు వివరాలన్నీ స్పష్టంగా పేర్కొనాలి.

4. కార్యక్రమ అమలు (Field work) :

   అనుకున్నట్లే అందరు క్షేత్రంలో తిరిగి సమాచారం సేకరించాలి. దీనిలో అనేక లోటుపాట్లుంటాయి. అందరు మనం అనుకున్నట్లు సమాచారం ఇవ్వవచ్చు. కొందరు మనకు తగిన గౌరవం ఇవ్వకపోవచ్చు మొదలగు సమస్యలుంటాయి.

5. సమాచార సేకరణ (Collection of Data):

వివిధ సమూహాలుగా క్షేత్రంలో తిరిగి సమాచారాన్ని సేకరిస్తాము.

6. సమాచార వ్యవస్థీకరణ :

మనం సేకరించిన సమాచారాన్ని మొత్తాన్ని ఒకచోట వ్యవస్థీకృతం చేస్తాము. అంటే గ్రామం మొత్తం సమాచారము ఒకచోట అమర్చబడుతోంది.

ఉదా :- గ్రామంలో ఎంతమంది రైతులున్నారు. ఎవరెవరు ఏయే పంటలు పండిస్తున్నారు. వారి ఆదాయమెంత? మొదలగు సేకరించిన వివరాలన్నీ వ్యవస్థీకృతం చేయబడతాయి.

సమాచార విశ్లేషణ :- ఆ తరువాత సమాచార విశ్లేషణ జరుగుతుంది.

అంటే ఏ పంట, ఎన్ని ఎకరాలలో ఎంతమంది రైతులు పండిస్తున్నారు. ఖర్చులు, ఆదాయం మొదలగు వివరాలన్నీ పంటల వారీగా విశ్లేషిస్తాము. ఏ పంట రైతులకు ఎక్కువ ఆదాయాన్నిస్తుంది. వారి సమస్యలు ఏమిటి? అని కొన్ని నిర్ణయాలకు వస్తాము.

నివేదిక తయారీ :- చివరలో ఈ మొత్తం ప్రక్రియలో మొత్తాన్ని రాస్తాము. ఈ కార్యక్రమం ప్రారంభం నుండి సమస్యా పరిష్కారం వరకు జరిగిన అన్ని సోపానాలను, కష్టనష్టాలను, పరిష్కారాలను స్పష్టంగా నమోదు చేస్తాము.

**ఈ పద్ధతి వలన ప్రయోజనాలు :**

1. సమస్యాపరిష్కార శక్తి అభివృద్ధి చెందుతుంది.
2. విద్యార్థులు జట్లుగా పనిచేయడం అలవరచుకుంటారు.
3. ప్రజాస్వామ్య వైఖరి అలవడుతుంది.
4. పని చేయడం ద్వారా నేర్చుకుంటారు.
5. శాస్త్రీయ వైఖరులు పెంపొందుతాయి.
6. వెనుకబడిన విద్యార్థులు కూడ ఉత్తేజం పొందుతారు.
7. ఇది మంచి పౌరసత్వ శిక్షణ.
8. శ్రమ పట్ల గౌరవం పెంపొందుతుంది.
9. వైయుక్తిక భేదాలకు తగిన కృత్యాలు ఇవ్వబడతాయి.
10. పాఠశాలలో వివిధ సబ్జెక్టుల మధ్య సహసంబంధం పెంపొందుతుంది.
11. నిజజీవితంతో దగ్గర సంబంధం.
12. విద్యార్థులలో మానసిక విస్తృతి కలుగుతుంది.
13. విద్యార్థులలో పరస్పర సహకార భావం పెంపొందుతుంది.

## 4.5.1. ఫ్లోఛార్ట్ :

ఫ్లోఛార్ట్ అనేది ఒక అంశానికి సంబంధించిన విషయాలను ఒక క్రమంలో అమర్చిన ఒక చిత్రణ లేక చిత్రాలు లేదా ఒక పట్టిక. అవి ఒకదానికి ఒకటి సంబంధించినవిగా ఉంటాయి. క్రమంలో అమర్చబడతాయి. ఆ సంబంధాలు సంకేతాల ద్వారా సూచించబడవచ్చు.

సాధారణంగా ఇవ్వబడిన, సేకరించబడిన సమాచారం క్రమపద్ధతిలో అమర్చడానికి ఇవి ఉపయోగ పడతాయి. వీటిని మనం పేపర్ పెన్సిల్‌తో తయారుచేయచ్చు. కంప్యూటర్ ద్వారా కూడా తయారు చేయవచ్చు.

మనవద్ద అందుబాటులో ఉన్న సమాచారాన్ని కంప్యూటర్ నైపుణ్యాలను ఉపయోగించి ఫ్లోఛార్టులు తయారు

చేయవచ్చు. మనం విద్యార్థులకు చాలా ప్రాజెక్టులు ఇస్తాము. వారికి ఈ కంప్యూటర్ నైపుణ్యాలు ఉంటే వారే చక్కని ప్రదర్శన ఇవ్వడానికి అవకాశం ఉంది.

మన పాఠ్యాంశాలకు సంబంధించిన అనేక అంశాలను ఫ్లోఛార్టుల రూపంలో తయారు చేయవచ్చు.

కొన్ని ఫ్లో ఛార్టులు.

అంతర్జాలంలో నుండి కొన్ని ఫ్లో ఛార్టులను మన పాఠ్యాంశాలకు అనుగుణంగా డౌన్‌లోడ్ చేసి కొన్ని తరగతిగదిలో ఉపయోగించవచ్చు.

**కాన్సెప్ట్ మ్యాప్ :**

ప్రతి పాఠ్యాంశాన్ని ప్రారంభించడానికి ముందు మనం కాన్సెప్ట్ మ్యాప్‌నుతో ప్రారంభిస్తాము. దీనివల్ల విద్యార్థిని ఆ భావనపై ఆలోచింపజేస్తాము. వారి పూర్వజ్ఞానానికి అనుగుణంగా వారి స్పందనను నమోదు చేస్తాము. ఆ తరువాత ఆయా అంశాలు ఆధారంగా పాఠ్యాంశ బోధన చేస్తాము.

పై అంశాలపై చక్కని బోధన కొరకు కంప్యూటర్ ఆధారిత కాన్సెప్ట్ మ్యాప్ తయారు చేయడం విద్యార్థులకు, బోధనను ఎంతో ఉపయోగం.

## 4.5.1. కాలపట్టికలు – చరిత్ర

సాధారణంగా చరిత్రను బోధించేటప్పుడు కాలాను గత పట్టికలను వాడతారు. దీనితో పాటు గొప్పవారి చరిత్రను బోధించేటప్పుడు వారు ఎపుడు ఏమి చేశారో, ఏమి సాధించారో మొ॥ తెలుసుకోవడానికి.

ఒక కాలక్రమం ప్రకారం ఒక విషయాన్ని వివరించవలసినపుడు ఈ టైమ్‌లైన్‌ను వాడతారు. దీనిలో విషయాలు ముందు జరిగినవి ముందు, తరవాత జరిగినవి తరువాత వివరించడం జరుగుతుంది. వీటిని అన్ని తరగతులు వాడతారు.

ఈ క్రింది సందర్భాలలో దీనిని వాడతారు.

- చరిత్రలో ఒక వరుస క్రమంలో జరిగిన సంఘటనలను వివరించుటకు.
- చరిత్రలో జరిగిన ముఖ్యమైన సంఘటలను వివరించుట.
- వ్యక్తుల చరిత్రలను ఒక క్రమపద్ధతిలో బోదించవలసినపుడు
- ఒకే కాలంలో గల విభిన్న వ్యక్తుల, సంఘటనలను పోల్చుటకు

1. మధ్యయుగాలలో భారతదేశం – ఐరోపా – ఆఫ్రికా
2. ఆధునిక భారతదేశం – ఆధునిక ఐరోపా – ప్రపంచం
3. అంతరిక్ష రంగంలో భారతదేశం – అదేకాలంలో నాసా – అదేకాలంలో రష్యా

వాటి వికాసం–అభివృద్ధి.

ఉదా : 1వ తరగతి నుండి ఒక విద్యార్థి ప్రగతి ఉదాహరణకు

| తరగతి | తెలుగు | గణితం | పరిసరాల విజ్ఞానం / సాంఘికశాస్త్రం |
|---|---|---|---|
| 1వ తరగతి | | | |
| 2వ తరగతి | | | |
| 3వ తరగతి | | | |
| 4వ తరగతి | | | |
| 5వ తరగతి | | | |
| 6వ తరగతి | | | |
| 7వ తరగతి | | | |
| 8వ తరగతి | | | |

భారతదేశ ప్రధానమంత్రులు :

| | |
|---|---|
| 1952–1964 | జవహర్‌లాల్ నెహ్రూ |
| 1964–1966 | లాల్‌బహదూర్ శాస్త్రి |
| 1966–1977 | ఇందిరాగాంధి |
| 1977–1980 | మురార్జీదేశాయ్ |
| 1980–1984 | ఇందిరాగాంధి |
| 1984 | రాజీవ్‌గాంధి |
| | వి.పి.సింగ్ |
| | చంద్రశేఖర్ |
| | చరణసింగ్ |
| | దేవగౌడ |
| | అటల్‌బిహారీ వాజ్‌పేయ్ |
| 2004–2014 | మన్మోహన్‌సింగ్ |
| 2014 | నరేంద్రమోడి |

**ఈ క్రింది కృత్యాలను చూడండి :**

1. 2000 సం॥ నుండి ఈ పాఠశాల పదవతరగతి పరీక్షా ఫలితాలపై టైమ్‌లైన్ చార్ట్ తయారుచేయండి. ఫలితాలను వివరించండి.
2. 6–10 వరకు మార్కుల / గ్రేడుల తీరుపై టైమ్‌లైన్ చార్టు తయారుచేసి విశ్లేషించండి.
3. భారతదేశ చరిత్రలోని ప్రముఖ పట్టణాలను చార్టు తయారుచేయండి.
4. భారతజాతీయ ఉద్దమ్యంలోని ప్రముఖ ఘట్టాల టైమ్‌లైన్ చార్టు తయారుచేయండి.
5. మీ పాఠశాల చరిత్రలో ప్రముఖ ఘట్టాలు.
6. మీ కుటుంబ చరిత్రలో ప్రముఖ ఘట్టాలు.
7. నీ జీవితంలో ముఖ్య ఘట్టాలు.

## 4.5.2. కళాకృతులు :

సాంఘికశాస్త్ర బోధనలో కళాకృతులు లేదా పరికరాల ఉపయోగం అత్యంత ప్రాముఖ్యంతో కూడుకున్నది. ప్రాచీనకాలంలో లేదా ఆధునిక కాలంలో వాడిన, వాడుతున్న వస్తువులు, పరికరాల ఆధారంగా సాంఘికశాస్త్రాన్ని బోధిస్తే పిల్లలకు ఆసక్తికరంగా ఉంటుంది. ప్రాచీన కళాత్మక వస్తువులు ఎక్కువ త్రవ్వకాలలో బయల్పడినవే. ఈ కళాత్మక వస్తువులు ఏమిటి?

వస్త్రాలు, కుండలు, గిన్నెలు, ఇటుకలు, కలములు, శిలలు, శిల్పాలు, సంగీత పరికరాలు, పాత్రలు, వ్యవసాయ పనిముట్లయిన నాగలి, అరక, గొలుసులు, ఉంగరాలు, పూసలు, ఆటవస్తువులు, బొమ్మలు.

ముఖ్యంగా ప్రాచీన కాలానికి సంబంధించిన ఈ కళాత్మక వస్తువులను వస్తు ప్రదర్శన శాలలో భద్రపరుస్తారు. ఆధునిక కాలానికి సంబంధించినవి, సమకాలీన కాలానికి సంబంధించినవి, మన ఇంట్లో, బజారులలో వుండవచ్చు. ఒక్కోసారి ఆ వస్తువులు ప్రత్యక్షంగా మనం పొందలేక పోతే వాటి నమూనాలు, వాటి చిత్రాలు లేదా ఫోటోలతోనైనా విద్యార్థులలో కొంత ఆసక్తి కలిగించవచ్చు.

ఉపయోగించే విధానం :

మనం ఒకరోజు తరగతిలోనికి నూలువడికే రాట్నం యొక్క చిన్న నమూనాను తెచ్చాము అనుకుందాం. దీనిఆధారంగా ఏమి చెప్పవచ్చు. ఇది ఏమిటి? దీనితో ఏమిచేస్తారు? నూలుతో ఏమి చేస్తారు? బట్టలు ఎలా నేస్తారు? గాంధీ గారిని ఎప్పుడూ రాట్నంతో ఎందుకు చూపిస్తారు? స్వతంత్ర్య ఉద్యమంలో రాట్నం పాత్రేమిటి? దీని ద్వారా ప్రజలను ఎలా స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములను చేశారు? స్వదేశీ ఉద్యమానికి ఇది ఎలా ఆధారంగా ఉన్నది. దీనిద్వారా బ్రిటీష్ వారి ఆర్థిక దోపిడీని ఎలా అరికట్టగలిగాము? ఈనాడు దీనిని ఎలా వుపయోగిస్తాము? చేనేత రంగం ఈనాడు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? వాటిని మనం ఎలా పరిష్కరించగలం? మన ప్రధానమంత్రి చేనేత వస్త్రాలు వాడమని ఎందుకు అన్నారు? మొదలగు ప్రశ్నల ద్వారా బోధన కొనసాగించవచ్చు. ఈ క్రింది కొన్ని కళాత్మక చిత్రాలను గమనించండి – వాటిని విశ్లేషించండి.

ఉదా :–

దీనివల్ల ప్రయోజనాలు :

- పిల్లలలో ఆసక్తి రేకిత్తించవచ్చు.
- పాఠంలో నిమగ్నమయ్యేలా చేయవచ్చు.
- వారిని పరిశోధకులుగా తయారుచేయవచ్చు.
- పనిచేయడం ద్వారా నేర్చుకోవడంలోకి నడిపించవచ్చు.

కృత్యాలు :

– సింధునాగరికత కాలానికి సంబంధించి విభిన్న కళాత్మక వస్తువులను తీసుకోండి. విద్యార్థులను 4 లేదా 5 గ్రూపులు చేసి ఒక్కొక్కరికి కొన్ని వస్తువులు ఇవ్వండి. వాని ప్రాముఖ్యతను వ్రాయమనండి. ఒక్కొక్క సమూహాన్ని వారి అభిప్రాయాలు తెలియజేయమనండి.

2. దీనికి ఇంటర్‌నెట్ సహాయం కూడా తీసుకుంటే ఇంకా రక్తిగడుతుంది.

## 4.5.3. అధికారిక ఆధారాలు (Officaial Sources):

సాంఘిక శాస్త్ర బోధనలో అధికారిక పత్రాలు చాలా ప్రముఖ పాత్ర వహిస్తాయి. ఈ అధికారిక పత్రాల ఆధారంగానే చరిత్ర నిర్మాణం జరుగుతుంది. వాటిలోని ప్రాధమిక, ద్వితీయ ఆధారాలు ఉంటాయి. వాటిలో అధికారిక పత్రాలు, రికార్డులు, ఫైళ్ళు, ముఖ్య గ్రంథాలు, చిత్రపటాలు, వ్యక్తిగత లేఖలు, డైరీలు, వ్రాతలు, మౌఖిక చరిత్ర మొ॥నవి ఇమిడి ఉంటాయి.

వీటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

రికార్డులు :

చరిత్రను నిర్మించాలన్నా, రాజనీతి శాస్త్రము, అర్ధశాస్త్రము, భూగోళము మొదలగు వానిలో అధికారికంగా విషయాలను పేర్కొవాలన్నా అధికారికమైన రికార్డులు విశేష చాలా ప్రాముఖ్య వహిస్తాయి.

ఉదా :–

1. భారతరాజ్యాంగం సభ నిర్మాణంలో ఏ విధమైన చర్చజరిగింది దానిలో ఎవరెవరు ఏయే అభిప్రాయాలు వ్యక్తంచేశారు మొదలైనవి తెలుసుకోవాలంటే పార్లమెంటు గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించాలి.
2. పార్లమెంటులోని లోక్‌సభ, రాజ్యసభలలో విభిన్న అంశాలపై చర్చలు జరుగుతుంటాయి. ఆ చర్చ ఎలా జరిగిందో తెలుసుకోవాలంటే మనం ఆయా రికార్డులను పరిశీలించాలి. ఏ నాయకుడు ఎమి మాట్లాడాడు, ఎలా మాట్లాడాడు మొ॥ విషయాలు మనం తెలుసుకోగలుగుతాము.

3. ఈ రోజులలో కేవలం వారు మాట్లాడిన అంశాలు లిఖిత పత్రాలు మాత్రమే కాదు. వాటిని వీడియో రికార్డులు కూడా లభ్యమౌతాయి.

4. రాజుల యొక్క రాజ్యస్థానములలో ప్రతిరోజు జరుగు కార్యకలాపాల నమోదు చేయబడి ఉంటాయి. ఇవి చరిత్ర నిర్మాణంలో ఉపయోగపడతాయి. ప్రధానంగా దీనితోపాటు మిలిటరీ రికార్డులు, వ్యాపార, పారిశ్రామిక రికార్డులు.

## 4.5.4. ఫైళ్ళ ప్రాముఖ్యత :

కొన్ని అంశాల గురించిన అవగాహన కొరకు మనం ఆయా కాలానికి సంబంధించిన ఫైళ్ళను కూడా పరిశీలించవలసి ఉంటుంది. అవి ప్రభుత్వ లేఖాగారాలలో, కార్యాలయాలలో భద్రపరచబడి ఉంటాయి. వీటిలో ఆయా కాలాలకు సంబంధించి విలువైన సమాచారము, వివిధ ప్రభుత్వాలకు, నాయకులకు, అధికారులకు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు అందులో భద్రపరచబడి ఉంటాయి. ఆయా నాయకులు, అధికారులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు కూడా అందు నమోదవుతాయి. వాటివలన మనకు సంబంధించిన విషయాలపై స్పష్టత ఏర్పడుతుంది.

ఉదా :-

1. ఇటీవలి కాలంలో సుభాష్‌చంద్రబోస్ మరణానికి సంబంధించిన ఫైళ్ళను పరిశీలించడానికి ప్రజలకు అవకాశం ఇవ్వవలసినదిగా ఉద్యమం జరిగింది. ఆయా ఫైళ్ళు వర్గీకృత జాబితాలో ఉండినవి. అందరికీ అందుబాటులో లేవు. వాటిని వర్గీకృత జాబితాల నుండి తొలగించాలని, అందరికీ అందుబాటులో వుంచాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకునిరావడం జరిగింది. తదనుగుణంగా భారతప్రభుత్వం ఆయా ఫైళ్ళను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.

2. అదేవిధంగా 1962లో జరిగిన భారత చైనా యుద్ధం సమయంలో మనం ఓడిపోవడానికి కారకులెవరనే అంశంపై ఆనాటి రికార్డులను ఫైళ్ళను బయట పెట్టాలని, సైనిక అధికారులు, ప్రభుత్వానికి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను బయట పెట్టాలని కూడా దేశ వ్యాప్తంగా చర్చ జరిగింది.

ఫైళ్ళు, రికార్డులు సాంఘిక శాస్త్ర బోధనలో అత్యంత ముఖ్యమైన అంశాలు.

## 4.5.5. వ్యక్తిగత లేఖలు, డైరీలు :

సాంఘికశాస్త్ర బోధనలో వ్యక్తిగత లేఖలు, డైరీలు, ఫోటోగ్రాఫ్‌లు, ఇల్లిల్లు తిరిగి చేసిన సర్వేలు అత్యంత ప్రాముఖ్యత గల అంశాలు. ముఖ్యంగా చరిత్ర, రాజనీతి శాస్త్రంనకు, అర్థశాస్త్రంనకు సంబంధించిన అంశాలలో చాలా ప్రాముఖ్యత ఉంది. ఇవన్నీ కూడా చరిత్ర నిర్మాణానికి ప్రముఖమైన ఆధారాలుగా ఉంటాయి.

ఈ క్రింది ఉదాహరణలు గమనిద్దాం.

1. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీకి వ్రాసిన లేఖలు.
2. వివిధ నేతలు వారి అనుచరులకు వ్రాసిన లేఖలు.
3. మహాత్మగాంధీ లేఖలు – స్వాతంత్ర్య ఉద్యమ కాలం నాటి పరిస్థితులు తెలియజేస్తాయి.
4. వివేకానందుని లేఖలు – లేఖావళి పేరుతో ప్రచురించబడ్డాయి. భారతజాతిని మేల్కొలపడానికి ఆయన చేసిన ప్రయత్నం అది.
5. అరవిందుని లేఖలు – ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమం గురించి ఆధ్యాత్మిక సాధన గురించి తెలుపుతాయి.
6. అబ్రహం లింకన్ లేఖలు
7. డా॥ శాంతన్‌దాస్ అన భారతీయ సైనికుడు మొదటి ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నాడు. అతడు గాయపడి

ఇంగ్లాండ్‌లో ఆసుపత్రినుండి 29 జనవరి 1915లో వ్రాసిన ఉత్తరం ఆనాటి సైనికుల మానసిక, యుద్ధ పరిస్థితులను తెలియజేస్తాయి.

### 4.5.6. ఆధారాల ప్రాముఖ్యత – ఆధారాల ఆధారంగా చరిత్ర రచన :

ప్రాధమిక ఆధారాలు:

| | |
|---|---|
| ఆడియోలు | ఇంటర్వ్యూలు, సంగీతం, మౌఖిక చరిత్ర |
| ఇమేజెస్ | ఫొటోగ్రాఫ్‌లు, వీడియోలు, పిల్లలు, |
| వస్త్రములు | బట్టలు, పరికరాలు, పాత్రలు, విలువైన నాణేలు, ఆయుధాలు |
| ........ | జనాభా సమాచారం, జనాభా లెక్కల వివరాలు, వాతావరణ రికార్డులు |
| గ్రంథాలు | ఉత్తరాలు, డైరీలు, విలువైన డాక్యుమెంట్లు, లీగల్ అగ్రిమెంట్లు, గ్రంథాలు, మ్యాప్‌లు చిత్రాలు, ప్రకటనలు, ఉపన్యాసాలు. |

ప్రాధమిక ఆధారాలు – మౌలిక రికార్డులు మొట్టమొదటగా స్థాయిలో ఉపయోగింపబడుతున్న ఆధారాలు.

ఉదా : వేదాలు, పురాణాలు

ద్వితీయ ఆధారాలు : ప్రాధమిక ఆధారాలు ఉపయోగించి రూపొందించబడినవి, మంచి ఉదాహరణలు – పాఠ్యపుస్తకాలు

భారతదేశ చరిత్ర నిర్మాణంలో ఆధారాలు :

1. పురావస్తు ఆధారాలు.
2. శాసనాలు
3. నాణేలు
4. సాహితీ ఆధారాలు

1. పౌరసాహిత్యం, 2. లౌకిక సాహిత్యం, 3. విదేశీయుల రచనలు.

సింధూ నాగరికత – వైదిక నాగరికతకు మధ్య గల సంబంధం.

### 4.5.7. ప్రామణిక గ్రంథాలు :

సాంఘిక శాస్త్ర అభ్యసనంలో ప్రామాణిక గ్రంథాల అధ్యయనం అత్యంత ప్రాముఖ్యత గల అంశం. మూల గ్రంథాలను చదవడం వల్ల ప్రత్యక్షంగా రచయిత అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ఉదా :–

1. డా॥ అంబేద్కర్ రచనలను ప్రత్యక్షంగా చదవడం ద్వారా వారి భావాలను తెలుసుకునే అవకాశం వుంది.
2. అలాగే ఖగోళ శాస్త్రంలో, చరిత్రలో కొన్ని ప్రామాణిక గ్రంథాలను చదువుట, వాటిని చర్చించుట, ఆమోదము విబేధాలను వ్యక్తీకరించుట అత్యంత ముఖ్యాంశాలు.
3. మహాత్మాగాంధీ ఆత్మకథ, అబ్దుల్‌కలామ్ రచనలు, జవహర్‌లాల్ నెహ్రూ, లాల్‌బహదూర్‌శాస్త్రి మొ॥వారి రచనలు.

ఉపయోగాలు :

1. విద్యార్థులలో మౌలిక చింతన పెంపొందుతుంది.
2. పరిశోధన దృక్పథం అలవడుతుంది.
3. ఏవిధమైన తేడా లేకుండా రచయిత భావాలు తెలుసుకునే వీలు కలుగుతుంది.
4. మనలో ఒక అనుభూతి కలుగుతుంది.

ఉపాధ్యాయుడు :

1. విద్యార్థులను కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం చేయకుండా కొన్ని ప్రామాణిక గ్రంథాలు చదవడానికి ప్రోత్సహించాలి.
2. ఉపాధ్యాయుడు తాను వాళ్ళకు ఆదర్శంగా ఉండాలి.
3. ఆయా గ్రంథాలను అందుబాటులో ఉంచాలి.
4. సొంత గ్రంథాలయాన్ని ఏర్పరచుకోవడానికి విద్యార్థులను ప్రోత్సహించాలి.
5. మౌలిక గ్రంథాలు చదివేవారు చరిత్ర పాఠములు మాత్రమే కాదు చరిత్ర నిర్మాణ ప్రక్రియను అలవరుకోవాలి.

## 4.5.8. మౌఖిక చరిత్ర :

వ్యక్తుల, కుటుంబాల ముఖ్యమైన సంఘటనల, రోజువారి జీవితానికి సంబంధించిన విషయాలను నమోదు చేసి పొందుపరిచే ప్రక్రియనే మౌఖిక చరిత్ర. దీనిని నమోదుచేయడానికి ఆడియో టేప్‌లు, వీడియో టేప్‌లు, వారితో నిర్వహించిన ఇంటర్వ్యూలను ఉపయోగిస్తారు. వీటిని నమోదు చేసే పురాతన లేఖాగారాలలోను, గ్రంథాలయాలలోను, భద్రపరచడం జరుగుతుంది. అనేక వెనుకబడిన జాతులు, ప్రాచీన జాలు, మౌఖిక సంప్రదాయాలలో తమ చరిత్రను కాపాడుకుంటూ వస్తున్నాయి. ఇవి జానపదగీతాలు, పాటలు, కథలు, పౌరాణికాలు కాలంలో పాల్గొన్న ఒకతరం నుండి ఇంకొక తరానికి అందించబడుతున్నాయి.

మౌఖిక చరిత్ర, చరిత్ర పరిశోధనలు అంతర్జాతీయ ఉద్యమంగా రూపొందుతున్నది.

మౌఖిక చరిత్రకారులు వివిధ దేశాలలో క్రోడీకరణ, విశ్లేషణ, ప్రసరణలలో ఉన్నాయి. జాతీయ స్థాయిలో కూడా దీనికి ప్రాముఖ్యత పెరిగింది. 1960–70లలో ఈ ప్రక్రియ ఊపందుకుంది. స్టడ్స్ టెర్‌కెల్, అలెక్స్ హేలి, ఆస్కార్ లెవిస్ దీనిని ప్రాచుర్యంలోకి తెచ్చారు. టేప్‌రికార్డింగ్ మొదలైన ప్రక్రియలు చౌకగా అందుబాటులోకి రావడంతో ఈ ఉద్యమం ఊపందుకుంది.

మౌఖిక చరిత్ర, చరిత్రలోని కొన్ని అంతరాలను తొలగిస్తుంది. రాజస్తానీయులలో ఉండే కొందరు సంపన్నులు, విద్యావంతులకు సంబంధించిన ఆధారాన్నేకాక సామాన్యుల విద్యలేనివారికి కూడా అవకాశం ఇస్తుంది.

1. భారతదేశంలో ఈ మౌఖిక చరిత్ర అనేక వేల సంవత్సరాలుగా కొనసాగుతున్నది.
2. వేదాలు ఎప్పుడు పుట్టాయో స్పష్టమైన తేదీలు లేవు. కాని కొన్నివేల సంవత్సరాలుగా ఒకతరం నుండి ఇంకొక తరానికి మౌఖికంగానే అందించబడినాయి. ఆ తరువాత ఎంతోకాలానికి అవి అక్షరరూపాన్ని దాల్చాయి.
3. ఇవి వ్యక్తుల యొక్క అనుభవాలు, అభిప్రాయాలు ఆధారంగా రూపొందించబడ్డాయి. ఇందులో విషయానికి కాదు, వ్యక్తులకు ప్రాముఖ్యం ఇవ్వబడుతుంది.

## 4.5.9. సాంఘిక శాస్త్ర వస్తు ప్రదర్శనశాలలు, లలిత కళాతోరణాలు, భాండాగారాలు :

సంగ్రహాలయము. చారిత్రక రికార్డులను భద్రపరచు స్థలము. ఒక వ్యక్తి లేదా సంస్థకు సంబంధించిన సంగ్రహించబడిన ప్రాథమిక ఆధారాలు. ఇవి సాంస్కృతిక, చారిత్రక తదితర అంశాలకు సంబంధించి ఉంటాయి. ఇవి గ్రంథాలయాలకు భిన్నమైనవి. పుస్తకాలు, మ్యాగజైన్‌లకు కాపీలుంటాయి. ఇవి ఒక ప్రత్యేకత గలవి. ప్రచురించ బడనివి. వీటిని భద్రపరిచే విధానము ప్రత్యేకంగా ఉంటుంది.

భారతదేశలో భారత జాతీయ సంగ్రహాలయము కలకత్తాలో 1891లో ప్రారంభించబడినది. దీనిని మొదట ఇంపీరియల్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్ అని పిలిచేవారు. ఆ తరువాత దానిని 1926లో న్యూఢిల్లికి మార్చారు.

దీని ప్రాంతీయ శాఖలు భోపాల్, భువనేశ్వర్, జైపూర్, పాండిచేరీలలో ఉన్నాయి. దీనిలో ప్రభుత్వ రికార్డులు, ప్రాచీన రికార్డులు, చేతివ్రాత ప్రతులు, ప్రైవేట్ పేపర్లు ఉన్నాయి. ఇవి మన సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక జీవితానికి సంబంధించి అనేక భాషలకు సంబంధించినవి. హిందీ, ఆంగ్లం, సంస్కృతం, ఉర్దూ, పారసీ, అరబిక్ మొ॥నవి.

దీనిలో

పబ్లిక్ రికార్డులు :

ఆలిండియా రేడియో రికార్డులు, భారత పురాతత్వశాఖకు సంబంధించినవి, రాష్ట్రపతి చేత ఆమోదించబడిన బిల్లులు, కేబినెట్ సెక్రటేరియట్, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలు, విద్యా విభాగాలు, కామర్స్ విభాగాలు.

కార్టోగ్రఫిక్ రికార్డులు :

సర్వే ఆఫ్ ఇండియా, చారిత్రక మ్యాప్‌లు, ముద్రించి ప్రచురింపబడిన మ్యాప్‌లు, రెవెన్యూ మ్యాప్‌లు, మెమోయర్స్.

డిపార్ట్‌మెంటల్ రికార్డులు :

భారతస్వాతంత్ర్యోద్యమ రికార్డులు, పరిపాలనకు సంబంధించిన రికార్డులు, సాంస్కృతిక విభాగం రికార్డులు.

ప్రైవేట్ పేపర్లు :

డా॥ అంబేద్కర్‌కు సంబంధించినవి, బనారసీ దాస్ చతుర్వేది, దాదాభాయ్ నౌరోజి, ఉత్తర ప్రత్యుత్తరాలు, గోపాలకృష్ణ గోఖలే, భారత జాతీయ సేన, లాహోర్ కుట్ర కేసు, మహాత్మగాంధీ, సరోజినీనాయుడు, శ్రీనివాస రామానుజం, జవహర్‌లాల్ నెహ్రూ, కె.ఎమ్. కరియప్ప, రవీంద్రనాథ్ ఠాగూర్, ఉద్ధాంసింగ్, రాజగోపాలచారి, నానాజి దేశ్‌ముఖ్ మొ॥న్నవి.

ఓరియంటల్ రీసెర్చ్ :

మైక్రో ఫిల్మ్ ల్యాబ్స్

భారతీయ జనాభా నివేదికలు

పార్లమెంటరీ డిబేట్‌లు

విదానసభ డిబేట్‌లు

కవితల నివేదికలు

పాంప్లేట్స్

## 4.5.10. వనరుల ప్రాముఖ్యత :

సాంఘిక శాస్త్ర బోధనలో వనరుల ప్రాముఖ్యత చాలా ప్రముఖమైనది. సాధారణంగా ఉపాధ్యాయుల పాఠ్యపుస్తకాన్నే ప్రముఖ సాధనంగా ఎంచుకొని బోధిస్తారు. కేవలం పాఠ్యపుస్తకంలో విషయాన్ని మాత్రమే చదివి, దానినే విద్యార్థులకు వివరించి, విద్యార్థులచే చదివించి, వారిని పరీక్షలకు తయారుచేయించి ఉత్తీర్ణులయ్యేలా చేయడం సాధారణంగా జరుగుతుంటుంది. ఇది ఉత్తమమైన పద్ధతి కాదు. ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తకాన్ని దాటి పోవాలి. పాఠ్యపుస్తకం ఒక సాధనమే. అనేక పరామార్శ గ్రంథాలను చదవాలి. మౌలిక గ్రంథాలను చదవాలి. ప్రాథమిక ఆధరాలను, గౌణ ఆధారాలను కూడా చదవాలి. వాటిని విశ్లేషించాలి. దీని ఆధారంగా మన బోధన కొనసాగించాలి. మెరుగు పరచుకోవాలి. మన ఆలోచనకు, వివేచనకు పదును పెట్టాలి. ఈసందర్భంగా ప్రాథమిక, గౌణ ఆధారాలంటే ఏమిటో తెలుసుకుందాం.

**ప్రాథమిక ఆధారాలు / వనరులు :**

చారిత్రక వాస్తవాలు, సంఘటనలు, ఉపన్యాసాలు, డైరీలు, గ్రంథాలు, కట్టడాలు స్వీయ చరిత్రలు, ఆకాలంనాటి వార్తా పత్రికలు, ఫోటోలు.

ఉదా:- ప్రాచీన తాళపత్ర గ్రంథాలు (రామాయణం, మహాభారతం, వేదాలు, ఉపనిషత్తులు మొ॥నవి) మొహంజదారో, హరప్పా అవశేషాలు, కొండవీటి కోట, అమరావతి శిల్పాలు, ఆకాలంనాటి కథలు, నవలలు, నాటికలు మొ॥నవి.

గౌణ వనరులు / ద్వితీయ వనరులు :

ఇవి ప్రాథమిక వనరుల ఆధారంగా వ్రాయబడిన గ్రంథాలు. ఇవి ప్రాథమిక వనరులను ఉపయోగించుకొని వ్రాయబడిన చరిత్ర గ్రంథాలు, విమర్శ గ్రంథాలు, జీవిత చరిత్రలు, నిఘంటువులు, విశ్లేషణలు మొ॥నవి.

విద్యార్థులు వాల్మీకి రామాయణాన్ని చదివి ఆకాలంనాటి పరిస్థితులను అర్థం చేసుకోవడం - ప్రాథమిక వనరులు.

రామాయణ కాలంనాటి పరిస్థితులపై వేరొక రచయిత వ్రాసిన గ్రంథాన్ని చదవడం - గౌణ వనరులు.

కొండవీటి కోటను సందర్శించుట - ప్రాథమిక వనరులు

కొండవీటి కోట బొమ్మను, నమూనాను చూసి అవగాహన చేసుకొనుట ద్వితీయ వనరులు.

వనరులు అనేక రకాలు :

**సహజ వనరులు :**

నదులు, సముద్రాలు, అడవులు, జంతువులు, ఖనిజాలు, జలపాతాలు, మేఘాలు మొ॥న్నవి.

**భౌతిక వనరులు :**

గాలి, నీరు, నేల మొ॥నవి

**చారిత్రక వనరులు :**

అజంతా ఎల్లోరా గుహలు, అమరావతి శిల్పకళ, కొండవీటి కోట మొ॥నవి.

**లిఖిత వనరులు :**

తాళపత్ర గ్రంథాలు, శిలాశాసనాలు, నివేదికలు, రికార్డులు, తాళపత్రాలు మొ॥నవి.

**ప్రయోజనాలు :**

1. ఈ వనరుల వినియోగం వలన విద్యార్థులలో ఆసక్తి, అవగాహన పెరుగుతాయి.
2. ప్రత్యక్ష అనుభవం కలుగుతుంది.
3. విద్యార్థులలో పరిపాలన, విమర్శన, స్వంతంగా ఆలోచించడం అభివృద్ధి చెందుతాయి.
4. పరిశోధనకు పునాదిగా ఉంటుంది.
5. విద్యార్థుల మధ్య ఐకమత్యం, సహకారం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి.

**అనువాద సామాగ్రి :**

అన్ని భాషలు మనం నేర్చుకోలేము. వివిధ భాషలలోని ప్రామాణిక గ్రంథాల ప్రామాణిక అనువాదాలు ఉంటాయి. వాటిని కూడా మనం ఉపయోగించుకోవాలి.

సమాచార సాంకేతిక ఆధారిత పరిశోధన :

ఈనాడు అంతర్జాలం ద్వారా ఎంతో సామాగ్రి మనకు అందుబాటులో ఉంది. యూట్యూబ్‌లో ఎన్నో ప్రత్యక్ష ఉపన్యాసాలు,సమాచారము మొ॥ అందుబాటులో ఉన్నాయి.

**సార్వత్రిక ఆధారాలు :**

ఎవరైనా తమ అవసరాల కొరకు ఉపయోగించదగిన సామాగ్రి. దీనికి ఏవిధమైన చట్టపరమైన ఆంక్షలు

ఉండవు. వాటిని కాపీ చేసుకోవచ్చు, ఉపయోగించుకోవచ్చు. అవి పాఠ్యపుస్తకాలు గాని, ఉపన్యాసాలు గాని, వీడియోలు, ఆడియోలు, ప్రాజెక్టులు, యానిమేషన్‌లు మొ॥నవి. మనం టైప్ నేర్చుకోవాలంటే యూట్యూబ్‌లో చాలా ఉచిత కోర్సులున్నాయి.

రాజనీతి శాస్త్రం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి వివరించేటపుడు అనుబంధంగా వివిధ రాజనీతిజ్ఞుల జీవితాలను, రాజ్యంగ సబలో జరిగిన చర్చలు, వివిధ సన్నివేశాలను వివరించవచ్చు.

అర్ధశాస్త్రంలోకూడ సన్నివేశాలను ఉటంకించడం ద్వారా ఆసక్తి కలిగించవచ్చు. వివిధ అర్ధశాస్త్రవేత్తల, పారిశ్రామికవేత్తల, శాస్త్రజ్ఞుల జీవిత గాధలను విశేషాలను చెప్పవచ్చు.

ఈ ప్రక్రియ విజవంతం కావాలంటే

1. ఉపాధ్యాయుని నిరంతర అధ్యయనం ముఖ్యం. ఎంతో అధ్యయనశీలి అయిన ఉపాధ్యాయుడే ఈ పని చేయగలడు.
2. పాఠ్యపుస్తక పరిధిని దాటి ఆలోచించాలి.

## 4.6.1. సాంఘిక శాస్త్ర బోధనలో కొన్ని ప్రక్రియలు :

సాంఘికశాస్త్ర బోధనా లక్ష్యాలను సాధించే దిశగా అనేక వనరులను, ఉపకరణాలను, ప్రక్రియలను వుపయోగించవచ్చు. సమయాన్ని, సందర్భాన్ని బట్టి,బోధించే పాఠ్యాంశాన్ని బట్టి ఉపయోగించే ప్రక్రియలను ఉపకరణాలను ఉపయోగిస్తాము.

వీనిలో సంఘటనలు, కథలు, ప్రయాణ కథనాలు, డైరీలు, పట్టికలు, గ్రాఫ్‌లు, పాఠ్య గ్రంథాలు, మ్యాప్‌లు, నాటకీకరణలు, దృశ్య ఉపకరణాలు, ఫిల్ములు, సర్వేలు, సిమ్యులేషన్, ఇంటర్వ్యూ మొదలైనవి.

వీటిని గురించి వివరంగా తెలుసుకుందాము.

**4.6.1. సంఘటనలు, కథలు :-**

కథల ప్రాముఖ్యం గురించి మనందరికి తెలుసు. విద్యాబోధనలో కథల ప్రాముఖ్యత ఎంతో. కథలంటే ఇష్టపడని పిల్లలే ఉండరు. కథలు చెప్పే ఉపాధ్యాయుణ్ణి పిల్లలు ఎంతో ఇష్టపడతారు.

కథలు పిల్లలలో ఊహాశక్తిని పెంచుతాయి. ఊహాశక్తి, సృజనాత్మకశక్తిగా మారుతుంది. కథ అంటే మనం చెప్పదలచుకున్న విషయాన్ని పరోక్షంగా చెప్పడమే. ఉదా:- సత్యాన్ని పలకడం మంచిది. కేవలం ఈ వాక్యం చెప్పినట్లయితే పిల్లలపై పెద్ద ప్రభావం ఉండదు. దీనితోపాటు సత్యహరిశ్చంద్రుని కథ చెప్పినట్లయితే పిల్లలు ఎప్పటికీ ఆ విషయాన్ని మరచిపోరు.

- తల్లిదండ్రులకు సేవ చేయాలి - శ్రావణకుమారుని కథ చెబితే ఎక్కువ ప్రభావాన్ని కలిగిస్తుంది.
- చదువుపై ఆసక్తి లేక జులాయిలుగా తిరుగుతున్న రాజకుమారులకు విష్ణుశర్మ పంచతంత్ర కథల ద్వారా వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దినాడు.
- భారతీయ సాహిత్యంలో కథలు అనంతం. భారతదేశ చరిత్రలో కూడా ఎన్నో కథలు కనిపిస్తాయి.

**సాంఘింక శాస్త్రము - కథలు :**

సాంఘికశాస్త్రాన్ని ఆసక్తికరంగా చేయడానికి కథలను ఒక ప్రక్రియగా వాడుకోవచ్చు.

- సంఘటనలను, కథలను ఎక్కువగా చరిత్రకు సంబంధించిన బోధనలో ఎక్కుగా ఉపయోగించవచ్చు.
- భూగోళము, రాజనీతి శాస్త్రము, అర్ధశాస్త్రములలో కూడా సందర్భానుసారంగా కథలను ఉపయోగించవచ్చు.

**చరిత్ర - కథలు, సంఘటనలు :**

ప్రాచీన భారతదేశ చరిత్ర నుండి ఆధునిక భారతదేశ చరిత్ర వరకు గల ఎన్నో సన్నివేశాలకు కథలను జోడించవచ్చు.

- ఉపనిషత్తులలో అనేక సన్నివేశాలకు కథల ద్వారా వివరించారు.
- బుద్ధుని జీవిత కథలు, జాతక కథలు
- మహావీరుని జీవిత విశేషాలు, జైన సాహిత్యంలోని కథలు
- అశోకుని కాలంనాటి పరిపాలన, జీవితాల కథలు
- చంద్రగుప్త విక్రమాదిత్య కథలు
- అక్బర్‌తాన్‌సేన్ లకు సంబంధించిన కథలు
- బైబిల్ కథలు
- రామాయణ మహాభారత కథలు
- పురాణకథ
- శివాజి, రాణా ప్రతాప్ మొ॥వారి కథలు
- ఝాన్సీలక్ష్మీబాయి, మీరాబాయి, అహల్యాబాయి, రాణిదుర్గావతి మొ॥ వీరనారులు.
- భారతస్వతంత్ర్య సంగ్రామ సంఘటనలు, దేశనాయకుల, దేశభక్తుల, విప్లవవీరుల కథలు.
- యుద్ధ సన్నివేశాలను, వీరగాధలను వివరించవచ్చు.

**భూగోళం :**

- నదులు, పర్వతాలను బోధించేటపుడు వాటికి అనుబంధంగా ఉండే పురాణకథల ద్వారా ఆసక్తిని కలిగించవచ్చు.
- ఆహారము, అడవులు, ఖనిజములు చెప్పేటపుడు వాటితో అనుసంధానమై ఉండే రైతుల జీవితాలను, గిరిజన గాథలను ఆసక్తికరంగా వివరించవచ్చు.

## 5.6.1. ప్రయాణ వివరాలు, ప్రయాణ దినచర్యలు :

అనేకమంది యాత్రికులు, నావికులు, శాస్త్రవేత్తలు తమ ప్రయాణ వివరాలను నమోదు చేసుకున్నారు. వారి దైనందిని వ్రాసుకున్నారు. ఆ తరువాత చరిత్ర రచనలో అవి ఎంతో ఉపయోగపడ్డాయి.

భారతదేశ చరిత్రలో అనేకమంది విదేశీ యాత్రికులు మనదేశం సందర్శించి ఆ వివరాలను వ్రాసుకున్నారు.

- మెగస్తనీసు అనే గ్రీకు యాత్రికుడు (350–290 క్రీ.పూ) తన యాత్ర వివరాలను 'ఇండికా' గ్రంథంలో వ్రాసుకున్నారు.
- పా హియాన్ అనే చైనా యాత్రికుడు (339–433 క్రీ.శ) 65 సం॥వయస్సులో చైనా నుండి కాలినడకన భారతదేశం వచ్చి 12 సం॥ భారతదేశంలోని అనేక ముఖ్యనగరాలను, బౌద్ధక్షేత్రాను దర్శించి తన 77వ యేట తిరిగి చైనా చేరినాడు.
- హ్యూయన్ త్స్యాంగ్ (క్రీ.శ.629–645) 26 సం. వయస్సులో మధ్యఆసియా, ఆఫ్ఘనిస్తాన్ మీదుగా కాశ్మీర్, పంజాబ్ గూండా నలంద చేరి అక్కడ 6 సం॥ ఉండినాడు. 19 సం. భారతదేశంలో ఉండి తన పర్యటన విశేషాలను వివరించినాడు.
- అబ్దుల్ రజాక్ అనే పర్షియన్ రాయబారి విజయనగరసామ్రాజ్యాన్ని సందర్శించి ఆనాటి పరిస్థితులను వర్ణించినాడు. "ఈ భూమి మీద విజయనగరం లాంటి నగరం లేదని, చూడడానికి కన్నులు చాలవని, వినడానికి చెవులు చాలవని" అతడు వర్ణించినాడు.

కొలంబస్ అనే స్పెయిన్ నావికుడు తన డైరీలో ఇలా వ్రాసుకున్నాడు.

సెప్టెంబర్ 8, 1492 – సముద్ర ప్రయాణం ప్రారంభం.

సెప్టెంబర్ 9, 1492 – పూర్తిగా సముద్రంలో మొదటి రోజు
సెప్టెంబర్ 15, 1492 – సముద్ర ప్రయాణం కొనసాగింది.
సెప్టెంబర్ 20, 1492 – సర్‌గాసో సముద్రం
సెప్టెంబర్ 23, 1492 – నావికా సిబ్బంది సణుగుడు ప్రారంభం
అక్టోబర్ 10, 1492 – నావికా సిబ్బంది తిరుగుబాటు
అక్టోబర్ 11, 1492 – భూమి కనిపించింది
అక్టోబర్ 12, 1492 – భూమిపైకి చేరాము, స్వాధీనం చేసుకున్నాము
అక్టోబర్ 28, 1492 – క్యూబా
డిసెంబర్ 5, 1492 – హెస్పనోయిలలా
జనవరి 16, 1493 – తిరుగు ప్రయాణం

– ఇదేవిధంగా అనేకమంది నావికులు తదితరాలు అనేక ఖండాలను కనుక్కోవడానికి బయలుదేరారు. వారి ప్రాణాలకు తెగించి కూడా వాటిని కనుగొన్నారు. ఆఫ్రికా ఖండాన్ని, దక్షిణ అమెరికా ఖండాన్ని మొ॥ఎన్నో. వారి కథనాలు మనకు ఎన్నో విశేషాలను తెలియజేస్తాయి.

**ప్రయోజనాలు :**

1. ఇవి చరిత్ర రచనకు ఉపయోగపడతాయి.
2. వారి సాహస గాథలు ఎంతో ప్రేరణదాయకంగా ఉంటాయి.
3. ఇవి విద్యార్థులకు ఎంతో ప్రేరణనిస్తాయి.
4. మనలో ఉత్సుకత, అధ్యయన శీలతను పెంచుతాయి.

## 5.6.2. పట్టికలు, చార్టులు :

"విషయ సామాగ్రిని సంక్షిప్తం చేసి వివరించడానికి, దాని అంశాలను పోల్చడానికి, వ్యత్యాసాలను చూపడానికి ఉపయోగించే దృశ్య సాధనమే చార్టు".

ఇవి ద్విమితీయ దృశ్య బోధనోపకరణాలు. వీటిని చెప్పబోయే విషయానికి సంబంధించిన పోలికలు, భేదాలు, అభివృద్ధి, నిర్వహణ, సాపేక్షత, వర్గీకరణ, నిర్మాణాలు, ఆకారాలు మొదలైన వాటిని వివరించడానికి ఉపయోగించవచ్చు.

వివిధ రకాల చార్టులు :

1. కాల క్రమానుసార చార్టులు
2. వంశవృక్ష చార్టులు
3. ప్రవాహ చార్టులు
4. టాబ్యులేషన్ చార్టులు మొ.వి.

1. కాలక్రమానుసార చార్టులు :

ఒక దేశ వ్యవస్థలోగాని, ప్రపంచ వ్యవస్థలోగాని జరిగిన వివిధ సంఘటనలను, అభివృద్ధిని కాలానుగుణంగా నివేదించి చూపించే చార్టులనే కాలక్రమానుసార చార్టులు అంటారు. ఏకాలంలో ఏమిజరిగిందో వివరంగా విద్యార్థులకు వివరించవచ్చు.

స్వతంత్ర భారతదేశంలో ముఖ్య సంఘటనలు

| సంవత్సరం | ముఖ్య సంఘటన | విశేషం |
|---|---|---|
| 1947 | భారతదేశానికి స్వాతంత్ర్యం | 2)21 పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ ఎర్రకోటపై జాతీయ పతాకాన్ని ఎగురవేయుట. 2)21 భారతదేశ విభజన |
| 1950 | స్వదేశీ సంస్థానాలు విలీనం | సర్దార్ వల్లభాయ్ పటేల్ విశేష కృషి |
| 1950 జనవరి26 | గణతంత్ర దినోత్సవం | భారతరాజ్యాంగం అమలులోకి వచ్చినది. |
| 1951 | మొదటి సార్వత్రిక ఎన్నికలు | వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికలలో పాల్గొనుట. కాంగ్రెస్ పార్టీ విజయం. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రి. |
| 1962 | చైనా దురాక్రమణ | భారత్ ఓటమి |
| 1965 | పాకిస్తాన్‌తో యుద్ధం | భారత్ విజయం |
| 1971 | పాకిస్తాన్‌తో యుద్ధం | భారత్ విజయం, బంగ్లాదేశ్ ఆవిర్భావం |
| 1975 | అత్యవసర పరిస్థితి | పౌరహక్కుల రద్దు, ప్రతిపక్ష నాయకుల నిర్బంధం |
| 1977 | జనతాపార్టీ విజయం | కేంద్రంలో మొదటి కాంగ్రేసేతర ప్రభుత్వం |

## 2. వంశవృక్షాలు :


చరిత్ర పాఠ్యాంశాలను బోధించడానికి ఒక వంశానికి సంబంధించి వివిధ వ్యక్తులను చూపుటకు ఈ చార్టులను ఉపయోగిస్తారు.

మొగలు వంశము :

బాబరు
|
హుమయన్
|
అక్బర్
|
జహంగీర్
|
షాజహాన్
|
ఔరంగజేబ్

**3. ప్రవాహచార్టులు :**

ఈ రకం చార్టుల ద్వారా వ్యవస్థీకృత అంశాలు, క్రియాత్మక సంబంధాల గురించి తెలియజేయవచ్చు. కేంద్ర, రాష్ట్ర మరియు నగర పరిపాలనా విధానాలను తెలియజేయటానికి, కార్య నిర్వాహక శాఖ, లెజిస్లేచర్ మరియు న్యాయశాఖకు సంబంధించిన సంబంధాలను తెలియజేయడానికి ఈ చార్టులు ఉపయోగపడతాయి.




**4. టాబ్యులేషన్ చార్టులు :**

ఒక టేబుల్ రూపంలో విషయాలను పోల్చడానికి, ఉపయోగించేవి టేబుల్ చార్టులు.

భారతదేశ జనాభా పెరుగుదల 1971 నుండి 2011 వరకు

| సం. | సంవత్సరం | జనాభా (కోట్లలో) | పెరుగుదల రేటు | వార్షిక పెరుగుదల |
|---|---|---|---|---|
| 1 | 1971 | 54.81 | 24.80 | 2.20 |
| 2 | 1981 | 68.33 | 24.66 | 2.22 |
| 3 | 1991 | 84.63 | 23.85 | 2.14 |
| 4 | 2001 | 102.70 | 21.31 | 1.90 |
| 5 | 2011 | 127.00 | 17.64 | 1.41 |

### 4.6.3. గ్రాఫ్‌లు :

ఒక పాఠం యొక్క మొత్తం సమాచారాన్ని సంక్షిప్తం చేసి చూపడానికి గ్రాఫ్‌లు ఎంతో సహాయపడతాయి. ఇవి ద్విమితీయ దృశ్య బోధనోపకరణాలు. ఈ విధమైన బోధనోపకరణాలను వినియోగించడం వల్ల విద్యార్థులు మొత్తం సారాంశాన్ని ఒకే సారి చూసి గ్రహించగలుగుతారు. వివిధ అంశాల మధ్య ఉండే సంబంధాలను చుక్కల ద్వారా, గీతల ద్వారా, బొమ్మల ద్వారా చూపించవచ్చు. విషయ స్వభావాన్ని బట్టి గ్రాఫును ఎంపిక చేసుకోవాలి. గ్రాఫులలో అనేక రకాలున్నాయి.


గ్రాఫులు – రకాలు :

1. రేఖాచిత్రాలు (Line Graph) :

రెండు పరస్పర సంబంధం కలిగిన విషయాల మధ్య సంబంధాలు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకోవడానకి రేఖాచిత్రాలను ఉపయోగిస్తాము.

ఉదా :-


1. ధరకు డిమాండ్‌కు మధ్య గల సంబంధం
2. ఇందులో ధర పెరిగినపుడు డిమాండ్ తగ్గుతుంది. ఈ రెండింటికి మధ్య గల సంబంధం విలోమసంబంధం.




**2. బార్‌గ్రాఫ్‌లు :**

వీటినే స్థూపాకర చిత్రాలంటారు. వివిధ సందర్భాలలో లేక కాలక్రమంలో వచ్చిన మార్పులను ఇవి తెలియజేస్తాయి.

ఉదా :- ఒక పాఠశాలలో గత 5 సంవత్సరాలలో ఫలితాలు ఎలా ఉన్నాయి.





**3. పై గ్రాఫ్‌లు :**

వీటిని వలయాకార గ్రాఫ్‌లు లేదా వృత్తపటాలు అని కూడా అంటారు. మొత్తం అంశలోని ఘటకాలు ఏ ఏ నిష్పత్తులలో ఉన్నాయో చూపడానికి ఈ గ్రాఫులు బాగా ఉపయోగపడతాయి.

ఉదా : ఈ సంవత్సరం బడ్జెట్‌లో ఏయే రంగాలలో ఎంతశాతం కేటాయించారో గణించి, ఆ మేరకు మనం వృత్త భాగాలలో చూపాలి.

ఉదా : వ్యవసాయరంగానికి 30%, రక్షణ రంగానికి 20%, సేవారంగానికి 20%, పారిశ్రామిక రంగానికి 20%, ఇతరరంగాలకు 10%.




**4. చిత్రాల గ్రాఫ్‌లు :**


గీతలు, అక్షరాల బదులు వివిధ రకాల రంగు, రంగు చిత్రాల ద్వారా సమాచారాన్ని అందించే గ్రాఫ్‌లనే చిత్రాల గ్రాఫ్ లంటారు. ఇవి బాగా ఆకర్షణీయంగా ఉంటాయి.


మన నగరంలో తిరిగే వివిధ రకాల వాహనాల సంఖ్య

| సం. | వాహనాలు | వాటి సంఖ్య (వేలల్లో) |
|---|---|---|
| 1 | సైకిళ్ళు | 10000 |
| 2 | ఆటోలు | 7000 |
| 3 | బస్‌లు, కార్లు | 2000 |
| 4 | స్కూటర్లు | 12000 |

**5. వెన్‌గ్రాఫ్‌లు :**

వీటిని వృత్తాల్లో చూచిస్తారు. వృత్తాలు ఒక దానితో ఒకటి ఖండించుకోవడం ఒకదానిలో ఒకటి ఇమిడి ఉండడాన్ని బట్టి వ్యాఖ్యానించవచ్చు.



**4.6.4. మ్యాప్‌లు :**

సాంఘికశాస్త్ర బోధనలో అత్యంత ప్రాముఖ్యత గల ప్రతీక సారాంశాలే (Symbolised Summaries) మ్యాప్‌లు. మ్యాప్‌లు ఒక అంశానికి సంబంధించిన ఉనికిని, కాలాన్ని ఖచ్చితంగా చూపుతాయి. మ్యాప్‌ల వలన ఒక ప్రదేశం యొక్క నైసర్గిక స్వరూపం. చారిత్రక, ఆర్థిక అంశాలు, ప్రకృతి సంపదలు, రోడ్లు, రవాణా, జనాభా విస్తరణ, ఇలా అనేక రకరకాల సమాచారాన్ని అందించవచ్చు.

మ్యాప్‌లు క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం వలన ప్రదేశం లేక ఖండం గురించి మాట్లాడుకుంటున్న ఆ ప్రదేశం యొక్క ఉనికి, విద్యార్థి మనస్సులో ప్రత్యక్షమవుతుంది. దీనివలన అవగాహన చక్కగా జరుగుంది. బాటసారులకు, యుద్ధాలలో పాల్గొనేవారికి, నావికులకు వారి ప్రణాళికా రచన చేసుకోవడానికి మ్యాప్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి.

మ్యాపులు – రకములు :–

సాధారణంగా మ్యాప్‌లన్నీ ద్విమితీయాలుగానే ఉంటాయి.

1. రిలీఫ్ మ్యాప్‌లు (Relief Maps) :

ఒక ప్రదేశం యొక్క భౌగోళిక లక్షణాలను చూపించే మ్యాప్‌లను రిలీఫ్ మ్యాప్‌లు అంటాము. వాటిలో పల్లపు ప్రాంతాలు ఆకు పచ్చని రంగులు, పీఠభూములు, పసుపు రంగులో, పర్వతాలు జేగురు రంగులో గుర్తిస్తారు.
ఉదా:– భారతదేశ భౌగోళిక పటం, ప్రపంచ భౌగోళిక పటం, ఆంధ్రప్రదేశ్ భౌగోళిక పటం.

2. చదును పటాలు :

ఎత్తు పల్లాలను చూపించకుండా సమాచారాన్నంతా అందిస్తాయి. వీటిని చదును పటాలంటారు. రాజకీయ, ఆర్థిక మ్యాప్‌లు, రవాణా, వర్షపాతం, ఉష్ణోగ్రత, నేలలు, జనాభా విస్తరణ మొ॥ అంశాలన్నీ చూపించాలంటే చదును పటాన్నే ఎక్కువగా ఉపయోగిస్తారు.

3. రాజకీయ పటాలు :

ఖండాలు, దేశాలు, రాష్ట్రాలు, జిల్లాలు, పట్టణాలు, వాటి ఉనికి, సరిహద్దుల్ని చూపించే చార్టులు ఈ కోవకు చెందుతాయి.
ఉదా:– భారతదేశం – రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్ – జిల్లాలు.

**4.5.4. స్కెచ్ మ్యాప్‌లు :**

వీటిలో ఆయా దేశాల, ఖండాల, రాష్ట్రాల సరిహద్దులు మాత్రమే గుర్తింపబడి ఉంటాయి.
ఉదా : భారతదేశ స్కెచ్ మ్యాప్ తీసుకొంటే దానిలో కేవలం భారతదేశ సరిహద్దులు మాత్రమే గుర్తింపబడి ఉంటాయి. దానిని అనేకరకాలుగా ఉపయోగించవచ్చు. రాష్ట్రాలు గుర్తించడానికి నగరాలు గుర్తించడానికి మొ.వి. ఉపయోగించవచ్చు.

వీటిని సింహావలోకనం చేయడానికి, సాధన చేయడానికి, మూల్యాంకనం మ్యాప్ గుర్తుపట్టే నైపుణ్యం పెరుగుతుది.

5. త్రిమితీయ మ్యాప్ :

మ్యాప్‌లోని నదులు, పర్వతాలు వంటి అంశాలను చూపినపుడు ఎత్తు, లోతుల్ని కల్పించి విద్యార్థులను వాస్తవాల్ని చూస్తున్న అనుభూతిని కల్గించడానికి ఈ మ్యాపులు పనికొస్తాయి. సాధారణంగా ఈ మ్యాపులను ప్లాస్టర్ ఆఫ్ పారిస్, మన్ను వంటి పదార్థాలతో తయారు చేస్తారు.

6. అట్లాస్ :

అట్లాస్ అనేది అనేక మ్యాప్‌ల సంపుటం. ప్రతి విద్యార్థి వద్ద అట్లాసు ఉండాలి. దీనివల్ల విద్యార్థి స్వంతంగా నేర్చుకోవచ్చు. వీటిలో ప్రపంచ అట్లాస్, భారతదేశ అట్లాస్ మొ. రకాలు ఉంటాయి.

మ్యాపులను చదవడం (Map Reading):

మ్యాప్‌లను బాగా పరిశీలించి అవగాహన చేసుకోవడం వల్ల అనేక విషయాలు మనకు అర్థమవుతాయి. మన అవగాహన విశాలమవుతుంది.


మ్యాప్‌లు చదివే పద్ధతి :

1. గుర్తులను గమనించాలి :

మ్యాప్‌లో రోడ్లను సన్నని గీతలద్వారా సూచిస్తారు. మట్టిరోడ్లయితే చుక్కలద్వారా సూచిస్తారు.

ఉదా : 

2. రైలు మార్గాలను సూచించడానికి సన్నని గీతలు గీసి వాటిని ఖండించే చిన్న గీతలుంటాయి.

ఉదా : 

3. ఓడలను ఓడ బొమ్మల ద్వారా, పరిశ్రమలను పొగ గొట్టాల ద్వారా, భవనాలను నల్లని చుక్కల ద్వారా, అడవుల్ని చెట్ల బొమ్మల ద్వారా సూచిస్తారు.

4. కొన్ని సందర్భాలలో అక్షరాల ద్వారా కూడ సూచిస్తారు. P అనే అక్షరం పోస్టాఫీసును, T అనే అక్షరం టెలిగ్రాఫ్ ఆఫీసును, H అనే అక్షరం హార్బర్‌ను సూచిస్తారు.

5. పట్టణాలకు ▪ గుర్తు, ముఖ్యపట్టణాలను ▪ గుర్తుతో సూచిస్తారు.

రంగులు :-

1. నదులు, సముద్రాలను నీలంరంగుతో సూచిస్తారు.

2. పల్లపు ప్రాంతాన్ని, మైదానాన్ని ఆకుపచ్చ రంగుతో, పర్వతాలను జేగురు రంగుతో, పీఠభూముల్ని పసుపు పచ్చని రంగులతో, నిస్సారమైన భూముల్ని పసుపు రంగుతో సూచిస్తారు. అలాగే సముద్ర మట్టం నుండి ఒక ప్రదేశం ఎంత ఎత్తులో ఉందో కూడ రంగులతో సూచించవచ్చు.

| ఎత్తు | సూచించే రంగు |
|---|---|
| 10000 అడుగుల కన్న ఎత్తు | ఎరుపు |
| 5000 - 10000 | బ్రౌన్ |
| 2000-5000 | లైట్ బ్రౌన్ |
| 1000-2000 | పసుపు |
| 500-1000 | లైట్ ఆకుపచ్చ |
| 0-500 | ముదురు ఆకుపచ్చ |
| సముద్రమట్టం కన్న తక్కువ | నీలం |

లేతనీలిరంగు గీత నది ముఖద్వారాన్ని, దళసరి నీలిరంగు గీత విశాలనదీ ప్రవాహాన్ని సూచిస్తాయి.

మ్యాప్‌ల వల్ల ప్రయోజనాలు :

1. మ్యాప్ సరిగా అవగాహన చేసుకుంటే ఆ ప్రదేశాన్ని సంబంధించిన భౌగోళిక, రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలను అర్థం చేసుకోవడం తేలిక.
2. వివిధ ఖండాలు, సముద్రాలు, దేశాలు, సాపేక్ష వైశాల్యం గురించి తెలుసుకోగలరు.
3. మ్యాపులను, స్కేలుననుసరించి ఇతర పటాలను గీయడం, తగిన గుర్తుల్ని వాడే నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటారు.
4. ఒక ప్రదేశం యొక్క ఉనికికి దాని ప్రగతికి గల సంబంధాన్ని తెలుసుకుంటారు.
5. ఉన్నతస్థాయి మ్యాపులను పరిశీలించి వ్యాఖ్యానించగలుగుతారు.
6. మ్యాపులలోని సంకేతాలను అర్థం చేసుకుని తదనుగుణంగా వ్యవహరించగలుగుతారు.
7. కాలనిర్ణయంలో ఉన్న తేడాలను, పీడన, వ్యత్యాసాలను, ఎడారులు, అడవులను ఏర్పడడానికి గల కారణాలను తెలుసుకుంటారు.

### 4.6.5. పాత్రపోషణ (Role Play) :

పాత్రపోషణ సాంఘిక శాస్త్ర బోధనలో చాలా ప్రాముఖ్యత గల అంశం. దీనిద్వారా విద్యార్థులలోని అంతర్గత సామర్థ్యాలు వికసించడానికి అవకాశం ఉన్నది. విద్యార్థులలో సృజనాత్మకత, భావవ్యక్తీకరణకు అవకాశం ఉన్నది.

ఎలా నిర్వహించాలి :

పాఠ్యాంశంలోని ఒకానొక పరిస్థితిని లేదా అంశాన్ని ఎంపిక చేసికొని, దానికి స్పష్టమైన విస్తృత రూపాన్ని కల్పించి, కొంతమంది విద్యార్థులను ఎంచుకొని, వారికి సరియైన పాత్రలను కేటాయించి ఉపాధ్యాయుని పర్యవేక్షణలో ప్రదర్శింప చేయడమే పాత్రపోషణ.

ఉదా :

1. మనం ఓటు ఎలా సద్వినియోగం చేసుకోవాలి ? – ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగే సంభాషణ ద్వారా సరియైన వారిని ఎన్నుకోవాలి. దీనివల్ల ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందనే సందేశం పంపవచ్చు.
2. అల్లూరి సీతారామరాజు – రూథర్‌ఫర్డ్‌ల మధ్య సంభాషణ ద్వారా విద్యార్థుల స్వతంత్ర్య పిపాసను, దేశభక్తిని పెంపొందించవచ్చు.
3. పర్యావరణాన్ని సంరక్షించడం – చెట్లను నాటడంపై
4. స్వచ్ఛ భారత్‌పై

నిర్వహణపై మెలకువలు :

1. పాత్రకు సరిపోయే వారిని ఎంపిక చేయడం.
2. వాళ్ళ పాత్రలకు తగిన స్క్రిప్ట్ అందించుట.
3. తగిన తర్ఫీదు ఇచ్చుట.
4. ప్రదర్శనకు అవకాశం కల్పించుట.
5. ప్రదర్శించిన తరువాత వారికి ఫీడ్ బ్యాక్ అందించుట తగిన సూచనలు చేయుట.
6. మరల ప్రదర్శించుట.

4.6.8. ప్రయోజనాలు :

1. విద్యార్థులు తాము పోషిస్తున్న పాత్రతో తాదాత్మం చెందుతారు.

2. వారి సామర్థ్యాలు పెంపొందుతాయి.
3. విద్యార్థులలో సమగ్ర వికాసానికి తోడ్పడే అంశము.
4. సృజనాత్మకత పెంపొందుతుంది.
5. ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది.
6. నిజ జీవిత అనుభవాలు కల్పించబడతాయి.
7. ప్రేరణ కలిగిస్తుంది.
8. అనేక రకాల నైపుణ్యాలు పెంపొందుతాయి. ఉదా:- ఉచ్ఛారణ, సంభాషణ, హావభావాలు, సమాచార ప్రసరణ మొ॥నవి.

**4.6.6. నాటకీకరణ** (Dramatisation) :

నాటకీకరణ చక్కని బోధనాభ్యసన పాఠం. ఉపాధ్యాయుడు హావభావ ప్రకటనలతో, గొంతులో మార్పులతో చరిత్రలోని అంశాలను బోధిస్తుంటే విద్యార్థులు ఎంతో ప్రభావితులౌతారు. ఆ అంశం వారి మనసులో నాటుకుని పోతుంది. నాటకీకరణ ఒక అద్భుతమైన సృజనాత్మక అనుభవం. నాటకీకరణకు నాటకాలకు తేడా ఉంది. నాటకాలలో పాల్గొనే విద్యార్థులకు, వేషధారణకు ప్రాధాన్యత ఇస్తారు. నాటకీకరణలో అలా ఉండదు.
నాటకీకరణలో అనేక ప్రక్రియలున్నాయి :- నాటికలు, నాటకాలు, ఏకపాత్రలు మొ.నవి.

ప్రయోజనాలు :

1. బిడియాన్ని పోగొడతాయి. 2. విద్యార్థులలో సంస్కృతి యెడల ప్రేమ, దేశభక్తి, సామాజిక స్పృహ పెంపొందుతాయి. 3. నటన, ఉచ్ఛారణ, భావవ్యక్తీకరణ మొదలైన నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. 4. విద్యార్థిలో సమగ్ర వికాసాన్ని పెంపొందిస్తాయి. 5. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి.

ఉపాధ్యాయుని పాత్ర :

ఉపాధ్యాయునిలో ఈ కళ ఉంటే విద్యార్థులకు కూడా అలవడుతుంది. తనకు లేకపోయినా తగు కళాకారుల సహకారం తీసుకోవచ్చు. అంతర్జాలం వంటివి అందుబాటులో ఉన్న ఈ కాలంలో ఉపాధ్యాయునికి ఆసక్తి ఉంటే ఏమైనా చేయవచ్చు.

**4.6.7. దృశ్య ఉపకరణాలు** Visual Images) :

సాంఘికశాస్త్ర బోధనలో ఉపయోగపడే బోధన ఉపకరణాలను 3 రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి 1. శ్రవణ ఉపకరణాలు (Audio Aids)
2. దృశ్య ఉపకరణాలు (Visual Aids)
3. దృశ్య శ్రవణ ఉపకరణలు (Audio Visual Aids)

1. శ్రవణ ఉపకరము :- 1. రేడియో, 2. టేప్ రికార్డర్, 3. భాషా ప్రయోగశాలలు
2. దృశ్య ఉపకరణము :- నల్లబల్ల, చార్టులు, బులిటెన్ చార్టులు, ప్రదర్శకములు, ఫిల్మ్‌స్ట్రిప్ట్‌లు, ఫ్లాష్ కార్డులు, మ్యాప్‌లు, నమూనాలు, పోస్టర్‌లు, ఫొటోగ్రాఫ్‌లు, స్లైడ్‌లు, స్వీయ బోధక పుస్తకములు.
3. దృశ్యశ్రవణ ఉపకరణములు :- ఫిల్మ్‌లు, టెలివిజన్, వీడియో టేపులు, సౌండ్‌ఫిల్మ్ స్ట్రిప్స్.

- శ్రవణ పరికరాలలో ప్రధానంగా రేడియోను మనం విస్తృతంగా ఉపయోగిస్తున్నాము. రేడియో పాఠాలను పిల్లలకు వినిపిస్తున్నాము. ఏ పాఠ్యాంశాలు బోధిస్తున్నారో ముందుగా పాఠశాలలకు ఉపాధ్యాయులకు తెలియజేయుట, విద్యార్థులను సంసిద్ధులను చేయడం, వారికి పాఠం వినిపించడం, పాఠం విన్న తరువాత ఎంతవరకు అర్థమైంది, ఏమి గ్రహించారు అని చర్చించి ముగించడం. ఇవి పరిమితంగానే విజయవంత మైనట్లు భావించవచ్చు.

- దృశ్య ఉపకరణములైన చార్టులు, నల్లబల్లలను, గ్రాఫ్‌లను మనం విరివిగానే ఉపయోగిస్తున్నాం.
- దృశ్య శ్రవణ పరికరాలైన టెలివిజననను విద్యాకార్యక్రమాలకు విస్తృతంగా ఉపయోగిస్తున్నాం.

## 4.6.8. క్షేత్ర పర్యటనలు :

క్షేత్ర పర్యటనలు సాంఘిక శాస్త్ర బోధనలో అత్యంత ముఖ్యమైన అంశం. ఇవి విద్యార్థిలో అనుభవజ్ఞానాన్ని పెంపొందిస్తాఇ. ఇవి అన్వేషణను ప్రోత్సహిస్తాయి. పాఠ్యాంశాలలో ఇవ్వబడినవి, మరికొన్ని అదనంగా కూడా క్షేత్ర పర్యటలలో చేర్చవచ్చు. భౌతిక, సాంస్కృతిక, చారిత్రాత్మక, ఆర్థిక పరిసరాలను ప్రత్యక్ష అనుభవాల ద్వారా అభ్యసించవచ్చు.

క్షేత్ర పర్యటనలు 1) ఒక పీరియడ్ వ్యవధికి సంబంధించినవి.

ఉదా :- బడితోట, వీధి పర్యటన, మార్కెట్‌లు, పార్కులు, గిడ్డంగులు, మురికివాడలు.

2. ఒక పూట లేక పూర్తి రోజుకు సంబంధించినవి.

ఉదా :- కోళ్ళ ఫారాలు, చెరువుల, వైద్యశాలలు, వస్తు ప్రదర్శన శాలలు మొ॥నవి.

3. రెండు నుండి ఐదు రోజులకు సంబంధించినవి.

ఉదా :- చారిత్రక స్థలాలు, జాతీయ వస్తు ప్రదర్శన శాలలు, కర్మాగారాలు మొ॥నవి.

క్షేత్ర పర్యటన నిర్వహణ :

క్షేత్ర పర్యటన నిర్వహణ బాగా జరగాలంటే ఈ క్రింది సోపానాలు అవసరం.

1. ప్రణాళిక, 2 సన్నాహము, 3. అమలు చేయడం, 4. తదుపరి కార్యక్రమం, 5. మూల్యాంకనం.

1. ప్రణాళిక :

తాము ఎక్కడికి వెళ్ళాలి? ఎందుకు వెళ్ళాలి? ఎంతకాలం పడుతుంది? ఎంత ఖర్చు అవుతుంది? ఎలా వెళ్ళాలి? మొదలైన విషయాలు క్షుణ్ణంగా చర్చించాలి.

2. సన్నాహం :

పర్యటనకు సంబంధించి ఎవరికి అప్పగించిన పనులు వారు చక్కగా నిర్వహించడానికి సన్నద్ధం కావాలి.

3. అమలు చేయడం :

అనుకున్న ప్రకారం పర్యటన ప్రారంభించి విజయవంతంగా ముగించాలి. ఉపాధ్యాయుల సూచనల మేరకు చక్కగా పని చేయాలి.

4. తదుపరి కార్యక్రమం :

వారు చూచిన ప్రదేశాలకు సంబంధించి విద్యార్థులు నివేదికలు తయారు చేసుకోవడం, పర్యటన అనుభవాలను నెమరు వేసుకోవడం, అనుభవాలను పంచుకోవడం మొ.నవి.

5. మూల్యాంకనం :

ఏ ఉద్దేశ్యంతో ఈ క్షేత్ర పర్యటన నిర్వహించామో ఆ లక్ష్యం నెరవేరిందా? లేకపోతే లోపం ఎక్కడుంది మొదలైనవి చర్చించాలి.

క్షేత్ర పర్యటన ప్రయోజనాలు :

1. ప్రత్యక్ష అనుభవాలు పొందుతారు.
2. భావిజీవిత సమస్యా పరిష్కారానికి దోహదపడుతుంది.
3. నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి.
4. విద్యార్థుల మధ్య సాన్నిహిత్యం, జట్టుభావన పెంపొందుతాయి.

5. అర్థవంతమైన అభ్యసన బదిలీ జరుగుతుంది.

6. రసజ్ఞన, సౌందర్యాత్మక విలువలు పెరుగుతాయి.

7. విద్యార్థుల యొక్క అసలైన ప్రవర్తనను గమనించవచ్చు.

### 4.6.9. సర్వేక్షణ (Survey):

ఏదైనా ఒక విషయమై సరియైన నిర్ణయం తీసుకోవాలన్నా, ఆ క్షేత్రం యొక్క సమస్యలను స్వభావాలను తెలుసుకోవాలన్నా సర్వేక్షణ అవసరం.

ఉదా :-

1. మన పాఠశాల పరిధిలో బడికి వెళుతున్న పిల్లలు ఎంతమంది, బడికి వెళ్ళని వార ఎంతమంది, ఎవరెవరు ఏయే పాఠశాలలకు వెళుతున్నారు అనే వివరాలు కావాలి అనుకుందాం. దీనికి ఒకే మార్గం మనం ఇంటికి వెళ్ళి, ఒక ప్రశ్నావళి ద్వారా సర్వేక్షణ నిర్వహించాలి.

మనం ఉపయోగించే చాలా ప్రాజెక్టులలో అన్వేషణా ఉపగమాలలో సర్వేక్షణ ఒకభాగంగా ఉంటుంది. సర్వేలు అనేక రకాలుంటాయి. అవి విద్యాసంబంధమైనవి, ఆరోగ్య సంబంధమైనవి ఇంకా మొ॥నవి.

ఈ సర్వేలు అన్ని రంగాలలో రకరకాల కారణాలతో నిర్వహించబడుతూ ఉంటాయి. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు కూడా సర్వేలు నిర్వహిస్తుంటాయి.

ఉపయోగాలు :

1. సర్వేలు విద్యార్థులలో చొరవను పెంపొందిస్తాయి.

2. వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి.

3. ధైర్యం, ఆత్మవిశ్వాస భావన పెంపొందుతాయి.

### 4.6.10. కల్పిత సన్నివేశం - సిమ్యులేషన్ :-

నిజజీవిత సన్నివేశాన్ని పోలిన సన్నివేశమును ఏర్పరచి అనుకరించుటయే సిమ్యులేషన్. ప్రతి సందర్భంలోను మనం నిజజీవిత సన్నివేశాన్ని ఏర్పాటు చేయలేము. అది చాలా కష్టంతో కూడుకున్న ప్రక్రియ. కాబట్టి మనం కల్పిత సన్నివేశం ద్వారా బోధనా ప్రక్రియను కొనసాగిస్తాము.

ఉదా :- సూక్ష్మ బోధన. సూక్ష్మబోధన - స్థూలబోధనలోని ఒక చిన్న ప్రక్రియ.

ఉదా : ఉన్ముఖీకరణ, వివరణ, మూల్యాంకనం, బోధనోపకరణలు మొదలగు వానిలో ఏదో ఒకదానిని ఎంచుకొని 5 నుండి 7 నిమిషాలలో దీనిని బోధించి, దానిలోని లోటుపాట్లను తెలుసుకొని తిరిగి బోధించి బోధనను మెరుగుపరచుకునే ప్రక్రియయే సూక్ష్మబోధన.

వాస్తవానికి సూక్ష్మబోధన అసలైన తరగతిగదిలో విద్యార్థుల ముందు నిర్వహించాలి. కాని ప్రతిసారి అది సాధ్యం కాదు కాబట్టి ఛాత్రోపాధ్యాయులనే అసలైన విద్యార్థులుగా భావించి, కల్పిత సన్నివేశాలలో బోధనను నిర్వహించాలి.

సాంఘిక శాస్త్ర బోధనలో ఈ క్రింది సన్నివేశాలలో కల్పిత సన్నివేవ ప్రక్రియను ఉపయోగిస్తాం.

1. చారిత్రక పాత్రలను నటించడం.

2. ఒక చెట్టును నరికేటపుడు ఆ వృక్షం యొక్క బాధను నటించమనుట.

### 4.6.11. పరిపుచ్ఛ (ఇంటర్వ్యూ) :

సాంఘికశాస్త్ర బోధనలో పరిపుచ్ఛ లేదా ఇంటర్వ్యూ ఒక ముఖ్యమైన సాధనము. ఒక వ్యక్తినుండి మనకు అవసరమైన సమాచారమును ప్రత్యక్షంగా ఆ వ్యక్తిని సందర్శించి అతని నుండి తెలుసుకోవడమే ఇంటర్వ్యూ. సాంఘిక శాస్త్ర బోధనలో అనేక సందర్భాలలో ఇంటర్వ్యూలు వాడతారు.

1. గ్రామ సర్పంచిని, మండల విద్యాశాఖాధికారిని తరగతి గదికి ఆహ్వానించి, విద్యార్థుల ముందు వారిని ఇంటర్వ్యూ చేయుట.
2. మౌఖిక చరిత్ర పద్ధతిలో ఇంటర్వ్యూ ఒక ముఖ్య సాధనం. గ్రామాలలో, అడవులలో, ఉన్నవారితో, ప్రముఖులతో వాళ్ళ వద్దకు వెళ్ళి ఇంటర్వ్యూ నిర్వహిస్తాము.
3. ప్రాజెక్టు పద్ధతులు, సమస్యా పరిష్కార పద్ధతులో కూడా ఇంటర్వ్యూ ఉపయోగించవచ్చు.

ఉపయోగాలు :

1. అవతలివ్యక్తితో ముఖాముఖి మాట్లాడతాము.
2. చొరవ పెరుగుతుంది.
3. బిడియాలు, సంకోచము పోతాయి.
4. మాట్లాడగలిగే సామర్థ్యం, సరైన ప్రశ్నలడగడం తెలుస్తుంది.

## 4.7. సమాచార, సాంకేతిక విజ్ఞానముతో బోధనను సమన్వయం చేయుట :

ఉపాధ్యాయుడు తన బోధనను నిరంతరం మెరుగుపరచుకోవాలి. దీనిలో నూతన బోధనోపకరణాలను, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమును ఉపయోగించి బోధనను నవీకరించాలి. అందువల్ల కంప్యూటర్లు (1) ఒక బోధనోపకరణాలుగా, (2) ఒక వైయుక్తిక బోధకునిగా, (3) పనిద్వారా విద్య అనే భావన ద్వారా అభ్యాసకులను కావలసిన నైపుణ్యాన్ని, జ్ఞానాన్ని అందించగలవు. ఇలా ఉండగలిగినపుడే తరగతి గదిలో కంప్యూటర్‌ల అన్వయం ఫలవంతమవుతుంది. ఇందుకుగాను ఉపాధ్యాయుడు ఒక సలహాదారుగా, మార్గదర్శకుడుగా ఉండాలి.

### 4.7.1. సమాచార సాంకేతిక విజ్ఞానం తరగతి గది - ఉపాధ్యాయుని పాత్ర :

ఉపాధ్యాయుడు తన పాఠ్యాంశాలను కంప్యూటర్‌ల సహాయంతో ఎలా రూపొందించవచ్చో తెలుసుకుందాం.

యూనిట్ పథకము :

బోధనాభ్యసన ప్రక్రియలో ప్రధానంగా పాఠ్యాంశాలను తయారుచేయడం. ఒక యూనిట్/పాఠ్యాంశంలోని వివిధ అంశాలను సమగ్రంగా వినియోగించుకోవడానికి కంప్యూటర్ అనేక విధాలుగా పనికి వస్తుంది. ఒక్కొక్క అంశం గురించిన బోధనా విశేషాలను ఈ క్రింది సాఫ్ట్‌వేర్ ద్వారా సులభంగా చేసుకోవచ్చు.

1. విషయాన్ని ఎం.ఎస్.వర్డ్‌ను ఉపయోగించి టెక్స్ట్‌గా తయారు చేయడం.
2. ముఖ్యమైన అంశాలను బుల్లెట్స్ ద్వారా చూపించడం.
3. సంక్షిప్త వివరాలను పట్టికద్వారా చూపించడం.
4. శాస్త్రీయంగా తరగతిలో చెప్పదలచిన విషయాలను సంబంధించిన గ్రాఫులు ఇతర చిత్రాల నుండి ఎం.ఎస్. ఎక్సెల్ ద్వారా తయారు చేసుకొని అవసరం ఉన్నచోట ఇముడ్చుకోవడం.
5. ఎం.ఎస్. పవర్‌పాయింట్‌ను ఉపయోగించి పీరియడ్ పథకానికి పట్టే సమయాన్ని నిర్ధారించుకోవడం.
6. ట్రాఫిక్ నిబంధనలు, రెండవ ప్రపంచయుద్ధం, భూచలనాలు మొదలగు పాఠ్యాంశాలు బాగా వివరించవచ్చు.

### 4.7.2. పాఠ్యపథకం – తయారీ :

పాఠ్యాంశం ఆధారంగా వివిధ పటాలు, గ్రాఫులు, బొమ్మలు, చార్టులు, ఫొటోగ్రాఫ్‌లు, కార్టూన్లు, ఫ్లోచార్టులు, కాన్సెప్ట్ మ్యాప్‌లు మొదలైనవి రూపొందించుకోవచ్చు. వీటికి ఆకర్షణీయమైన ఫాంట్స్, రంగులు ఇవ్వడం ద్వారా పాఠ్య పథకాన్ని విద్యార్థులు ఆకట్టుకునేలా తయారు చేసుకోవచ్చు.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ :

ఒక బోధనాంశాన్ని దృశ్య శ్రవణ పద్ధతులలో ఆకర్షణీయంగా వ్యక్తపరచడమే పవర్‌పాయింట్ ప్రజెంటేషన్. విద్యార్థుల మనసులను ఆకట్టుకునేలా తయారు చేయవచ్చు. ఇది ఒక కళ. ఇందుకోసం గ్రాఫ్‌లు, ఫొటోలు, కార్టూన్ చిత్రాలు, యానిమేషన్, స్వరాలు మొదలైనవి ఎంతో అవసరం. పాఠ్యాంశానికి అనుగుణంగా వీటన్నిటినీ కలిపి ప్రజెంట్ చేయడానికి ఎం.ఎస్. పవర్‌పాయింట్ ఎంతో ఉపయోగపడుతుంది.

సాంఘికశాస్త్రంలో సూర్యకుటుంబం, మానవ పరిణామ దశలు, భూస్వరూపాలు, ఐక్యరాజ్యసమితి మొదలైన అంశాలను అనుభవ పూర్వకంగా నేర్చుకుంటారు. ఈ భావనలను వాస్తవ ప్రపంచంలో ఎలా ఉపయోగించాలో కూడా నేర్చుకుంటారు. కంప్యూటర్ సహాయంతో ఎల్‌సిడి తెర మీద పడేటట్లు చేయడం వల్ల అనేకమంది విద్యార్థులకు ఒకేసారి పాఠ్యాంశాన్ని బోధించే అవకాశం ఉంది. బోధించే అంశానికి ముందుగా వాయిస్ రికార్డు చేయడం ద్వారా బోధనను ఒక క్రమపద్ధతిలో జరపవచ్చు.

మన పాఠ్యాంశానికి సంబంధించి అంతర్జాలంలో ఎన్నో అంశాలుంఆయి. యూట్యూబ్‌లో ఉండే అనేక అంశాలను మన పాఠానికి అనుసంధానం చేసి ఉపయోగించవచ్చు.

### 4.7.3. ఫ్లో చార్టులు :

చాలా పాఠ్యాంశాలలను ఫ్లోచార్టులుగా మార్చుకొని విద్యార్థులకు ప్రదర్శించవచ్చు. దీనివల్ల విద్యార్థులకు చాలా త్వరగా విషయాన్ని అర్థం చేసుకునే అవకాశం ఉంది. దీనివల్ల విద్యార్థులకు చాలా త్వరగా విషయాన్ని అర్థం చేసుకొనే అవకాశం ఉంది. 1) భారతదేశము భౌగోళిక స్వరూపము, 2) నేలలు – రకాలు మొ॥నవి.

### 4.7.4. భావనా చిత్రాలు :

మన పాఠ్యాంశానికి సంబంధించిన కాన్సెప్ట్ మ్యాప్‌ను మనం ఆకర్షణీయంగా తయారు చేయవచ్చు. దీనివల్ల విద్యార్థులకు ఇంకా ఆసక్తి కలుగుతుంది. నల్లబల్ల సహాయంతో బోధించటంతో పాటు కంప్యూటర్ ఆధారిత బోధనను జోడించడం విద్యార్థులను ఎంతో ఆకర్షిస్తుంది.

### 4.7.5. డాక్యుమెంటరీలు :

విద్యార్థులకు ఎంతో ఉత్తేజాన్ని కలిగించే ఎన్నో డాక్యుమెంటరీలున్నాయి. వాటిని ప్రదర్శించిన యెడల విద్యార్థులు ఎంతో జ్ఞానాన్ని, ఆనందాన్ని పొందుతారు. అనేక పాఠ్యాంశాలకు అనుబంధంగా ఉండే డాక్యుమెంటరీలు ఉంఆయి. ఉపాధ్యాయుడు వాటిని జాగ్రత్తగా ఎంపికచేసికొని, విద్యార్థుల స్థాయికి తరగతి స్థాయికి తగినట్లుగా ప్రదర్శిస్తే వారి ప్రగతికి ఎంతో ఉపయోగపడుతుంది.

### 4.7.6. ధారావాహికలు :

విద్యార్థులకు ఉపయోగపడే ఎన్నో విద్యావిషయక సీరియల్స్ ఉంటాయి. సమయానుగుణంగా వాటిని ప్రదర్శించినట్లయితే విద్యార్థులు ఎంతో ప్రయోజనాన్ని పొందుతారు.

ఉదా :– ఝాన్సీలక్ష్మీబాయి, చాణక్య, చంద్రగుప్త మొదలుగున్నవి.

### 4.7.8. చరిత్ర, భూగోళాలను సంబంధించిన ఫిల్మ్‌లు :

చరిత్ర, భూగోళాలకు సంబంధించిన ఎన్నో ఫిల్మ్‌లు ఈనాడు అందుబాటులో ఉన్నాయి. పెద్ద విద్యాసంస్థలలో వీటిని భద్రపరచి ఉంచినారు. ఈనాడు ఇవి అంతర్జాలంలో, యూట్యూబ్‌లో అందుబాటులో

వున్నవి. వాటిని జాగ్రత్తగా వెతికి అవసరమైన వాటిని ఎంపిక చేసుకొని విద్యార్థులకు ప్రదర్శించినట్లయితే వారికి ఎంతో ఉపయోగం.

## 4.8. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు :

సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు తన బోధనను సమర్ధవంతంగా నిర్వహించాలంటే తాను బోధించే అంశంపై ఆసక్తి ఉండాలి, విషయంపై లోతైన, సమగ్రమైన అవగాహన ఉండాలి. మంచి సమాచార ప్రసార నైపుణ్యాలుండాలి, సామాజిక సమస్యలపై, సమకాలీన అంశాలపై అవగాహనను పెంచుకొంటూ నిరంతర విద్యార్థిగా ఉండాలి. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ముందు ఒక మంచి ఉపాధ్యాయుడు. ఆ తర్వాత మంచి సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు ఈ క్రింది లక్షణాలను కలిగి ఉండాలి.

1. నిరంతర విద్యార్థిగా ఉండటం :

ఒక మంచి ఉపాధ్యాయుడంటే ఒక మంచి విద్యార్థే. ఉపాధ్యాయుడు ఎప్పుడూ తన విద్యార్థి లక్షణాలను కోల్పోరాదు. నిరంతర అధ్యయనశీలి, అన్వేషణశీలి కావాలి.

2. విద్యార్థులతో తాదాత్మ్యం చెందుట :

ఒక మంచి ఉపాధ్యాయునికి పిల్లవానిలా అనుభూతి చెందే లక్షణం ఉండాలి. అంటే పిల్ల చేష్టలనికాదు. పిల్లల హృదయం, వారితో తాదాత్మ్యం చెందే లక్షణం. వారిలా ఆలోచించి, వారితో కలిసి పోయే లక్షణం. వారి దృష్టికోణం నుండి ప్రపంచాన్ని చూడడం.

3. విద్యా మనోవైజ్ఞాన శాస్త్ర అవగాహన, ఆచరణ :

మనోవిజ్ఞాన శాస్త్ర అవగాహన అంటే మనోవిజ్ఞాన శాస్త్ర సూత్రాలను, సిద్ధాంతాలను, బట్టీపట్టడం కాదు, వాటిలోని మౌలిక సూత్రాలను తన నిజ జీవితంలో ఆచరించడం. వాటికనుగుణంగా విద్యార్థులతో మెలగడం వారితో ప్రవర్తించడం.

4. సహనం కలిగి ఉండటం :

పిల్లలతో మనం ఎంతో ఓర్పుతో ఉండాలి. వారి పొరపాట్లను, తప్పులను భరించగలిగి సహించగలిగే మాతృహృదయం ఉపాధ్యాయునికి అవసరం. అప్పుడే ఉపాధ్యాయుడు పిల్లల జీవితాలను మార్చగలుగుతాడు. వారి జీవితాలలో, హృదయాలలో నిలిచిపోగలుగుతాడు.

5. తన బోధనా పద్ధతులను మెరుగుపరచుకోవడం :

తన బోధనాపద్ధతులను నిరతరం మెరుగుపరుచుకోగలగాలి. తాను బోధించే విధానం, బోధనా నైపుణ్యం, ఆయేటికాయేడు మెరుగుపడాలి. బోధనా నైపుణ్యం పెరగాలి. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుంది. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ బోధనను మెరుగు పరచుకోవాలి.

6. అందరిని సమానంగా ప్రేమించగలగాలి :

తన సొంత పిల్లలను ప్రేమించినట్లుగానే ఉపాధ్యాయుడు తన తరగతి పిల్లలను ప్రేమించగలగాలి. ప్రేమ అంటే నిష్కల్మషమైన, తిరిగి ఏమీ కోరుకోని తల్లి ప్రేమ అత్యుత్తమ బోధనా మాధ్యమము. ప్రేమతో జయింపబడని వ్యక్తి ఎవరుంటారు. నిష్కల్మషమైన, ఏమీ ఆశించని ప్రేమకు ప్రపంచం పాదాక్రాంతమవుతుంది. వెనుకబడిన వారిని, బాగా ప్రగతి సాధిస్తున్న వారందరిని సమానంగా చూడాలి. వెనుకబడిన వారిపై మరింత శ్రద్ధ అవసరం.

7. సమాజంతో సత్సంబంధాలు ఉండాలి :

తల్లిదండ్రులతో, సమాజంలోని పెద్దలు, అధికారులతో సత్సంబంధాలు ఉండాలి.

8. మంచి విషయ పరిజ్ఞానం :

తాను బోధించే విషయంలో మంచి పట్టు సంపాదించాలి. సమగ్రమైన అవగాహనను పెంపొందించుకోవాలి. దీనికోసం సంవత్సరాలు తరబడి కృషి చేయడం అవసరం. ప్రతి ఉపాధ్యాయుడు తన ఇంటిలో సొంత గ్రంథాలయం ఏర్పాటు చేసికోవాలి. తన సంపాదనలో కొంత భాగాన్ని పుస్తకాల కోసం ఖర్చు పెట్టాలి.

9. వృత్తిపరమైన అభివృద్ధి :

తన వృత్తిపరమైన అభివృద్ధి కోసం నిరంతర కృషి అవసరం. నూతన పోకడలను అధ్యయనం చేయడం, సెమినారుల, వర్క్‌షాప్‌లు, శిక్షణా కార్యక్రమాలలో పాల్గొనడం చేయాలి.

10. మంచి నిర్వహణా సామర్థ్యాలు :

పాఠశాలలో జరిగే రకరకాల సాహిత్య, సాంస్కృతి, క్లబ్ కార్యక్రమాలు, క్షేత్ర పర్యటనల, తల్లిదండ్రుల సమావేశాల కార్యక్రమాలు, సహజ చైతన్య కార్యక్రమాలు నిర్వహించగల సమర్థతను పెంపొందించుకోవాలి.

11. మంచి పరిశోధకుడై ఉండాలి :

నూతన ప్రక్రియలను అవలంబించడం, చిట్టి పరిశోధనలను చేపట్టడం, విద్యార్థులను పరిశోధనకు నూతన పోకడలకు ప్రోత్సహించే వాడై ఉండాలి.

12. మంచి సమాచార ప్రసార నైపుణ్యాలు :

తన భావాలను, అభిప్రాయాలను చక్కగా వ్యక్తం చేయగలిగి ఉండాలి. హాస్య చతురత, సమయస్ఫూర్తి ఉండాలి.

13. వర్తమాన వ్యవహారాలపై అవగాహన :

ప్రతిరోజు వార్తాపత్రికలు చదువుట, అంతర్జాలం ఉపయోగించుట, వివిధ పత్రికలు, మ్యాగజైన్‌లు చదవాలి. వీటిని తన బోధనకు అనుసంధానం చేయాలి.

14. మంచి పర్యాటకుడై ఉండాలి :

నిరంతరం స్వయంగా తాను వివిధ ప్రదేశాలను సందర్శించి, విశేషాలను తెలుసుకోవాలి.

15. క్షేత్ర పర్యటలు :

క్షేత్ర పర్యటనలు నిర్వహించి విద్యార్థులలో మంచి ప్రేరణ కలిగించాలి.

16. మంచి హాబీలు ఉండాలి :

స్టాంపులను, నాణేలను సేకరించడం, ఆల్బమ్‌లను తయారు చేయడం, పత్రికలు, మ్యాగజైన్‌లు చదవడం, గ్రంథాలయాలకు వెళ్ళడం మొదలైనవి.

**తరగతి గది నిర్వహణ, విద్యార్థులను భాగస్వాములను చేయాలి :**

తన తరగతి గదిని ఒక ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించాలి. తగు విధంగా బోధనాభ్యసన సామాగ్రిని సంసిద్ధం చేసుకోవడం, విషయాన్ని ముందే బాగా తయారవడం, ఎవరిని ఏయే సమూహాలుగా విభజించుకోవాలో ముందుగా నిర్ణయించుకోవడం, విద్యార్థుల స్థాయిని అర్థం చేసుకోవడం, అందరు విద్యార్థులతో చక్కని సాన్నిహిత్యం, వారి వారి సామర్థ్యాలు, అభిరుచులకు అనుగుణంగా అందరిని ప్రోత్సహించడం.

**లఘు ప్రశ్నలు :**

1. సాంఘికశాస్త్ర బోధనలో పిల్లల భాగస్వామ్యం?
2. వార్షిక ప్రణాళిక అవసరమేమి?
3. వాస్తవాలకు, అభిప్రాయాలకు గల తేడాలను వివరింపుము.
4. సాంఘికశాస్త్ర బోధనలో పిల్లల సాంఘిక-సాంస్కృతుల నేపథ్యం.
5. సాంఘికశాస్త్రమునందు ఏవైనా 5 ముఖ్య భావనలను వివరింపుము.
6. ఈ క్రింది వానిని వివరింపము.
   ఎ) సాంఘికశాస్త్ర బోధనలో మ్యాప్‌ల ప్రాధాన్యత.
   బి) వ్యక్తిగత లేఖలు, డైరీలు
   సి) మౌఖిక చరిత్ర అంటే ఏమిటి? దాని ప్రాముఖ్యతలేమి?
   డి) అధికార పత్రాలు అంటే ఏమిటి?
   యి) టైమ్‌లైన్ చార్టులు అనగానేమి?
7. ప్రయాణ వ్యాఖ్యానాలు, డైరీలు - సాంఘికశాస్త్రములో వీని ప్రాముఖ్యత
8. సాంఘికశాస్త్ర బోధనలో కథల ప్రాముఖ్యత
9. సాంఘికశాస్త్ర బోధన దృశ్య ఉపకరణాలు.
10. తరగతి నిర్వహణ
11. ఫ్లో చార్టు ఎక్కడ ఎలా ఉపయోగపడతాయి.
12. చరిత్ర, భూగోళ ఫిల్ములు ద్వారా సాంఘిక శాస్త్ర బోధన ఎలా జరుగుతుంది?

**వ్యాసరూప ప్రశ్నలు :**

1. ఏదైనా ఒక యూనిట్‌కు యూనిట్ ప్రణాళికలను, పీరియడ్ ప్రణాళికలను వ్రాయుము.
2. సాంఘికశాస్త్ర బోధనలో వైవిధ్య భరిత ప్రశ్నలు, జట్టు కృత్యాల ప్రాముఖ్యతను వివరింపము.
3. అన్వేషణాధారిత ఉపగమమును వివరింపుము.
4. చరిత్ర నిర్మాణ రచనలో ఆధారాల మధ్య గల సంబంధానికి గల ప్రముఖ్యత ఏమి?
5. ప్రయాణ వ్యాఖ్యానములు, డైరీలు చరిత్ర రచనలో ఎలా ఉపయోగపడతాయి?
6. సాంఘికశాస్త్ర బోధనలో సర్వేలు, ఇంటర్వ్యూల ప్రాముఖ్యతను వివరింపుము.
7. సాంఘికశాస్త్ర బోధనలో గ్రాఫ్‌లు, పట్టికల యొక్క ప్రాముఖ్యత వివరింపుము?
8. సాంఘికశాస్త్ర బోధనలో ICT యొక్క ప్రాముఖ్యతను సోదాహరణముగా వివరింపుము.
9. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుని పాత్ర, బాధ్యతలను వివరించుము.
10. మ్యూజియంల, సంగ్రహాలయముల సందర్శన - దీనిని సోదాహరణంగా వివరించండి.
11. సాంఘికశాస్త్ర బోధనలో మ్యాప్‌ల ప్రాముఖ్యత.

# అధ్యాయం - 5 సాంఘిక శాస్త్ర భోధనాభ్యసన మదింపు

సాంఘికశాస్త్రం గతిశీలమైనది. మిగిలిన శాస్త్రాలవలె సాంఘికశాస్త్ర భోధన కూడా లక్ష్యాత్మకంగా జరగాలి. లక్ష్యాత్మకంగా జరిగినప్పుడే మంచి భావి పౌరులు ఏర్పడతారు. మంచి సమాజం ఏర్పడుతుంది. అప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుంది. సుశిక్షితులైన పౌరులతో నిర్మించబడే సమాజం క్రమశిక్షణతో ప్రశాంతంగా ఉండి పౌరులు తమ శక్తిసామర్ధ్యాల కొద్దీ అభివృద్ధి సాధించడానికి తద్వారా దేశాభివృద్ధికి దారితీస్తుంది. మరి భోధన లక్ష్యాత్మకంగా జరిగిందా లేదా అని తెలుసుకోవడానికి భోధన అభ్యసన కార్యక్రమాలను సరిగా మదింపు చేసినప్పుడే లక్ష్యాలకనుగుణంగా ఫలితాలు వస్తాయి.

## మదింపు - మూల్యాంకనం

మాపనము, మూల్యాంకనము ఒకటి కాదు. కాని ఒకే ప్రక్రియతో సంబంధమున్న అంశాలు. భోధన పూర్తిఅయిన తరువాత పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ప్రగతిని మార్కుల రూపంలో కొలవడాన్ని మదింపు అంటారు. అంటే మాపనం పరిమాణాత్మకంగా ఉంటుంది. ఉదాహరణకు ఒక విద్యార్థికి అర్ధసంవత్సర పరీక్షలో 520/600 మార్కులు వచ్చినవి. అంటే వీటి అధారంగా ఒక విద్యార్థికి ఎంత ఎక్కువ మార్కులు వచ్చినవి లేదా తక్కువ మార్కులు వచ్చినవి చెప్పవచ్చు. దాని వలన విద్యార్థి సాధించినమార్కుల శాతం, తరగతిలో విద్యార్థి స్థానం తెలుసుకోవచ్చు.

మూల్యాంకనమునేది విద్యార్థి సాధించిన ఫలితాలకు విలువ కట్టడం ఉదాహరణకు ఒక విద్యార్థికి 100 కి 75 మార్కులు వచ్చాయుంటే డిస్టింక్షన్‌లో పాసయ్యాడని, 100 కి 50 మార్కులు వచ్చాయంటే ద్వితీయ శ్రేణిలో పాసయ్యాడని చెప్పవచ్చు. అనగా విద్యార్థి సాధించిన మార్కులను బట్టి అతని అభ్యసన ఫలితానికి విలువ కట్టడమన్నమాట. అనగా మూల్యాంకనం గుణాత్మకమైనది. కాని మాపనము, మూల్యాంకనము పరస్పర సంబంధమైనవే. మాపనము సహాయంతో మూల్యాంకనం చేయగలము. మూల్యాంకనము లేకుండా మాపనము చేయగలం కాని మాపనం లేకుండా మూల్యాంకనం చేయలేము.

## మూల్యాంకనం - భావన

విద్యార్థుల నిష్పాదనలోని అంశాలన్నింటిలో ఏవి ప్రధానంగా గ్రహించాలో ముందే నిర్ణయించుకోవాలి. వాటినే లక్ష్యాలు అంటారు. పాఠ్యావిషయాలు, పాఠ్యాంశాలు, తరగతులను అనుసరించి లక్ష్యాలు వేరు-వేరుగా ఉండే అవకాశం ఉంది. అందుకు సాంఘికాధ్యయన లక్ష్యాలు, సాంఘికాధ్యయన పాఠ్యాంశాల లక్ష్యాలు ఏవో ముందే నిర్ణయించుకోవాలి. విద్యార్థులు ఆ లక్ష్యాలను ఎంతమేరకు సాధించిందీ వారి నిష్పాదనలో గుర్తింపు మదింపు చేయాలి. కాబట్టి లక్ష్యాలే మూల్యాంశాలని భావించాలి. మూల్యాంశాలను అంకనం చేయడం లేదా విలువ కట్టడం మూల్యాంకనం అవుతుంది. మూల్యాంకనం అనేది సమగ్ర భావన. దీనిలో నిషకలు, పరీక్షలు, మాపనులు మొదలైనవి చేరి ఉ ంటాయి.

## నిర్వచనం :

1. రాల్ఫ్ టైలర్ నిర్వచనం ప్రకారం విద్యాలక్ష్యాలు ఎంతవరకు సాధించడం జరిగిందో తెలుసుకునే విధానమే మూల్యాంకనం

2. విద్యా విజ్ఞాన సర్వస్వం (1960) అనుసరించి కొన్ని ఎన్నుకొన్న లక్ష్యాల అధారంగా ఏ మేరకు యోగ్యత సంపాదించడం జరిగిందో తెలియజేసేదే మూల్యాంకనం.


3. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (....) ప్రకారం

– లక్ష్యం ఎంతమేరకు సాధించడమైనది.

– తరగతి గదిలో సమకూర్చిన అభ్యసనానుభవాల తీరు, విద్యాగమ్యాలు ఎంత ఉత్తమ స్థాయిలో సాధించారు? అనే వాటిని నిర్ధారించే విధానమే మూల్యాంకనం.

మరో అభిప్రాయంలో నిర్ధారించిన, నిర్వచించిన విద్యా లక్ష్యాలు ఎంతమేరకు సాధించబడినాయో తరగతి గదిలో అనుసరించిన అభ్యసన అనుభవాలు ఎంత ప్రభావశీలమయినాయో విదా7్యగమ్యాలు ఎంత బాగా నెరవేరాయో, నిర్ధారించడాన్ని అనుసరించే క్రమబద్ధమైన నిరంతర ప్రక్రియయే మూల్యాంకనం

బెంజిమన్ యస్. బ్లూమ్స్ అతని అనుచరులు మూల్యాంకన రంగంలో ప్రత్యేకంగా పరిశోధనలు చేశారు. వారు విద్యాప్రక్రియలో మూడు పరస్పర సంబంధం గల అంశాలుంటాయని తెలిపారు. అవేమంటే 1. లక్ష్యాలు, 2. అభ్యసనానుభవాలు 3. మూల్యాంకనం. ఈ మూడింటిని పటం రూపంలో ఇట్లా చూపవచ్చు.




విద్యా లక్ష్యాలు ముందుగా నిర్ణయించిన తరువాత వాటికనుగుణంగా భోధనాభ్యసన కృత్యాలు అందించాలి. లక్ష్యాలు, భోధనాభ్యసన కృత్యాలను మూల్యాంకనం చేయాలి. విద్యాప్రక్రియలో ఇవి మూడు అంతర్భాగాలు. పరస్పర ప్రభావం కలిగి ఉంటాయి.

**మూల్యాంకనం – ప్రయోజనాలు :**

మూల్యాంకనము విద్యావ్యవస్థలో సంబంధమున్న ప్రతి ఒక్కరికీ ప్రయోజనము కలిగిస్తుంది. అనగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఇతరులకు, విద్యాశాఖకు, పరిశోధకులకు ప్రయోజనము కలిగిస్తుంది.

**ఉపాధ్యాయులకు :**

– భోధనా లక్ష్యాలను ఎంపిన చేయడానికి

– పాఠ్య విషయానికి, భోధన లక్ష్యాలను అన్వయించడానికి

– భోధన వ్యూహాల ఎంపికకు అభ్యసన కృత్యాల తయారికీ

– అభ్యసన కృత్యాల ప్రభావాలను నిర్ధారించుకోవడానికి

– విద్యార్థుల లక్ష్య సాధనను తెలుసుకోవడానికి

– పాఠ్య భోధనా ప్రభావాన్ని కనుగొనడానికి తోడ్పడుతుంది.

**విద్యార్థులకు :**

– తమకు నచ్చిన భోధనాంశాన్ని ఎంపిక చేసుకోవడానికి

– భోధనాంశాన్ని తాము అభ్యసించిన విధానిన్ని గ్రహించడానికి

– లక్ష్యసాధన విధానాన్ని గుర్తించడానికి

– ఏయే రంగాలలో లక్ష్యము సాధించబడినది లేక సాధించబడలేదు అనే విషయాలు తెలుసుకోవడానికి తోడ్పడుతుంది.

**తల్లిదండ్రులకు, ఇతరులకు :**

– తమ పిల్లలు ఏ ప్రమాణాలు కనబరుస్తున్నారో తెలుసుకోవడానికి

– పిల్లల్లో ప్రతిభా వ్యుత్పత్తులను గుర్తించడానికి

– మరింత మెరుగైన లక్ష్యసాధనకు చెప్పదగిన వ్యూహాలను ఎంపిక చేయమని ఉపాధ్యాయులకు చెప్పడానికి

– విద్యానాణ్యతను తెలుసుకోవడానికి

– పిల్లల అభివృద్ధికి తగిన నిర్ణయాలు తీసుకోవడానికి మూల్యాంకనం తోడ్పడుతుంది.

– విద్యాశాఖాధికారులకు తమ శాఖలో జరుగుచున్న కార్యక్రమాల ఫలితాలు, నాణ్యతను, పర్యవసానాలను తెలుసుకోవడానికి

– తగు మార్పులు, సంస్కరణలు చేయడానికి

**పరిశోధకులకు:**

– విద్యా కార్యక్రమాల నాణ్యతను తెలుసుకోవడానికి

– ఇతర రాష్ట్రాల, దేశాల కార్యక్రమాలతో పోల్చి చూడడానికి

– మార్పుల ప్రభావం పరిగణించడానికి

– నూతన పోకడల గురించి ప్రభుత్వానికి సలహాలివ్వడానికి

## 5.1 మదింపు మూల్యాంకన సంస్కరణల ఆవశ్యకత, ప్రాధాన్యత సాంఘిక శాస్త్రంలో సిసిఇ అమలు

### మదింపు – మూల్యాంకన సంస్కరణల ఆవశ్యకత:

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పలు వ్యూహాలను అనుసరించాలని మన విద్యావేత్తలు సూచిస్తూనే ఉన్నారు. ఆ క్రమములో విద్యావ్యవస్థ పలు మార్పులకు లోనవుతుంది. ఉపాధ్యాయ కేంద్రిత భోధన నుంచి శిశు కేంద్రిత భోధనవైపు మన దృష్టి మళ్ళింది. ఉపాధ్యాయుడు విద్యార్థికి అభ్యసన సహాయకుడిగా రూపాంతరం చెందాడు. విషయ ప్రణాళికలు మారుతున్నాయి. విద్యార్థుల ఉపలబ్ధిని లేదా సాధనను నిర్ధారించే విధానాల్లో కూడా మార్పు వస్తుంది.

ఒక కాలంలో ఉపాధ్యాయుడే కేంద్రంగా ఉన్న పరీక్షా విధానం ఉండేది. ఈనాడు విద్యార్థి కేంద్రంగా రూపాంతం చెందుతోంది. ఈ క్రమములో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పరిణామాలకు అనుగుణంగా మన దేశంలో విద్యావ్యవస్థ మార్పు చెందుతోంది. సాంప్రదాయకంగా మన దేశంలో అభివృద్ధి చెందిన పరీక్షా వ్యవస్థ ఈనాడు కొత్తరూపం తొడుక్కుంటోంది. ఈ క్రమములో మాపనం, మూల్యాంకనం, పరిగణనం అనే భావనలు వెలుగులోనికి వచ్చాయి. విద్య సరిగా ఆర్జించలేకపోవడానికి విద్యార్థి అశ్రద్ధే కారణం అనే స్థాయికి, అనాసక్తి కలిగిన పాఠ్య ప్రణాళిక, జ్ఞాపకశక్తిని పరీక్షించేందుకు మాత్రమే ప్రాధాన్యమిస్తున్న పరీక్షా విధానాలు, జ్ఞానాత్మరంగానికి మాత్రమే ఇతోధిక ప్రాధాన్యమిస్తున్న ప్రశ్నపత్రాలు కారణమని విద్యావేత్తలు, విధానకర్తలు అభిప్రాయపడుతున్న ప్రస్తుత తరుణంలో మదింపు , మూల్యాంకన సంస్కరణల ఆవశ్యకత ఎంతైనా వుంది.

పాఠశాలల్లో బాలల సర్వతోముఖాభివృద్ధికి బదులు మార్కులు, పరీక్షలకు పరిమితమైన పరిస్థితులు నెలకొన్నాయి. పరీక్షలకు సంబంధించిన అంశాలకే ప్రాధాన్యత. వాటిని అభ్యాసం చేయించడానికే పాఠశాల సమయాన్ని వెచ్చిస్తున్నారు. పిల్లలు తోటి వారితో ముచ్చటించడం, చర్చించడం, ఆడుకోవడం వంటి వాటితో ఆనందంగా తమ బాల్యాన్ని అనుభవించడానికి బదులు తమ తోటి విద్యార్థులను మార్కులు, ర్యాంకుల కోసం పోటీదారులుగా చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు పిల్లలను బాల్యం నుండి దూరం చేయడంతో పాటు వారిలో అసహనాన్ని, ఆత్మన్యూనతను పెంచి ఆత్మ విశ్వాశాన్ని, సమస్యా పరిష్కార శక్తిని, విచక్షణాశక్తిని కోల్పోయేలా చేస్తున్నాయని 2003లో యశ్‌పాల్ విమర్శిస్తూ భారం లేని విద్య ఆవశ్యతను గురించి భారత ప్రభుత్వానికి నివేదికను సమర్పించినది. దీని అధారంగా జాతీయ విద్యా ప్రణాళికా చట్టం 2005 ( యన్.సి.ఎఫ్ 2005) అమలులోనికి వచ్చింది. పిల్లలు ఆనందంగా అర్థవంతంగా నేర్చుకోవడానికి పరీక్షల విధానాన్ని సంస్కరించాలని యన్.సి.ఎఫ్ 2005 పేర్కొంది. వీటి అమలును చట్టబద్ధం చేస్తూ వచ్చిన నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం – 2005 (ఆర్.టి.ఇ – 2009) బాలల సర్వతోముఖాభివృద్ధి జరగాలని ఇందుకనుగుణంగా విద్యా ప్రణాళికలు, పాఠ్యప్రణాళికలు, పాఠ్యపుస్తకాలు, మూల్యాంకన విధానాలు ఉండాలని పేర్కొంది.

ఆర్.టి.ఇ. – 2009 చట్టం ప్రకారం మన రాష్ట్రంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం బాలల సర్వతోముఖాభివృద్ధి సాధన దిశగా ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. 2012–13 విద్యా సంవత్సరము నుండి మన రాష్ట్రంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలులోనికి వచ్చింది. ఇందుకోసం నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలను అమలు చేయడం జరుగుతోంది. అయితే క్షేత్ర స్థాయిలో వీటినిఅమలు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కోన్నట్లు గుర్తించడం జరిగినది.

సామర్థ్యాల ఆధారంగా ప్రశ్నలను రూపొందించడంలో వాటిని సరిదిద్ధడంలో గ్రేడింగ్ చేయడం వంటి అంశాలలో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాము. అందుకు మదింపు–మూల్యాంకనం విషయాలలో సంస్కరణం ఆవశ్యకత ఎంతైనా వుంది.

**మూల్యాంకనంలో సంస్కరణలు చే**

**సటపుడు ప్రాధాన్యతనీయవలసిన అంశాలు:**

1. కేవలం జ్ఞానాత్మక రంగ విషయాలలో మాత్రమే పరీక్షలు నిర్వహించడం కాక విద్యార్థుల సర్వతోముఖవికాసానికి సంబంధించిన విషయాలకు మూల్యాంకనంలో స్థానం కల్పించాలి.

2. విద్యా ప్రమాణాల సాధన చేయకపోవడానికి విద్యార్థి వైఫల్యం కారణమని భావించడం కాకుండా ఉపాధ్యాయుని భోధనా వైఫల్యం కోణంలో జవాబుదారీతనం వహించేలా ఉండాలి.

**సాంఘిక శాస్త్రంలో సిసిఇ అమలు:**

జాతీయ విద్యా ప్రణాళికా చట్రము – 2005 మరియు విద్యాహక్కు చట్టము – 2009 కి అనుగుణంగా మన రాష్ట్రంలో 2012–13 సంవత్సరము నుండి అన్ని పాఠ్య విషయాలతో పాటే సాంఘిక శాస్త్రములో కూడా నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు ప్రారంభమైనది. ఇందులో భాగంగా సిసిఇ విధానము అమలుకు అనుగుణంగా పాఠ్యపుస్తకాలను సవరించడం జరిగినది. సాంఘిక శాస్త్రములో బోధనాభ్యసనకు, మూల్యాంకనానికి అంతకు ముందున్న బోధనా లక్ష్యాలు, విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ప్రశ్నాపత్రం నిర్మాణ విధానాన్ని మార్చి సిసిఇ లో పేర్కొన్న విద్యా సామర్థ్యాలకు అనుగుణంగా పాఠ్యవిషయాలు, కృత్యాలు, అభ్యాసాలు, ప్రశ్నపత్రము మార్చి అమలు చేస్తున్నారు. సిసిఇ విధానంలో సాంఘిక శాస్త్రములోని సామర్థ్యాలను 6గా పేర్కొనడం జరిగినది. అవి

1. విషయావగాహన
2. ఇచ్చిన అంశాన్ని చదివి అర్థం చేసుకొని వ్యాఖ్యానించడం
3. ప్రాజెక్టు పనులు, సమాచార సేకరణ నైపుణ్యాలు
4. సమకాలీన అంశాల పట్ల ప్రతిస్పందన
5. పట నైపుణ్యాలు
6. సునిశితత్వం, ప్రశంస

2012–13 సిసిఇ అమలులోని రాక పూర్వం ఉన్న యూనిట్ పరీక్షలు, త్రైమాసిన, అర్ధ సంవత్సర, వార్షిక పరీక్షల ద్వారా మూల్యాంకనానికి బదులు సిసిఇలో భాగంగా నిర్మాణాత్మక మూల్యాంకనం, సంగ్రహణాత్మక మూల్యాంకనం విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. బోధన సమయములో లోప నిర్ధారణ మూల్యాంకనం ద్వారా పాఠం బోధించడానికి ముందు విద్యార్థుల లోపాలు గుర్తించడం, పాఠము బోధిస్తున్నప్పుడు నిర్మాణాత్మక మూల్యాంకనం ద్వారా విద్యార్థుల అభ్యసనంలో ఎదురయ్యే లోపాలను అప్పటికప్పుడే సరిచేసి అభ్యసన శూన్యాలను పూరించడం, బోధన పూర్తైన వెంటనే నిర్ణీత కాల వ్యవధులతో సంగ్రహణాత్మక మూల్యాంకనం ద్వారా బోధన, అభ్యసనను పటిష్టపరుస్తున్నారు. 2016–17 సం.ము నుండి 8,9,10తరగతులకు 20% మార్కులకు అంతర్గత మూల్యాంకనమును వివిధ సాధనాల ద్వారా తరగతిలో విషయాలను బోధించే బోధకులు చేస్తుండగా 80% మార్కులకు బాహ్య మూల్యాంకనము ద్వారా మార్కులు ఇచ్చి గ్రేడులు నిర్ణయించి సిసిఇ రిజిస్టరులో నమోదు చేసి విద్యార్థుల స్థాయి నిర్ణయించడం జరుగుచున్నది.

**5.2 : నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మదింపు ఉద్దేశ్యము గ్రేడింగ్ నమోదు**

నిరంతం సమగ్ర మూల్యాంకనంలో భాగంగా పాఠశాలలో నిర్వహించే మూల్యాంకనం విధానాలు పిల్లలను సంపూర్ణంగా పరిశీలించి నమోదు చేసేవిగా ఉండాలి. ఉపాధ్యాయులు తరగతి గదిలోపల, బయట పిల్లలను పరిశీలిస్తూ నమోదు చేసే అంశాలతో పాటు క్రమానుగుణంగా నిర్ణీత కాలవ్యవధులలో నిర్వహించే మూల్యాంకనం కూడా అవసరమే. ఇవి వారాంత, పక్ష, మాస, టెర్మినల్ రూపాలలో కూడా ఉండడం అవసరం. జ్ఞానము, అవగాహన, వినియోగం, విశ్లేషణ, నూతన సందర్భాలలో సర్దుబాటు చేసుకోవడమనే అంశాలతో పాటు అభిరుచులు, వైఖరులు, ఉద్వేగాలు, ప్రత్యేక ఆసక్తులు, శారీరక ఎదుగుదల, ఆరోగ్యకరమైన విషయాలు కూడా నిశితంగా మూల్యాంకనం చేయాలి. ఈ విధమైన మూల్యాంకనం 2 రకాలు.

1. నిర్మాణాత్మక మూల్యాంకనం

2. సంగ్రహాత్మక మూల్యాంకనం

**1. నిర్మాణాత్మక మూల్యాంకనం :** దీనినే రూపణ మూల్యాంకనం అని కూడా పిలుస్తారు. తరగతి గదిలో కల్పించిన అభ్యసన కృత్యాలలో పిల్లలు పాల్గొంటున్నప్పుడు భోధన జరుగుతున్నప్పుడు, విద్యార్థి ఏవిధంగా నేర్చుకుంటున్నాడో పరిశీలించి నమోదు చేయడం ద్వారా పిల్లల అభ్యసనాన్ని మెరుగుపరచడానికి కృషి చేయడాన్ని నిర్మాణాత్మక మూల్యాంకనం అంటారు. నిర్మాణాత్మక మూల్యాంకనం అనేది భయారహిత వాతావరణంలో పిల్లలకు ఆసరాగా నిలిచి అభ్యసనం వేగవంతం చేసుకోవడానికి ఉపకరించేది. ఉపాధ్యాయుడు పిల్లల ప్రగతిని నిరంతం పరిశీలిస్తూ అవసరమైన సందర్భాలలో పిల్లలకు సహాయకారిగా నిలిచి , సరిదిద్ధి ముందుకు నడిపించాలి. కేవలం మార్కులు, గ్రేడుల రూపంలో కాకు,డా పిల్లలకు వారి సామర్థ్యాల సాధనా స్థితిగతులను వివరణాత్మకంగా తెలిపి వారికి సరైన సూచనలు, సలహాలు ఇచ్చి ప్రోత్సహించి అభ్యనానాన్ని మెరుగుపరచడానికి నిర్మాణాత్మక మూల్యాంకనం సహాయపడుతుంది.

తరగతి గదిలో జరిగే చర్యలు, పిల్లల సమాధానాలు, పాఠం మధ్యలో మరియు చివర ఉన్న ప్రశ్నలు, అభ్యాసాల గూర్చి చర్చిస్తున్నప్పుడు పిల్లలు చర్యలో పాల్గొని ఇచ్చే సమాధానాలు, పిల్లలు రాసిన నోటు పుస్తకాలు, తరగతి పని, ఇంటి పని, ప్రాజెక్టులు జట్టు పనులు మొదలైన వాటి ఆధారంగా పిల్లలలు ఏమి నేర్చుకున్నారో ఎలా నేర్చుకుంటున్నారనేది ఉపాధ్యాయుడు అంచనా వేయవచ్చు. దీనినేన నిర్మాణాత్మక మూల్యాంకనం అంటారు.

భోధనాభ్యసన జరుగుతున్న సమయములో నిరంతరం ఫీడ్ బ్యాక్ ఇస్తూ ఉపాధ్యాయునికి, విద్యార్థికి తమను తాము సరిచేసుకునే వీలు కల్పిస్తుంది. అవసరమైన మార్పులు చేసుకోవడానికి తోడ్పడుతుంది. స్వీయ మూల్యాంకనంగా పనికొస్తుంది.

**నిర్మాణాత్మక మూల్యాంకనం లక్షణాలు :**

- భోధనాభ్యసనం జరిగేటప్పుడు విద్యార్థి ఎలా నేర్చుకుంటున్నాడు ప్రగతి ఎలావుంది అని పరిశీలించే ప్రక్రియ.
- పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారు ? అనే దానిపై సమర్థవంతమైన ఫీడ్ బ్యాక్ అందిస్తుంది.
- పిల్లలు తమకై తామే భాగస్వాములై నేర్చుకోవడంలో ప్రధాన భూమిక వహిస్తుంది.
- ఒక పాఠ్యాంశంలో వెనుకబడిన పిల్లలకు ప్రత్యామ్నాయ భోధనకు చేయడానికి సహకరిస్తుంది.
- మూల్యాంకన ఫలితాల ఆధారంగా ఉపాధ్యాయుడు తన భోధనా వ్యూహం మార్చుకోవడానికి వీలు కలిగిస్తుంది.
- పిల్లలు తమకు తామే మూల్యాంకనం చేసుకోవడానికి, అభ్యసన సామర్థ్యం పెంపొందించుకోవడం ఎలాగో అర్థంచేసుకోవడానికి ఉపకరిస్తుంది.
- విభిన్న రకాల అభ్యసన శైలులను పాటించడానికి వీలు కలిగిస్తుంది.
- జట్లలో పరిశీలించడానికి, సహకరించుకోవడానికి పనికి వస్తుంది.
- ఇది ఒక పరీక్ష రాస్తున్నామనే భావన లేకుండా సహజమైన వాతావరణంలో నిర్వహించడం జరుగుతుంది.
- విద్యార్థి అభ్యసన వేగాన్ని పెంచుతుంది.

విద్యావేత్తల అభిప్రాయంలో నిర్మాణాత్మక మూల్యాంకనం అభ్యసన ప్రక్రియను అనురీక్షణ ( ) చేయడానికి భోధనలో భాగంగా ఉపయోగపడుతుంది.

నిరంతర సమగ్ర మూల్యాంకనం ద్వారా పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు ఉపాధ్యాయుడు పరిశీలించి తరగతి గదిలో, బయట జరిగే భోధనాభ్యసన ప్రక్రియలన్నింటిని పరిగణనలోకి తీసుకొని పిల్లల ప్రగతిని మూల్యాంకనం చేయాలి. ఇందు కోసం ఉపాధ్యాయునికి, వివిధ రకాలైన మూల్యాంకన సాధనాలు అవసరమవుతాయి. నిర్మాణాత్మక మూల్యాంకనంలో ఉపాధ్యాయుడు చెక్‌లిస్టులు, పిల్లల నోట్ పుస్తకాలు, పిల్లల డైరీలు, రేటింగ్ స్కేలు, పోర్టు ఫోలియోలు, ఆనెక్డోట్‌లు, వ్యక్తిగత పరిశీలనలు, ఉపాధ్యాయుని డైరీ మొదలైనవి ఉపయోగపడతాయి.

**నిర్మాణాత్మక మూల్యాంకన విధానాలు:**

నిర్మాణాత్మక మూల్యాంకనంలో ప్రధానంగా 4 రకాలు సాధనాలుపయోగించాలి.

1. పిల్లల భాగస్వామ్యం – ప్రతిస్పందనలు ( 10 మార్కులు)
2. రాత అంశాలు ( 10 మార్కులు)
3. ప్రాజెక్టు పనులు ( 10 మార్కులు)
4. లఘు పరీక్షలు ( 20 మార్కులు)

మొత్తము 50 మార్కులు

**ఒక్కొక్క సాధనాన్ని గురించి చర్చిద్దాం:**

**1. పిల్లల భాగస్వామ్యం – ప్రతి స్పందనలు:**

పాఠశాలలో కల్పించే భోధనాభ్యసన సన్నివేశాలలో పిల్లలు పాల్గొనే విధానం, వారు నేర్చుకొనే క్రమాన్ని ప్రగతిని తెలియచేస్తుంది. ఉపాధ్యాయుడు పాఠం చెప్పేటప్పుడు జరిగే చర్యలలో విద్యార్థులు అడిగే ప్రశ్నలు, ప్రశ్నలకు జవాబులు ఇచ్చే తీరును గమనిస్తే వారి ప్రగతి ఉపాధ్యాయునికి అవగాహన అవుతుంది. దీనికి వేరుగా పరీక్ష అవసరం లేదు. అభ్యసన ప్రక్రియలో పిల్లల భాగస్వామ్యాన్ని, ప్రతిస్పందనను వివిధ అభ్యసన సన్నివేశాల ద్వారా పరిశీలించవచ్చు. అవి :

- పాఠ్యాంశం పై జరిగే చర్యలో
- కృత్యాలు, జట్టు పనులు చేస్తున్నప్పుడు
- ప్రాజెక్టు పనులలో పాల్గొన్నప్పుడు
- నమూనాలు, మాదిరులు, పటాలు, గ్రాఫ్‌లు రూపొందిస్తున్నప్పుడు
- సృజనాత్మక కృత్యాలలో పాల్గొంటున్నప్పుడు
- పాఠం మధ్యలోని, పాఠం చివర వున్న ప్రశ్నలకు సమాధానాల గూర్చి చర్చిస్తున్నప్పుడు

పాఠం లేదా యూనిట్ పూర్తయిన తరువాత పాఠం చివర వున్న ప్రశ్నలు, అభ్యాసాలను పూర్తి తరగతి గదిలో ఒక్కొక్క ప్రశ్న బోర్డు మీద రాసి మొత్తం తరగతి గదిలో చర్చించాలి. ఇలా చర్చించినప్పుడు పిల్లలు పాల్గొన్న తీరు, చెప్పే సమాధానాలపై అధారపడి పిల్లల ప్రగతిని అంచనా వెయ్యవచ్చు. తరగతి గది బయట పిల్లల క్రమశిక్షణ, ప్రవర్తన, వివిధ అంశాలకు ప్రతిస్పందన, చిత్రాలు గీయడం, పాటలు పాటడం, ఆటలు ఆడటం, ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిసరముల పరిశుభ్రత, విచక్షణా పరిజ్ఞానం మొదలైన విషయాలలో పిల్లలను పరిశీలించడం ద్వారా మదింపు చేయవచ్చు. వారికి సలహాలు ఇచ్చి ఇంకా మెరుగుపరుచుకొనేటట్లు, తప్పులు సరిదిద్దుకొనేటట్లు చేయవచ్చు. దీని కోసం తరగతి గదిలోపల తరగతి గది బయట ఎల్లప్పుడూ ఉపాధ్యాయుడు పరిశీలిస్తూ ఉండాలి. ఇంకా మౌఖిక పరీక్ష ఎ, మౌఖిక పరీక్ష బి, టీచర్ డైరీ వంటి సాధనాలను కూడా ఉపయోగించవచ్చు.

**ఎ) మౌఖిక పరీక్ష :–** తరగతి గదిలో పిల్లల అభ్యసన సన్నివేశాల ద్వారా నేర్చుకుంటున్న అంశాలను గురించి పరిశీలించడానికి మౌఖిక పరీక్షను ఉపాధ్యాయుడు సాధనంగా ఉపయోగించవచ్చు. ప్రతిరోజూ తరగతి గదిలో పాఠం చెబుతున్న సందర్భంలో విద్యార్థికి ఎంతవరకు అర్ధమయినదో తెలుసుకోవడానికి ఉపాధ్యాయుడు రకరకాల ప్రశ్నలు వేస్తూ ఉంటాడు. దీనిని మౌఖిక పరీక్షగా గ్రహించవచ్చు.

బి) టీచర్ – డైరీ– పాఠశాలలో కల్పించే అభ్యసన అనుభవాలలో పిల్లల ప్రగతిని , పాల్గొంటున్న విధానాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించినమోదు చేసుకోవడానికి టీచర్ డైరీ ఉపయోగపడుతుంది. భోధన జరుగుతున్నప్పుడు భోధనానంతరం, విద్యార్థుల ప్రతిస్పందనలను కొందరి విశేష ప్రతిభను లేదా అవగాహనా లోపాలను నమోదు చేయడానికి, ప్రత్యామ్నాయ మార్గాలను గుర్తించడానికి ఉపాధ్యాయుడికి ఉపయోగపడుతుంది. కనుక టీచర్ డైరీ పిల్లల సామర్థ్యాలను మదింపు చేసి నమోదు చేసుకోవడానికి ఉపాధ్యాయుడికి రోజువారీ ఉపయోగపడే సాధనంగా భావించాలి.

**2) రాత అంశాలు :** పిల్లలు తాము నేర్చుకున్న అంశాలపై తమ అభిప్రాయాలను జోడించి సొంతంగా రాస్తారు. ఇవి పిల్లలు సాధించిన సామర్థ్యాల గురించి అర్థం చేసుకోవడానికి సాధనాలుగా ఉపయోగపడతాయి. తరగతి గదిలోను, ఇంటి దగ్గర పిల్లలు అనేక అంశాలను రాస్తారు. వీటినన్నింటినీ నిర్మాణాత్మక మూల్యాంకనంలో పరిగణనలోనికి తీసుకోవాలి. నోటు పుస్తకాలలో ఇంటి పని పుస్తకాలలో పాఠ్యపుస్తకాలతో తరగతి గదిలో, ఇంటి వద్ద రాస్తూ అనేక విషయాలు రాస్తూ ఉంటారు. వీటినన్నింటినీ పరిశీలించినప్పుడు పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారు? ఎక్కడెక్కడ తప్పుడు చేస్తున్నారు? పరిశీలించి సొంతంగా రాయడానికి తగిన తహకారం అందించడానికి వీలు కలుగుతుంది.

**రాసిన అంశాలలో పరిగణించేవి :**

**అ) నోటు పుస్తకాలు :** పాఠ్య పుస్తకములో పాఠం చివర ఉన్న అభ్యసాలు మరియు ప్రశ్నలు, తరగతి గదిలో చర్చించిన తరువాత విద్యార్థులు తమ నోట్‌బుక్‌లో స్వంతంగా రాసుకోవాలి. గైడ్లు ఉపయోగించకూడదు. వీటిని చూసి పిల్లల అభ్యసన ప్రగతిపై ఉపాధ్యాయుడు ఒక అంచనాకు రావచ్చు. మార్కులు,గ్రేడ్లు ఇవ్వవచ్చు. అభ్యాసాలు, ప్రశ్నలు, జవాబులతో పాటు వివిధ అంశాలలో వారికి నచ్చిన అంశాలు, ప్రయోగ విధానములు, బొమ్మలు గీయడం, వివిధ సమస్యలు, ప్రాజెక్టు పనులు, పరికల్పనలు మొదలైన అంశములు రాయడానికి ప్రోత్సహించాలి. ఈ నోట్ పుస్తకాలను ఎప్పటికప్పుడు దిద్ధి సూచనలు నోట్‌బుక్‌లో రాయాలి..

**ఆ) సంఘటన రచన ( అనెక్డోటల్ రికార్డు) :–**

తనకెదురైన ఒక సంఘటనను లేదా సన్నివేశాన్ని గురించి రాయడానకి ఉద్దేశించిన రికార్డును సంఘటన రచన లేదా అనెక్డోట్ రికార్డు అంటారు. కొన్ని సందర్భాలలో పిల్లలు పెద్దవారిని ఆశ్చర్యపరిచే తీరులో ప్రవర్తిస్తారు. ఒక అంశం పట్ల పిల్లలు ధనాత్మకంగా లేదా ఋణాత్మకంగా ప్రతిస్పందించే తీరును పరిశీలించడానికి ఇది ఉ పయోగపడుతుంది.

**ఇ) పోర్ట్‌ఫోలియో :**

విద్యార్థులు చేసిన కృత్యాలను, సేకరించిన వాటిని ప్రదర్శలను పనితీరు వివరాలను సంకలనం చేసి భద్రపరచడమే పోర్ట్‌ఫోలియో. వివిధ స్థాయిలలో వారు రాసిన వాటిని ప్రదర్శించవచ్చు. వాటిని వ్యక్తిగత ఫోర్ట్ ఫోలియో అని అంటారు.

– ప్రత్యేక సంఘటనలు, విశేష ప్రతిభ కనబరిచినప్పుడు ఆ ఆధార పత్రాలను భద్రపరచవచ్చు.

– పిల్లలు రాసిన గేయాలు, కథలు, పాడిన గేయాలు, గీసిన చిత్రాలు, ఉత్తరాలు మొదలైనవి తీసుకొని ఒక ఫైల్‌లో ఉంచితే దానిని పోర్ట్‌ఫోలియో అని అంటారు.

**ఈ) పాఠ్యపుస్తకములోని ప్రశ్నలు, అభ్యాసాలు :**

నిర్మాణాత్మక అభ్యసన సన్నివేశాలలో పాల్గొంటూ సామర్థ్యాలను సాధించడానికి అనుకూలంగా పాఠ్యపుస్తకాలు రూపొందుతాయి. కాబట్టి పిల్లలు పాఠ్యపుస్తకాలలో కూడా చాలా అంశాలను చర్చించడం మరియు రాయవలసియుంటుంది. పాఠం మధ్యలో పాఠం చివర వుండే ప్రశ్నలకు సమాధానాలు రాయడం, కృత్యాలలోని పట్టికలు నింపడం, సమాచారా సేకరణ పట్టికలు నింపడం, అవసరమైన నివేదిక రాయడం మొదలైనవి పాఠ్యపుస్తకాలలో రాయవలసియుంటుంది. ఈ అంశాలను పరిగణనలోనికి తీసుకొని ప్రగతిని అంచనా వేయాలి.

**ఈ) పిల్లల డైరీ :**

పిల్లల దినచర్య, వారి స్పందనలు, చూసిన, విన్న ఘటనల పట్లవారి అనుభూతలు, అనుభవాలు మొదలైన వాటిని రాసిన పుస్తకమే పిల్లల డైరీ. పిల్లల డైరీ ద్వారా భాషా సామర్థ్యాలు వారి నిజాయితీ, అభిరుచులు, ఆసక్తులు, భాషను ఉపయోగించు తీరు తెలుసుకోవచ్చు.

**3) ప్రాజెక్టు పనులు:** తరగతి గదిలో కేవలం వినడం ద్వారా లేదా చదవడం ద్వారా నేర్చుకోవడం అవి కాకుండా చేయడం ద్వారా, అనుభవం ద్వారా నేర్చుకోడానికి అవకాశం కల్పించే కార్యక్రమాలే ప్రాజెక్టు పనులు. ప్రాజెక్టు నిర్వహణా ద్వారా పిల్లల్లో పరిశీలన, ప్రయోగ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. ఉత్సాహంగా భోధనాభ్యసన కృత్యాలలో పాల్గొనగలుగుతారు. పిల్లలు ప్రాజెక్టులో పాల్గొన్న విధానాన్ని రూపొందించిన నివేదికలను అధారంగా చేసుకొని మూల్యాంకనం చేయాలి.

ప్రాజెక్టులు వ్యక్తిగతంగా, జట్టుగా కూడా ఇవ్వవచ్చు. ఈ విధానం వలన విద్యార్థిలో స్వయం అభ్యసనము, తాను తెలుసుకున్న అంశాలమీద నిజ నిర్ధారణ, కొత్త విషయాలను సేకరించడం, నమూనాలు తయారుచేయడం, సమస్యను విశ్లేషించడం, ఇతరులతో మాట్లాడడం మొదలైన గుణాలు అలవడతాయి.

ప్రాజెక్టును పూర్తి చేయడంలో సేకరించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని నివేదికను తయారుచేస్తారు. పిల్లలు నిర్వహించే కార్యక్రమాలను క్రమ పద్ధతిలో రాసి ఇవ్వగలిగితే అది నివేదిక అవుతుంది.

**4) లఘు పరీక్ష :**

నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లల సామర్థ్యాల సాధనను ఒక చిన్న పరీక్ష రూపంలో పత్రం తయారుచేయడం; టైం టేబుల్ ఉండదు. ఇది ఉపాధ్యాయుడు తాను చెప్పిన పాఠంలో లేదా పాఠ్యాంశాలలో ఎంపిక చేసుకున్న విద్యాప్రమాణాలను పరిశీలించడానికి అప్పటికప్పుడే నిర్వహించే ఒక రాత పరీక్ష. దీని ద్వారా పిల్లల సామర్థ్యాన్ని

తక్షణ సాధనను నిర్ధారించడానికి వీలుఅవుతుంది. ఈ టెస్టు గురించి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వవలసిన అవసరం లేదు.

ప్రశ్నలను నల్లబల్లపై గాని, చార్టుపై గాని రాయవచ్చు. పుస్తకములో ఉన్న ప్రశ్నలను, అభ్యాసాలను అలాగే ఇవ్వాల్సిన అవసరం లేదు. పిల్లలు ఆలోచించి స్వంతంగా సమాధానాలు రాసేందుకు వీలుగా ప్రశ్నలు ఇవ్వాలి. పిల్లలు లఘు పరీక్ష సమాధానాలు రాయడానికి ఒక నోట్‌బుక్ పెట్టుకోవాలి. దానిలోనే నాలుగు లఘు పరీక్షలు నిర్వహించబడతాయి.

**సంగ్రహణాత్మక మూల్యాంకనం :-**

విద్యార్థి భోధనాభ్యసన ప్రక్రియల ద్వారా నేర్చుకున్న అంశాలను మొత్తంగా మూల్యాంకనం చేయడాన్ని సంగ్రహణాత్మక మూల్యాంకనం అంటారు. ఇవి కోర్సు మొత్తము పూర్తయిన తరువాత లేదా నిర్ధారిత పాఠ్య ప్రణాళిక పూర్తయిన తరువాత పిల్లల సాధనను పరీక్షించే పద్ధతి. ఈ పద్ధతిలో విద్యార్థి తాను చదివిన కోర్సు ద్వారా ఏమి నేర్చుకున్నాడు? ఎంత నేర్చుకున్నాడు అనే అంశాలను పరిశీలించడం జరుగుతుంది. సాధారణంగా రాత పరీక్షల రూపంలో (పేపరు–పెన్సిల్) పరీక్షల రూపంలో మాత్రమే నిర్వహించే సంగ్రహణాత్మక మూల్యాంకనంలో పాఠ్య విషయాలు మాత్రమే పరీక్షించడం జరుగుతుంది. టెర్మినల్ వార్షిక పరీక్షల పేరిట నిర్వహించే సంగ్రహణాత్మక మూల్యాంకనం విద్యార్థులకు వారి సాధనను మార్కులు, ర్యాంకుల రూపంలో అందచేస్తుంది. ఉత్తీర్ణత సాధించాలో లేదో మాత్రమే తెలియజేస్తుంది. విద్యార్థులు చదివిన అంశాలన్నీ అవగాహన చేసుకొని స్వంతంగా పరీక్షలలో రాయవలసి రాయడం వల్ల పిల్లల్లో పరీక్షల పట్ల భయం, వ్యాకులత ఉండదు. విద్యా ప్రమాణాల ఆధారంగా పిల్లల ప్రగతిని ఉపాధ్యాయుడు స్వయంగా తయారుచేసిన పరీక్షా పేపరుతో పరిశీలించే పరీక్ష పద్ధతి. సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రధానంగా రాత పరీక్ష ద్వారానే జరిపిన ప్రాథమిక స్థాయిలో అందును. 1, 2 తరగతుల విద్యార్థుల మూల్యాంకనంలో మౌఖిక పరీక్షను కూడా ఉపయోగించవచ్చును.

**రాత పరీక్ష నిర్వహించడంలో ఉద్దేశించిన ప్రయోజనాలు :**

- విద్యార్థుల రచనా కౌశలాన్ని తెలుసుకొనుట
- విద్యార్థుల ఆలోచనలు, భావాలను ఏ మేరకు వ్యక్తం చేయగలడో తెలుసుకొనుట
- విద్యార్థి ఆలోచనలను ఎలా వ్యక్తం చేయగలడో తెలుసుకొనుట
- విద్యార్థి ఆలోచన క్రమంలో అమర్చుకునే విధానం తెలుసుకొనుట
- విద్యార్థుల చేతిరాత నైపుణ్యం, రాతలో మెళుకువల పాటింపు, పదజాలం వాడకంలో సామర్థ్యం తెలుసుకొనుట

**నిరంతర సమగ్ర మూల్యాంకనము నిర్వహణ వివరాలు:-**

| | | | | |
|---|---|---|---|---|
| 1. | నిర్మాణాత్మక మూల్యాంకనం | – | 1 | జులై |
| 2. | నిర్మాణాత్మక మూల్యాంకనం | – | 2 | ఆగస్టు |
| 3. | సంగ్రహణాత్మక మూల్యాంకనం | – | 1 | సెప్టెంబరు |
| 4. | నిర్మాణాత్మక మూల్యాంకనం | – | 3 | నవంబర్ |

| | | | | |
|---|---|---|---|---|
| 5. | సంగ్రహణాత్మక మూల్యాంకనం | – | 2 | డిసెంబరు/ జనవరి |
| 6. | నిర్మాణాత్మక మూల్యాంకనం | – | 4 | ఫిబ్రవరీ |
| 7. | సంగ్రణాత్మక మూల్యాంకనం | – | 3 | మార్చి / ఏప్రిల్ |

ఆధారము సిసిఇ మాడ్యుల్

**గ్రేడింగ్ విధానము :–** పిల్లల్లో మార్కులు, ర్యాంకులు కోసం జరిగే అనారోగ్యకర పోటీని నిరోధించడానికి ప్రభుత్వం నిరంతం సమగ్ర మూల్యాంకనంలో భాగంగా గ్రేడింగ్ పద్ధతిని అమలు చేస్తుంది. నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనంలో పిల్లలు సాధించిన మార్కుల అధారంగా వారి ప్రగతిని 5 పాయింట్లు స్కేలులో మాపనరీ చేస్తాయి. ఎ+, ఎ, బి+, బి,సి గ్రేడులుగా పిల్లల ప్రగతిని నిర్ధారిస్తారు. పిల్లల ప్రగతిని సామర్థ్యాల వారిగా పరిశీలించడం, నమోదు చేయడం, పిల్లల అభ్యసనాన్ని మెరుగు పరుచుకునేందుకు ఎంతగానో దోహదపడుతుంది.

**మార్కులు – గ్రేడులు :**

నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలు రెండింటిలోను పిల్లలు సాధించిన మార్కుల శాతం అధారంగా క్రింది పట్టికలో తెలిపిన ప్రకారం గ్రేడులు ఇవ్వాలి.

| క్రమసంఖ్య | మార్కులు శాతం | గ్రేడులు |
|---|---|---|
| 1 | 91 – 100 | ఎ+ |
| 2. | 71 – 90 | ఎ |
| 3. | 51 – 70 | బి+ |
| 4 | 41 – 50 | బి |
| 5 | 0 – 40 | సి |

**టేబుల్ – 2**

**నిర్మాణాత్మక మూల్యాంకనములో వివిధ అంశాలకు మార్కులు కేటాయింపు**

| అంశం | ఫార్మేటివ్ | | | | మొత్తం |
|---|---|---|---|---|---|
| | పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందనలు | రాత అంశాలు | ప్రాజెక్టు పనులు | లఘు పరీక్ష | |
| భారత్వం | 20% | 20% | 20% | 40% | 100% |
| మార్కులు | 10 | 10 | 10 | 20 | 50 |

**రాజుకు వచ్చిన మార్కులు – గ్రేడ్**

| విషయము | నిర్మాణాత్మక మూల్యాంకనం | | | | పొందిన మార్కులు |
|---|---|---|---|---|---|
| | పిల్లల భాగస్వామ్యం ప్రతిస్పందనలు | రాత అంశాలు | ప్రాజెక్టు పనులు | లఘు పరీక్ష | |
| సాంఘిక శాస్త్రం | 8 | 7 | 9 | 16 | 40 |
| | A | B+ | A | A | A |

రాజు పొందిన మార్కులకు అంశము వారీగా గ్రేడ్లు, మొత్తము గ్రేడు ఇచ్చే విధానం చూపించడం జరిగింది.సంగ్రహణాత్మక మూల్యాంకనం – విద్యా ప్రమాణాల వారీ మార్కులు కేటాయింపు**<u>సంగ్రహణాత్మక మూల్యాంకనం – విద్యా ప్రమాణాల వారీ మార్కులు కేటాయింపు</u>**

**టేబుల్ – 4**

| వివరాలు | విద్యా ప్రమాణాలు | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| సామర్థ్యాలు | విషయవగాహన | చదివి వ్యాఖ్యానించడం | సమాచార నైపుణ్యాలు | సమకాలిన అంశాలపై ప్రతిస్పందన | పట నైపుణ్యాలు | ప్రశంస | మొత్తం |
| భారత్వం | 40% | 10% | 15% | 10% | 15% | 10% | 100% |
| మార్కులు | 40 | 10 | 15 | 10 | 15 | 10 | 100m |

**టేబుల్ – 5**

| వివరాలు | విద్యా ప్రమాణాలు | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| సామర్థ్యాలు | విషయవగాహన | చదివి వ్యాఖ్యానించడం | సమాచార నైపుణ్యాలు | సమకాలిన అంశాలపై | పట నైపుణ్యాలు | ప్రశంస | మార్కులు | గ్రేడు |
| మార్కులు | 20 | 8 | 10 | 8 | 12 | 7 | 65 | |
| గ్రేడు | B | A | B+ | A | A | B+ | | B+ |

పైన తెలిపిన విధంగా గ్రేడులు నిర్ణయించాలి. నిర్మాణాత్మక, సమగ్ర మూల్యాంకనంలో ప్రతి విద్యార్థి సాధించిన మార్కులను గ్రేడులను రిజిస్టరులో జాబితాగా రాయాలి.

## నిరంతర సమగ్ర మూల్యాంకనం – ప్రగతి నమోదు

**పిల్లలు ప్రగతి నమోదు రిజిస్టరు :**

– ఫార్మాటివ్, సమ్మేటివ్ మూల్యాంకాన్ని పిల్లలు సాధించిన గ్రేడ్‌లను ఈ రిజిస్టరు లో నమోదు చేయాలి.

– రిజిస్టరులో తరగతి వారీగా, సబ్జెక్టువారీగా పేజీలు కేటాయించాలి.

– నిర్మాణాత్మక మూల్యాంకనములో 4 అంశాల క్రింద మార్కులు గ్రేడ్‌లు రాయాలి.

– సమగ్ర మూల్యాంకనంలో విద్యా ప్రమాణాలు వారీగా విద్యార్థి పొందిన మార్కులను గ్రేడ్‌లను నమోదు చేయాలి.

– పాఠశాల సందర్శన సమయములో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు యమ్.ఇ.ఒ.కి, ఉన్నత పాఠశాలలు ఉపవిద్యాశాఖాధికారికి చూపించి ధృవీకరింపచేసుకోవాలి. నమూనా తరువాత పేజిలో ఇవ్వబడినది.

– నిరంతర సమగ్ర మూల్యాంకనం – పిల్లల ప్రగతి నమోదు రిజిస్టరు నమూనా 2.8 లో ఇవ్వబడినది.

నిర్మాణాత్మక, సంగ్రహణ్మాతక మూల్యాంకాలను నిర్వహించిన తరువాత సమాధాన పత్రాలను దిద్దడం, గ్రేడులను లెక్కించడం ఎంత ప్రధానమో వాటి వివరాలను నమోదు చేసే రికార్డులు, రిజిస్టర్లు నిర్వహించకుండానేఅంతే ప్రధానమైన అంశం పిల్లల ప్రగతిని సిసిఇ రిజిస్టరు లో నమోదు చేయాలి.

**మదింపు పద్ధతులు:–**

ప్రస్తుతము పాఠశాలల్లో నిరంతం సమగ్ర మూల్యాంకనం క్రింది 1–8 తరగతుల వరకు రెండు పద్ధతులలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని మదింపు చేస్తున్నారు. అవి 1. నిర్మాణాత్మక మూల్యాంకనం 2. సంగ్రహణాత్మక మూల్యాంకనం

**సి.సి.ఇ విధానములో మదింపు సాధనాలు**

సిసిఇ విధానంలో నిరంతరంగా సమగ్రంగా మదింపు జరగవలసియుంటుంది. అందుకని ఇది రెండు విధాలుగా జరుగుతుంది. 1. నిర్మాణాత్మక మూల్యాంకనం మరియు 2. సమగ్ర మూల్యాంకనం

**1. నిర్మాణాత్మక మూల్యాంకనం 4 విధాలుగా వుంటుంది.**

1. పిల్లల భాగస్వామ్యం – ప్రతిస్పందనలు
2. రాత పనులు
3. ప్రాజెక్టు పనులు
4. స్లిఫ్ టెస్ట్

సంవత్సరములో 4 సార్లు జరుగుతుంది.

2) సమగ్ర మూల్యాంకనం సంవత్సరములో నిర్జిణ కాలవ్యవధులో 3 సార్లు జరుగుతుంది.

కేవలం రాత పరీక్ష ద్వారానే జరుగుతుంది. 6 విద్యా ప్రమాణాలు ఆధారంగా నిర్జిత నిష్పత్తిలో మార్కులుంటాయి. వాటికి అనుగుణంగా ప్రశ్నలు అన్ని రకాలవి ఇవ్వడం జరుగుతుంది. మొత్తము మూల్యాంకనం లోని అంశాలన్ని ఇదే అధ్యాయంలో 5.2 లో ఇవ్వడం జరిగింది.

**మరికొన్ని మదింపు పద్ధతులు:–**

నిర్మాణాత్మక మూల్యాంకన విధానంలో తరగతి గదులలో జ్ఞాన నిర్మాణము చేసుకొనే అనేక సందర్భములను వివిధ రకాల మదింపు సాధనాలు, పద్ధతులు ఉపయోగించి ఉపాధ్యాయడు పరిశీలించడానికి వీలు కలుగుతుంది. పైన పేర్కొన్న వాటితో పాటు ఈ క్రింది రకాలైన మదింపు విధానాలను ఉపాధ్యాయుడు అర్థం చేసుకోవడం అవసరం.

1. జట్టు మదింపు
2. తోటి పిల్లలతో మదింపు
3. స్వీయ మదింపు

పైన పేర్కొన్న మూడు విధానాల గురించి తెలుసుకుందాం.

**జట్టు మదింపు :–** పిల్లలు ఒకరితో ఒకరు కలిసి చర్చిస్తూ నేర్చుకోవడానికి కృత్యాలు ఎంతగానో ఉపయోగపడతాయని మనకు తెలుసు. జట్టు మదింపు చేయాలంటే జట్టు కృత్యంలో పిల్లలు ఎలా భాగస్వాములౌతున్నారో విశ్లేషించడం అవసరం. అందులోని సోపానాల క్రమాన్ని గమనించండి.

- జట్టు కృత్యాన్ని నిర్వహించడానికి ఉపాధ్యాయుడు సూచనలు ఇస్తాడు.
- పిల్లలు తమ తమ వ్యక్తిగత/జట్టు రూపకల్పనలతో గ్రూపులో కూర్చొంటారు.
- పిల్లలు తాము రూపొందించిన అంశాల గ్రూపులో కూర్చొంటారు.
- ఇతర గ్రూపు పిల్లలు దీనిపై అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు.
- పై సూచనల అధారంగా తిరిగి కొత్త అంశాలను రూపొందిస్తారు.
- మరల ప్రతి గ్రూపు తమ అంశాలు ప్రదర్శిస్తారు.
- ఇతర గ్రూపులు దానిపై మనలా తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు.
- ఉపాధ్యాయుడు తన అభిప్రాయాలను జోడిస్తారు.

గ్రూపు కృత్యంలో పిల్లలు నాణ్యమైన గ్రూపు నివేదికను ఇవ్వడానికి ప్రయత్నిస్తారు. ఒక గ్రూపు వారు తమ అభిప్రాయాలను వివరిస్తున్నప్పుడు మిగితాగ్రూపులో అదే సమాచారం ఉన్నట్లయితే దానిని వదిలేసి మిగిలిన అంశాలతో కొత్త కోణంలో ప్రదర్శిస్తారు.ఇతరులు చెప్పేది వినడం, తమ అంశాలలో మార్పులు చేసుకోవడం వల్ల విషయాన్ని పూర్తిగా అవగతం చేసుకొనగలుగుతారు. ఇతర గ్రూపుల వారు చెప్పిన విలువైన సమాచారాన్ని కూడా గ్రహిస్తారు. అందువల్ల తరువాత మరింత సమర్ధవంతంగా గ్రూపు నివేదిక ఇవ్వగలుగుతారు. మొత్తం తరగతి లేదా గ్రూపు పని ద్వారా ప్రదర్శన ద్వారా, జ్ఞానాన్ని పంచుకోవడం, ఒకరి ద్వారా ఇతరులు నేర్చుకోవడం జరుగుతుంది.

**2. తోటి పిల్లలతో మదింపు :**

విద్యార్థులు చేసిన పనిని ఒకరి పని ఇంకొకరికి ఇప్పించి మదింపు చేయించాలి. దీనికి ఉపాధ్యాయుడు పిల్లలకు సూచనలివ్వాలి. అభ్యసనాన్ని సమర్ధవంతంగా పిల్లలు అర్థం చేసుకోవడానికి తోటి పిల్లలతో మదింపు చేయడం చక్కగా ఉపయోగపడుతుంది. అయితే తరగతి గదిలో పరస్పరం సహకరించుకుంటూ నేర్చుకోవడానికి తగిన వాతావరణం ఉండడంతో పాటు పిల్లలకు ఒకరిపై ఒకరికి నమ్మకం ఉండడం కూడా అవసరం. ఈ విధమైన మదింపులో మొత్తం అభ్యసనంలో అభ్యాసకునికే ప్రధానపాత్ర వుంటుంది. అందువల్ల పిల్లలకు అభ్యసన లక్ష్యాల పట్ల, అభ్యసన అవకాశాల పట్ల, మదింపు పట్ల స్పష్టత కలిగించాలి. తోటి పిల్లల మదింపు వలన నాణ్యమైన అభ్యసనం అంటే ఏమిటో మరియు స్పష్టంగా తెలుసుకోగలుగుతారు. వారు నిర్వహించిన పనిని కూడా పునరాలోచించుకొని మార్చుకోగలుగుతారు.

నిర్మాణాత్మక మూల్యాంకనములో నిర్వహించే లఘు పరీక్ష సమాధాన పత్రాలను తోటి పిల్లలతో మదింపు చేయించాలి. ఉపాధ్యాయుడు ఒక విద్యార్థి సమాధాన పత్రంలో రాసిన సమాధానాన్ని బోర్డు మీద రాసి విశ్లేషించాలి. తరువాత సమాధాన పత్రాలను తోటి పిల్లలతో మదింపు చేయించాలి.

**3. స్వీయ మదింపు :**

విద్యార్థి తాను చేసిన పనిని లేదా పరీక్ష పేపరును ఉపాధ్యాయుడు ఇచ్చిన సూచనల అధారంగా తనకై తానే మదింపు చేసుకోవాలి. పిల్లలు అభ్యసన సన్నివేశాలలో పూర్తిగా నిమగ్నమైనప్పుడు వారు స్వంతంగా నేర్చుకొనగలుగుతారు. అభ్యాసకుని యొక్క బలాలు బలహీనలపై ఆధారపడి అభ్యసన సన్నివేశాలను రూపొందించినప్పుడు సమర్ధవంతంగా నేర్చుకోవడానికి వీలు కలుగుతుంది. స్వయంగా ఆలోచించడం, తనను తాను మదింపు చేసుకోవడం అభ్యసన ప్రక్రియలో శక్తివంతమైన మా పనిగా ఉపయోగపడుతుంది. స్వీయ మదింపు ద్వారా తన అభ్యసన లోపాలను తానే గుర్తించి అర్థం చేసుకోవడం వలన లోపాలను సవరించుకోవడానికి వ్యక్తిగతంగా కృషి చేస్తాడు. అభ్యాసకులు స్వీయ మదింపు ద్వారా తనను తాను పరిశీలించుకోవడం ఉపాధ్యాయునికి ఒక భోధనా వ్యూహంగా కూడా ఉపయోగపడుతుంది. అభ్యసనా లక్ష్యాలు, వాటిని ఎలా చేరుకోవాలో తెలిపే విధానాల పట్ల సరైన అవగాహన లేకపోతే పిల్లలు నేర్చుకోవడం ఎంతో కష్టతరంగా మారుతుంది. స్వీయ మదింపు ఈ సమస్యకు చక్కని పరిష్కారంగా ఉపయోగపడడమే గాన పిల్లల్లో ఆత్మవిశ్వాశాన్ని నింపుతుంది. చెక్‌లిస్టులు స్వీయ మదింపు సాధనాలుగా ఉపయోగపడతాయి.

**వివిధ రకాల మదింపు పద్ధతులు ఉపయోగం – ఉపాధ్యాయుడు పాటించవలసిన మెలకువలు:**

- నిర్మాణాత్మక మూల్యాంకనంలో మూల్యాంకనా విధానాలన్నీ వాడాలి. మదింపు సాధనాలన్నింటీ ద్వారా మూల్యాంకనం చేయాలి.
- మూల్యాంకనం విధానాలకు కేటాయించిన మార్కుల నిష్పత్తి పాటించాలి.
- సంగ్రహణాత్మక మూల్యాంకనంలో పరీక్ష నిర్వహణ కోసం ఉపాధ్యాయులు సబ్జెక్టువారీగా నిర్ధారించిన విద్యా ప్రమాణాల ఆధారంగా ప్రశ్న పత్రం రూపొందించుకోవాలి.
- మౌఖిక పరీక్షను ప్రత్యేకంగా నిర్వహించాల్సిన అవసరంలేదు. మౌఖిక పరీక్షకు సంబంధించిన విద్యా ప్రమాణాలకు కేటాయించిన మార్కులను ఉపాధ్యాయుడు తమ పరిశీలనల అధారంగా లేదా అంతకుముందు నమోదు చేసిన ఫార్మేటివ్ మూల్యాంకనం ఆధారంగా కేటాయించిన పిల్లల ప్రగతిని నమోదు చేయాలి.
- సమ్మేటివ్ మూల్యాంకనం ప్రశ్నాపత్రం రూపొందిచబడినపుడు అన్ని రకాల ప్రశ్నలకు ప్రాధాన్యమివ్వాలి.

- ఒక సామర్థ్యానికి చెందిన ప్రశ్నలన్నీ ప్రశ్నాపత్రములో ఒకే విభాగంగా ఇవ్వాలి. ప్రాజెక్టు పనులను ప్రశ్నపత్రంలో ఇవ్వరాదు.

- ప్రశ్నలు పిల్లలు నేర్చుకున్న భావనల అధారంగా విశ్లేషించడానికి, తార్కికంగా ఆలోచించడానికి, సృజనాత్మకంగా వ్యక్తీకరించడానికి తన సొంత అభిప్రాయాలను జోడించి రాయడానికి అనుకూలంగా వుండాలి.

- నిర్ధారిత సిలబస్ ఆధారంగా ఉపాధ్యాయుడు స్వయంగా ప్రశ్నాపత్రం రూపొందించుకొని మూల్యాంకనం చేయాలి.

- ఇతర సంస్థలు, వ్యక్తులు రూపొందించిన ప్రశ్నాపత్రాలు ఉపయోగించకూడదు. ఐతే ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రం రూపకల్పన గురించి పాఠశాల సముదాయం సమావేశంలో చర్చించి నమూనా ప్రశ్నాపత్రం రూపొందించుకొని, దాని ఆధారంగా స్వయంగా ప్రశ్నాపత్రం తయారుచేయాలి.

- ఉపాధ్యాయుడు ప్రశ్నాపత్రం ఆధారంగా ప్రాథమిక కీ తయారు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పిల్లలందరూ ఓకే సమాధానము రాయాల్సిన విధంగా కాక స్వంతంగా సమాధానాలు రాసే విధంగా ఉంటాయి.

- సాధారణంగా ఉపాధ్యాయులు ఇంతకుముందు సమాధాన పత్రాలు దిద్దినట్లే ప్రస్తుతము కూడా సమాన పత్రాలు దిద్ధి మార్కులు వేయవచ్చు. ఐతే సమాధానాలు విద్యార్ధికి విద్యార్ధికి మారుతూ ఉంటాయి.

- సమాధానపత్రాలు దిద్దిన తరువాత విద్యార్ధి సాధించిన మార్కులు గ్రేడులను నిర్ణయించిన విధంగా పట్టికలో వేయాలి.

## 5.8 మూల్యాంకన ప్రణాళిక తయారి– విద్యా ప్రమాణాల భారత్వ పట్టికలు , బ్లూ ప్రింట్ మాదిరి ప్రశ్నలు – మాదిరి ప్రశ్నాపత్రం, జవాబు పత్రం / మూల్యాంకనం కొరకు సూచికలు / రికార్డుల నిర్వహణ.

**మూల్యాంకన ప్రణాళిక తయారీ :**

నిరంతర సమగ్ర మూల్యాంకనంలో మూల్యాంకనం నిరంతరం జరగవలసి వుంది. దీనికి చక్కని ప్రణాళిక అవసరం. మూల్యాంకనం భోధనలో అంతర్భాగం. భోధనతో పాటే మూల్యాంకనం జరుగుతూ ఉండాలి.

భోధనాభ్యసన ప్రకియల సాఫల్యతను, తదునుగుణంగా భోధనను మెరుగుపరచడానికి ఉపయోగపడే కార్యక్రమమే మూల్యాంకనం.

నూతన పాఠ్య పుస్తకాలలో మూల్యాంకనాన్ని భోధనాభ్యసనాన్ని ప్రక్రియలో భాగంగా చేర్చి మరింత శాస్త్రీయంగా రూపొందించారు. పాఠం మధ్యలో ఉన్న ప్రశ్నలు ఆలోచింపచేసే ప్రశ్నలు, జట్టు కృత్యాలు, పరిశీలనలు, ప్రయోగాలు, ప్రాజెక్టులు, పిల్లల స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేసి మెరుగుపర్చేందుకు దోహదం చేస్తాయి.

నిరంతర సమగ్ర మూల్యాంకన, ప్రకారం పిల్లల ప్రగతిని ప్రతి పిరియడ్‌లోనూ, ప్రతిరోజూ పరిశీ పరిశీలించవలసియుంటుంది. పాఠ్యభోధనకు ముందు , భోధనాభ్యసన ప్రక్రియలు జరుగుతున్నప్పుడు తర్వాత తరగతి గదిలో, ప్రయోగశాలలో, గ్రంధాలయములో, క్షేత్ర పరిశీలనల్లో, ప్రాజెక్టు పనుల నిర్వహణలో, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో పిల్లల శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలను పరిశీలించి నమోదు చేయవలసి ఉంటుంది.

సాంఘిక శాస్త్రంలో పిల్లల ప్రగతిని తెలుకునేందుకై 4 ఫార్మేటివ్స్, 3 సమ్మేటివ్ మూల్యాంకనాలను నిర్వహించవలసి ఉంటుంది. వీటన్నిటీ కంటే ముందు విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రారంభ పరీక్ష నిర్వహించి విద్యా సంవత్సరము ప్రారంభములోనే ఆ తరగతి చదవడానికి ఉండవలసిన సామర్థ్యాలు పిల్లల్లో ఎంత మేరకు ఉన్నాయో గుర్తించడం కోసం ప్రారంభ పరీక్ష నిర్వహించాలి. బేస్‌లైన్ ఆసెస్‌మెంట్ టెస్ట్ పేరుతో జరిపే ప్రారంభ పరీక్ష వల్ల విద్యార్థుల స్థాయి నిర్ధారణకు వీలు కలుగుతుంది. దీని ఫలితాలను ఆధారం చేసుకొని ఏఏ విద్యార్థులకు ఆ తరగతి చదవడానికి కావలసిన కనీస సామర్థ్యాలు కల్పించడం అవసరమో గుర్తించి భోధనాభ్యసన కార్యక్రమాలు రూపొందించి విద్యా సంవత్సరము ఆరంభంలోనే నిర్వహించి కనీస అభ్యసన స్థాయిలు చేకూరిన తరువాతనే సరిపడు సామర్థ్యాలు లేనప్పుడు ఆ తరగతికి సంబంధించిన సిలబస్ భోధించడం వృధా ప్రయాస అవుతుంది. ఈ పరీక్ష దిగువ తరగతుల సిలబస్‌పై నిర్వహించాలి. అన్ని విద్యా ప్రమాణాలలో నిర్వహించాల్సిన అవసరం లేదు. ప్రారంభ పరీక్ష ఫలితాన్ని క్యుములేటివ్ రికార్డులో నమోదు చేయవలసిన అవసరం లేదు. కాని సిసిఇ రిజిస్టరులో నమోదు చేయాలి.

**మూల్యాంకన ప్రణాళిక నిర్వహించే వివిధ పరీక్షలు ఈ క్రింది విధంగా సంవత్సర కాలంలో నిర్వహించాలి.**

| క్రమసంఖ్య | మూల్యాంకనం | నిర్వహించవలసిన నెల |
|---|---|---|
| 1. | ప్రారంభ పరీక్ష | జూన్ |
| 2. | నిర్మాణాత్మక మూల్యాంకనం – 1 | జులై |
| 3. | నిర్మాణాత్మక మూల్యాంకనం – 2 | ఆగస్టు |
| 4. | సంగ్రహణాత్మక మూల్యాంకనం – 1 | సెప్టెంబరు |
| 5. | నిర్మాణాత్మక మూల్యాంకనం – 3 | నవంబరు |
| 6. | సంగ్రహణాత్మక మూల్యాంకనం – 2 | డిసెంబర్/జనవరి |
| 7. | నిర్మాణాత్మక మూల్యాంకనం – 4 | ఫిబ్రవరి |
| 8. | సంగ్రహణాత్మక మూల్యాంకనం – 3 | మార్చి/ఏప్రిల్ |
| | మూలం : సి.సి.ఇ. మాడ్యులు | |

నిరంతర సమగ్ర మూల్యాంకనం రెండు విధాలుగా జరుగుతుందని ఇదే అధ్యాయంలో పేర్కొనడం జరిగింది. అవి 1) నిర్మాణాత్మక మూల్యాంకనం 2) సంగ్రహణాత్మక మూల్యాంకనం.

## 1) నిర్మాణాత్మక మూల్యాంకనం :

నిరంతర సమగ్ర మూల్యాంకనంలో నిర్మాణాత్మక మూల్యాంకనం అత్యంత కీలకమైనది. నిర్మాణాత్మక మూల్యాంకనం సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించే పరీక్ష కాదు. ఇది పిల్లలకు తెలియకుండానే భోధనాభ్యసన కార్యక్రమాలు నిర్వహించే క్రమంలోనే పిల్లల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలించే పద్ధతి. అభ్యసనం జరిగేటప్పుడు విద్యార్ధి ఎలా నేర్చుకుంటున్నాడు? ఎక్కడెక్కడ తప్పులు చేస్తున్నాడు ? తెలుసుకొని తన భోధనను మార్చుకొని విద్యార్ధికి తగిన విధంగా సహాయ సహకారాలు అంధించి మెరుగపర్చాలి. పరిశీలించిన ప్రగతిని గ్రేడు రూపంలో నమోదు చేసి విద్యార్ధి సామర్ధ్యాలను అభివృద్ధిపరచుటకు ఉపయోగపడుతుంది.

నిర్మాణాత్మక మూల్యాంకనంలో నాలుగు రంగాలు ఉంటాయి. వాటికి కేటాయించిన మార్కులను భారత్వ పట్టిన రూపంలో వాటిలోని వివిధ సాధనాలు వాటి వివరణ ఇదే అధ్యాయంలోని 5.2 లో వివరించండ జరిగినది.

## 2) సంగ్రహణాత్మక మూల్యాంకనం:

సంగ్రహాత్మక మూల్యాంకనం నిర్ణీత కాలవ్యవధుల్లో జరిగే రాత పరీక్షల ద్వారా జరుగుతుంది. త్రైమాసిక, అర్ధ సంవత్సర, సంవత్సరాంత పరీక్షల ద్వారా జరుగుతుంది. ఆయా కాలాల్లో జరిగిన మొత్తం సిలబస్ భోధన చేసిన పాఠాలపై ప్రశ్నాపత్రం రూపొందిస్తారు. ప్రశ్నాపత్రం ఆ విద్యా ప్రమాణాల ఆధారంగా జరుగుతుంది. విద్యా ప్రమాణాలకు వాటికి ఇవ్వవలసిన మార్కుల భారత్వం టేబుల్‌ను ఇదే అధ్యాయనంలో 5.2 లో వివరించడం జరిగినది. ప్రశ్నల రూపం అనేక రకాలుగా అనగా వ్యాసరూప, లఘు సమాధాన, అతి లఘు సమాధాన, లక్ష్యాత్మక ప్రశ్నలుగా ఉంటుంది.

**ప్రస్తుత స్థితి:**

ప్రాథమిక స్థాయిలో 1 – 5 తరగతులకు పరిసరాల విజ్ఞానంలో భాగంగా ప్రస్తుతం సాంఘిక శాస్త్రం సబ్జెక్టు, ఎలిమెంట్ స్థాయిలో 6,7,8 తరగతులకు సాంఘికశాస్త్రంగా భోధన అభ్యసనం మూల్యాంకనం జరుగుతుంది. నిర్మాణాత్మక భోధనల ఆధారంగా మూల్యాంకనంలో భాగంగా 1) పిల్లల భాగస్వామ్యం 2) రాత అంశాలు, 3) ప్రాజెక్టు పనులను నిరంతరం పరిశీలించి ఉపాధ్యాయుడు, మార్కులు, గ్రేడులు నమోదు చేస్తున్నాడు. 4) వ అంశమైన స్లిప్ టెస్టును సంవత్సరములో నాలుగుసార్లు నిర్వహించడం జరుగుతున్నది. వీటి నిర్వాహణ కొరకు ఒక ప్రత్యేకమైన నోట్‌బుక్ ఉ ంటుంది. దీనికి సంబంధించిన వివరణ ఇదే అధ్యాయంలో 5.2 లో చూడవచ్చు.

ఇక సంగ్రహణాత్మక మూల్యాంకనంలో భాగంగా సాంఘిక శాస్త్రంగా 3 నిర్ణీత సమయాలలో పరీక్షలలో ముఖ్యంగా రాత పరీక్షలను నిర్వహిస్తారు. వీటిని 5.2 లో పేర్కొన్న విద్యా ప్రమాణాల భారత్వ పట్టికల అధారంగా ప్రశ్నా పత్రం తయారుచేస్తారు. దీనికి ప్రస్తుతము 2016–2017 సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి సంగ్రహణాత్మకమూల్యాంకనం – 2 ప్రశ్నాపత్రం ఇందులో జతపర్చడమైనది.

ప్రశ్నాపత్రం రెండు భాగాలుగా ఉంటుంది. పార్టు – ఎ లో 60 మార్కులకు , పార్టు–బి లో లక్ష్యాత్మక ప్రశ్నలు 20 మార్కులకు ఇవ్వడం జరిగినది. పార్టు–ఎ లో వ్యాసరూప, లఘు సమాధాన, అతి లఘు సమాధాన ప్రశ్నలు, పట నైపుణ్యాలకు సంబంధించిన ప్రశ్నలు, పార్టు–బిలో బహుళైచ్ఛిక ప్రశ్నలు ఇవ్వడం జరిగినది. 6,7,8 తరగతులకు ఇదే విధానం అమలులో వుంది. ప్రశ్నాపత్రాల సిసిఇ మాడ్యుల్‌లో ఉండుట వలన ప్రశ్నాపత్రంలోని

ప్రశ్నలకు సమాధానం రాయడానికి ఇది వరలో వలెనే 2.30 గం.ల సమయము ఇస్తూనే ప్రశ్నలు అర్థం చేసుకోవడానికి 15 నిమిషాలు సమయము అదనంగా ఇవ్వడం జరుగుతుంది. మొత్తం థియరీ పరీక్షల ద్వారా 80 మార్కులకు ప్రశ్నాపత్రం ఉండగా అంతర్గత మూల్యాంకనం ద్వారా ఆయా తరగతులకు భోధించిన ఉపాధ్యాయులు 20 మార్కులు విద్యార్ధుల ప్రతిభ అధారంగా కేటాయిస్తారు. మొత్తం మీద 100 మార్కులను పైన తెల్పిన విధంగా కేటాయించడం జరుగుతున్నది. పరీక్ష పేపరు తయారుచేసే ముందు అన్ని విద్యా ప్రమాణాలను అన్ని రకాల ప్రశ్నలకు ప్రాధాన్యతనిస్తూ మొత్తం నిర్ణయించిన సిలబస్ అంతటికీ ప్రాధాన్యతనిస్తూ భారత్వ పట్టికలు తయారుచేసుకోవాలి. అవి

1. విద్యా ప్రమాణాల భారత్వ పట్టిక
2. విషయ భారత్వ పట్టిక
3. ప్రశ్న రూప భారత్వ పట్టిక
4. కఠిన స్థాయి భారత్వ పట్టిక
5. నీలినక్ష లేదా సమగ్ర భారత్వ పట్టిక

విద్యా ప్రమాణాల భారత్వ పట్టిక

| వివరాలు | విద్యా ప్రమాణాలు | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| సామర్థ్యాలు | విషయవ గాహన | చదివి వ్యాఖ్యానిం చడం | సమాచార నైపుణ్యాలు | సమకాలిన అంశాలపై ప్రతిస్పందన | పట నైపుణ్యాలు | ప్రశంస | మొత్తం |
| భారత్వం | 40% | 10% | 15% | 10% | 15% | 10% | 100% |
| మార్కులు | 40 | 10 | 15 | 10 | 15 | 10 | 100m |

**ఆధారం :** సిసిఇ మాడ్యూల్

**సమ్మేటివ్ ప్రశ్నాపత్రం రూపొందించే విధానం:**

- సమ్మేటివ్ మదింపులో రాత పరీక్షలో అన్ని సామర్థ్యాలను పరిశీలించాలి.
- ప్రశ్నాపత్రం సామర్థ్యాల వారీగా విభజించాలి. 6,7,8 తరగతుల సాంఘికశాస్త్రం 6 సామర్థ్యాలుంటాయి. కాబట్టి ప్రశ్నాపత్రంలో 6 విభాగాలుండాలి.
- సామర్థ్యానికి కేటాయించిన భారత్వం అధారంగా ప్రశ్నలు ఉండాలి.

## ప్రశ్నాపత్రం , జవాబు పత్రం మూల్యాంకనం కొరకు సూచనలు:

1. ప్రశ్నాపత్రం ఉపాధ్యాయుడే స్వయంగా తయారుచేయాలి. ఇతర ఏజెన్సీలు తయారుచేసినవి లేదా ప్రక్క టీచర్ తయారుచేసినవి, ప్రక్క పాఠశాల వారు తయారుచేసినవి ఉపయోగించరాదు.

2. ప్రశ్నలు పాఠ్యపుస్తకాలలోనివి యథాతథంగా ప్రశ్నపత్రంలో ఇవ్వరాదు. వాటిని ఆధారంగా చేసుకొని స్వంతంగా పశ్నలివ్వాలి.

3. విద్యాప్రమాణాలకు కేటాయించిన మార్కుల నిష్పత్తిని పాటించాలి.

4. సమాధానాల కీ తయారు చేయవలసిన అవసరం లేదు. ఎందుకంటే సిసిఇ విధానంలో ప్రశ్నలు విద్యార్థులు స్వంతంగా సమాధానాలు రాసే విధంగా ఉంటాయి. విద్యార్థులందరూ ఒకేలా సమాధానం రాయరు. సందర్భానికి తగిన సమాధానం మార్కులు ఇవ్వాలి.

5. ప్రశ్నాపత్రం తయారీలో భారత్వ పట్టికలో రూపొందించుకొని, వాటికి అనుగుణంగా ప్రశ్నల సంఖ్య రూపం ఉండేటట్లు చూడాలి.

6. స్లిప్ టెస్టు 20 మార్కులకే నిర్వహిస్తాం కనుక అన్ని విద్యా ప్రమాణాలు నెరవేరేటట్లుగా ప్రశ్నలివ్వాల్సిన అవసరం లేదు. 3,4 విద్యా ప్రమాణాలు నెరవేర్చినా చాలును.

7. నిర్మాణాత్మక మూల్యాంకనం, సమగ్ర మూల్యాంకనలకు, ప్రారంభ పరీక్ష నిర్వహణకు నిర్ణీత షెడ్యూలు విద్యాశాఖ ఇచ్చింది పాటించాలి.

| సమగ్ర భార్వ పట్టిక (Blue Print) | | | | | |
|---|---|---|---|---|---|
| ద నెం | సామర్థ్యాలు | శాతం | మార్కులు | ప్రశ్నల రకం | వివరాలు |
| 1 | విషయావగాహన | 40 | 32 | వ్యాసరూప ప్రశ్నలు 8 మార్కులు స్వల్ప సమాధాన ప్రశ్నలు -1 , 4 మార్కులు, సంక్షిప్త సమాధాన ప్రశ్నలు - 2 4 మార్కులు లక్ష్యాత్మక ప్రశ్నలు 16 మార్కులు | ప్రశ్నకిచ్చిన సూచనల ఆధారంగా సమాధానం రాయాలి. ( రెండింటిలో ఒకటి రాయాలి) ప్రశ్నకు తగు సామాధానం రాయాలి. |
| 2 | చదివి వ్యాఖ్యానించడం | 10 | 8 | వ్యాసరూప ప్రశ్న 8 మార్కులు | ప్రశ్నకిచ్చిన సూచనల ఆధారంగా సమాధానం రాయాలి. ( రెండింటిలో ఒకటి రాయాలి) |
| 3 | సమాచార నైపుణ్యాలు | 15 | 12 | వ్యాసరూప ప్రశ్న-1 8 మార్కులు స్వల్ప సమాధాన ప్రశ్న | ప్రశ్నకిచ్చిన సూచనల ఆధారంగా సమాధానం రాయాలి. ( రెండింటిలో ఒకటి రాయాలి) సరి అయిన సమాధానం రాయాలి |
| 4 | సమకాలీన అంశాలపై | 10 | 8 | స్వల్ప సమాధాన ప్రశ్నలు 2 ప్రశ్నలు 4 మార్కులు | 2 ప్రశ్నలకు సమాధానం రాయాలి. ఇచ్చిన సమాధానం ఆధారంగా జవాబు రాయాలి. |
| 5 | పట నైపుణ్యాలు | 15 | 12 | వ్యాసరూప ప్రశ్న-1 8 మార్కులు సంక్షిప్త సమాధాన ప్రశ్న-1 2 మార్కులు లక్ష్యాత్మక ప్రశ్నలు 2 - 2 మార్కులు | మ్యాప్‌లో గుర్తించాలి (లేక) మ్యాప్‌లో సమాచారం అధారంగా సమాధానం రాయాలి. సరైన సమాధానం - గ్లోబ్ బొమ్మ గీసి భూమధ్య రేఖను గుర్తించాలి. సరియైన సమాధానాన్ని సోచించు ఆంగ్ల అక్షరాన్ని బ్రాకెట్లలో రాయాలి. |
| 6 | చదివి వ్యాఖ్యానించడం | 10 | 8 | వ్యాసరూప ప్రశ్న 8 మార్కులు | ప్రశ్నకిచ్చిన సూచనల ఆధారంగా సమాధానం రాయాలి. ( రెండింటిలో ఒకటి రాయాలి) |

- ప్రశ్నలు వ్యాసరూప, స్వల్ప సమాధాన, సంక్షిప్త సమాధాన, లక్ష్యాత్మక రూపాలలో ఉండాలి.
- భారత్వం ఆధారంగా ప్రశ్నల సంఖ్య ఉండాలి. పై విధంగా వివిధ కాంబినేషన్లలో ప్రశ్నల సంఖ్య ఉండాలి.

  కాని సామర్థ్యంలోని ప్రశ్నలలనీ ఒకే విభాగంలో ఉండాలి.

సాంఘిక శాస్త్రం ప్రశ్నల వారీగా భారత్వం (6వ తరగతి)

| సమ్మేటివ్ | | | | | | |
|---|---|---|---|---|---|---|
| సామర్థ్యాలు | వ్యాసరూప ప్రశ్నలు | స్వల్ప సమాధాన ప్రశ్నలు | సంక్షిప్త ప్రశ్నలు | లక్ష్యాత్మక ప్రశ్నలు | మార్కులు | శాతం |
| విషయావగాహన | 1<br>8 మార్కులు | 1<br>4 మార్కులు | 2<br>(2x2)<br>4 మార్కులు | 16<br>16మార్కులు | 32 | 40 |
| చదివి వ్యాఖ్యానించడం | 1<br>8 మార్కులు | - | - | - | 8 | 10 |
| సమాచార నైపుణ్యాలు | 1<br>8 మార్కులు | 1<br>4 మార్కులు | - | - | 12 | 15 |
| సమకాలీన అంశాలపై ప్రతిస్పందన | - | 2 ( 4G 4)<br>8 మార్కులు | - | - | 8 | 10 |
| పట నైపుణ్యాలు | 1<br>8 మార్కులు | - | 1<br>2 మార్కులు | 2<br>2 మార్కులు | 12 | 15 |
| ప్రశంస | - | 1<br>4 మార్కులు | 1<br>2 మార్కులు | 2<br>2 మార్కులు | 8 | 10 |
| | 32 | 20 | 8 | 20 | 80 | 100 |

**రికార్డుల నిర్వహణ :**

నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక మూల్యాంకనాలను నిర్వహించిన తరువాత సమాధాన పత్రాలను దిద్దడం, గ్రేడులు లెక్కించడం ఎంత ప్రధానమో వాటి వివరాలను నమోదు చేసే రికార్డులు, రిజిస్టర్లు నిర్వహించడం కూడా అంతే ప్రధానమైన అంశం. పిల్లల ప్రగతిని 1) సిసిఇ రిజిస్టరులో నమోదు చేయాలి 2) క్యుములేటివ్ రికార్డులో కూడా నమోదు చేయాలి. వీటిని నింపడంలో సబ్జెక్టు ఉపాధ్యాయులు తరగతికి భాధ్యత వహించే ఉఫాధ్యాయునికి లేదా ప్రధానోపాధాయునికి సహకరించాలి. వీటి వివరాలు క్రింది ఇవ్వడమైనది.

**1) పిల్లల ప్రగతి నమోదు రిజిస్టరు ( సిసిఇ రిజిస్టరు)**

- ఫార్మాటివ్ సమ్మేటివ్ మూల్యాంకనాలలో పిల్లలు సాధించిన గ్రేడులను ఈ రిజిస్టరు లో నమోదు చేయాలి.
- ప్రగతి నమోదు రిజిస్టరులో తరగతి వారీగా సబ్జెక్టువారీగా పేజీలను నమోదు చేయాలి.
- నిర్మాణాత్మక మూల్యాంకనంలో పిల్లల భాగస్వామ్యం – ప్రతిస్పందనలు, రాత పనులు, ప్రాజెక్టు పనులు, రాత పరీక్షలో నిర్ధేశించిన సూచికల అధారంగా పొందిన మార్కులను గ్రేడులును వేయాలి.
- సహపాఠ్యాంశాలకు సంగ్రహణాత్మక మూల్యాంకనంలో మాత్రమే మార్కులు, గ్రేడులు ఇవ్వాలి. వివరణాత్మక సూచికలు రాయాలి.

– సిసిఇ రిజిష్టరు ను పాఠశాల సందర్శన సమయములో మండల విద్యాశాఖాధికారి / ఉప విద్యాశాఖాధికారి తో ధృవీకరించచేసుకోవాలి. ప్రగతి నమోదు రిజిస్టరు నమూనా ఇందులో జతపర్చబడినది.

**2) క్యుములేటివ్ రికార్డు :**

పాఠశాలలో నిర్వహించే భోధనాభ్యసన ప్రక్రియలు పిల్లల శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలను కలిగించడానికి దోహదపడతాయి. పిల్లలు పాఠశాలలో చేరినప్పటి నుండి వారికి భోధనాంశాలు, కళలు, సాంకేతిక విద్య, ఆరోగ్య వ్యాయామ విద్య, పని, కంప్యూటర్ విద్య విలుల విద్య, జీవన వైపుణ్యాలు మొదలైన అంశాలన్నిటిలో పిల్లల ప్రగతిని పరిశీలించి నమోదు చేయాలి. దీనికోసం క్యుములేటివ్ రికార్డు నిర్వహించాలి.

ఒక విద్యార్థి పాఠశాలలో చేరినది మొదలు ఎలిమెంటరీ విద్య పూర్తి చేసేంతవరకు తరగతి వారీగా విద్యార్థి ప్రగతిని పాఠ్య సహపాఠ్య అంశాలన్నింటిలోనూ పరిశీలించి నమోదు చేయాలి. ఒక వేళ విద్యార్థి ఒక పాఠశాల నుండి మరొక పాఠశాలకు వెళ్తే క్యుములేటివ్ రికార్డును చేరిన పాఠశాలలో అందచేయాలి. 8 వ తరగతి పూర్తి చేసిన తరువాత విద్యార్థి ఏ పాఠశాలలో 8వ తరగతి పూర్తిచేశాడో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్యుములేటివ్ రికార్డు చివరి పేజీలో వున్న ఎలిమెంటరీ స్కూల్ సర్టిఫికెట్ ను జారీ చేయాలి. దీనిని పాఠశాలల పర్యవేక్షణాధికారి, మండల విద్యాధికారి / ఉప విద్యాధికారి ధృవీకరించాలి. కొన్ని పాఠశాలల్లో 5వ తరగతి వరకే వుంటుంది. ఈ పాఠశాలల్లో చదివిన విద్యార్థి 6వ తరగతి చదవడానికి ఇతర పాఠశాలకు వెళతాడు. కాబట్టి ఇలాంటి పిల్లలకు ప్రాధమిక స్థాయి అనగా 5 వ తరగతి పూర్తి చేసినట్లు సర్టిఫికెట్ ఇవ్వాలి.అంటే పిల్లలు ఆ స్థాయికి సంబంధించిన సబ్జెక్టుల వారీగా సామర్థ్యాల సాధించారని అర్థం. కాబట్టి నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని జాగ్రత్తగా ఆధారాలతో నిర్వహించాల్సి ఉ ంటుంది. ఈ క్యుములేటివ్ రికార్డు 2 రకాలు

1. 1 – 5 వ తరగతి వరకు ఒక బుక్‌లెట్

2. 6 – 10 వ తరగతి వరకు ఒక బుక్‌లెట్ గా ఉంటుంది.

దీనిని బడిలోనే భద్రపరచాలి. ప్రతి సమ్మెటివ్ పరీక్ష అయిపోగానే ప్రోగ్రెస్‌లో రికార్డు చేసి తల్లిదండ్రులకు పంపించి సంతకం తీసుకోవాలి. పాఠశాల చివరిగా అనగా 5వ తరగతి, 10వ తరగతి వదిలినప్పుడు పిల్లలకు ఇచ్చివేయాలి. క్యుములేటివ్ రికార్డు నమూనా పత్రాలను ఇందుతో జతచేయడమైనది.

**సంగ్రహణాత్మక మదింపు - 2 - 2016 - 2017**

**సాంఘిక శాస్త్రం**

**( తెలుగుమీడియం)**

**పార్టు - ఎ & బి**

**తరగతి : 6** **గరిష్ట మార్కులు : 80** **సమయము : 2.45ని.**

**సూచినలు:- 1. ప్రశ్నాపత్రము చదువుకోవడానికి 15 ని. జవాబులు రాయడానికి 2.30 గంటలు కేటాయించబడినది.**

**2. పార్టు-ఎ సమాధానములను సమాధాన పత్రములో రాయండి.**

**3. పార్టు-ఎ లో మూడు సెక్షన్లు కలవు.**

**4. ప్రతి ప్రశ్నకు సమాధానమియ్యండి.**

**5. ప్రతి జవాబును స్పష్టంగా, చక్కగా కనపడేలా రాయండి.**

**6. సెక్షను- 3 లో అంతర్గత ఎంపిక కలదు.**

**సూచినలు: 1. క్రింది అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

**2. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు.**

1. సలకంచెరువు గ్రామము ఏ భూ స్వరూపంలో కలదు?

2. యఫ్.సి.ఐ.ని విస్తరింపుము

3. గ్లోబు చిత్రపటాన్ని గీచి అందులో భూమధ్యరేఖను గుర్తించండి?

4. మీ ప్రాంతంలో వివిధ మతాల ప్రజలు జరుపుకునే పండుగల జాబితా తయారుచేయండి?


సెక్షన్ - 2

**సూచికలు: 1. ఈ క్రింది అన్ని ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి**

**2. ప్రతి ప్రశ్నకు 4 మార్కులు**

5. సూర్యుడు ఎల్లప్పుడూ తూర్పున ఉదయిస్తాడు కారణాలు తెలపండి?

6. అక్షరాస్యత రేటు :: పురుషులు మరియు స్త్రీలు




**పై గ్రాఫ్‌ను చదివి క్రింది ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి?**

అ. భారతదేశంలో ఎవరి అక్షరాస్యత రేటు ఎక్కువగా ఉంది?

ఆ. 2011 జనాభా లెక్కల ప్రకారం పురుషుల అక్షరాస్యత శాతం ఎంత?

ఇ. 2011 జనాభా లెక్కల ప్రకారం స్త్రీల అక్షరాస్యత శాతం ఎంత?

ఈ. 1991 సం.లో స్త్రీ, పురుషుల మధ్య అక్షరాస్యతలో గల తేడా ఎంత?

7. అడవులను విచక్షతారహితంగా నరకడం వల్ల వాటి విస్తీర్ణం రోజు రోజుకి తగ్గిపోవుచున్నది. దీనిని నివారించడానికి ఎలాంటి చర్యలు చేపట్టాలి?

8. మీరే స్థానిక సంస్థలో సభ్యుడైతే ఏఏ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తారు?

9. అశోకుడు విశిష్టపాలకుడని అంటారు. ఎందుకు?

## సెక్షన్ 3

**సూచికలు:** **1. అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

**2. ప్రతి ప్రశ్నకు 8 మార్కులు**

**3. ఈ ప్రశ్నకు అంతర్గత ఎంపిక అవకాశం కలదు.**

10. ఆది మానవుల యొక్క జీవన విధానం గురించి వ్రాయండి?

(లేదా)

11. గిరిజన సంప్రదాయాలను ఆయా సమాజాలలోని వయోజనులందరూ తెలుసుకుంటారు. గిరిజన సమాజ వ్యవహారాలలో ప్రతి కుటుంబము సమర్ధవంతంగా పాలు పంచుకుంటుంది. కొన్ని సందర్భాలలో గ్రామ పెద్ద కంటే ఎక్కువ ప్రాముఖ్యం సమాజానికి వుంది. గ్రామ పెద్ద ఎవరికి అనుకూలంగాను, వ్యతిరేకంగాను ఉండకుండా అందరి అభిమానాన్ని పొందవలసివుంటుంది. వాళ్ళ అభిప్రాయాలకు విరుద్ధంగా పట్లా ప్రవర్తించకూడదు. అలాగే అతడు తెగకు చేస్తున్న సేవలకు ప్రతిఫలంగా అతనికి కొన్ని ప్రత్యేక సదుపాయాలు ఉంటాయి. అతని పొలంలో ఉచితంగా తెగవారు పనిచేస్తారు.

గిరిజన సమాజం గురించి వ్యాఖ్యానించండి

(లేదా)

చాలా గ్రామాల్లో నైపుణ్యం గల వృత్తి పనివాళ్ళు ఉండేవారు. కమ్మర్లు వ్యవసాయానికి పనికి వచ్చే పనిముట్లు (నాగలి కర్రలు, గొడ్డళ్లు, బాణాలు మొదలైనవి)ను, వంటకు ఉపయోగపడే కుండలు, ధాన్యం నిలువ వుంచే పాత్రలను కుమ్మరి, బండ్లు, నాగళ్ళు, ఇతర గృహసామాగ్రిని వడ్రంగులు, దుస్తులను నేత పనివారు తయారుచేసేవారు వుత్పత్తులకు బదులుగా గృహపతులు వారికి ధాన్యం ఇచ్చి వుండవచ్చు. ఆ ఉత్పత్తులు వ్యవసాయానికి అత్యవసరం. వాటిని సొంతంగా తయారుచేసుకోవడానికి గృహపతులు నైపుణ్యం సమయం ఉండవు.

మహాజన పదాల కాలం నాటి చేతివృత్తుల వారి గురించి వ్యాఖ్యానించండి?

**12. క్రింది సమాచారం అధారంగా ఇవ్వబడిన ప్రశ్నలకు జవాబులివ్వండి?**

| | | |
|---|---|---|
| 1. | ఎన్నికలు | ప్రతి 5 సంవత్సరాలకొకసారి ఎన్నికలు జరుగుతాయి. 18 సం॥లు నిండిన వారు ఓటరు జాబితాలో ఓటరుగా నమోదు కాబడిన వారు రెండు ఓట్లు వేస్తారు. ఒకటి వార్డు మెంబరును ఎన్నుకోవడానికి,రెండోది గ్రామ సర్పంచ్‌ని ఎన్నుకోవడానికి వేస్తారు. |
| 2. | పౌరసౌకర్యాలు | రోడ్లు కాలువల నిర్మాణం, మంచినీటి సరఫరా వీధి దీపాలు, వీధులను శుభ్రపరచడం మొ॥ |
| 3. | నిధులు | ఇంటి పన్ను విధించడం వలన, భూమిశిస్తు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చే గ్రాంట్లు |
| 4. | సమావేశము | పంచాయితీ ప్రతి నెలలో సమావేశమవుతుంది. కనీసం సగం మంది సభ్యులు హాజరవ్వాలి. |

అ) గ్రామ పంచాయితీ అధ్యక్షుడు ఎవరు?

ఆ) గ్రామ పంచాయితీ వారు కల్పించే రెండు పౌర సౌకర్యాలను రాయండి?

ఇ) గ్రామ పంచాయితీ నిధులు ఏ విధంగా పొందుతుంది?

ఈ) గ్రామ పంచాయితీ సమావేశముకు కనీసం ఎంతమంది సభ్యులు హాజరవ్వాలి?

(లేదా)

**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమైన రాతిచిత్ర కళాస్థావరాలు**

| క్ర.సంఖ్య | జిల్లా | చిత్రకళా స్థావరాలు |
|---|---|---|
| 1. | చిత్తూరు | రేణిగుంట, శ్రీకాళహస్తి, వెంబఖండ్రిగ |
| 2. | నెల్లూరు | కావలి, నందిపాడు |
| 3. | కర్నూలు | బొల్లారం, కేతవరం, కాలువబుగ్గ, ఆదోని |
| 4. | ప్రకాశం | నాయుడుపల్లి, సింగరాయకొండ |
| 5. | గుంటూరు | వినుకొండ |

**పై పట్టిక చదివి ఈ క్రింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఎ) నాయుడుపల్లి చిత్రకళా స్థావరం ఏ జిల్లాకు సంబంధించినది?

బి) ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఏ ప్రాంతం చిత్తూరు జిల్లాలో చిత్రకళా స్థావరంగా గుర్తించబడినది?

సి) వినుకొండ చిత్రకళా స్థావరం ఏ జిల్లాకు సంబంధించినది?

డి) ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక రాతిచిత్రకళా స్థావరాలు కలిగిన జిల్లా ఏది?

**13.** **ఆంధ్రప్రదేశ్ పటంలో ఈ క్రింది వాటిని గుర్తించండి?**

ఎ) కృష్ణానది    బి) పాపికొండలు    సి) విజయవాడ    డి) తిరుపతి



1) మౌర్యుల రాజధాని నగరం పేరు రాయండి.

2) వైశాలి, పాటలీపుత్రంకు ఏదిక్కులో ఉన్నది.

3) కళింగప్రాంతం ప్రస్తుతం ఏ పేరుతో పిలువబడుతుంది.

4) అశోక సామ్రాజ్యంలో దక్షిణ భాగాన వున్న “నగరం” ఏది.

# యూనిట్ 6 : ఎలిమెంటరీ స్థాయి సాంఘిక శాస్త్ర బోధనలో సమస్యలు, సవాళ్ళు
## (ఛాత్రోపాధ్యాయుల మధ్య చర్యా పద్ధతిలో బోధన జరగాలి)

6.1. సాంఘికశాస్త్ర బోధనా వనరులు – ప్రాథమిక, ద్వితీయ వనరులు, అనువాద వనరులు, సాంకేతిక ఆధార వనరులు, సార్వత్రిక వనరుల ఉపయోగం, ఉపయోగిస్తున్న తీరు, ఉపయోగించిన సందర్భాలలో వారి అనుభవాల గురించి ఛాత్రోపాధాయయులతో చర్చించి, పరిష్కార మార్గాలను సూచించుట.

6.2. ఉపాధ్యాయుల పరిజ్ఞానం – లోతైన ఆలోచనాత్మక అగాహన, వివిధ సందర్భాలలో అనుసరించాల్సిన బోధన విధానాలు మదింపు వ్యూహాలపై చర్చించి పరిష్కార మార్గాలు సూచించుట, అనుభవాలను పంచుకొనుట.

6.3. విద్యార్థుల పూర్వజ్ఞానాన్ని పాఠ్యాంశాలతో అనుసంధానం చేయటం ద్వారా విద్యార్థులలో ఆసక్తిని, నిమగ్నతను పెంపొందించుట – వారి అనుభవాల ఆధారంగా చర్చ నిర్వహించి – అనుభవాలను పంచుకొనుట – మెరుగైన బోధనకు ప్రోత్సహించుట.

6.4. సాంఘిక శాస్త్రబోధనలో సమాచార ప్రసార సాంకేతిక సమైక్యత (ICT)ను వినియోగించుటలో సవాళ్ళను చర్చించి – సరియైన పరిష్కార మార్గాలను సూచించుట.

6.5 సాంఘిక శాస్త్ర బోధనలో సామాజిక మరియు సాంస్కృతిక అంశాలను బోధించవలసిన విధానాలు – బోధనను మెరుగు పరచుటకు సూచించుట.

6.6. మంచి సాంఘిక శాస్త్ర తరగతి గది స్వరూపం – ఉపాధ్యాయుల పాత్ర; ఉపాధ్యాయుల నిరంతర, వృత్తిపర అభివృద్ధి; సబ్జెక్టు ఫోరంలు (విషయ వేదికలు), విషయ సమూహాలు (Connected Groups) సార్వత్రిక అభ్యసన వనరులు, సెమినార్‌లు, కార్యశాలలు, అధ్యయనాలు, ప్రతిస్పందనలపై చర్చించి – సామర్థ్యంను మెరుగు పరచుకునే విధానంను సూచించుట – అనుభవాలు పంచుకొనుట.

**ఎలిమెంటరీ స్థాయిలో సాంఘిక శాస్త్ర బోధనలో సవాళ్ళు, సమస్య :–**

ఇప్పటివరకు సాంఘిశాస్త్ర బోధనకు సంబంధించిన అనేక అంశాలను చర్చించినాము. పై విషయాలను బాగా అర్థం చేసుకొని ఆచరణలోకి తీసుకురావడానికి ఉపాధ్యాయుడు కృషిచేయాలి. ఇది ఎంతో శ్రమతో కూడుకున్న పని. ఈ క్రమంలో ఎన్నో సమస్యలు, ఆటంకాలు ఏర్పడతాయి. ఈ సమస్యలను ఇలా వర్గీకరించవచ్చు.

1. పరిపాలనాపరమైన సమస్య
2. ఆర్థిక వనరుల సమస్య
3. గ్రంథాలయము అందుబాటులో లేకపోవుట.
4. సమాచార సాంకేతిక ఉపకరణాలు
5. సమయాభావము.

పై సమస్యలలో అన్నింటికి గాని కొన్నింటికి గాని ఉపాధ్యాయుడు నిరంతరము ఎదుర్కొంటూనే వుంటాడు. వాటిని అధిగమిస్తూ ఉపాధ్యాయుడు తన లక్ష్యంవైపు ప్రయాణించడానికి ప్రయత్నం చేయాలి.

## 6.1. సాంఘికశాస్త్ర బోధన – వనరులు :

సామాజిక శాస్త్రాల రచనను, అధ్యయనమునకు ఆధారము వనరులు. ఈ వనరులను మనం రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి ప్రాధమిక వనరులు, ద్వితీయ వనరులు. ప్రాధమిక వనరులు మౌలికమైనవి.

అవి ప్రాథమికంగా చారిత్రక వాస్తవాలు, సంఘటనలు, ఉపన్యాసాలు, డైరీలు, గ్రంథాలు, స్వీయ చరిత్రలకు సంబంధించినవి.

ప్రాథమిక వనరుల ఆధారంగా రూపొందించినవే ద్వితీయ ఆధారాలు. వీటితోపాటు అనువాదిత సామాగ్రి, కంప్యూటర్ ఆధారిత వనరులు, సార్వత్రిక వనరులు కూడా ముఖ్యమైనవి.

ఇంతకు ముందేవీటికి సంబంధించిన అంశాలతో మనం అధ్యయనం చేసినాము. వీటి ఆధారంగా మనం బోధించడంలో ఉన్న సమస్యలను అధ్యయనం చేసినాము.

మనం సాంఘికశాస్త్రం 6,7,8 తరగతులలో బోధించినాము. అవి బోధించినపుడు మనం ఏయే ప్రాథమిక వనరులను బోధించడానికి అవకాశం ఉన్నది.

బోధనాంశాలు :-

- 6,7,8 తరగతుల బోధనలో మనం ఏయే ప్రాథమిక వనరులను ఉపయోగించడానికి అవకాశం ఉన్నది జాబితా వ్రాయండి.
- 6,78 తరగతుల బోధనలో ఏయే ద్వితీయ వనరులను ఉపయోగించడానికి అవకాశం ఉన్నది.
- 6,7,8 తరగతుల బోధనలో అంతర్జాలాన్ని, కంప్యూటర్‌ను ఎలా ఉపయోగించిన గలిగినారు.
- ఏ అనువాదిత సామాగ్రిని ఉపయోగించినారు.
- ఏ సార్వత్రిక వనరులను ఉపయోగించినారు.

ఉపాధ్యాయుని పాత్ర :-

ఉపాధ్యాయుడు విద్యార్థులను 5 సమూహాలుగా విభజిస్తాడు. వారు తమ బోధనా సమయంలో వుపయోగించిన శాసనాలు, నాణాలు.

తరగతుల గదిని కొన్ని సమూహాలుగా విభజించినారు :-

6వ తరగతిలో

మొదటి 1-10 అధ్యాయము ఏయే వనరులను ఉపయోగించవచ్చు ? ఎలా ?
11-20 అధ్యాయము ఏయే వనరులను ఉపయోగించవచ్చు ?

7వ తరగతిలో

మొదటి 1-10 అధ్యాయము ఏయే వనరులను ఉపయోగించవచ్చు ? ఎలా ?
11-20 అధ్యాయము ఏయే వనరులను ఉపయోగించవచ్చు ?

8వ తరగతిలో

మొదటి 1-10 అధ్యాయము ఏయే వనరులను ఉపయోగించవచ్చు ? ఎలా ?
11-20 అధ్యాయము ఏయే వనరులను ఉపయోగించవచ్చు ?

మీరందరూ పాఠ్యాంశాలకు పాఠశాలలో బోధించి ఉంటారు ?

మీరు బోధించినపుడు ఈ క్రింది పేర్కొన్న బోధనా వనరులను వివరించండి.

మీరు ఉపయోగించిన వాటిని ఈ క్రిందివిధంగా పేర్కొనుము.

| పాఠంపేరు | ప్రాథమిక వనరులు | ద్వితీయ వనరులు | అనువాద వనరులు | సాంకేతిక ఆధార వనరులు | సార్వత్రిక వనరులు |
|---|---|---|---|---|---|
| | | | | | |

మీరు వాటిలో ఏయే వనరులను ఎక్కువగా ఉపయోగించినారు. ఎందుకని ?

ప్రాథమిక వనరులను చాలా తక్కువగా వాడి ఉంటారు ? ఎందుకు ?

అనువాద వనరులను కూడా తక్కువగా వాడి ఉంటారు ? ఎందుకు ?

సాంకేతిక ఆధార వనరులు వాడకానికి అవకాశం ఉంది ? వాడినారా? లేదా ?

సార్వత్రిక వనరులు ఏమేమి వాడినారు? ఎందుకు ?

## సాంఘికశాస్త్ర బోధన – వనరులు – ప్రాథమిక, ద్వితీయ, అనువాదిత సామాగ్రి – సమాచార సాంకేతిక వనరులు – సార్వజనీన వనరులు :

ఉపాధ్యాయుడు తన బోధనను మెరుగుపరచడానికి వనరుల అవసరం ఉంది. ఈ వనరులలో ప్రాథమిక, ద్వితీయ వనరులకు ప్రాముఖ్యత ఉంది. అంతర్జాలము అనేది మన ఇంటికే చేరిన గ్రంథాలయం లాంటిది. దీనితో పాటు ఈనాడు ఎన్నో సార్వజనీన వనరులు, ఆన్‌లైన్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రాథమిక వనరులను మన అందుబాటులోకి తెచ్చుకోవడం.

ఉదా :- ప్రాథమిక వనరులు

1. 6వ తరగతి విద్యార్థులను బోధించే పాతాలలో ప్రాథమిక వనరులు ఏవి ? ద్వితీయ వనరులు ఏవి?
2. 7వ తరగతి పాఠ్యాంశాలను బోధించడంలో ప్రాథమిక వనరులు, ద్వితీయ వనరులు ఏవి ?
3. 8వ తరగతి బోధనలో ప్రాథమిక వనరులు ఏవి ? ద్వితీయ వనరులు ఏవి ?

ఉదా :- 3వ పాఠం తీసుకొందాం.

**సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయుని పాత్ర – బోధన :-**

బోధనావనరులు సరైన పద్ధతిలో, సరియైనవి ఉపయోగించినప్పుడు బోధన ఆకర్షణీయంగా, ఆకట్టుకొనేలా ఉంటుంది. విద్యార్థుల దృష్టిని బాగా ఆకర్షించగలుగుతాము. వారి అవధానాన్ని (Attention) ఎక్కువసేపు నిలబెట్టుకోగలుగుతారు. బోధన సమర్ధవంతంగా ఉండడానికి మీకు కావలసిన వనరులు ముఖ్యంగా 2 రకాలు.

1. విషయసేకరణ / విషయము (Concept) నకు సంబంధించినవి.
2. బోధనా పద్దతులు / వ్యూహాలు / టెక్నికల్‌కు సంబంధించినవి.

ఉదాహరణ :- 6వ తరగతిలోని 3వ పాఠ్యాంశం తీసుకుందాం.

కొన్నివేల సంవత్సరాల క్రితం ఉన్న వనరులు జీవనవిదానం

- వాళ్ళు ఆహారాన్ని ఎలా సేకరించారు. ఎలా వేటాడారు ? వేటకు ఉపయోగించిన పనిముట్లు ఏమిటి? ఆయుధాలు ఏమిటి ?
- వివిధ ప్రదేశాలలో లభ్యమయిన పనిముట్లు.
- వివిధ గుహలలోని / గోడలపైని మానవాకృతులు, జంతువుల ఆకృతులు.
- చెంచుల చిత్రాలు

పై అంశాలు మన ప్రాథమిక వనరులను ఏవైనా లేనట్లయితే ద్వితీయ వనరులను

సాంకేతిక ఆధారవనరులు – అంతర్జాలం ఆధారంగా కంప్యూటర్ ఆధారంగా ఏమైనా ఉపయోగించారా?

సార్వత్రిక వనరులంటే ఏమిటి? వాటిని ఎలా ఉపయోగించారు?

## 6.2 ఉపాధ్యాయుల పరిజ్ఞానం :

ఇంతకుముందు అధ్యాయంలోనే మనం సాంఘికశాస్త్ర బోధనలో ఉపాధ్యాయుని పాత్ర, బోధనలను గురించి అధ్యయనం చేసినాము. సాంఘిక శాస్త్ర బోధనలో ఉపయోగించవలసిన బోధనా పద్దతులు, బోధనా రీతులను గురించి, విద్యార్థుల అభ్యసన స్థాయిలను అంచనావేయవలసిన విదానాన్ని గురించి తెలుసుకున్నాము.

ఉపాధ్యాయుడు తన బోధన సమగ్రంగా విద్యార్థులలో ఆలోచన రేకెత్తించేదిగా ఉండాలంటే తన అధ్యాయం చాలా లోతుగా ఉండాలి. నిరంతర అధ్యయన శీలి కావాలి. అప్పుడు మాత్రమే విద్యార్థిపై, ప్రతిభావంతమైన విద్యార్థులపై ప్రభావాన్ని చూపగలుగుతాడు.

ఉపాధ్యాయుడు తన సేవాకాలం పెరిగే కొద్ది అతని సామర్థ్యం పెరగాలి. వృత్తిలో సేవాకాలం పెరిగే కొద్ది ఆయన విషయజ్ఞానం, పిల్లలను అర్థం చేసికొనే తీరు, ఉపయోగించే బోధనా పద్ధతులు, విద్యార్థులను అంచనా వేసే విధానం వృద్ధి చెందాలి. అప్పుడు ఆయన నిజంగా వృత్తిలో అభివృద్ధి చెందినట్లు. ఈ వృత్తి సామర్థ్యం పెంచుకోవడం కోసం నిరంతరం ప్రయత్నం చేస్తూ ఉండాలి. దీనికి అతనికి తోడ్పడేది అతని అంతఃప్రేరణ మాత్రమే. వృత్తిలో సాధించే చిన్న చిన్న విజయాలు, మరింత పెద్ద విజయాలవైపు తీసికొని వెళతాయి. ఈ రోజు నేను బాగా పాఠం చెప్పగలిగాను అనే సంతృప్తి ఇంకా బాగా చెప్పడానికి ప్రోత్సహిస్తుంది. అందుకే అంటారు ఒక విజయం ఇంకో విజయానికి కారణమవుతుంది. "Success Begets Succes". బాహ్య ప్రేరణలైన మెచ్చుకోలు, ఆర్థిక అంశాలు కూడా కొంతమేరకు పనిచేస్తాయి. ప్రధానమైనది అంతఃప్రేరణ. ఉపాధ్యాయుని ప్రగతిని 3 అంశాలలో అంచనావేద్దాం.

1. తాను బోధించే విషయంలో లోతైన అవగాహన.
2. మంచి బోధనా పద్దతులనవలంభించుట.
3. సరియైన మూల్యాంకనా వ్యూహాలననుసరించుట.

పై అంశాలలో ఉపాధ్యాయుడు ఎదుర్కొనే సమస్యలేమిటి ? అతని ప్రగతికి అడ్డంకిగా నిలిచే సమస్య లేమిటో చూద్దాం.

1. లోతైన పరిజ్ఞానం :-

ఉపాధ్యాయునికి తాను బోధించే విషయంలో లోతైన ఆలోచనాత్మకమైన అవగాహన ఉండాలంటే తాను బోధించే తరగతి గది పాఠ్య పుస్తకాలకే పరిమితం కారాదు. ఆ పాఠ్యపుస్తకానే మళ్ళీ మళ్ళీ చదివి వివరించడం వల్ల విద్యార్థికి తగిన ప్రేరణ కలిగించలేదు. విద్యార్థులలో జ్ఞాన తృష్ణను రగిలించలేదు. కాబట్టి ఏమి చేయాలి? పరిశీలనా గ్రంథాలను చదవాలి. పై తరగతుల గ్రంథాలను చదవాలి, మిత్రులతో విషయపరమైన విషయాలపై చర్చించాలి.

2. మెరుగైన బోధనా పద్దతుల ఉపయోగం :-

ఎప్పుడూ ఉపన్యాస పద్ధతినే ఉపన్యాస చర్చా పద్దతినే ఉపయోగించడం వల్ల విద్యార్థులలో మెరుగైన అభ్యసనం జరగదు. దీనికోసం ఏమిచేయాలి? 1) పిల్లల మనోవిజ్ఞానంపై అధ్యయనం, 2) విజయవంతమైన బోధనా పద్దతులకు సంబంధించిన పుస్తకాలు చదవాలి. (ఎ) గిజూభాయి పుస్తకాలు, పగటి కల మొదలైనవి. (బి)రైలుబడి రచన, (సి) పిల్లలకే నా హృదయం అంకితం. గొప్ప ఉపాధ్యాయుల, తత్వవేత్తల, విద్యావేత్తల, జాతీయ నాయకుల జీవితాలు చదవాలి. వారి జీవితాలు మనకు ఎంతగానో ప్రేరణ నిస్తాయి.

ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి జీతంలోని ఈ సంఘటనను చదవండి.

"నా మొదటి ఉపాధ్యాయుడు"

"రామేశ్వరం పాఠశాలలో నేను ఐదవ తరగతి చదువుతున్నప్పుడు మాకు శ్రీ శివసుబ్రహ్మణ్య అయ్యర్ అనే

ఉపాధ్యాయుడుండేవాడు. ఆయన మా పాఠశాలలో మంచి ఉపాధ్యాయులలో ఒకరు. తన దగ్గర చదువుకునే పిల్లలందరినీ ఆయన అమితంగా ప్రేమించేవాడు.

ఆయన ఒకరోజు పక్షులు ఎలా ఎగురుతాయో పాఠం చెప్పాడు. నల్లబల్లమీద ఒక పక్షి బొమ్మ గీసి దాని తల, తోక, రెక్కలు, శరీర నిర్మాణాన్ని వివరంగా చిత్రించాడు. పక్షులు తమ రెక్కల్ని అల్లలాడించడం ద్వారా ఎట్లా ఎగరగలుగుతాయో, అవి ఎగురుతున్నప్పుడు తమ తోక ద్వారా ఎట్లా దిశలు మార్చుకోగలుగుతాయో చూపించాడు. దాదాపు 25 నిమిషాల పాటు పక్షులు ఎగరడంలో వివిధ భావనలైన ఎగరడం, ఎదురీత, దిశాగమనం వంటి వాటిని చక్కగా వివరించాడు.

పాఠం ముగించిన తర్వాత ఆయన తను చెప్పింది మాకర్థమైందో లేదో అడిగాడు. నేను నా కర్థంకాలేదని చెప్పాను. ఆ మాటే చాలామంది విద్యార్థులు చెప్పారు. మా సమాధానం విని శ్రీ అయ్యర్ నిరుత్సాహపడలేదు. పైగా ఆ సాయంకాలం మమ్మల్ని సముద్రతీరానికి రమ్మన్నాడు. ఆ సాయంకాలం మా మొత్తం తరగతి విద్యార్థులమంతా రామేశ్వర సముద్రతీరంలో గుమిగూడాం. సైకత శ్రేణుల్ని తాకి విరిగి పడుతున్న అలల ఘోష విని ఆనందించాం. అప్పుడు మా ఉపాధ్యాయుడు ఆకాశంలో పదులుగా, ఇరవైలుగా గుంపులుకట్టి ఎగురుతున్న పక్షుల్ని చూపించాడు. ఆ అద్భుతమైన పక్షి సమూహాలను చూసి మేం విభ్రాంతులయ్యాం. అతడు ఆ పక్షుల్ని చూపిస్తూ అవి ఎగురుతున్నప్పుడు తమ రెక్కల్ని అల్లారుస్తున్నప్పుడు మాకెట్లా కనిపిస్తున్నాయో గమనించ మన్నాడు. అవి గాలికి ఏటవాలుగా ఎదురీదుతున్నప్పుడు వాటి తోకల్ని పరీక్షగా చూడమన్నాడు. అవి ఎగురు తున్నప్పుడు తాము కోరుకున్న దిశకు తిరగటానికి తమ తోకల్ని ఎట్లా వాడుకుంటున్నాయో పరిశీలించమన్నాడు.

అప్పుడాయన మమ్మల్ని ఒక చిత్రమైన ప్రశ్న అడిగాడు. 'పక్షిని నడిపిస్తున్న ఇంజను ఎక్కడుంది? దానికి ఆ శక్తి ఎక్కడి నుంచి వస్తుంద'ని. జవాబు కూడా ఆయనే చెప్పాడు. పక్షిని నడిపిస్తున్న శక్తి దాని ప్రాణ శక్తేనని, దాని ఇచ్ఛశక్తే దాని చోదకశక్తి అనీ. అంత గహనమైన భావలన్ని ఆయన మా కళ్లెదుట కనపడుతున్న దృష్టాంతంతో సులభంగా, సరళంగా సుబోధ పరిచాడు. శ్రీ అయ్యర్ నిజంగా గొప్ప ఉపాధ్యాయుడు. ఆయన మా పరిసరాలలో లభ్యమయ్యే ఉదాహరణలతో మాకొక గొప్ప సైద్ధాంతిక పాఠాన్ని అవలీలగా బోధించాడు. నిజమైన బోధనంటే అది.

నావరకూ నాకు నేనారోజు తెలుసుకున్నది కేవలం ఒక పక్షి ఎలా ఎగురుతుంది అన్న దాంతో ఆగిపోలేదు. ఒక పక్షి ఎలా ఎగురుతుందో ఆరోజు ఉపాధ్యాయుడు చెప్పిన పాఠం నాలో విశిష్ట అనుభూతిని జాగృతం చేసింది. నేను భవిష్యత్తులో చదువుకోబేయే చదువు ఆకాశయాన వ్యవస్థలకి సంబంధించినదై ఉండాలని నేనారోజే తీర్మానించుకున్నాను. శ్రీ అయ్యర్ చేసిన బోధనా, ఆ రోజు ఆయన చూపించిన దృష్టాంతం ఆ విధంగా నా భవిష్య అధ్యయనం దేనిగురించి సాగాలో నిర్ణయించేసాయి.

ఒక సాయంకాలం పాఠశాల ముగిసిన తర్వాత నేనాయన్నడిగాను. 'మాస్టారు, ఆకాశయాన వ్యవస్థల గురించి ఇంకా తెలుసుకోవాలంటే నేనేంచేయాలో చెప్పండి'. అప్పుడాయన చాలా ఓపిగ్గా నా భవిష్య విద్యాప్రణాళిక ఎలా ఉండాలో చెప్పుకొచ్చాడు. మొదట నేను 8వ తరగతి పూర్తి చేయాల్సి ఉంటుందని, ఆ తర్వాత హైస్కూలుకు వెళ్లాల్సి ఉంటుందని, హైస్కూలు అయిన తరువాత ఇంజనీరింగ్ చెయ్యాల్సి ఉంటుందని, అక్కడ ఆకాశయాన వ్యవస్థల గురించి చదువు కొనసాగించాలనీ చెప్పారు. ఈ మొత్తం క్రమంలో నేను కష్టపడి చదువుకోగలిగితే భవిష్యత్తులో ఆకాశయాన విజ్ఞానానికి సంబంధించి నేనెంతో కొంత సాధించగలుగుతానని కూడా ఆయన చెప్పాడు. నా ఉపాధ్యాయుడి సలహా ప్రకారం నేను కాలేజికి వెళ్లినపుడు భౌతికశాస్త్రం చదువుకున్నాను. అలాగే మద్రాసు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చేరినపుడు ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌ను ఎంచుకున్నాను. నా ఉపాధ్యాయుడు పక్షులు ఎలా ఎగురుతాయో వివరించటానికి చూపించిన దృష్టాంతం, నా చదువు కోసం ఆయన చేసిన సూచనలు

నా జీవితానికొక గమ్యాన్ని, లక్ష్యాన్ని ప్రసాదించాయి. నా జీవితంలో అదొక గొప్ప మలుపు. అక్కడ నుండే నా వృత్తి జీవితం రూపుదిద్దుకోవటం ప్రారంభమయింది. భవిష్యత్తులో నేనొక రాకెట్ ఇంజనీరుగా, అంతరిక్ష శాస్త్రవేత్తగా, సాంకేతిక నిపుణుడిగా రూపుదిద్దుకోవటానికి ఆ సంఘటనే నాంది పలికింది.

మిత్రులరా! మీరా సంఘటన చదివారు కదా! దీనిపై మీ స్పందన ఏమిటి?

ఈ సందర్భం కారణంగా బాలుడైన కలాం జీవితానికి ఒక లక్ష్యం, ఆ లక్ష్య సాధనకు కావలసిన ప్రేరణ ఏర్పడ్డాయి.

మీ విద్యార్థులకు ప్రేరణ కలిగించడానికి మీరేంచేస్తారు?

రేపు మనం మన తరగతిలో ఈ క్రింది విషయాలు చర్చిద్దాం.

1. మీరు గత సంవత్సరం చదివిన ప్రేరణదాయకమైన పుస్తకాలు ఏవి?
2. మీ బోధనా పద్ధతులను మెరుగుపరచుకోదగిన పుస్తకాలు ఏవి?
3. విద్యార్థులను బాగా అర్థం చేసుకోవడానికి మీరు చేసిన ప్రయత్నాలు ఏమిటి?
4. మీ విద్యార్థుల నుండి మీరేమి నేర్చుకున్నారు?

పై విషయాలపై విద్యార్థులు తయారై వస్తారు.

ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా చర్చ నిర్వహించాలి.

1. రాబోయే ఒక సంవత్సరంలో వారు చదవదలచుకున్న కొన్ని పుస్తకాల జాబితాను, మాగజైన్లను చక్కగా వ్రాయమని చెప్పండి.
2. మీరు విద్యార్థులకు బోధిస్తున్నప్పుడు విద్యార్థులు ఎలా బోధిస్తున్నప్పుడు, ఏ పద్ధతిలో బోధిస్తున్నప్పుడు ఆసక్తిగా నేర్చుకున్నారో, వాళ్ళ అనుభవాలను వివరించమనండి.
3. విద్యార్థుల సామర్థ్యాలను వాళ్ళు ఎలా తెలుసుకున్నారో, ఎలా అంచనా వేసారో తెలియజేయమని చెప్పండి.

ఉపాధ్యాయుడు తన వృత్తిలో విజయం సాధించాలంటే మంచి వ్యక్తిత్వంతో పాటు తన బోధించే విషయంపై మంచి పట్టు అవసరం, సరైన బోధనాపద్ధతులను, బోధనాభ్యసన ప్రక్రియలను ఉపయోగించడంతో బాటు, విద్యార్థుల సామర్థ్యాలను సరిగ్గా అంచనా వేయగలగాలి. ఇది అత్యంత ముఖ్యమైన భూమిక.

ఉపాధ్యాయునికి తాను బోధించే విషయమై లోతైన పరిజ్ఞానం అవసరం. ఉపాధ్యాయులు విద్యార్థులుగా ఉన్నప్పుడు విషయ పరిజ్ఞానం సంపాదిస్తారు. కొన్ని సందర్భాలలో అన్ని అధ్యయనాలు చదివి ఉండకపోవచ్చు. కొన్ని అధ్యాయాలు వదిలివేసి ఉండవచ్చు. చదివినా తగినంతలో లోతుగా అధ్యయనం చేసి ఉండకపోవచ్చు. మనం చదివేటప్పుడు (అది డిగ్రీ కావచ్చు, పి.జి.కావచ్చు) మన దృష్టి ఎక్కువగా పరీక్షలపైన, మార్కులు, ర్యాంక్‌పై ఉంటుంది. కాబట్టి ఆయా అంశాలపై పరిపూర్ణమైన, లోతైన, విస్తృతమైన జ్ఞానాన్ని సంపాదించామని చెప్పలేము.

ఆ తదుపరి పోటీ పరీక్షలకై తయారయ్యేటప్పుడు గతం కంటె మరికొంత లోతైన అధ్యయనం చేసి ఉండవచ్చు.

కాని మనం ఒక విషయాన్ని బోధించవలసి వచ్చినప్పుడు ఇంకా లోతైన, విస్తృతమైన అధ్యయనం అవసరం అవుతుంది. విద్యార్థులు మన పాఠ్యాంశంలోని ఏ చిన్న అంశంపైనైనా వివరణ కోరవచ్చు, ప్రశ్నించవచ్చు. ఆ ప్రశ్నలకు సమాధానం మన పాఠ్యపుస్తకంలో లేకపోవచ్చు. మనం పరామార్శ గ్రంథాలను, ప్రామాణిక గ్రంథాలను చదవవలసి ఉంటుంది.

మనం ఒక విషయాన్ని బోధించడం ప్రారంభించినపుడే నిజంగా మనం నేర్చుకోవడం ప్రారంభిస్తాం. బాగా, క్షుణ్ణంగా అధ్యయనం చేస్తాము. ఇది చాలామంది బోధనలో విజయవంతమైన ఉపాధ్యాయుల అభిప్రాయం.

ఈ క్రింది సన్నివేశాన్ని చదవండి.

ఎవరికీ తలవంచను. – డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలామ్

నా రెండవ ఉపాధ్యాయుడు :

విమానయాన ఇంజనీరుగా నేను రక్షణ మంత్రిత్వ శాఖలో ఢిల్లీలో పనిచేశాను. తరువాత బెంగుళూరులో రక్షణ అభివృద్ధి సంస్థలో పనిచేసాను. అక్కడ పనిచేస్తున్నప్పుడు ఆ సంస్థ డైరక్టరు సలహామేరకు హోవర్‌క్రాఫ్ట్ అభివృద్ధి ప్రణాళికను చేపట్టాను. అందులో భాగంగా హెూవర్‌క్రాఫ్ట్ ఆకాశంలో సునాయాసంగా ఎగరటానికి అవసరమైన సాధనాలను రూపొందించవలసిన అవసరం ఏర్పడింది. అయితే అటువంటి సాధనాలను సాంప్రదాయిక పద్ధతిలో ఎలా తయారు చేయవచ్చో నాకు తెలుసుగానీ. కొత్త తరహా సాధనాల్ని తయారుచేయడం మాత్రం నాకు తెలియలేదు. ఆ సందర్భంగా బెంగుళూరు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పనిచేస్తున్న ప్రొ. సతీష్‌ధావన్ వైమానిక శాస్త్రంలో అగ్రగణ్యుడనీ నేనాయన సహాయం తీసుకుంటే బాగుంటుందని కొందరు మిత్రులు సలహా ఇచ్చారు.

నేను నా డైరెక్టరు డా. మెండిరెట్టా అనుమతి మీద ప్రొ. సతీష్‌ధావన్‌ను కలిసాను. నేను ఆయన్ని కలవడానికి వెళ్ళినపుడు ఆయన ఒక చిన్న గదిలో కూర్చొని పనిచేసుకుంటున్నారు. ఆ రూమ్ నిండాపుస్తకాలు. ఒకవైపు గోడమీద నల్లబల్ల ఒకటి వేలాడుతూ ఉంది. వచ్చిన పని ఏమిటో చెప్పమని ప్రొ.ధావన్ నన్నడిగారు. నేను నా ప్రాజెక్టు గురించీ, నేను రూపకల్పన చేస్తున్న హెూవర్‌క్రాఫ్ట్‌కు అవసరమైన కొత్త తరహా సాధనాల గురించి వివరించాను. ఆయన కాకు కావలసినది బోధించడానికి ఒప్పుకున్నాడు. అయితే దాదాపు ఆరువారాల పాటు ప్రతి శనివారం మధ్యాహ్నం 2 గంటల నుండి 3 గంటల దాకా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో తను చెప్పే పాఠాలు వినవలసి ఉంటుందన్నాడు. అలాగే నాకోసం రిఫరెన్స్ పుస్తకాల జాబితా ఒకటి తయారుచేసి, నేనాయన పాఠాలు వినడానికి ముందే పుస్తకాలన్నీ చదివి రాయవలసి ఉంటుదని అన్నారు. నాకదంతా గొప్ప అభ్యసన అవకాశమనిపించింది. నేను డా. ధావన్ పాఠాలు వినడం మొదలుపెట్టాను. దాంతోపాటు ఆయన్ను తరచు కలుస్తూండేవాడిని కూడా. మేము కలిసిన ప్రతిసారీ ఆయన నా అవగాహనకు పరీక్ష పెడుతుండే కీలకమైన ప్రశ్నలు అడుగుతుండేవాడు. మంచి ఉపాధ్యాయుడు సక్రమమైన ప్రణాళికతో పాఠాలు చెప్పటానికి తననీ, విద్యార్జన కోసం తన విద్యార్థినీ ఎలా తర్ఫీదు చేసుకుంటాడో నేను మొట్టమొదటిసారిగా గ్రహించాను.

ఆ అధ్యయనమట్లా ఆరువారాలు కొనసాగింది. నాకు కావలసిన కొత్త రతహా సాధనాలను ఎలా రూపొందించుకోవాలో తెలుసుకున్నాను. అప్పుడు ప్రొ.ధావన్ ఆ సాధనాల నమూనా తన ఎదుట తయారుచేసి చూపించమన్నాడు. అప్పుడర్థమైంది నాకు డా.ధావన్ గొప్ప ఉపాధ్యాయుడు మాత్రమేకాదు, వైమానిక వ్యవస్థల్లో ఉత్తమ ఇంజనీరు అనికూడా. నేనా నమూనాను పూర్తిచేసి చూపించాక ప్రొ.ధావన్ దాన్ని సవివరంగా పరీక్షించాడు. అప్పుడు మేమానమూనాని పోతపోయడానికి సిద్ధపడ్డాము. కాని పోతపోయడానికి అవసరమైన ముడిసరుకు స్థానిక మార్కెట్‌లో అందుబాటులో లేకపోయింది. ప్రొ.ధావన్ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ ఛైర్మన్‌తో మాట్లాడి ఆ ముడిసరుకు లభ్యమయ్యే ఏర్పాటు చేశాడు. నేనానమూనాని పోతపోసి ఆయనకు చూపించాను.

మేము తయారుచేసిన సాధనాల్ని పరీక్షించి చూసేటప్పుడు కొన్ని బాలారిష్టాలు ఎదురయ్యాయి. అటువంటి గడ్డు పరిస్థితుల్లో నేను ఎప్పుడు కోరితే అప్పుడు డా.ధావన్ ప్రయోగ క్షేత్రానికి హాజరై నేను లేవనెత్తిన సమస్యలన్నిటికీ పరిష్కారాలు చూపిస్తుండేవాడు. నేను తయారుచేసిన సాధనం సజావుగా పనిచేస్తుందో లేదో పరిక్షించే దశకు చేరుకున్నప్పటికి ఆ పరీక్ష దాదాపు 50 గంటల పాటు నిర్విరామంగా కొనసాగింది. ఆ పరీక్షా ప్రయోగాన్నంతటిని డా.ధావన్ స్వయంగా చూసి నన్ను అభినందించాడు. నేను తరగతి గదిలో నేర్చుకుని, నాకై నేనొక నమూనా తయారుచేసి పోతపోసి నా లక్ష్యానికి తగ్గట్టుగా దాన్ని విజయవంతంగా పరీక్షించిన ఆ రోజుని నేనెన్నటికీ మరువలేను.

నా అంతట నేను తయారుచేసిన ఆ నమూనా నా తదనంతర జీవితంలో ఎన్నో సంక్లిష్ట అంతరిక్ష నౌకా వ్యవస్థలను రూపొందించటానికి ఆవశ్యకమైన ఆత్మవిశ్వాసాన్ని నాకందించింది. ఆ రోజు నేను నేర్చుకున్నది హొవర్‌క్రాఫ్ట్‌కు అవసరమైన ఒక కొత్త తరహా సాధనాన్ని నిర్మించడమే కాదు, ఒక ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురయ్యే సమస్యల్ని ఎట్లా అధిగమించాలో, ఒక ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురుకాగల వైఫల్యాల్ని దాటి వ్యవస్థను ఎట్లా జయప్రదం చేయగలగాలో కూడా నేర్చుకున్నాను.

ఈ ఇద్దరు ఉపాధ్యాయులు నా జీవితంలో నాకు రెండు ముఖ్యమైన విషయాలు నేర్పారు. మొదటిది : ఉపాధ్యాయుడు తన విద్యార్థికి జ్ఞానాన్నివ్వటమేకాక, తన విద్యార్థి జీవితాన్ని గొప్ప కలలతోనూ, ఉదాత్త ఆశయాలతోను కూడా నింపివేస్తాడు. రెండవది, ఉపాధ్యాయుడు తన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి వాళ్ళు నేర్చుకునే క్రమంలో తాము దేన్నైనా సాధించగలమనే భావనని పెంచి పోషిస్తాడు."

ఈ ప్రపంచంలో ప్రతి ఒక్క మనిషీ మానవ చరిత్రలో తనకంటూ ఒక అధ్యయనాన్ని లిఖించగలడని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గ్రహించాలి. మానవచరిత్రలో నా అనుభవం ఒక చిన్ని బిందువు వంటిది మాత్రమే కావచ్చుగాక! కాని ఆ బిందువుకు కూడా తనదైన ఒక వ్యక్తిత్వం, ప్రకాశం ఉంటాయని నా అనుభవం ద్వారా నేను తెలుసుకున్నాను. అదే ఉపాధ్యాయుడి జీవితమే అయితే మరెన్నో దీపాల్ని వెలిగించేటంత ప్రకాశముంటుంది దానికి.

## ఉపాధ్యాయుడు నిన్ను కాలంకన్నా ముందుకు తీసుకుపోగలడు :

నేను తిరుచిరాపల్లిలో సెయింట్ జోసఫ్ కాలేజీలో చదువుకునే రోజులు. అప్పుడు ప్రతిరోజూ ఉదయం కాలేజీ ఆవరణలో బి.ఎస్సీ, ఎంఏ విద్యార్థులకు గణితశాస్త్రం బోధించడానికి నెమ్మదిగా నడిచిపోతూండే దైవసమానుడైన ఒక వ్యక్తిని చూస్తుండేవాడిని. ఆ వ్యక్తి నడుస్తుంటే అతడి చుట్టూ విజ్ఞాన ప్రకాశం వెల్లివిరుస్తూండేది. ఆయన ప్రఖ్యాత గణితశాస్త్ర ఉపాధ్యాయుడు డా. తోతాద్రి అయ్యంగార్. సామాజిక జీవితంలో విద్యా సంస్కృతుల ఉత్తమ వారసత్వానికి అత్యుత్తమ ప్రతీక ఆయన. ఆ రోజుల్లో కాలిక్యులస్ శ్రీనివాసన్‌గారు మా గణితశాస్త్ర ఉపాధ్యాయులు. ఆయన ఎప్పుడు మాట్లాడినా ప్రొ.తోతాద్రి అయ్యంగార్ గురించి గొప్పగా మాట్లాడేవారు. అప్పట్లో ప్రొ. తోతాద్రి అయ్యంగారు మొదటి సంవత్సరం విద్యార్థులకు పాఠాలు చెప్తుండేవారు. ఆవిధంగా నాకు కూడా ప్రొ.అయ్యంగార్ వద్ద ఆధునిక బీజగణితం, సాంఖ్యకశాస్త్రం చదువుకునే అవకాశం లభించింది. గణితశాస్త్రంలో అత్యంత సంక్లిష్టభావనల్ని ఆయన వివరిస్తుండగా వినే అవకాశం కూడా కలిగింది. మాలోంచి బాగా చురుకైన పదిమంది విద్యార్థుల్ని ఎంపికచేసి కాలిక్యులస్ శ్రీనివాసన్‌గారు సెయింట్‌జోసఫ్ గణితశాస్త్రపు క్లబ్బుకి పంపేవారు. అక్కడ వారికి ప్రొ. తోతాద్రి అయ్యంగార్ గారి ప్రసంగాలు వినే అవకాశం లభించేది. 1952లో ఆయన చేసిన అటువంటి ఒక ప్రసంగం నాకిప్పటికీ గుర్తుంది. ఆ రోజు ఆయన నలుగురు గొప్ప గణితశాస్త్ర వేత్తల గురించీ, ఖగోళ శాస్త్రవేత్తల గురించీ మాకు పరిచయం చేశారు. ఆర్యభట్ట, భాస్కరుడు, బ్రహ్మగుప్తుడు, రామానుజంల గురించి ఆయన చేసిన ఆ ప్రసంగం ఇప్పటికీ నా చెవులలో మార్మోగుతూ ఉంది. అటువంటి ఉత్తేజకరమైన ప్రసంగాలూ, అభ్యసనం నా విద్యావ్యవస్థకు పునాదిగా నిలబడ్డాయి.

విలువతో కూడిన బోధనతో ప్రాథమిక పాఠశాలలో, మాధ్యమిక పాఠశాలలో, కళాశాలల్లో నాకు పాఠాలు చెప్పిన నా గురువులు నన్ను కాలంకన్నా, కొన్ని దశాబ్దాల ముందుకు తీసుకుపోయారు.

ఉపాధ్యాయుడు తాను బోధించే విషయాన్ని సక్రమంగా అధ్యయనం చేస్తే, విషయంపై బాగా పట్టు ఉంటే తరగతి గదిలోనికి ఆత్మవిశ్వాసంతో ప్రవేశిస్తాడు.

**కృత్యము –1 :**

విద్యార్థులారా మనం ఒక పనిచేద్దాం. 6వ తరగతిలో ఒక పాఠం తీసుకుందాం. దీనిలోని కొన్ని భాగాలను మనలోని ముగ్గురు విద్యార్థులకు ఇద్దాం. వారు ఆయా బాగాలను బాగా అధ్యయనం చేసి రేపటి కాలాంశంలో 10 నిమిషాలు ఆయా భాగాలను వివరించాలి. విషయం సమగ్రంగా, సంక్షిప్తంగా ఉండాలి. మీరు విషయాన్ని వివరించిన తరువాత దానిపై అనుబంధ ప్రశ్నలకు అవకాశం ఉంది. ప్రశ్నలు అడిగే అవకాశం అందరికీ ఉంది కాబట్టి వారు కూడా చదివి రావాలి. ఆ అంశాలు :

1. సింధులోయ నాగరికత నాటి మతం
2. వేదాకాలంలో మతం
3. బౌద్ధమతం

విద్యార్థులు వారి వారి అంశాలను సమగ్రంగా వివరిస్తారు. దానిపై చర్చ జరుగుతుంది. తయారై విషయాన్ని వివరించిన విద్యార్థులు తాము ఏయే గ్రంథాలు చదివారు ఎంత సమయం చదివారు. వాళ్ళ అనుభవం అనుభూతి ఏమిటి? మొ॥ విషయాలు వివరిస్తారు. తరగతి గదిలో దీనిపై విద్యార్థుల మధ్య చర్చ జరుగుతుంది. ఉపాధ్యాయుడు సంధానం చేస్తాడు. లేదా ఎవరైనా విద్యార్థికి అయినా సంధానం చేసే బాధ్యత అప్పగించవచ్చు.

ముగింపు :–

మరి మనం ఒక సంవత్సరంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా ఎన్ని తరగతులకు బోధించవలసి రావచ్చు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు కనీసం 5 లేదా 4 తరగులను బోధించవలసి రావచ్చు. ఒక్కొక్క తరగతిలో కనీసం 20 పాఠ్యాంశాలుంటాయి. రోజుకి కనీసం 4 లేక 5 పీరియడ్‌లు బోధించవలసి రావచ్చు. సమర్ధవంతంగా బోధించాలంటే మనం ఇంటివద్ద ఎంత శ్రమ తీసుకోవాలి. ఎంత సమయం వెచ్చించాలి? మీరే ఆలోచించండి.

"మన విద్యార్థుల విజయానికి ప్రేరణాదాతలుగా మనం ఉండాలంటే మనం శ్రమించవలసిన అవసరం లేదా?

**Using instructional methods and assessments strategies.** విభిన్న సన్నివేశాలలో సరైన బోధనా పద్ధతులను మూల్యాంకనా వ్యూహాలను అనుసరించాలి.

విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించేటప్పుడు సరైన బోధనావ్యూహాలు, పద్ధతులు, మూల్యంకనా పద్ధతులు వ్యూహాలు ఎంతో అవసరం. విద్యార్థుల యొక్క స్థాయిననుసరించి, విషయ స్వభావాన్ని అనుసరించి బోధించాలి. సరియైన మూల్యాంకనా విధానాన్ని అనుసరించాలి.

**కృత్యం – 2 :**

ఆంధ్రప్రదేశ్ ప్రదాన భూ స్వరూపాలు అనే పాఠ్యాంశంను తీసుకుందాం.

ఇందులో 3 భాగాలు ముగ్గురికి ఇవ్వబడతాయి. ఒక్కొక్కరు 10 ని.లు బోధించాలి. ఈ 10 ని.లలో మీదైన బోధనా పద్ధతులు ఉపయోగించవచ్చు.

ఆ తరువాత మీరు ఉపయోగించిన బోధనా పద్ధతులపై చర్చ జరుగుతుంది. దీనిలో మీరు ICT ని కూడా ఉపయోగించవచ్చు.

**కృత్యం – 3 :**

మూల్యాంకనా వ్యూహాలు.

మనం విద్యార్థులను ఎలాంటి వ్యూహాల ద్వారా మూల్యాంకనం చేయవచ్చు అనే అంశంపై చర్చ జరపాలి. మూల్యాంకనానికి ఆధారం విద్యాప్రమాణాలు (Academic Standards). మనం ఎంతవరకు వీటిని సాధించగలిగాం అనే అంశాలపై చర్చించి ముగిద్దాం.

## 6.3. విద్యార్థుల పూర్వజ్ఞానాన్ని పాఠ్యాంశాలతో అనుసంధానం చేయడం ద్వారా విద్యార్థులలో ఆసక్తిని, నిమగ్నతను పెంపొందించుట.

విద్యార్థులు పుట్టినప్పటి నుండి వాళ్ళ మానసిక వికాసం లేక సంజ్ఞాత్మక వికాసం జరుగుతూ ఉంటుంది. ప్రతినిత్యం చుట్టూ ఉన్న సామాజిక, భౌతిక పరిసరాలతో Interact అవుతూ ఉంటాడు. కాబట్టి ఈ పరస్పర చర్య కారణంగా అతను కొన్ని భావనలను ఏర్పరచుకుంటాడు. కొన్ని అనుభవాలను, అనుభూతులను పొందుతుంటాడు.

కాబట్టి విద్యార్థి పాఠశాలకు వచ్చేనాటికే కొన్ని అనుభవాలతో, కొన్ని భావనలతో, నైపుణ్యాలతో వస్తాడు. అతడు ఏ అనుభవాలు లేని ఖాళీ బుర్ర కాదు.

కాబట్టి అతని యొక్క గత అనుభవాలతో నూతన అనుభవాలును జోడించడమే అభ్యసనము. నూతనంగా జోడించబడే అభ్యసన అనుభవాలు అతని గత అనుభవాలకు చాలా దగ్గర సంబంధం కలవిగా, సులభంగా అర్థం చేసుకొని ప్రతిస్పందించదగినవిగా ఉండాలి. అందుకే Conneting is Learning అన్నారు.

అందుకే అనుభవాల స్వరూపం ఎలా ఉండాలి.

తేలిక నుండి కష్టం వైపు (Easy to Difficult)

సరళత నుండి సంక్లిష్టత వైపు (Simple to Complex)

తెలిసిన దాని నుండి తెలియని దానికి (From known to unknown)

ఉదా :- సాంఘికశాస్త్రంలో మొదట గ్రామం తరువాత జిల్లాను పరిచయం చేస్తాము. ఆ తరువాత రాష్ట్రాన్ని పరిచయం చేస్తాము. ఆ తరువాత దేశాన్ని పరిచయం చేస్తాము.

దీనిలో పై మూడు సూత్రాలు ఇమిడి ఉన్నాయి.

- 6వ తరగతిలో ప్రాచీన భారతదేశం, 7వ తరగతిలో మధ్యయుగాలలో భారతదేశం, 8వ తరగతిలో ఆధునికయుగంలో భారతదేవం పరిచయం చేయబడ్డాయి.
- మనం కల్పించే కృత్యాలు, సన్నివేశాలు, అనుభవాలు విద్యార్థి వయస్సును, గత అనుభవాలను దగ్గరగా ఉండాలి. అప్పుడు తాను నేర్చుకునేటప్పుడు దానిలో పూర్తిగా నిమగ్నమౌతాడు. ఈ విషయమై ఉపాధ్యాయునికి అవగాహన ఉండాలి.
- ఈ అనుసందానం చేయడం అనేది క్రింది తరగతులలోని భావనలను పై తరగతిలోనికి అనుసంధానం చేయడం, వారి పరిసరాలలోని, వాళ్ళ అనుభవాలలోని అంశాలను తరగతి గదికి అనుసంధానం చేయడం. వాళ్ళ తరగతిలోనే ముందు పాఠాన్ని తరువాత పాఠానికి అనుసంధానం చేయడం.

విద్యార్థులారా మనం కొన్ని అంశాలను రేపు చర్చిద్దాం. నేను మీకు కొన్ని అంశాలను ఇస్తాను. వాటిపై మీరు తయారైరండి. రేపటి తరగతిలో ఈ అంశాలపై చర్చిద్దాం.

1. మీరు క్రింది తరగతిలోని అంశాలను, పై తరగతిలోని అంశాలను ఎలా అనుసంధానం చేశారు? ఎలా అనుసంధానం చేయవచ్చు? మీరు అనుసంధానం చేస్తూ బోధించినట్లయితే విద్యార్థులతో మీ అనుభవాలేమిటి?

   5వ తరగతి భావనలు, అనుభవాలు – 6వ తరగతి భావనలు, అనుభవాలు

   6వ తరగతి భావనలు, అనుభవాలు – 7వ తరగతి భావనలు, అనుభవాలు

   7వ తరగతి భావనలు, అనుభవాలు – 8వ తరగతి భావనలు, అనుభవాలు
2. మీమీ పాఠ్యాంశాలలో ఏయే పాఠ్యాంశాలను వారి గ్రామ, కుటుంబ, తదితర అంశాలకు అనుసంధానం చేయగలిగారు? విద్యార్థుల ప్రతిస్పందన ఎలా ఉన్నది?
3. మీరు బోధించిన పాఠశాలలో అందరు విద్యార్థులు ఒకేవిధంగా ప్రతిస్పందించినారా? ఎందుకు?

## 6.4. సాంఘిక శాస్త్ర బోధన, సమాచార ప్రసార సాంకేతిక సమైక్యత :

ICT మరియు ఇతర సాంకేతిక పరిజ్ఞానం బోధనకు నూతన ఆవిష్కరణల వైపు తీసుకెళుతుంది. బోధనను ఆసక్తికరంగా చేస్తుంది. బోధనలో కొత్తదనాన్ని తీసుకువస్తుంది. ఉపాధ్యాయునికి విద్యార్థికి ఎక్కువ సంతృప్తిని, సంతోషన్ని కలిగిస్తుంది.

సమాచార, ప్రసార సాంకేతికత అనుసంధానం చేయడం గురించి కొంత మనం చర్చించాలి. సాంకేతిక సాధనాలైన కంప్యూటర్‌లు, ఇంటర్‌నెట్, రేడియో, టి.వి., టెలిఫోన్ మొదలైన వాటిని అనుసంధానం చేయడం ద్వారా బోధనను మెరుగుపరచడం, అభ్యసనాన్ని పటిష్ఠము, వేగవంతం చేయడమే ఇందులో ప్రధానమైన అంశం.

దీనికోసం ప్రభుత్వం రకరకాల పథకాలను వివిధ సమయాలలో ప్రవేశపెట్టినది. వివిధ విద్యాకమీషన్ల కూడ దీనిని ప్రాముఖ్యతను నొక్కి చెప్పినాయి. దీనిలో 1984–85లో ప్రవేశపెట్టిన CLASS (Compuer literacy and studies in schools), SMART Schools కొంతమేరకు మనం ప్రగతి సాధించినప్పఇకి ఇంకా సాధించవలసినది ఎంతో ఉంది.

దీనిలో ప్రధానంగా ఈ క్రింది అంశాల సంబంధించిన సమస్యలను విందాం.

అవస్థాపనా సంబంధిత సమస్యలు :–

అన్ని పాఠశాలలకు కంప్యూటర్‌లు లేవు. ఉన్నా తగినంత సంఖ్యలో లేవు. ప్రతి విద్యార్థి ఎక్కువ గంటలు, అన్ని సబ్జెక్టులకు ఉపయోగించ తగినట్లుగా లేవు. చాలాచోట్ల LCD ప్రొజెక్టర్ల అవకాశం లేదు. అందువల్ల తగినంత స్థాయిలో ICT ని అనుసంధానం చేయగల పరిస్థితి లేదు.

ఉపాధ్యాయ సంబంధిత సమస్యలు :–

అందరు ఉపాధ్యాయులకు తగినంత కంప్యూటర్ లేక సాంకేతిక పరిజ్ఞానం లేదు. వారికి ICT ఆధారంగా పాఠాలను తయారు చేసుకోగల స్థాయి లేదు. మొదట ముఖ్యమైనది ఉపాధ్యాయులు మానసిక సంసిద్ధత. కొందరు వయస్సులో పెద్దవారైనా, సాంకేతిక పరిజ్ఞానం లేకపోయినా వెంటనే ప్రయత్నం చేసినట్లయితే నేర్చుకుని చేయగలరు. కాబట్టి ముఖ్యమైనది మానసిక సంసిద్దత.

- శిక్షణ పొందటానికి తగిన అవకాశాలు కల్పించాలి.
- బయట మన సొంత ప్రయత్నంతో శిక్షణ పొందటానికి ప్రయత్నం చేయాలి.
- ప్రస్తుతం వృత్తివిద్య శిక్షణలో విద్యార్థులకు ICT లో శిక్షణ ఇస్తున్నారు. ఇది సంతోషించదగిన విషయం.
- ప్రాంతీయ భాషలలో ఈ పరిజ్ఞానాన్ని, అంతర్జాలాన్ని తీసుకొని వచ్చినట్లయితే ఇంకా వేగంగా అధ్యయనం చేసే అవకాశం ఉన్నది.
- ఇప్పుడు ఉన్న శిక్షణా అవకాశాలను, అవస్థాపనా సౌకర్యాలను నిరంతరం కొనసాగించే ప్రక్రియను ప్రతిపాదించాలి.
- పాఠశాలలో తగిన గదులు, వాటి అమరిక
- ప్రభుత్వ విధానాలు, నిరంతరంగా అధ్యయనం.

ఉపాధ్యాయుడు :–

5 ప్రధాన అంశాలపై కేంద్రీకరించును. 1. కొన్ని ప్రత్యేక అంశాలపై కేంద్రీకరించుట, 2. పాఠ్య ప్రణాళికతో అనుసంధానం, 3. ICT కి అనుగుణంగా పాఠ్య ప్రణాళికలో మార్పు, బోధనా ప్రక్రియతో సహా. 4. ఉపాధ్యాయుని పాత్రలో మార్పు, 5. బోధనా సిద్దాంతాల ప్రాముఖ్యత తెలియజేయుట.

ఉపాధ్యాయుడు నిరంతరం తమ సామర్థ్యాలను, నైపుణ్యాలను పెంచుకొనుచూ ఉండాలి.

విద్యాపరిపాలకులు :–

విద్యాపరిపాలకులు వెనుక ప్రోత్సాహం, చొరవ కూడా ప్రాముఖ్యత వహిస్తాయి. వారు కూడా ICT లో ప్రవీణులు, సమర్థులు అయితే ఉపాధ్యాయులకు ప్రేరణగా కూడా ఉంటుంది. పరిపాలకులు, సాంకేతికత, పాఠ్యప్రణాళిక, పరిపాలన, ఆర్థిక మొదలగు అంశాలలో ప్రోత్సాహులుగా ఉండాలి.

విషయాన్ని మెరుగుపరుచుట :-

ఉన్న పాఠ్యాంశాలను ఎలా ICT పద్ధతిలోకి తీసుకుని రావాలి అనేది నిరంతరం జరగాలి. పాఠ్యాంశాలను ఈ పద్ధతిలో తీసుకుని రావాలి.

**National policy of ICT - MHRD - 25 March 2012**

మరికొంత సమాచారం తీసుకుందాం :

మీరు ఒక ప్రాథమిక పాఠశాలలో / ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. మీ పాఠశాలలో ICT based learing ఉండాలి. అప్పుడు ఏమి చేస్తారు.

మీ పాఠశాలలో ఈ క్రింది సన్నివేశం ఉండవచ్చు.

1. మీ పాఠశాలలో ఏవిధమైన కంప్యూటర్ లేదు - అప్పుడు ICT ని ఎలా అమలు చేస్తారు?
2. మీ పాఠశాలలో ఒకే కంప్యూటర్ ఉన్నది. కాని Internet సౌకర్యం లేదు. అప్పుడు ఏమి చేస్తారు?
3. మీకు లాప్‌టాప్ ఉంది, ఇంటర్‌నెట్ సౌకర్యం ఉన్నది.
4. మీ పాఠశాలలో 10 కంప్యూటర్లు ఉన్నాయి. ఇంటర్నెట్ సౌకర్యం కూడా ఉంది. LCD సౌకర్యం కూడా ఉంది.

విద్యార్థులను 4 సమూహాలుగా చేసి వారు ఈ విషయంపై ఆలోచించి వారి నివేదికలను, అభిప్రాయాలను వ్యక్తం చేస్తారు. మిగిలిన విద్యార్థులు కూడా స్పందిస్తారు. ఉపాధ్యాయుడు దీనికి ముగింపు చేస్తాడు.

## 6.5. సాంఘికశాస్త్ర బోదన-సామాజిక సాంస్కృతిక అంశాలు :-

సాంఘికశాస్త్ర బోధనలో సాంఘిక, సాంస్కృతిక అంశాలకు ఎంతో ప్రాధానత్య ఉంటుంది. అన్ని రకాలైన సాంఘిక, సాంస్కృతిక అంశాలపై పాఠ్యపుస్తకాలలో సమగ్రమైన చర్చ జరిగే అవకాశం లేదు. ఈ సాంఘిక సాంస్కృతిక అంశాలు సుదీర్ఘకాలంలో సమాజంలో కొనసాగుతున్న అంశాలు కావచ్చు, ప్రస్తుతం తెరపైకి వచ్చిన అంశాలు కావచ్చు, వాటిని తరగతి గదిలో అవకాశమున్నప్పుడు చర్చించాలి. విద్యార్థులు ప్రశ్నించడానికి అవకాశం ఇవ్వాలి. ఉపాధ్యాయుడే వివిధ సందర్భాలలో విషయాన్ని ప్రతిపాదించి విద్యార్థులు మాట్లాడడానికి ప్రోత్సహించాలి.

ఇలా చేస్తే ఉపయోగాలేమిటి?

1. విద్యార్థుల మాట్లాడే సామర్థ్యం పెరుగుతుంది.
2. చక్కగా చర్చలో పాల్గొంటారు.
3. సమస్యలపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతుంది.
4. తదుపరి సామాజిక జీవితంలో సమర్థవంతంగా తన బాధ్యతను నిర్వర్తిస్తాడు.
5. సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెంపొందుతుంది.

ఇందుకోసం ఉపాధ్యాయుడు తరగతి గదిలో అనుసరించవలసిన కొన్ని సూచనలు.

1. విద్యార్థులు తరగతి గదిలో ప్రశ్నలు అడగటానికి, చర్చించడానికిగాని అనువైన స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాలి. వారికి తగు గౌరవాన్నిచ్చి ప్రోత్సహించాలి.
2. విద్యార్థులు తగు ప్రశ్నలకు సమాధానం తెలుసుకొనుట కొరకు మార్గాలను సూచించాలి.

3. వారి నైపుణ్యాలను, లోపాలను ఎత్తి చూపకుండా ముందుకు వెళ్ళడానికి ప్రోత్సహించడం.

4. వారు చెప్పే, ప్రతిపాదించే విషయాలను శ్రద్ధగా గమనించి తగు సూచనలను చేయాలి.

5. వారు పరస్పరం ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకొనేలా చూడాలి.

జాగ్రత్తలు :–

– మాట్లాడేటప్పుడు విద్వేష పూరితమైన, కించపరచే విధంగా మాట్లాడరాదు.

– తన అభిప్రాయాలను వ్యక్తం చేసేటప్పుడు కొన్ని సాధారణ నియమాలను ఏర్పాటు చేసుకొని ఆ పరిధిలోనే వాటిని చర్చించాలి.

కన్ని సూచనలు :–

1. ఏ విషయంపైనైనా విభేధించు కాని విద్వేషంగా ఉండవద్దు.

2. ముఖ్యంగా సమాజంలో వెనుకబడిన వర్గాలు, వ్యక్తుల గురించి మాట్లాడేటప్పుడు సరియైన, ఆమోద యోగ్యమైన పదజాలాన్ని ఉపయోగించాలి.

3. కొన్ని అంశాలకే చర్చను పెట్టు. వాటిని సమర్ధవంతంగా నిర్వహించు.

4. వారికి సవాలుగా ఉండే సమస్యలు, ప్రశ్నలు ఇవ్వాలి. సామర్థ్యాన్ని పెంచుకునే అవశాకాలు వుండాలి.

5. చారిత్రక వివాదాలలోకి కూడా వెళ్ళే అవకాశాలు ఇవ్వు.

6. అన్ని రకాలైన విద్యార్థులకు గౌరవాన్నివ్వు.

7. సాంఘిక, సాంస్కృతిక అంశాలలో ఏవి సత్యాలో, ఏవి కావో తెలుసుకోనివ్వు.

8. వారు చెప్పే విషయాలకు సరియైన ఆధారాలను ఇవ్వవలసినదిగా చెప్పాలి.

9. ప్రత్యామ్నాయ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి అవకాశం ఇవ్వు. Intellectual Honesty కలిగి వుండాలని చెప్పు.

10. చర్చలలో, పాఠ్యాంశాల నిర్వహణలో పాల్గొనడానికి విద్యార్థులను ప్రోత్సహించు.

**కొన్ని సాంఘిక సమస్యలు :–**

| | | |
|---|---|---|
| 1. నిరక్ష్యరాస్యత | 2. బాల్య వివాహాలు | 3. పోషకాహార లోటు |
| 4. బాల కార్మికత | 5. బీదరికం | 6. స్వచ్ఛత |
| 7. అవినీతి | 8. కులతత్వము | 9. మహిళా సశక్తీకరణ |

**సాంస్కృతిక అంశాలు :–**

1. భారతీయ సంస్కృతి – పాశ్చాత్య సంస్కృతి
2. నేటి యువతరం – తీరు తెన్నులు

**మంచి తరగతి గది దృశ్యీకరణ :–**

ఒక మంచి తరగతి గది ఎలా ఉండాలని వారు భావిస్తున్నారు? ఒక మంచి తరగతి గది అంటే ఏమిటి?

– ఆహ్లాదకరమైన తరగతి గది.

– తరగతి గది పరిశుభ్రంగా ఉండడం, గదిలో మంచి సూక్తులు పెట్టడం.

– సమర్ధుడైన ఉపాధ్యాయుడు

– బోధనోపకరణాలు, మ్యాప్‌లు, చార్టులు

– కంప్యూటర్, అంతర్జాలం మొ॥ ఉండుట.

ఒక మంచి తరగతి గదిలోనికి వెళ్ళేటప్పుడు బాగా తయారై వెళ్ళాలి. విద్యార్థులకు అవసరమైన బోదనాభ్యసన సామాగ్రి ఉండాలి. కంప్యూటర్, ఇంటర్నెట్, ఎల్.సి.డి. అందుబాటులో ఉండాలి. కేవలం ఉపన్యాసం కాకుండా

విద్యార్థులకు స్వీయ అభ్యసనానికి అవకాశం ఉండాలి.

విద్యార్థుల మధ్య ఈ క్రింది విషయాన్ని చర్చించాలి :-

ఈ రోజు మన పాఠశాలలో ఉన్న సాధన సంపత్తి, బోధనోపకరణాలు, కంప్యూటర్ మొ॥నవి మీకు తెలుసు.

మీ దృష్టిలో ఒక ఆదర్శ తరగతి ఎలా ఉండాలని భావిస్తున్నారు. ఈ విషయమైన విద్యార్థులతో చర్చించాలి.

విద్యార్థులు తమ అభిప్రాయాలను చెప్పిన తరువాత ఉపాధ్యాయుడు చర్చను ముగించాలి.

ఉపాధ్యాయుడు సమర్థుడై నిరంతర విద్యార్థిగా ఉండటానికి అనేక ప్రక్రియలు, సంస్థలు, ఫోరమ్‌లు వుపయోగపడతాయి. వీటన్నింటి యొక్క సహకారంతో నిరంతరంగా తన యొక్క వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. అలా తన వృత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు, తన గ్రంథాలలో ఉపయోగ పడుతుంది. తనతోటి సహచారులతో నిరంతరం చర్చలు, అభిప్రాయ వినిమయము మొదలైనవి ఉపయోగపడతాయి. సబ్జెక్టు ఫోరమ్‌లు, ఆ సబ్జక్టుపై మన అవగాహనను సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చు. అలాగే ఓపెన్ లెర్నింగ్ ద్వారా, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా కూడా అనేక విషయాలపై అభ్యసనం కొనసాగించవచ్చు. దేశవ్యాప్తంగా, అంతర్జాతీయంగా అనేక సెమినార్లు కార్యశాలలు జరుగుతుంటాయి. వాటిలో పాల్గొనవచ్చు. మనం నిరంతరం విషయాలను అధ్యయనం చేయాలి. వాటిపై ఆలోచించాలి, వ్రాయాలి, మాట్లాడాలి. మనం వివిధ పత్రికలలో వ్యాసాలు వ్రాయవచ్చు, చర్చలలో పాల్గొనవచ్చు, మనం చదివిన కొత్త విషయాలను మన విద్యార్థులతో, తోటివారితో పంచుకోవచ్చు.

దీనితోపాటు ఉపాధ్యాయుడు తన వ్యక్తిగత ఆరోగ్యాన్ని, మానసిక సామర్థ్యాన్ని కూడా పెంపొందించు కోవాలి. మంచి శారీరక ధైర్యాన్ని పెంపొందించుకోవాలి.

మీరందరూ రాబోయే రోజులలో ఉపాధ్యాయులౌతారు. అది ఏ స్థాయిలోనైనా కావచ్చు. మీరు ప్రాథమిక పాఠశాలలో ఉండవచ్చు లేదా ఉన్నత పాఠశాలలో ఉండవచ్చు.

మీరు ఒక 10 సం॥లో ఉపాధ్యాయునిగా పని చేసిన తరువాత తప్పక మీయొక్క సామర్థ్యం పెరగాలి. మీ యొక్క సబ్జెక్టు పరిజ్ఞానం మంచి స్థాయిలో ఉండాలి. అలాగే మీరు బోధనలో నైపుణ్యం పెరగాలి. విద్యార్థులకు అర్థం చేసుకునే స్థాయి పెరగాలి. ఇంకా ఎన్నో ఎన్నో...

1. దీని గురించి 10 సం॥ ముందుకు ఆలోచించి 10 సం॥ తరువాత మీరు ఎలాంటి ఉపాధ్యాయుడుగా ఉండాలనుకుంటున్నారు అనే విషయాన్ని గురించి మీమీ అభిప్రాయాలను వ్యక్తం చేయండి. ఆ విధంగా ఉండటానికి మీరు అనుసరించే పద్ధతి, నిర్వహించే, పాల్గొనే కార్యక్రమాలు ఏమిటి ?
2. మీరు రాబోయే 10 సం॥ ఎలాంటి పుస్తకాలు చదవాలనుకుంటున్నారు ? ఎందుకు ?
3. మీరు ఒక సబ్జెక్టు ఫోరంలో సభ్యునిగా ఉంటే మీ పాత్ర ఏమిటి ?
4. మీ పాఠశాల ద్వారా ఒక సాంఘిక శాస్త్ర కార్యశాల నిర్వహించాలి అనుకుంటే, మీరు ఎలా నిర్వహిస్తారు?

## 6.6. ఉపాధ్యాయుల నిరంతర వృత్తిపర అభివృద్ధి :-

ఉపాధ్యాయుడు వృత్తిపరంగా నిరంతరం ఎదగాలి. వృత్తిపరంగా ఎదగడం అంటే జీతం పెరగడం, ప్రమోషన్లు రావడం, అవార్డులు రావడం, తన సబ్జెక్టులో మంచి ఫలితాలు సాధించడం ఒక విధం.

తాను బోధించే అంశాలలో లోతైన, సమగ్రమైన అవగాహనను, జ్ఞానాన్ని సంపాదించడం. దీనికోసం కొత్త పుస్తకాలు చదవడం, ఆయా రంగాలలో ప్రముఖ వ్యక్తుల ఉపన్యాసాలు వినడం, విషయ వేదికలలో, విషయ సమూహాలలో సభ్యుడుగా ఉండడం, సెమినార్లు, కార్యశాలలలో తరచుగా పాల్గొనడం మొదలైనవి అతనిని వృత్తిలో ఎంతో ముందుకు తీసుకొని వెళతాయి.

విషయ వేదికలలో ఆ విషయానికి సంబంధించినవారు ఒక సమూహంగా ఏర్పడతారు. ఒకరి సందేహాలను ఇంకోరు తీరుస్తూ ఉంటారు. ఒకరి అనుభవాలను ఇంకొకరు పంచుకుంటూ ఉంటారు. దీనివల్ల ఉపాధ్యాయులు ఒకరిద్వారా ఇంకొకరు ప్రేరణ పొంది అందరూ ముందుకు వెళతారు.

సంబంధిత సమూహాలు (Connecting Groups) :–

సమాన భావాలు గల వ్యక్తుల సమావేశ సంబంధిత సమూహాలు. పాఠశాలకు మంచి ఫలితాలు తీసుకొని రావాలి. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి అని ఆవేదన చెందే ఉపాధ్యాయులు కొందరుంటారు. అలాంటివారు తరచూ కలుస్తూ పాఠశాల గురించి, పిల్లల గురించి, వారి భవిష్యత్తు గురించి చర్చిస్తూ పిల్లల భవితకు బాటలు వేస్తారు. దీనివల్ల కేవలం సబ్జక్టు విషయంల పెద్ద చర్చలు లేకపోయినప్పటికీ.

సెమినార్‌లు :–

ఒక అంశాన్ని లేక కొన్ని అంశాలను ఎన్నుకొని దానిపై ఎంపిక చేయబడిన వ్యక్తులు పత్రాలు సమర్పిస్తారు. దానిపై చర్చ జరుగుతుంది. ఇదే సెమినారు.

కార్యశాలలు :–

వీనిలో ఎంపిక చేయబడి అంశంపై పాల్గొని పరస్పరం చర్చించి కొన్ని నిర్ణయం తీసుకుంటారు.

పై కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా మనం బోధించే అంశాలపై స్పష్టత, లోతైన అవగాహన, సమగ్రత పెంపొందుతాయి.

**ఈ అంశాలపై ఈక్రింది అంశాల ఆధారంగా తరగతి గదిలో చర్చించవచ్చు :**

1. మీలో ఎవరైనా ఎప్పుడైనా సెమినార్‌లలో పాల్గొన్నారా? ఏ విషయంపై పాల్గొన్నారు? మీ అనుభవం, అనుభూతి ఏమిటి? దానిలో పాల్గొన విశిష్ట వ్యక్తులు ఎవరు ? ఉపాధ్యాయుడు కూడ తన అనుభవాన్ని జోడిస్తాడు. మీకు దగ్గరలోని కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో జరిగిన కొన్ని సెమినార్లు, కార్యశాలల గురించి చెప్పండి?
2. మీలో ఎవరెవరు కార్యశాలలో పాల్గొన్నారు? ఎలాంటి కార్యశాలలో పాల్గొన్నారు? దాని ఫలితాలేమిటి? దానివల్ల ఏమి నేర్చుకున్నారు? ఎలాంటి ఫలితాన్ని పొందారు?
3. విషయ సమూహాలంటే ఏమిటి? మీరెక్కడైనా విషయసమూహాలకు గమనించారా? వారిమధ్య ఏవేమి చర్చలు జరుగుతాయి. వాళ్ళ స్వభావాలేమిటి?
4. ఈనాడు మనకు అనేక సార్వత్రిక అభ్యసన వనరులు అందుబాటులో ఉన్నాయి. అవి ఏమిటి? దానిపై మీరు అను భావాలు చెప్పండి. ఈ విషయంపై చర్చించవచ్చు.
5. గతన సంవత్సరం లేదా రెండు సంవత్సరాల కాలంలో మీరు అధ్యయనం చేసిన గ్రంథాలు ఏమిటి? వాటిలోని విషయాలను తెలియజేయండి? అవి మిమ్మల్ని ఏవిధంగా ప్రభావితం చేసాయి.
6. మీరు గ్రంథాలయంలో పూర్తిగా కాకపోయిన కొంతభాగం చదివిన కొన్ని గ్రంథాల పేర్లు చెప్పండి. వాటి గురించి మీకు తెలిసిన మేరకు చెప్పండి?
7. ఈ సం॥లో మీరు చదివిన కొన్ని పుస్తకాలు ఏమిటి? మీరు పుస్తకాలపై ఎంత డబ్బు ఖర్చు పెట్టారు. (తరగతి పుస్తకాలకు కాక)

ఒక్కొక్క అంశంపై కొద్దిసేపు చర్చిస్తూ రెండు పిరియడ్‌లలో మొత్తం విషయాలను చర్చించవచ్చు. ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా ఉంటాడు. తన అనుభవాలకు కూడ జోడిస్తాడు.

విద్యార్థుల అనుభవాలతో, అభిప్రాయాలతో ఒక సమగ్ర నివేదిక తయారుచేయవచ్చు. ఇవి తరువాత వచ్చే ఛాత్రోపాధ్యాయులకు కూడ ఉపయోగకరంగా ఉంటుంది.

**ముఖ్యాంశాలు :-**

- జీవితంలోని ప్రతి సందర్భంలో సమస్యలు సవాళ్ళు ఉన్నట్లుగా సాంఘికశాస్త్ర బోధనలో కూడ సమస్యలు సవాళ్ళు ఉంటాయి.
- అవి పరిపాలనా పరమైనవి, వనరుల సంబంధమైనవి, గ్రంథాలయ సంబంధమైనవి, సమాచార సాంకేతిక సంబంధమైనవి, వృత్తి అభివృద్ధికి సంబంధించినవి.
- సాంఘిక శాస్త్ర బోధనకు ప్రాథమిక, ద్వితీయ వనరులు రెండూ ముఖ్యమే. కాని ప్రాథమిక వనరులు దొరకడం కొంత కష్టంతో కూడుకున్న అంశం. కాని ప్రయత్నం చేసి కొన్ని అరుదైన సందర్భాలలోనైనా ఉపయోగించడానికి ప్రయత్నం చేయాలి.
- ద్వితీయ వనరుల లభ్యత కొంత సులభమే – వీటిని విరివిగా ఎక్కువ సందర్భాలలో ఉపయోగించవచ్చు.
- ఇవికాకుండా అనువాద వనరులు, సార్వత్రిక వనరులను కూడ వాడే ప్రయత్నమే చేయాలి.
- ఉపాధ్యాయుడు తన విషయంలో లోతైన పరిజ్ఞానం కోసం మెరుగైన బోధనా పద్ధతుల కోసం, మూల్యాంకనా విధానాల కోసం, అనేక పుస్తకాలు చదవాలి, తత్వవేత్తల, మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల జీవితాలు, రచనలు చదవాలి, మ్యాగజైన్లు చదవాలి, తన బోధనా పద్ధతులను మెరుగుపరచుకోవాలి.
- విద్యార్థుల పూర్వజ్ఞానాన్ని పాఠ్యాంశాలతో అనుసంధానం చేయాలి; వాళ్ళ పరిసరాల జ్ఞానాన్ని తరగతి గదికి అన్వయం చేయాలి. తేలిక నుండి కష్టమైన దానికి, సరళతనుండి క్లిష్టతను, తెలిసిన దాని నుండి తెలియదానికి అనే సూత్రాల ఆధారంగా బోధన సాగించాలి.
- అధునాత సాంకేతిక పరిజ్ఞానమైన అంతర్జాలము, కంప్యూటర్ మొ॥ అంశాల ఆధారంగా పాఠ్యప్రణాళికను రూపొందించి బోధనకు ఆసిక్తకరంగా చేయాలి.
- క్లిష్టమైన సాంఘిక, సాంస్కృతిక అంశాలను బోధిస్తూ విద్యార్థులను భాగస్వాములను చేయాలి. వాళ్ళలో సున్నితమైన అంశాలపై చర్చించే సామర్థ్యాన్ని పెంచాలి.
- ఉపాధ్యాయుడు తన బోధనపై ఒక భవిష్య దృష్టి ఉండాలి. నిరంతరం వృత్తిపరమైన అభివృద్ధికి పెంపొందించుకోవాలి. దీనికోసం కార్యశాలలలో సంగోష్టులతో పాల్గొనాలి.

**లఘు ప్రశ్నలు :**

1. సార్వత్రిక వనరులు అంటే ఏమిటి? అవిఏవి?
2. ప్రాథమిక, ద్వితీయ వనరులను గల తేడాలు ఏమిటి ?
3. కొన్ని సామాజిక, సంస్కృతిక అంశాలను (6,7,8 తరగతులలో) పేర్కొనుము.
4. అంతర్జాలం ద్వారా పాఠ్యాంశాల బోధన.
5. పూర్వజ్ఞానం – పాఠ్యాంశాల అనుసందానం – ఒక ఉదాహరణ ద్వారా వివరించండి.
6. నీ దృష్టిలో మంచి తరగతి గది ఎలా ఉండాలి.
7. సెమినార్‌కు కార్యశాలకు గల తేడా ఏమిటి ?
8. విషయ సమూహాలు (Connected Groups) అంటే ఏమిటి ?
9. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు తన బోధనాంశాలు గురించిన లోతైన అవగాహన కొరకు చదవదగిన కొన్ని పుస్తకాలను సూచించాలి.
10. మంచి బోధనాపద్ధతుల కొరకు చదవదగిన కొన్ని పుస్తకాలను సూచించండి.

**వ్యాస ప్రశ్నలు :-**

1. సాంఘిక శాస్త్ర బోధనా వనరులను, ముఖ్యంగా ప్రాథమిక వనరులను, సాంకేతిక వనరులను వుపయోగించడంలో వచ్చే సమస్యలేమిటి? వాటిని ఎలా అధిగమించవచ్చు ?
2. ఉపాధ్యాయులకు తాను బోధించే విషయము, బోధనా పద్ధతులపై లోతైన పరిజ్ఞానం పెంపొందించు కోవడానికి ఏమి చేయాలి? దీనిని పెంపొందించుకోవడంలో ఉండే సమస్యలు ఏమిటి ?
3. విద్యార్థుల పూర్వజ్ఞానాన్ని పాఠ్యాంశాలతో అనుసంధానం చేయడం ద్వారా వారి ఆసక్తిని, నిమగ్నతను ఎలా పెంపొందించవచ్చు ?
4. సమాచార ప్రసార సాంకేతిక సమైక్యతకు వినియోగించుటలో గల సవాళ్ళు ఏవి ?
5. సాంఘికశాస్త్ర బోధనలో సామాజిక, సాంస్కృతిక అంశాలను బోధించటంలో గల సమస్యలు ఏమిటి ? వాటిని సమర్ధవంతంగా ఎలా బోధించాలి?
6. ఉపాధ్యాయుని నిరంతర వృత్తిపర అభివృద్ధిలో వివిధ వేదికలు ఎలా ఉపయోగపడతాయి ?